# క్రాంతి

సి.పి.ఐ. (మావోయిస్టు) ఎ.పి., ఎన్.టి., ఎ.ఒ.బి. కమిటీల అధికార పత్రిక

సంపుటి: 34 సంచిక: 5 సెప్టెంబర్ - అక్టోబర్ 2010 వెల: పది రూపాయలు


లోపలి పేజీల్లో...


పార్టీ ఆవిర్భావ సందేశం ........ 7
తిరగబడ్డ సోంపేట ........ 14
అణు పరిహార బిల్లు 2010 ........ 19
కాంగ్రెస్‌లో కుమ్ములాటలు ........ 22
మామాయిల్ ప్రతిఘటన ........ 26
అర్జున్ ఖతం ........ 27
గ్రంథ పూజ ...మధ్య పేజీలో
కా. ఆజాద్‌ను హత్య చేసారు ........ 36
నాల్కో అమరులు ........ 38
పష్తూన్ జాతి ఉద్యమం ........ 41
ప్రతిఘటనా-పోరాటాలు... ........ 52


## ఆజాదీ ఆకాంక్షతో ప్రజ్వరిల్లుతోన్న కాశ్మీర్

కాశ్మీర్ మరొకసారి దోపిడీ పాలకవర్గాలకు కంటి మీద కునుకు లేకుండా చేస్తోంది. అన్ని ఉద్యమాలనూ అణచిపారేశామని ఇక మావోయిస్ట్ ఉద్యమాన్ని అణచడమే తమ లక్ష్యమని ప్రకటించుకున్న భారత పాలకవర్గాలకు కాశ్మీర్ పచ్చి వెలక్కాయలా గొంతుకడ్డం పడింది. ఆజాదీ ఆకాంక్ష ఆరిపోయిందనే పాలకవర్గాల దుష్ప్రచారాన్ని బట్టబయలు చేస్తూ నేడు కాశ్మీర్ అశేష పీడిత ప్రజానీకానికి నూతనోత్తేజాన్ని కల్గిస్తోంది.

ఆజాదీ కాంక్ష ఎన్నటికీ ఆరేది కాదని ఇప్పటికే ఎన్నోసార్లు చరిత్ర రుజువు చేసే వుంది. కాశ్మీర్ మరోసారి రుజువు చేస్తోంది. కాశ్మీర్‌లో తీవ్రవాదాన్ని రూపుమాపామని, సాయుధ సంఘర్షణను అణచివేశామని పాలకవర్గాలు గత కొంత కాలంగా చెప్పుకుంటూ వస్తున్నాయి. కానీ నేడు కాశ్మీర్‌లోని ప్రతి ఒక్కరూ 'తీవ్రవాదుల'వుతున్నారు. చేతికందిన రాళ్లనే ఆయుధాలుగా చేసుకొని 'సాయుధ సంఘర్షణ'కు దిగుతున్నారు.



సాయుధ బలగాలను రాళ్లతో తరిమి కొడ్తున్న యువతరం

ఇది యాదృచ్ఛికంగా వచ్చిన పోరాటంగా కనిపించవచ్చు, కానీ ఇదొక అనివార్య పరిణామం. విస్తరణవాద కాంక్ష కింద దశాబ్దాలుగా కాశ్మీర్ జాతి నలుగుతున్న చరిత్ర నుండి ఈ తాజా పరిణామాలను విడదీసి చూడలేం.

కాశ్మీర్ జాతి విముక్తి పోరాటానికి దాదాపు ఎనభైయేళ్ల చరిత్ర వుంది. 1947కు పూర్వం బ్రిటీష్ వలసవాదంతో దాదాపు 16 ఏళ్లు పోరాడింది. 1947 నుండి భారత్ విస్తరణవాదంతో పోరాడుతూనే వుంది. 1947లో ప్రజల అభిమతానికి భిన్నంగా కాశ్మీర్‌ను విలీనం చేసుకున్న భారత్ దానికి స్వయం ప్రతిపత్తిని కల్పిస్తామని నచ్చజెప్పింది. అందుకు గాను భారత రాజ్యాంగంలో 370 అనే ఒక నామమాత్రమైన అధికరణాన్ని ఏర్పాటు చేసింది. కానీ నామమాత్రమైన ఆ అధికరణాన్ని కూడా భారత్ ఎన్నడూ పట్టించుకోలేదు. అంతేకాదు కాశ్మీర్‌కు ప్రత్యేక రాజ్యాంగం వుంది కానీ భారత పాలకులు దాన్నెప్పుడూ గుర్తించలేదు. 1948లో ఐక్యరాజ్య సమితి రిఫరెండం (జనాభిప్రాయ సేకరణ) చేపట్టాలని తీర్మానం చేసింది. దీన్ని కూడా భారత పాలకులు పట్టించుకోలేదు. 1953లో నేషనల్ కాంగ్రెస్ నాయకుడు షేక్ అబ్దుల్లాను అరెస్ట్ చేసి నామమాత్రపు స్వయం ప్రతిపత్తిని కూడా భారత పాలకులు హరించారు.

భారత పాలకుల ఈ నిరంకుశ వైఖరితో కాశ్మీర్ ప్రజలు మొదటి నుండీ పోరాడుతున్నప్పటికీ, 1989 నాటికి ఆ పోరాటం బలమైన సాయుధ పోరాట రూపం తీసుకుంది. జె.కె.ఎల్.ఎఫ్., జమాతె ఇస్లామి, దాని సాయుధ విభాగం హిజుబుల్ మొజాహిదీన్, లష్కరే తోయిబా, హర్కతుల్ అన్సర్ వంటి దాదాపు 30 చిన్నా పెద్దా సంస్థలు ఈ పోరాటంలో పాలు పంచుకుంటున్నాయి. 1992 డిసెంబర్‌లో వీటిలోని మెజారిటీ సంస్థలు కల్సి ఆల్ పార్టీ హురియత్ కాన్ఫరెన్స్‌గా ఏర్పడ్డాయి.

నాటి నుండి మొదలైన సాయుధ పోరాటంలో కాశ్మీరీ గెరిల్లాలు భారత పాలకులతో వీరోచితంగా తలపడ్డారు. ఎన్నో సాహసిక విజయాలను సాధించి గెరిల్లా పోరాటానికి నూతన అనుభవాలను జోడించారు.

అయితే భారత ప్రభుత్వాలు, కాంగ్రెస్, ఎన్.డి.ఎ., యు.పి.ఎ. అనే బేధం లేకుండా ఏ పార్టీ/కూటమి అధికారంలో వున్నా ఈ పోరాటంపై తీవ్ర అణచివేతను ప్రయోగించాయి. సైన్యాన్ని మోహరించి కాశ్మీర్ లోయను రక్తసిక్తం చేశాయి. సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (ఎ.ఎఫ్.ఎస్.పి.ఎ.) పేరుతో సైన్యానికి విచ్చలవిడి అధికారాలను కట్టబెట్టాయి. ఈ చట్టం అండతో ఏ మాత్రం జవాబుదారీతనం లేకుండా అక్కడ సైన్యం పాల్పడ్డ అకృత్యాలకు అంతే లేదు. అక్కడ నెత్తురు చిందని రోజు లేదంటే, హింసాగ్ని తాకని కుటుంబం లేదంటే అతిశయోక్తి కాదు. భారత పాలకులు అక్కడి పౌర ప్రభుత్వాలను తన తొత్తులుగా మార్చుకొని, వాటిని నామమాత్రం చేసి మిలిటరీ పాలనను కొనసాగించారని చెప్పుకోవచ్చు. హిట్లర్ పాలనను తలపించేలా కాన్సంట్రేషన్ క్యాంపులను నెలకొల్పారు. హత్యలు, సామూహిక హత్యలు, అరెస్టులు, చిత్రహింసలు, మిస్సింగులు, మహిళలపై దారుణ అత్యాచారాలు, ప్రజలను మానవ కవచాలుగా వుపయోగించు కోవడం తదితర దారుణాలు నిత్యకృత్యమైపోయాయి. అనేక సంస్థలపై ఉగ్రవాద ముద్రవేసి తమ హత్యాకాండకు సాధికారతను కల్పించుకున్నాయి. నాయకులను నిర్బంధించడం, హత్య చేయడం మామూలైపోయింది.

రివార్డుల కోసం, అవార్డుల కోసం కూడా ఎంతో మంది అమాయకులను చంపి ఉగ్రవాదులుగా ముద్రవేశారు. ఇండ్లల్లో నుండి సాధారణ యువతను ఎత్తుకుపోయి చంపి పాకిస్తాన్ చొరబాటుదారులుగా ముద్రవేశారు.

భారత ప్రజల్లో పాలకవర్గాలు ఒక పథకం ప్రకారం కుట్రపూరితంగా పెంపొందించిన పాకిస్తాన్ వ్యతిరేకతనూ, ముస్లిం వ్యతిరేకతను ఉపయోగించుకొని కాశ్మీరీ పోరాటాన్ని అణచివేయడానికి సాధికారతను సంపాదించుకున్నాయి. మొత్తం కాశ్మీర్ పోరాటాన్ని అక్కడి ప్రజల స్వాతంత్ర్య ఆకాంక్షగా గుర్తించకుండా, బయటి ప్రపంచానికి వ్యక్తం కానీయకుండా కేవలం దాన్ని పాకిస్తాన్ ప్రేరేపిత పోరాటంగానో, ముస్లిం మతవాద పోరాటంగానో చిత్రీకరించే ప్రయత్నం చేశాయి.

నిజానికి నేడు కాశ్మీర్‌లో పోరాడుతున్న కొన్ని సంస్థలను పాకిస్తానే పెంచిపోషించింది. కొన్ని సంస్థలు పాకిస్తాన్‌కు అనుకూలంగా వున్నాయి. పాకిస్తాన్ తన స్వార్థ ప్రయోజనాల కోసమే, విస్తరణవాద కాంక్షతోనే నేడు కాశ్మీరీల పోరాటానికి మద్దతును ఇస్తోంది. అయినంత మాత్రాన ఆజాదీ ఆకాంక్షనే అది వుట్టించలేదు. మన సొత్తునేదో పాకిస్తాన్ అక్రమంగా గుంజుకుంటున్నట్టుగా భారత పాలక వర్గాలు ప్రవర్తిస్తున్నాయి కానీ కాశ్మీర్ ఎన్నడూ భారత్‌లో భాగంగా లేదన్నది చారిత్రక వాస్తవం. బలవంతంగా కాశ్మీర్‌ను విలీనం చేసుకున్న తర్వాత కాశ్మీరీలు భారత్ నుండి పొందిన ప్రయోజనాలేమీ లేవు, క్రర పెత్తనం తప్ప. హిందూ మతోన్మాద స్వభావాన్ని కల్గి వున్న భారత పాలకవర్గాల నుండి కాశ్మీర్‌లోని మెజారిటీ ముస్లిం మత ప్రజలు వివక్షనే ఎదుర్కున్నారు. అందుకే కాశ్మీరీలు భారత్ నుంచి స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నారు. భారత్‌తో విడిపోయి వాళ్లు పాకిస్తాన్‌తో కల్సి వుంటారా? విడిగానే వుంటారా? అనేది కేవలం కాశ్మీరీ ప్రజలు మాత్రమే నిర్ణయించుకోవాల్సిన విషయం. అది వాళ్ల స్వయం నిర్ణయాధికార హక్కు. దాన్ని నిరాకరించే హక్కు ఎవరికీ లేదు. కానీ విస్తరణవాద కాంక్ష, మరెన్నో ఆర్థిక ప్రయోజనాలను కల్గి వున్న భారత్ కాశ్మీరీల స్వయం నిర్ణయాధికారాన్ని నిరాక్షిణ్యంగా కాలరాయడానికి ప్రయత్నిస్తోంది.

అందుకే దారుణ అణచివేతకు పాల్పడింది. పాకిస్తాన్ బూచిని, ఉగ్రవాదం సాకును చూపించి గతంలో ఎన్నో హత్యాకాండలకు పాల్పడింది. 'ఉగ్రవాదులు' దాక్కున్నారనే సాకుతో ఛరారే షరీఫ్ పట్టణాన్నే విధ్వంసం చేసింది. చత్తీసింగ్‌పురాలో 35 మంది సిక్కులను ఊచకోత కోసి లస్కరే తోయిబా మీదికి నెట్టింది. ఆ తర్వాత అయిదుగురు అమాయకులను చంపి ఈ ఘటనకు బాధ్యులైన వారిని చంపినట్టు ప్రకటించుకుంది. అయితే దీనికి వ్యతిరేకంగా వెల్లువెత్తిన ప్రతిఘటన మూలంగా ఈ ఘటనపై సి.బి.ఐ. విచారణ చేపట్టి ఇది బూటకపు ఎన్‌కౌంటర్ అని తేల్చింది. అయిదుగురు సైనికాధికారులను దోషులని తేల్చింది. ఇటువంటి ఎన్నో మారణకాండల ఫలితంగా 1989 నుండీ నేటి వరకూ 80 వేలకు పైగానే కాశ్మీరీలు ప్రభుత్వ సాయుధ బలగాల చేతుల్లో హతమయ్యారు. ఈ రక్తపాతాన్నీ, దారుణాలను ప్రజలు నిద్రలోనైనా మరిచిపోగలరా? పీడకలలుగా అవి వారిని వెంటాడకుండా

వుంటాయా? ప్రతిఘటనకు వారిని పురిగొల్పకుండా వుంటాయా?

గత కొద్ది సంవత్సరాలుగా సాపేక్షికంగా మిలిటెంట్ కార్యక్రమాలు తగ్గిపోవడాన్ని పేర్కొంటూ తమ చర్యలు ఫలించాయనీ కాశ్మీర్ సమస్య సమసిపోయిందని పాలకులు చెప్పుకుంటూ వస్తున్నారు.

అయితే 2008లో కాశ్మీర్ మరోసారి భగ్గుమంది. అమర్‌నాథ్ దేవస్థానం బోర్డుకు వంద ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించడమే దీనికి కారణం. ఈ చర్యను కాశ్మీర్‌లో ముస్లిం సంఖ్యాధిక్యతను తగ్గించే కుట్రగా భావించిన పోరాటకారులు 63 రోజుల పాటు పెద్ద ఎత్తున ఆందోళన నడిపారు. ఈ ఆందోళనకు తలవంచిన ప్రభుత్వం భూకేటాయింపును రద్దు చేయక తప్పలేదు.

మిలిటెంట్ల చర్యలు తగ్గిపోయాయని చెప్తున్న కాలంలోనూ సాయుధ బలగాల హింస ఆగిపోలేదు. అమాయకులను చంపడం, వారిపై ఉగ్రవాద ముద్ర వేయడం, మహిళలపై అత్యాచారాలు పాల్పడ్డం కొనసాగుతూనే వుంది. దానికి నిరసనగా ఏదో స్థాయిలో ప్రజాందోళనలు జరుగుతూనే వున్నాయి. 2009 మేలో షోపియాన్‌లో నీలోఫర్ అహంగర్ (22), ఆసియా (17) అనే ఇద్దరు యువతులను పోలీసులు అత్యాచారం చేసి హత్య చేసిన ఘటనపై మాత్రం పెద్ద ఎత్తున వుద్యమం చెలరేగింది. దానితో ప్రభుత్వం విచారణకు అంగీకరించక తప్పలేదు. హైకోర్టు మాజీ న్యాయమూర్తి చేపట్టిన ఈ విచారణలో పోలీసులు దోషులని తేలింది. అయితే సిబిఐ దీన్ని మార్చి వేసి దోషుల పక్షాన నిలిచింది. దీనితో మరోసారి ప్రజా ఉద్యమం నడిచింది.


రాయి విసురుతున్న మహిళ


ఈ సంవత్సరాది నుండి కూడా సాయుధ బలగాల కాల్పుల్లో అమాయక కాశ్మీరీల ప్రాణాలు రాలిపోతూనే వున్నాయి. దీనికి వ్యతిరేకంగా ప్రజాందోళనలు కొనసాగుతూనే వున్నాయి. అయితే జూన్ 11న తుఫాయిల్ అహ్మద్ మట్టూ అనే 17 ఏళ్ల బాలుడి మరణం ఉద్యమాన్ని మలుపు తిప్పింది. ఒక ఆందోళనను చెదరగొట్టే లక్ష్యంతో బలగాలు విచక్షణా రహితంగా ప్రయోగించిన భాష్పవాయువు తూటా క్రికెట్ ఆడుకుంటున్న తుఫాయిల్‌కు తగలడం వల్ల అతను ప్రాణాలు కోల్పోయాడు. సాయుధ బలగాల పట్ల, ఆ బలగాలకు విచ్చలవిడి అధికారాలను ఇస్తున్న భారత పాలకుల పట్ల ఎన్నాళ్లుగానో పేరుకుపోయిన ద్వేషం, మరోసారి వారిలోని ఆజాదీ కాంక్షను ప్రజ్వలింపచేసింది. నాటి నుండి నిరంతరాయంగా ఉద్యమం ఉవ్వెత్తున సాగుతోంది. భారత పాలన నుండీ, భారత సైనికుల నుండీ విముక్తి లభించినప్పుడే తమపై అమలవుతున్న అణచివేత ముగిసిపోతుందనే విశ్వాసంతో పోరాడుతున్నారు.

'ఇండియన్ కుక్కలు వెళ్లిపోవాలి' అని నినదిస్తూ, పిచ్చి కుక్కలను తిరిమికొట్టినట్టుగా ప్రభుత్వ బలగాలపై రాళ్లవర్షం కురిపిస్తున్నారు. సాయుధ బలగాల ఉనికినే ప్రజలు సహించలేకపోతున్నారు. ఎక్కడ కనబడ్డా రాళ్లను తమ చేతుల్లోకి తీసుకుంటున్నారు. తమ మీదికి కాల్పులు జరుపుతున్నా ప్రజలు వెనక్కి తగ్గకుండా ప్రాణాలకు తెగించి రాళ్లను విసురుతూనే వున్నారు. వీధుల్లో సాయుధ బలగాలపై రాళ్లు విసరడంతోనే సరిపెట్టడం లేదు. పోలీసు స్టేషన్లనూ, సిఆర్‌పిఎఫ్ క్యాంపులనూ దగ్ధం చేస్తున్నారు. బంకర్‌లను ధ్వంసం చేస్తున్నారు. స్పెషల్ ఆపరేషన్స్ శిబిరాన్ని కూడా దగ్ధం చేశారు. సిఆర్‌పిఎఫ్ వాళ్లు ప్రయాణిస్తోన్న బస్సులను అటకాయించి వాటి మీద రాళ్ల వర్షం కురిపిస్తూన్నారు. తుపాకులనూ గుంజుకోవడానికి విఫల ప్రయత్నం చేస్తున్నారు. కొన్ని చోట్ల తుపాకులను గుంజుకున్నారు కూడా. చేతుల్లో తుపాకులు పట్టుకున్న బలగాల మీద రాళ్లు విసరడం అనేది తమకెంత ప్రమాదకరమో ఆందోళనాకారులకు తెల్సు. ఆ తుపాకులు నిశ్శబ్దంగా వుండవనీ, శాంతియుత నిరసనను కూడా సహించే అలవాటు వాటికి వుండదని తెల్సు. గత అనుభవాల్లోకి వెళ్లక్కర్లేదు ఈ ఆందోళనలోనే వాళ్లు ప్రత్యక్షంగా అనుభవిస్తున్నారు. ఆ తుపాకుల గర్జనకు పిట్టల్లా రాలిపోతున్నారు. జూన్ 11 నుండి ఇప్పటిదాకా 110 మందికి పైగా మరణించారు. సెప్టెంబర్ 13న ఒక్క రోజునే 15 మందిని సాయుధ బలగాలు పొట్టన పెట్టుకున్నాయి. ఎనిమిది మందీ తొమ్మిది మంది చనిపోయిన ఘటనలూ వున్నాయి. అయినా ప్రతిఘటనను ఆపడంలేదు. ఇటీవలి కాలంలో చనిపోయిన వారిలో యువజనులూ, పిల్లలూ అధికంగా వున్నారు. ఎనిమిది, తొమ్మిదేళ్ల పిల్లలు కూడా చనిపోవడం సాయుధ బలగాల క్రూరత్వానికి నిదర్శనం. ప్రతి మరణం తీవ్ర ప్రతిఘటనకు దారితీస్తోంది. ప్రతి ప్రతిఘటనా మరిన్ని మరణాలకు దారితీస్తోంది. అయినప్పటికీ తమలో ఎన్నాళ్లుగానో రగులుతున్న ద్వేషాన్నీ, అసహ్యాన్నీ, కసినీ, కన్నీళ్లనీ రాళ్లుగా మార్చి సాయుధ మూకల మీదికి విసరకుండా వుండలేక పోతున్నారు.

రాళ్లు విసరడం అనే పోరాటం కాశ్మీర్‌కు కొత్తేం కాదు. చరిత్రలో అనేక సార్లు కనిపించిందే. అయితే ఇంత నిరవధికంగా ఇంత విశాల ప్రజానీకం భాగస్వామ్యంతో జరగడం మాత్రం అపూర్వం. నిజానికి ఈ స్థాయిలో ప్రతిఘటించాల్సిన పరిస్థితుల్లోకి ప్రజలను పాలకులే నెట్టివేశారు. 2008లో జరిగిన ఆందోళనలో ప్రజలు లక్షల సంఖ్యలో కదిలారు, ఊరేగింపులు, మానవహారాలు ఏర్పాటు చేశారు. కానీ, అప్పుడు బంకర్‌లను గానీ సైనికులను గానీ

ముట్టుకోలేదు. అయితే ఆ ఆందోళనను పాలకులు హింసాత్మకం చేశారు. అహింసాయుతంగా జరుగుతున్న ఆందోళనపై కాల్పులు జరపడానికి సాయుధ బలగాలకు ఉత్తర్వులు ఇచ్చారు. ప్రజలు గుమికూడడాన్ని ప్రభుత్వం ఎట్టి పరిస్థితుల్లోనూ ఆమోదించలేదు. చివరికి శవయాత్రల మీద కూడా డజన్ల సార్లు కాల్పులు జరిపారు. మరి నాడు శాంతియుతంగా ఆందోళన చేసిన ప్రజలు నేడు రాళ్లు విసిరేవాళ్లుగా తయారవడంలో ఆశ్చర్యం ఏముంది? తాము విసిరే రాళ్ల సాయుధ బలగాలను చంపవనీ, కనీసం తీవ్రంగా గాయపరచను కూడా లేవని వాళ్లకు స్పష్టంగానే తెల్సు. అయినప్పటికీ అలా రాళ్ల విసరడాన్ని వాళ్ల ఒక నిరసన రూపంగానే కాదు, దశాబ్దాలుగా తాము అనుభవిస్తున్న వేదనకు ఒక ఉపశమనంగా కూడా వాళ్ల భావిస్తుండవచ్చు.

ఈ ఉద్యమంలో స్త్రీ, పురుషులూ, పిల్లలూ, వృద్ధులు చురుగ్గా భాగస్వాములవుతున్నప్పటికీ, యువత విశేషంగా కదులుతున్నారు. సాయుధ బలగాల ఆగడాలకు తోడు, కాశ్మీర్‌లో రోజు రోజుకూ పెరిగిపోతున్న నిరుద్యోగం వల్ల కూడా యువతలో భారత ప్రభుత్వ వ్యతిరేకత తీవ్రమవుతున్నది. ఇలా పలు కారణాలుగా అన్ని వర్గాల్లో పేరుకు పోయిన అశాంతి ఫలితమే నేటి ప్రజల ప్రతిఘటన. 1989 నుండి మిలిటెంట్ల సాయుధ ప్రతిఘటనతో సతమతమవుతున్న అర్ధసైనిక బలగాలూ, భారత సైన్యమూ, స్థానిక పోలీసులు నేడు వీధుల్లో సాధారణ ప్రజల మిలిటెన్సీకి ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు.



శ్రీనగర్‌లో కర్ఫ్యూ విధించడాన్ని నిరసిస్తూ సీఆర్‌పీఎఫ్ జవాన్లపై రువ్వడానికి రాళ్ల ఏరుకుంటున్న ఓ ఆందోళనకారుడు

ఈ ప్రతిఘటనను ఆపడానికి పాలకవర్గాలు ఎన్నో ప్రయత్నాలు చేస్తున్నాయి. ముఖ్యంగా అక్కడ వున్న అర్ధసైనిక బలగాలకు తోడు సైన్యాన్ని దింపింది. అర్ధసైనిక బలగాల సంఖ్యను మరింత పెంచింది. ప్రస్తుతం 70 వేల సైన్యంతో కాశ్మీర్ ప్రపంచంలోనే అత్యంత మిలిటరీకరించిన ప్రాంతంగా వుంది. ప్రజల కదలికలను నియంత్రించి వీధులను నిర్మానుష్యం చేసి ప్రతిఘటన ఆపడం కోసం రోజుల తరబడి విధిస్తున్న కర్ఫ్యూలు, కన్పిస్తే కాల్చివేత ఆదేశాలు, వీధుల్లో కరకు బూట్ల కవాతులు అన్నీ ప్రజా ప్రతిఘటన ముందు అపహాస్యం పాలవుతున్నాయి. కర్ఫ్యూలనూ ధిక్కరించి, కాల్చివేతలకు సిద్ధపడి వేలాది ప్రజలు వీధుల్లోకి వస్తున్నారు. 'పోలీసులు కాల్పులు జరిపినప్పుడు సాధారణంగా ప్రజలు దూరం పరిగెడుతారు, కానీ కాశ్మీర్‌లో మరింత దగ్గరికి వస్తారు' అని ఒక పైస్థాయి పోలీసు అధికారి చేసిన వ్యాఖ్యానం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది.

కాశ్మీరీల ఈ ప్రతిఘటనకు సహజంగానే భారత పాలకులు అత్యంత బాధ్యతా రహితంగా ప్రతిస్పందిస్తున్నారు. కానీ బాధ్యతగా ప్రతిస్పందిస్తున్నట్టు నటించడం కోసం సమావేశాల మీద సమావేశాలు నిర్వహిస్తున్నారు. ప్రభుత్వ ప్రయివేటు రంగాల్లో కాశ్మీరీ యువతకు ఉద్యోగ అవకాశాల కల్పన విషయమై ప్రణాళిక రూపొందించేందుకు రంగరాజన్ కమిటీని నియమించారు. 24 వేల కోట్లతో ప్రత్యేక ఆర్థిక ప్యాకేజీని ప్రకటించారు. కాశ్మీరీల డిమాండ్ ఒకటైతే దానితో ఏమాత్రం సంబంధం లేని చర్యలివి. అందుకే హురియత్ కాన్ఫరెన్స్ నేత గిలానీ 'ఈ ఆందోళన రహదారులూ, ఫ్లై ఓవర్లు, ఉద్యోగాల కోసమో కాదు స్వయం నిర్ణయాధికార హక్కు కోసం' అంటూ భారత ప్రభుత్వ తాయిలాల్ని తోసిపారేశాడు.

సెప్టెంబర్ 20, 21న కాశ్మీర్‌లో ప్రజాభిప్రాయ సేకరణ కోసం అంటూ 39 మంది సభ్యులతో అఖిల పక్ష బృందం పర్యటన జరిపింది. సెప్టెంబర్ 25న కేంద్ర రక్షణ వ్యవహారాల కేబినెట్ కమిటీ (సీసీఎస్) ఎనిమిది అంశాలతో కూడిన 'కాశ్మీర్ ఫార్ములా'ను ప్రకటించింది. అఖిల పక్ష బృందం ఇచ్చిన నివేదికను సమీక్షించిన అనంతరం ఈ ఫార్ములాను ప్రకటించినట్టు సీసీఎస్ ప్రకటించుకుంది. ఈ ఫార్ములాలోని అంశాలు: 1. రాష్ట్రంలోని అన్ని వర్గాలతో చర్చల కోసం ప్రముఖ వ్యక్తి సారథ్యాన మధ్యవర్తుల బృందం ఏర్పాటు 2. అల్లర్ల సందర్భంగా అరెస్టయిన విద్యార్థులూ, యువతపై కేసులు ఎత్తివేత, జైళ్ల నుంచి విడుదల 3. ప్రజా భద్రతా చట్ట కేసులపై సమీక్ష, బందీల విడుదల 4. తక్షణమే యునిఫైడ్ కమాండ్ సమావేశం, కాశ్మీర్ లోయలో దళాల మోహరింపుపై సమీక్ష 5. అల్లర్లలో చనిపోయిన వారి కుటుంబాలకు ఐదేసి లక్షల పరిహారం 6. జమ్మూ, లడఖ్ ప్రాంతాల అభివృద్ధి అవసరాలను పరిశీలించేందుకు రెండు టాస్క్ ఫోర్సులు 7. తక్షణమే అన్ని విద్యా సంస్థలు తెరవాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి, ప్రత్యేక తరగతుల నిర్వహణకు సూచన 8. వంద కోట్లతో స్కూళ్లు, కాలేజీల్లో మౌలిక సదుపాయాల అభివృద్ధి.

ఈ ఫార్ములాను కేంద్రం ప్రకటించిన వరాలుగా మీడియా అభివర్ణించింది. కానీ కాశ్మీరీలు ప్రధానంగా డిమాండ్ చేస్తున్న స్వయం నిర్ణయాధికారం, సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం ఎత్తివేతకు సంబంధించిన ఊసు ఈ ఫార్ములాలో లేకపోవడం

బట్టి కాశ్మీరీ పోరాటంపై ప్రభుత్వ నిరంకుశ వైఖరి అర్థం అవుతూనే వుంది. భారత పాలక వర్గాలకు తొత్తులుగా మారిన కాశ్మీరీ పాలక, ప్రతిపక్ష పార్టీలు ఈ ఫార్ములాను స్వాగతించగా సామాన్య ప్రజలు మాత్రం దీని పట్ల నిరసన వ్యక్తం చేశారు.

ఈ ఫార్ములాను అనుసరించి ప్రభుత్వం మధ్యవర్తుల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ పర్యటనలు కూడా ప్రారంభమయ్యాయి. సమస్యను పక్కదార్లు పట్టించడం, వాయిదా వేయడం, పోరాటాన్ని నీరుకార్చడం కోసం ఇటువంటి కమిటీలను వేస్తాయని మనం చరిత్రలో ఎన్నోసార్లు చూసే వున్నాం. అంతకంటే ఈ కమిటీకి ఇంకే ప్రత్యేకతా లేదు.

సమస్య పరిష్కారం కోసం తాను చిత్తశుద్ధితో ప్రయత్నిస్తున్నట్టు నమ్మించడం కోసం భారత పాలకులు పదే పదే తెస్తున్న ప్రస్తావన చర్చలు. సమస్య పరిష్కారానికి చర్చలే సరైన మార్గమని, అన్ని వర్గాలతో చర్చలకు తాను సిద్ధమని యుపిఎ సర్కార్ పదే పదే 'విజ్ఞప్తి' చేస్తోంది. అయితే చర్చలకు శాంతిని ముందస్తు షరతుగా కూడా పెడుతోంది. శాంతి నెలకొంటేనే చర్చలు సాధ్యమని చెప్తోంది. చిదంబరం తనకు బాగా అలవాటైన పదజాలంతో కాశ్మీర్ పోరాటాన్ని 'మతిలేని హింస'గా అభివర్ణిస్తూ శాంతి నెలకొంటేనే చర్చలు అంటున్నాడు. ప్రభుత్వం ఇలా మాటి మాటికీ శాంతి అని అరవడంలోని దురుద్దేశం, నేడు కాశ్మీర్‌లో నెలకొని వున్న అశాంతికి కారణం ప్రజలూ, లేదా పోరాటకారులేనని నొక్కి చెప్పడం, అక్కడ నేడు నెలకొన్న అశాంతికి పాలకవర్గాలే కారణమనే సత్యాన్ని కుట్రపూరితంగా మరుగుపర్చడం. చర్చల ప్రస్తావన పట్ల ప్రతిస్పందిస్తూ గిలానీ "మేం 1952 నుండి 130 సార్లు చర్చల్లో పాల్గొన్నాం కానీ ఏ ప్రగతీ లేదు. చర్చలు ఫలప్రదం కావాలంటే ఢిల్లీ సర్కార్ జమ్మూ కాశ్మీర్‌ను వివాదాస్పద ప్రాంతంగా గుర్తించాలి. బలగాలను వెనక్కి తీసుకోవాలి, ఎ.ఎఫ్.ఎస్.పి.ఎ.ను, ప్రజా భద్రతా చట్టం (పి.ఎస్.ఎ.) రద్దు చేయాలి, రాజకీయ ఖైదీలను బేషరతుగా విడుదల చేయాలి" అంటున్నారు.

పోరాట సంస్థలు చేస్తున్న ఇటువంటి డిమాండ్లను కనీసం పట్టించుకోకుండా యు.పి.ఎ. సర్కార్ చర్చల పాట పదే పదే పాడడం అసలు సమస్యను పక్కదారి పట్టించడానికే. పోరాటకారులను హింసావాదులుగా సమస్య పరిష్కారం పట్ల చిత్తశుద్ధి లేనివారిగా చిత్రీకరించడానికే. ఒకవైపు సాయుధ బలగాల చేతిలో ప్రజలు పిట్టల్లా రాలిపోతున్నారు. కానీ పోరాటకారుల చేతిలో సాయుధ బలగాలకు చెందిన వారెవ్వరూ చనిపోలేదు, కనీసం తీవ్రంగా గాయపడిన దాఖలాలు కూడా లేవు. అయినప్పటికీ సాయుధ బలగాల భద్రత పట్ల భారత ప్రభుత్వం ఎంతో పట్టింపును కనబరుస్తున్నది. 'విధి నిర్వహణలోని పోలీసు సిబ్బంది, వారి కుటుంబ సభ్యుల రక్షణకు రాష్ట్ర ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవాలని' మన్మోహన్ సూచించాడు. 'వాళ్ల నైతిక స్థైర్యం దెబ్బతినేలా ఎటువంటి చర్యలు చేపట్టమ'ని కూడా అన్నాడు.

కాశ్మీర్ సమస్య పట్ల పోరాడుతున్న సంస్థలు భిన్న వైఖరిని, మార్గాలను కలిగి వున్నాయి. జెకెఎల్ఎఫ్ కాశ్మీర్‌పై ఇండియాకు గానీ, పాకిస్తాన్‌కు గానీ హక్కు లేదని రెండు దేశాల నుండి కాశ్మీరీలు స్వాతంత్ర్యాన్ని పొందాలనే సరైన వైఖరిని కల్గి వుంది. అంతేకాదు సమస్య పరిష్కారానికి సాయుధ పోరాటమే మార్గమని కూడా జె.కె.ఎల్.ఎఫ్. మొదటి నుండీ నొక్కి చెప్తోంది. హురియత్ కాన్ఫరెన్స్ గిలానీ వర్గం బలగాలను ఉపసంహరించుకొని, ఐక్యరాజ్యసమితి తీర్మానాన్ని అనుసరించి రిఫరెండం జరపాలని డిమాండ్ చేసున్నది. హురియత్ కాన్ఫరెన్స్ మితవాద నేత మీర్వాయిజ్ ఒమర్ ఫారూక్ ఇండియా, పాకిస్తాన్ దేశాలు ఆక్రమించిన వుభయ కాశ్మీరీల విలీనాన్ని స్వయంపాలనను కోరుతున్నాడు. ఇటీవల అఖిల పక్ష బృందానికి హురియత్ కాన్ఫరెన్ మితవాద వర్గం, జె.కె.ఎల్.ఎఫ్. ఇచ్చిన సంయుక్త పత్రంలో సమస్య పరిష్కారానికి భారత్, పాకిస్తాన్‌లలో కాశ్మీర్ కమిటీలను ఏర్పాటు చేయాలని సూచించారు. వెంటనే సైన్యాన్ని ఉపసంహరించాలని కూడా నొక్కిచెప్పారు. కాగా మరికొన్ని సంస్థలు పాకిస్తాన్‌తో విలీనం కావాలనీ, తాలిబాన్ తరహా పాలనను ఏర్పాటు చేస్తామని బహిరంగంగానే ప్రకటిస్తున్నాయి. స్థూలంగా చూస్తే దాదాపు అన్ని సంస్థలూ ఇండియా నుండి స్వాతంత్ర్యాన్ని కోరుకుంటున్నాయి.

కాశ్మీరీ అధికార పార్టీ అయిన నేషనల్ కాన్ఫరెన్స్ మాత్రం స్వాతంత్ర్యాన్ని కాకుండా స్వయం ప్రతిపత్తిని మాత్రమే కోరుతోంది. 1953 నాటి వరకూ వున్న స్వయం ప్రతిపత్తిని పునరుద్ధరించాలని అంటోంది. ఇటీవల లోక్‌సభలో జరిగిన చర్చలో ఆ పార్టీ నేత, కేంద్ర మంత్రి ఫరూక్ అబ్దుల్లా మెజారిటీ కాశ్మీరీలు ఇండియాతోనే వుండాలని కోరుకుంటున్నారనీ, పాకిస్తాన్ అధీనంలో వున్న కాశ్మీరీ ప్రాంత ప్రజలు కూడా ఇండియాతోనే వుండాలని కోరుకుంటున్నారనీ, ఇండియాలో భాగంగా వుంటూనే తమ సమస్య పరిష్కరించుకోవాలని అనుకుంటున్నారనీ నిస్సిగ్గుగా ప్రకటించాడు. అదే పార్టీకి చెందిన కాశ్మీర్ ముఖ్యమంత్రి ఒమర్ అబ్దుల్లా కాశ్మీర్‌లో శాంతి స్థాపన కోసం మరిన్ని బలగాలను ఇవ్వాలని కూడా కోరాడు. బలగాలను తక్షణం ఉపసంహరించుకోవాలని ఒకవైపు ప్రజలు పెద్ద ఎత్తున ఆందోళన చేస్తుంటే మరోవైపు మరిన్ని అదనపు బలగాలను ఒమర్ అడుగుతున్నాడంటే ప్రజల ఆకాంక్షలకు అక్కడి పాలకులు ఎంత వ్యతిరేక దిశలో వున్నారో అర్థం చేసుకోవచ్చు. అందుకే ఆగస్ట్ 15న ఒమర్‌పై బూటు విసిరి తమ ఏహ్యభావాన్ని పోరాటకారులు ప్రదర్శించుకున్నారు.

ప్రతిపక్షమైన పి.డి.పి. వైఖరి కూడా దీనికి భిన్నంగా లేదు. అది కూడా స్వయం ప్రతిపత్తిని కోరుతూ, భారత, పాక్ ఆక్రమిత కాశ్మీర్‌లు రెంటికీ ఒకే అసెంబ్లీనీ, రెండు ప్రాంతాలపైనా సంయుక్త నియంత్రణనూ, భారత్ పాకిస్తాన్‌ల ఉమ్మడి పర్యవేక్షణనూ కోరుతోంది. పర్యవేక్షణ అనేది ఆజాదీ ఆకాంక్షకు వ్యతిరేకమైనది కనుక ప్రజల ఆకాంక్షలకు పి.డి.పి. కూడా వ్యతిరేకంగా వుందని కచ్చితంగా చెప్పవచ్చు. ప్రస్తుత పోరాటాన్ని అడ్డం పెట్టుకొని ఒమర్‌ను గద్దె దించి తమ పార్టీ అధికారంలోకి రావాలనే తాపత్రాయం తప్ప పి.డి.పి.కి మరో ఆలోచన లేదు.

అయితే పై పోరాట సంస్థలూ, బూర్జువా పార్టీలు ఎ.ఎఫ్.ఎస్.పి.ఎ.ను ఎత్తివేయడం పట్ల మాత్రం ఏకాభిప్రాయాన్ని కల్గి వున్నాయి.

ఇండియాలోని బూర్జువా, వామ పక్షాల వైఖరి ఏదీ కాశ్మీరీ ప్రజలకు అనుకూలంగా లేదు. పచ్చి మతతత్వ పార్టీ అయిన బిజెపీ కాశ్మీర్ స్వాతంత్ర్యాన్ని కాదు కదా, స్వయం ప్రతిపత్తిని కూడా అంగీకరించడం లేదు. పేరుకు మాత్రమే స్వయం ప్రతిపత్తి కోసం ఉద్దేశించబడిన 370 అధికరణాన్ని రద్దు చేయాలని బిజెపి బలంగా డిమాండ్ చేస్తోంది. కాశ్మీర్‌లో సాయుధ బలగాలను వుపసంహరించుకున్నా, ప్రత్యేక అధికారాల చట్టాన్ని రద్దు చేసినా ఊరుకునేది లేదని తెగేసి చెప్పింది. అంతే కాదు కాశ్మీర్‌లోని సాయుధ బలగాల నైతికత దెబ్బ తినేలా ప్రభుత్వం ఏ చర్యలూ చేపట్టకూడదని హెచ్చరిస్తోంది. అంటే సాయుధ బలగాలు పాల్పడుతున్న హత్యాకాండ, అత్యాచారాలపై కనీసం కంటి తుడుపు విచారణలను కూడా అది వ్యతిరేకిస్తోంది. కాశ్మీరీ పోరాటాన్ని అణచడంలో మన్మోహన్ సర్కార్ విఫలమయిందని అది గగ్గోలు పెడుతున్న తీరు చూస్తే కాశ్మీర్‌లో మరెంతగా హింసాపాతం సృష్టించాలని అది కోరుకుంటున్నదో అర్థం చేసుకోవచ్చు. ప్రస్తుతం కాశ్మీరీ పోరాటానికి సంఘీభావం కూడ గట్టదానికి భారత్‌లో ఎక్కడ సభ, సమావేశం తదితర కార్యక్రమం జరపతలపెట్టినా బి.జె.పి. అక్కడ దౌర్జన్యాలకు దిగి ఆ కార్యక్రమాలకు అడ్డుతగులుతోంది.

వామపక్షాలు కాశ్మీర్ సమస్యకు పరిష్కారంగా రాజకీయ, ఆర్థిక ప్యాకేజీని కోరుతున్నాయి. భారత రాజ్యాంగం పరిధిలోనే స్వయం ప్రతిపత్తిని అంగీకరిస్తున్నాయి. ప్రత్యేక తెలంగాణా పోరాటాన్నే వ్యతిరేకిస్తున్న సిపిఎం వంటి రివిజనిస్టు పార్టీలు కాశ్మీర్ పోరాటం పట్ల ఇటువంటి వైఖరిని కల్గి వుండడంలో ఎటువంటి ఆశ్చర్యమూ లేదు. పరమ క్రూరమైన ఎ.ఎఫ్.ఎస్.పి.ఎ.ను రద్దుచేయాలని కూడా సి.పి.ఎం. మాట్లాడ్డం లేదు, ఆ చట్టాన్ని సవరించాలని మాత్రమే కోరుతున్నది.

సి.పి.ఐ. (మావోయిస్ట్) కాశ్మీర్ పోరాటానికి మొదటి నుండీ బలమైన మద్దతును ఇస్తోంది. కాశ్మీర్ సమస్యపై తన వైఖరిని ఎన్నడో ప్రకటించింది. తాజాగా పార్టీ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గణపతి పత్రికలకు ఇచ్చిన ఇంటర్వ్యూలో మరోసారి పునరుద్ఘాటించారు. ఈ సందర్భంగా సమస్య పరిష్కారానికి కింది డిమాండ్లను చేశారు. అవి: 1. కాశ్మీర్‌లో భారత ప్రభుత్వ సాయుధ బలగాలు సాగిస్తున్న హత్యాకాండను వెంటనే నిలిపివెయ్యాలి! 2. కాశ్మీర్ నుండి అర్థసైనిక, సైనిక బలగాలను వెంటనే వెనక్కి రప్పించాలి! 3. సైన్య బలగాలకు ప్రజలను విచ్చలవిడిగా చంపేసే అధికారాన్నిచ్చే ఫాసిస్టు చట్టం ఎ.ఎఫ్.ఎస్.పి.ఎ.ను వెంటనే రద్దు చేయాలి! 4. కాశ్మీర్‌లో ప్లెబిసైట్ నిర్వహించి కాశ్మీరీయులకు తమ భవిష్యత్తును తామే నిర్ణయించుకునే అధికారం ఇవ్వాలి! 5. రాజకీయ ఖైదీలందరినీ బేషరతుగా విడుదల చేయాలి.

విస్తరణవాద స్వభావం కల్గిన భారత పాలక వర్గాలు కాశ్మీర్ ప్రజలకు ఎన్నటికీ న్యాయం చేయవని ప్రస్తుత పోరాటం పట్ల దాని వైఖరినీ, అణచివేత విధానాలను చూస్తే మరోసారి స్పష్టంగా అర్థమవుతోంది. ఉద్యమానికి నాయకత్వం వహిస్తున్న గిలానీ, మద్దతునిస్తున్న అరుంధతీ రాయ్ తదితరులపై దేశద్రోహ నేరాన్ని మోపడం, పలువురు నాయకులను అరెస్టులు చేయడం వంటి చర్యల ద్వారా ఈ పోరాటం పట్ల తన కఠిన వైఖరిని మరింతగా బయటపెట్టుకుంటోంది. నేడు రాళ్లతో పోరాడుతున్న ప్రజలకు రేపు తుపాకులు పట్టుకొని పోరాడ్డం తప్ప మరో మార్గమేదీ లేని పరిస్థితిని పాలకవర్గాలే తెచ్చిపెడుతున్నాయి. మరోసారి కాశ్మీరీ ప్రజలు సాయుధ పోరాటాన్ని ఉధృతం చేయడం తప్ప మరో ప్రత్యామ్నాయమేదీ లేదు. అందుకు గాను వివిధ పోరాట సంస్థల మధ్య బలమైన ఐక్యత తప్పనిసరి అవసరం. అంతే కాదు పాకిస్తాన్ పట్ల కొన్ని పోరాట సంస్థలు కల్గి వున్న భ్రమల నుండి బయటపడాలి. నిజమైన స్వాతంత్ర్యం కోసం జాతి విముక్తి పోరాటాలను వర్గ పోరాటాలతో ఐక్యం చేయాలి.

దేశద్రోహ ఆరోపణలకు సైతం వెరవకుండా కాశ్మీరీ పోరాటానికి మన దేశంలోని ప్రగతిశీల, ప్రజాస్వామిక వాదులు దృఢమైన మద్దతునీయడం అభినందనీయ విషయం. అయితే ఇంకా దేశంలోని విస్తృత ప్రజానీకంలో కాశ్మీర్ సమస్య పట్ల సరైన అవగాహనను కల్పించి, విస్తృతమైన మద్దతును కూడగట్టి కాశ్మీరీ ప్రజలకు సంఘీభావంగా పోరాటాలను నిర్మించాల్సిన చారిత్రక బాధ్యత విప్లవోద్యమం పైనా, ప్రగతిశీల, ప్రజాస్వామికవాదులపైనా వుంది. ఆ దిశగా ప్రజా ఉద్యమాలనూ, విప్లవోద్యమాన్ని మరింతగా తీవ్రతరం చేసి శత్రువును ఉక్కిరి బిక్కిరి చేయడం నేటి చారిత్రక అవసరం. ★

## పార్టీ 6వ వార్షికోత్సవాలకు విప్లవ జేజేలు!

### నాయకత్వానికీ, శ్రేణులకు కలుగుతున్న భారీ నష్టాలను నివారించడానికి పార్టీని శత్రు దుర్భేధ్యమైందిగా పటిష్టపరచుకుందాం!!

### అద్భుత విప్లవ పరిస్థితికీ, ప్రజాయుద్ధ పురోభివృద్ధికీ తగినట్లు సమర్థవంతంగా నాయకత్వాన్ని అందించడానికి పార్టీని సంఘటితపరచుకుందాం!!!

# 2010 సెప్టెంబర్ 21 నుండి 27 వరకు పార్టీ 6వ వార్షికోత్సవాలను సమరోత్సాహాలతో ఘనంగా జరపాలని పార్టీ శ్రేణులకు పొలిట్ బ్యూరో పిలుపు

ప్రియమైన కామ్రేడ్స్,

సెప్టెంబర్ 21, మన నూతన పార్టీ, భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు) అవతరణ దినం సమీపించబోతున్నది. ఈ సెప్టెంబర్ 21తో మన నూతన పార్టీ ఏర్పడి ఆరు ఏండ్లు నిండుతాయి. శత్రువు మన పార్టీని నిర్మూలించడానికి మునుపెన్నడూ లేని విధంగా సాగిస్తున్న భారీ సైనిక దాడిని ధైర్యసాహసాలతో ఎదిరిస్తూ, ప్రజాయుద్ధాన్ని ముందుకు తీసుకుపోతున్న మన పార్టీ, పిఎల్‌జిఏ, విప్లవ ప్రజా కమిటీలు, ఇతర ప్రజా నిర్మాణాలన్నింటిలోని కామ్రేడ్స్ అందరికీ, శత్రువు నెదిరిస్తూ అరెస్టయి చెరశాలలను విప్లవ శిబిరాలుగా మలుస్తున్న కామ్రేడ్స్ అందరికీ, విప్లవ ప్రజానీకానికందరికీ ఈ సందర్భంగా పొలిట్‌బ్యూరో హార్ధిక విప్లవాభినందనలు తెలియజేస్తోంది.


కామ్రేడ్ చారుమజుందార్ కామ్రేడ్ కన్హయ్ ఛటర్జీ
సి.పి.ఐ. (మావోయిస్టు) వ్యవస్థాపకులు

సెప్టెంబర్ 21, పార్టీ అవతరణ దినం. పార్టీ 6వ వార్షికోత్సవం అనగానే ముందు మన స్మృతి పథాన కదిలేది మన పార్టీ వ్యవస్థాపకులు భారత విప్లవ మహా నాయకులు, ప్రియతమ కామ్రేడ్స్, అమరులు చారుమజుందార్, కన్హయ్ ఛటర్జీలతో పాటు కామ్రేడ్స్ సరోజ్‌దత్తా, అమూల్యసేన్, చంద్రశేఖర్‌దాస్, క్రిష్ణమూర్తి, సత్యం, కైలాసం, అప్పు, నిర్మల, ఐ.వి., శ్యాం, మహేష్, మురళి, అంజన్న, పద్మ, జ్యోతి, చిట్టెక్క, సుఖదేవ్ తదితర 10 వేలమంది జ్ఞాత, అజ్ఞాత వీరయోధులు. వెనువెంటనే మన స్మృతిలోకి వచ్చేది తమ చేతుల మీదుగా మన నూతన పార్టీని ఏర్పరచి, నాయకత్వాన్నందించి పోరాట క్రమంలో కర్కశమైన శత్రు చెరసాలల పాలయిన మన ప్రియతమ కామ్రేడ్స్ సుశీల్‌రాయ్, నారాయణ సాన్యాల్, జనార్దన్, శోభా, కోబాడ్‌గాంధీ, ఆశుతోష్ తదితరులు, అమరులైన స్ఫూర్తి ప్రదాతలు కామ్రేడ్స్ కరంసింగ్, రాజ్‌కుమార్ తదితరులందరితో పాటు పార్టీ అవతరణ వుత్సవ ఊరేగింపులో పార్టీ, ప్రజా విముక్తి గెరిల్లా సేన జండాలను చేబూని సమరోత్సాహంతో భూమ్యాకాశాలు ప్రతిధ్వనించేలా నినదిస్తూ సాగిపోతున్న కామ్రేడ్సూ కళ్లముందు కదలాడుతారు. గత 6 సంవత్సరాలలో ప్రజాయుద్ధ మార్గంలో సాగిపోతూ అడుగడునా రక్తతర్పణ చేస్తూనే పార్టీకి ఎన్నో విజయాలను, గొప్ప అనుభవాలను అందించిన 15 వందల మంది మన ప్రియతమ కామ్రేడ్స్ చంద్రమౌళి, రాజమౌళి, అనురాధా గాంధి, అజయ్‌దా, సుధాకర్‌రెడ్డి, అప్పారావు, మైముద్దీన్ (రవి), మాధవ్, శ్రీధర్, మంగ్తూ, రణదేవ్, సూర్యం, కరుణ, రింకీ, డేవిడ్, లాల్‌మోహన్ టుడు, అభిషేక్ ముఖర్జీ, ఉమాకాంత్ మహతో, సిద్ధూసోరేన్, క్రిష్ణ యాదవ్, అభయ్, కొండల్‌రెడ్డి, మస్తాన్‌రావు, రాంచందర్, సుకాంతో, వినయ్, వికాస్, దయ, మంగేష్, సింగన్న, ఆంద్రు, లాల్‌మోహన్ టుడు, బండు, శంకర్, రమేష్, సంపత్, శారద, గిరిజ (స్వర్ణ), కమల, రాంబత్తి, రుకృతి, సుచిత్ర ముర్ము తదితరులు మన స్మృతిలో మెదిలిన వుద్విగ్న క్షణాలు గుండెలను బరువెక్కిస్తాయి. ప్రాణాలను సైతం లెక్కచేయకుండా శత్రు బలగాలపై తుఫాను వేగంతో దాడి చేసి విజయాలు సాధించిపెట్టిన సమర్థులైన మన కమాండర్లకూ, సాహసిక యోధులందరికీ విప్లవ జేజేలు. ఈ యుద్ధంలో తమ ప్రాణాలను తృణప్రాయంగా అర్పించిన అమర కామ్రేడ్స్ అందరికీ వినమ్రంగా మన పొలిట్‌బ్యూరో జోహార్లు అర్పిస్తున్నది. వారి ఆదర్శవంతమైన జీవితాలను స్ఫూర్తిగా తీసుకుందాం.

గత 45 వసంతాల సుదీర్ఘ భారత నూతన ప్రజాస్వామిక విప్లవ చరిత్రలో నక్సల్‌బరి వసంత మేఘగర్జన; కామ్రేడ్ సిఎం నేతృత్వంలో 1969 ఏప్రిల్ 22న సి.పి.ఐ (ఎం–ఎల్), కామ్రేడ్ కెసి నాయకత్వంలో అదే సంవత్సరం అక్టోబర్ 20న ఎం.సి.సి. ఏర్పడిన చారిత్రాత్మక మహత్తర ఘటనలు; నక్సల్బరీ తరహా సాయుధ వ్యవసాయ విప్లవ పోరాటాలు దేశం నలుమూలలా వెల్లువెత్తడం; ప్రజాయుద్ధానికి వ్యతిరేకంగా దేశవ్యాపిత ఫాసిస్ట దమనకాండ–విప్లవోద్యమ సెట్‌బ్యాక్; సెట్‌బ్యాక్‌ను అధిగమిస్తూ

నూతన విప్లవ తరంగంగా గయ–ఔరంగాబాద్–జహానాబాద్, కరీంనగర్–ఆదిలాబాద్ రైతాంగ విప్లవ పోరాటాలు, ఆంధ్ర–బీహార్ విప్లవోద్యమాలు పెల్లుబుకడం; దేశంలో విప్లవం పుంజుకుంటూ అప్రతిహతంగా పురోగమించడం; మితవాద, అతివాద అవకాశవాదులకు వ్యతిరేకంగా జరిగిన ఆంతరంగిక పోరాటాలు; చీకటి అధ్యాయం (బ్లాక్ చాప్టర్) లాంటి విషాదాలు; ఆశ్చర్యపరిచే ప్రజాయుద్ధ విజయాలు, అబ్బురపరిచే సాహసాలు, అమూల్యమైన త్యాగాలు; దేశంలో దీర్ఘకాలిక ప్రజాయుద్ధం మలుపులు, మెలికల గుండా సాగుతూ 2004 సెప్టెంబర్ 21న మన మహత్తర నూతన పార్టీ అవతరణ మన కండ్ల ముందు నిలుస్తాయి. మరొకవైపు అంతర్జాతీయ రాజకీయ రంగాన గొప్ప రాజకీయ చర్చ (గ్రేట్ డిబేట్), చైనాలో సాంస్కృతిక మహా విప్లవం, మావో మరణానంతరం ప్రపంచ సోషలిస్టు విప్లవ చివరి స్థావరం పతనం కావడం, వివిధ దేశాల్లోని విప్లవాలపై దాని ప్రతికూల ప్రభావం, ప్రత్యేకంగా మన దేశ విప్లవంపై చూపిన ప్రభావం తదితర ప్రపంచాన్ని కుదిపివేసిన పరిణామాలు చాలా స్పష్టంగా మన ముందుకొస్తాయి. మన నూతన పార్టీ అవతరణ దినం సందర్భంగా అమరులు మన ప్రియతమ కామ్రేడ్స్ సిఎం, కెసి తదితర వేలాది వీర యోధులందరినీ స్మరించుకుని సగౌరవంగా తలవంచి అరుణారుణ జోహార్లు పలుకుదాం. అమరుల ఆశయ సాధనకు బిగిపిడికిళ్లతో ప్రతిన బూనుదాం!

కామ్రేడ్స్,

అత్యంత ఉత్సాహపూరితంగా పార్టీ ఐదవ వార్షికోత్సవాలు జరుపుకుని అప్పుడే సంవత్సరం కావస్తోంది. ఈ కాలంలో విప్లవానికీ, విప్లవ ప్రతిఘాతుకానికీ నడమ అత్యంత తీవ్రంగా సంఘర్షణ కొనసాగింది. వ్యూహాత్మక దృష్టితో చూసినప్పుడు ఈ కాలంలో మన దేశంలోనూ, మన ప్రజాయుద్ధంలోనూ చాలా ప్రాధాన్యత కలిగిన పరిణామాలు చోటు చేసుకున్నాయి. ఈ పరిణామాలు భారత విప్లవాన్ని చాలా కాలం వరకు ప్రభావితం చేస్తాయి.

ఒకటి – మన పార్టీ 5వ వార్షికోత్సవాలకు 4 నెలల ముందు నుండి ఈ సంవత్సరం జూలై మధ్య సాగిన 14 నెలల కాలంలో మన పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, ప్రియతమ నాయకుడు కామ్రేడ్ ఆజాద్‌తో పాటు అగ్రశ్రేణికి చెందిన 8 మంది కామ్రేడ్స్‌నూ, 10 మంది రాష్ట్రకమిటీ సభ్యులనూ శత్రువు అరెస్టు చేయడం లేదా పట్టుకొని చంపడం చేశాడు. జిల్లా కమిటీల నుండి కింది వరకు గల చాలామంది పార్టీ నాయకత్వ కామ్రేడ్స్‌ని అరెస్టు చేశాడు లేదా పట్టుకొని చంపాడు. విప్లవ నాయకత్వాన్ని నిర్మూలించి విప్లవాన్ని ఓటమి పాలుచేసే ప్రతిఘాతుక వ్యూహంతోనే శత్రువు పథకం ప్రకారం దాడి చేస్తున్నాడు. ఈ పథకం కొత్తదేమీ కానప్పటికీ దీని ద్వారా ఈ కాలంలో శత్రువు మన నాయకత్వానికి కలిగించిన నష్టం చాలా తీవ్రమైంది.

నూతన పార్టీ ఏర్పడిన ఒక్క సంవత్సరం తర్వాత మొదలైన అగ్రశ్రేణి నాయకత్వపు నష్టాల కొనసాగింపుగా ఇటీవల జరిగిన ఈ నష్టం పార్టీనీ, ఉద్యమాన్ని చాలా తీవ్రంగా ప్రతికూలంగా ప్రభావితం చేసింది. ప్రత్యేకంగా కామ్రేడ్ ఆజాద్‌ను కోల్పోవడం ద్వారా మన పార్టీకి తీవ్రమైన నష్టం జరిగింది. పార్టీ అత్యున్నతస్థాయి కమిటీలో కీలకమైన బాధ్యతలు నిర్వహిస్తూ, విప్లవోద్యమంలోని అనేక రంగాల్లో బహుముఖ సేవలను అత్యంత సమర్థవంతంగా అందించిన కామ్రేడ్ ఆజాద్ లేని లోటును సమీప భవిష్యత్తులో తీర్చుకోలేనిది.

నూతన పార్టీ సుసంపన్నమైన రాజకీయ, నిర్మాణ, సైనిక పంథాలను, బలమైన పార్టీని–నాయకత్వాన్ని, విశాలమైన పోరాట ప్రాంతాలను దేశ ప్రజల ముందుంచింది. పార్టీ పట్ల ప్రజల్లో విశ్వాసం మరింతగా పెరిగింది. దేశంలో విప్లవ పురోగమనానికి స్వీయాత్మకంగా చాలా అనుకూల పరిస్థితులు ఏర్పడినాయి. అనుకూలమైన స్వీయాత్మక పరిస్థితిలో అత్యంత కీలకమైనది బలమైన పార్టీ – బలమైన నాయకత్వం. ఇలాంటి గొప్ప విప్లవకర స్వీయాత్మక పరిస్థితిని చూసి భీతిల్లిన భారత పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు మన పార్టీ నాయకత్వాన్ని హత్య చేసి, సుదీర్ఘకాలం పాటు జైళ్లలో బంధించి పెట్టి పార్టీని బలహీనపరచి విప్లవాన్ని అణచివేయాలనే పథకం రూపొందించుకున్నారు. వీరు 2005, 2006లలో మన పార్టీ నాయకత్వానికి కలిగించిన నష్టాలు ఈ దుష్ట పథకం వల్ల జరిగాయి. అయినప్పటికీ పార్టీ ఏకతా కాంగ్రెస్ – 9వ కాంగ్రెస్ పార్టీ ఐక్యతను సుదృఢంగా చేసి, విప్లవ పురోగమనానికి ఒక సమగ్ర పథకాన్ని రూపొందించి, నాయకత్వాన్ని సుదృఢం చేసింది. ఆంధ్ర ఉద్యమం, ఉత్తర ఛత్తీస్‌గఢ్ ఉద్యమం సెట్‌బ్యాక్‌కు గురైనప్పటికీ ఉత్తర ఒడిషా జిల్లాల్లో ఉద్యమానికి చాలా నష్టాలు కలిగినప్పటికీ ఆచరణ క్రమంలో సాధించిన విజయాలు విప్లవ క్యాంపు ఆత్మ విశ్వాసాన్ని మరింతగా పెంచాయి.

ఏకతా కాంగ్రెస్‌ని విజయవంతంగా జరపడంతో పాటు తదనంతర కాలంలో మనం సాధించిన ఈ విజయాలు శత్రు క్యాంపుని చాలా తీవ్రంగా కలవరపరిచాయి. దీనితో విప్లవ నాయకత్వాన్ని నిర్మూలించడానికీ శత్రువులు ముమ్మరంగా ప్రయత్నించారు. పార్టీ 5వ వార్షికోత్సవానికి కొద్ది నెలల ముందు నుండి మన నాయకత్వానికి కలిగించిన నష్టాలు మరింత తీవ్రమైనవి. అయితే అవెంత తీవ్రమైనవే అయినప్పటికీ నక్సల్బరీ విప్లవ తిరుగుబాటు తర్వాత గడచిన 45 ఏండ్లలో భారత విప్లవోద్యమం నూతన నాయకత్వాన్ని సృష్టించుకుంటూ వస్తూనే ఉన్నది.

రెండు – సోనియా–మన్మోహన్‌సింగ్‌ల నాయకత్వంలోని

యు.పి.ఎ. ప్రభుత్వం రెండవసారి అధికారంలోకి రాగానే విప్లవోద్యమంపై మునుపెన్నడూ లేనిస్థాయిలో ముమ్మరం చేసిన బహుముఖ దాడి వ్యూహానికి కేంద్ర హోంమంత్రి చిదంబరం నేతృత్వం వహిస్తున్నాడు. ఈ బహుముఖ దాడి వ్యూహానికి నిర్దిష్ట రూపంగా ఫాసిస్టు "ఆపరేషన్ గ్రీన్‌హంట్" క్యాంపెయిన్ నిర్వహిస్తున్నారు. భారత విప్లవోద్యమాన్ని అణచివేసే లక్ష్యంతో గత 45 ఏండ్లల్లో పాలకవర్గాలు రూపొందించుకున్న దాడి వ్యూహాలలో 2009 మధ్య నుండి కొనసాగుతున్న ఈ దాడి వున్నతమైనది, విస్తృతమైనది, దేశవ్యాపితమైనది, తీవ్రమైనది, హింసపూరితమైనది, కేంద్రీకృతమైనది, దీర్ఘకాలికమైనది. పాలకవర్గాలు విప్లవోద్యమం నుండి ఎదురవుతున్న ప్రతి సవాలును, గమనంలో ఉంచుకుని దీనిలో అవసరమైన మార్పులు చేస్తున్నాయి. ఇందులో భాగంగానే మన బలమైన గ్రామీణ ప్రాంతాలపై, గెరిల్లాజోన్లపై, ప్రత్యేకించి దండకారణ్యం, ఝార్ఖండ్, లాల్‌గఢ్, నారాయణపట్నాలపై కేంద్రీకరించి దాడి క్యాంపెయిన్‌ను కొనసాగిస్తున్నారు. ఈ క్యాంపెయిన్ పూర్తిగా కౌంటర్ ఇన్‌సర్జెన్సీ, కౌంటర్ గెరిల్లా వార్‌ఫేర్ సిద్ధాంతంపై ఆధారపడి కేంద్రీకృత కమాండ్ కింద వ్యూహాత్మక బలగాలచే (స్ట్రాటజిక్ ఫోర్సెస్ – ప్రత్యేక పోలీసు, పారామిలటరి, ఎస్ఏఎఫ్ (కోబ్రా), మిలటరిలోని స్పెషల్ ఫోర్సెస్) అత్యంత క్రూరంగా, అత్యంత హింసపూరితంగా నిర్వహించబడుతున్నది. క్రమంగా వివిధ రకాల స్పెషల్ ఫోర్సెస్‌ని భారత సైన్యం నడిపే విధంగా పరిస్థితి మారుతున్నది. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో పాలకవర్గాలు అమలు చేస్తున్న దమనకాండ, హింసాకాండ 'ప్రజలపై ప్రభుత్వ యుద్ధం'గా బాగా బహిర్గతమైంది. ఈ ఫాసిస్టు దాడి సామాజిక వైరుధ్యాలను తీవ్రతరం చేసింది. గత 45 ఏండ్లలో ఎప్పుడూ ఏ నిర్బంధ క్యాంపెయిన్ ఇంత తీవ్రంగా ప్రజల నిరసనకు, ప్రతిఘటనకు గురికాలేదు.

మూడు – భారత రాజ్య యంత్రాంగం, న్యాయవ్యవస్థ, పాలనా యంత్రాంగం, శాసనవ్యవస్థ, ప్రభుత్వ పాలసీలు కౌంటర్ ఇన్‌సర్జెన్సీ సిద్ధాంతాలతో పునర్నిర్మాణం అవుతున్నాయి. రాజకీయ పార్టీలు, వివిధ సామాజిక సంస్థలు, సంస్కృతి, మీడియా ఈ సిద్ధాంతంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా చాలా తీవ్రంగా ప్రభావితమవుతున్నాయి. ఈ సిద్ధాంతాని కనుగుణంగా ఓవర్ట్ లేదా కోవర్ట్ పద్ధతుల్లో వివిధ సంస్థలు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. మన నూతన పార్టీ ఏర్పడిన తర్వాత విప్లవోద్యమాన్ని అణచివేయడానికి పాలకవర్గాలు ఈ నూతన ధోరణిని ముందుకు తెచ్చినా, మన్మోహన్ సింగ్ ప్రభుత్వం రెండోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత ఇందులో గణనీయమైన మార్పు వచ్చింది. నేడు ఈ ధోరణి దేశవ్యాపితమైంది. దీనికి ప్రేరణ, రిమోట్ కంట్రోల్ అమెరికా సామ్రాజ్యవాదుల నేతృత్వంలో సామ్రాజ్యవాదులు రూపొందించి అమలు చేస్తున్న 'వార్ ఆన్ టెర్రర్' (టెర్రరిజంపై యుద్ధం). రెండవ ప్రపంచ యుద్ధం తర్వాత కమ్యూనిస్టు విప్లవాలను, జాతి విముక్తి పోరాటాలను ఎదుర్కోవడానికి సామ్రాజ్యవాదులు రూపొందించుకున్న విప్లవ ప్రతిఘాతుక 'లో ఇంటెన్సిటి కాన్‌ఫ్లిక్ట్' (తక్కువ తీవ్రత కలిగిన యుద్ధం–ఎల్.ఐ.సి.) అనేది సామ్రాజ్యవాదుల, భారత పాలకుల 'వార్ ఆన్ టెర్రర్'కు మూలం. ఈ ప్రతీఘాతుక ఎల్ఐసీ విధానం వల్ల మన దేశంలోని సామాజిక వైరుధ్యాలు మరింతగా పదునుదేరాయి. సామ్రాజ్యవాదులు, భారత పాలకులు ఎల్ఐసి, కౌంటర్ ఇన్‌సర్జెన్సీ విధానాలకు అనుగుణంగా రాజ్యాన్నీ, న్యాయ వ్యవస్థనూ, పాలనా వ్యవస్థనూ, చట్ట సభలనూ, రాజకీయాలనూ, ఆర్థికాన్నీ, సంస్కృతినీ, మీడియాను పునర్నిర్మాణం చేయడానికి ఎంత ప్రయత్నిస్తే, అంత ఎక్కువగా విశాల ప్రజల తీవ్ర నిరసనకు, ప్రతిఘటనకు గురికాకతప్పదు. ఇప్పటికే దేశవ్యాపితంగా ఇలాంటి ప్రతిఘటనను వారు చవి చూస్తున్నారు.

కామ్రేడ్స్,

గతంలో ఎన్నడూ లేని స్థాయిలో, విస్తృతిలో, అన్ని రంగాల్లోనూ విప్లవం విప్లవ ప్రతీఘాతుకాన్ని ఎదుర్కొంటున్నది. మన న్యాయబద్ధమైన ప్రతిఘటనా యుద్ధంలో మనం చాలా త్యాగాలు చేశాము. ఈ త్యాగాలు లేకుండా గత సంవత్సర కాలంలో వివిధ రంగాల్లో మనం సాధించిన ఏ ఒక్క విజయం సాధ్యమయ్యేది కాదు. యావత్తు పార్టీ, పిఎల్‌జిఏ, జనతన సర్కార్లు, ప్రజా నిర్మాణాలు, విప్లవ క్యాంపులో సమీకరించబడుతున్న వారంతా, ప్రజా పక్షం వహిస్తున్నవారంతా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా జీవన్మరణ పోరాటమే చేశారు. ఈ సాహసిక వీరోచిత పోరాటం ద్వారానే గత సంవత్సర కాలంలో మనం కొన్ని గొప్ప విజయాలను, విలువైన అనుభవాలను సైతం సాధించుకున్నాం.

గత సంవత్సర కాలంలో మనం సాధించుకున్న విజయాలు ఇలా వున్నాయి.

ఒకటి – గెరిల్లా యుద్ధ విజయాలు. ఛత్తీస్‌గఢ్‌లోని సింగన్‌మడుగు, ముకరం (తాడిమెట్ల), కొంగెర; మహారాష్ట్రలోని లాహెరి; బెంగాల్‌లోని సాంక్రేల్, సిల్దా, ఝార్ఖండ్‌లోని గుమ్లా, విష్ణుపూర్, లతేహార్; బీహార్‌లోని సోనో, ప్రభుత్వ టోల్ ప్లాజా (గయా), టాండ్వా బాజార్; ఒరిస్సాలోని పాతకల్, బైఫర్‌గూడలలో శత్రు బలగాలపై చేసిన విజయవంతమైన దాడులు, ప్రత్యేకించి చారిత్రాత్మక ముకరం (తాడిమెట్ల) దాడి శత్రు బలగాల చొరవని దెబ్బతీశాయి. పిఎల్‌జిఏ చొరవని పెంపొందించాయి. ప్రజల ఆత్మవిశ్వాసం పెంచాయి. పిఎల్‌జిఏని మరింతగా సాయుధం చేసి, గెరిల్లా యుద్ధంలో నూతన అనుభవాలు అందించాయి. తాడిమెట్లలో మనం సాధించిన అనుభవం వాటన్నింటిలోకి ఉన్నతమైనది. ఈ దాడులు ప్రజలను, ప్రజా నిర్మాణాలను, ప్రజా వ్యవసాయ, వుత్పత్తి–అభివృద్ధి–సంక్షేమ కార్యకలాపాలను రక్షించుకోవడానికీ,

సజావుగా నడిపించుకోవడానికి ఎంతగానో తోడ్పడినాయి. ప్రజల క్రియాశీల మద్దతే ప్రజాయుద్ధంలో మనం సాధించిన విజయాలకు పునాదిలా ఉపయోగపడింది. మనం ఇలాంటి చురుకైన ప్రతిఘటన కొనసాగించకపోయి వుంటే మనల్ని రూపుమాపడానికి తప్పకుండా శత్రువుకు సానుకూల పరిస్థితి ఏర్పడి వుండేది. మన ఈ ఆత్మరక్షణా యుద్ధం బలహీనంగా సాగితే మన విజయాలు చేజారి వుండేవి. మరింత పెద్దయెత్తు సన్నాహాలు చేసుకుని మరింత పెద్దదాడికి రాబోతున్న శత్రు బలగాలను ఎదుర్కోవడానికి ఈ గొప్ప అనుభవాలు తప్పకుండా మనకు ఎంతో బాగా తోడ్పడుతాయి.

రెండు – కళింగ నగర్, సింగూర్, నందిగ్రాం సమరశీల ప్రజా పోరాటాల ఒరవడిలో, అంతకంటే ఉన్నత, విస్తృత స్థాయిలో లాల్‌గఢ్, నారాయణపట్నా ప్రజా పోరాటాల ప్రభంజనాలు పెల్లుబికాయి. వాటికి మన పార్టీ నాయకత్వం వహించింది. ఇవి రెండూ రివిజనిజానికి లేదా మితవాద అవకాశవాదానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడినాయి. రెండూ రాజ్యానికి వ్యతిరేకంగా ఎక్కుపెట్టబడినాయి. రాజ్యహింసకు వ్యతిరేకంగా లాల్‌గఢ్, భూమి సమస్యపై నారాయణపట్నా ప్రజలు పోరాటాలు ఆరంభించినా, అనతి కాలంలోనే అవి ప్రత్యామ్నాయ రాజ్య వ్యవస్థని ఆవిష్కరించాయి. ఇంతటి విశాల, సమరశీల, సుదీర్ఘకాలం జరిగిన ప్రజా విజృంభణలను గత పాతిక సంవత్సరాలలో మన దేశంలో చూసి ఎరగం. ఈ ప్రజా పోరాటాల ప్రాధాన్యత ఎంత ఉందంటే, దేశంలో ప్రజా యుద్ధ ప్రాంత విస్తరణకూ, పార్టీ, పిఎల్‌జిఏ, రాజ్యాధికార సంస్థల విస్తరణకు స్ఫూర్తిదాయకంగా, నూతన వనరులుగా ఇవి గొప్ప పాత్ర నిర్వహించాయి. మన దేశంలో ప్రజాయుద్ధం అభివృద్ధికి ఈ తిరుగుబాట్లు అందించిన పాఠాలు ఎంతో విలువైనవి. ఇవి దేశవిప్లవ చరిత్రలో ఒక నూతన అధ్యాయాన్ని సృష్టించాయి.

మూడు – లాల్‌గఢ్ విప్లవ రైతాంగ ఉద్యమం నేటి భారతదేశ సాయుధ పోరాట చిత్రపటంలో తనదైన ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. ఒకవైపు శత్రువు పెద్దెత్తున బలగాలను మోహరించి దేశవ్యాపితంగా రైతాంగ ఉద్యమాలను అణచివేస్తామంటున్న పరిస్థితులలో పెల్లుబికిన, విస్తరించిన, సంఘటితపడిన లాల్‌గఢ్ సాయుధ రైతాంగ విప్లవోద్యమానికి చాలా ప్రాధాన్యత వుంది.

నాలుగు – తూర్పు, మధ్య భారతదేశంలో ప్రకృతి సంపదలను కొల్లగొట్టడానికి బహుళ జాతి సంస్థలు, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ సంస్థలు చేసిన తీవ్రమైన ప్రయత్నాలన్నింటినీ మన పార్టీ నాయకత్వం కింద విశాల ప్రజలు సమరశీలంగా ప్రతిఘటిస్తూ విఫలం చేస్తున్నారు. ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో వేలాది, లక్షలాది సాయుధ బలగాల్ని దింపుతున్నా ప్రజలు వివిధ రూపాలలో వీరోచితంగా ప్రతిఘటిస్తున్నారు. 'జల్–జంగల్–జమీన్ హమారా హీ, జల్–జంగల్–జమీన్ ఛోడాబొ నహీ' అని ఉద్యమిస్తున్నారు. రానున్న రోజుల్లో ఈ పోరాటాల వ్యాప్తి, తీవ్రత, పరిణామాలు భారతదేశ రాజకీయాలను, అందులో భాగంగా ప్రజాయుద్ధాన్ని సానుకూలంగా బాగా ప్రభావితం చేస్తాయి. ఈ పోరాటాలలో దృఢంగా నిలిచిన ప్రజానీకాన్ని, వివిధ ప్రగతిశీల సంస్థలను–వ్యక్తులను మన పిబి అభినందిస్తున్నది. వీరందరికి అండగా నిలుస్తుంది. మరింత సమైక్యంగా సమరశీలంగా, విస్తృతంగా ఈ ఉద్యమాలను నడపాల్సిన అవసరాన్ని మరోసారి గుర్తు చేస్తున్నది. సామ్రాజ్యవాదుల, వారికి తొత్తులుగా పనిచేస్తున్న దేశద్రోహుల ఆటలు సాగనివ్వమనీ, ఈ ఉద్యమాలలో ముందు పీఠీన మా పార్టీ నిలుస్తుందనీ పిబి బాహాటంగా ప్రకటిస్తున్నది.

ఐదు – శత్రు మానసిక యుద్ధానికి వ్యతిరేకంగా కామ్రేడ్ ఆజాద్ నాయకత్వంలో మన పార్టీ ప్రభావవంతంగా సిద్ధాంత, రాజకీయ ప్రచార యుద్ధాన్ని కొనసాగించింది. ప్రజలను మోసం చేసి ప్రజాయుద్ధానికి వ్యతిరేకంగా నిలబెట్టడానికి శత్రువు తలపెట్టిన మానసిక యుద్ధాన్ని దేశ – ప్రపంచ ప్రజల ముందు కామ్రేడ్ ఆజాద్ సమర్థవంతంగా బట్టబయలు చేశాడు. సిద్ధాంత, రాజకీయ రంగంలో శత్రువుకు వ్యతిరేకంగా కామ్రేడ్ ఆజాద్‌తో పాటు వివిధ స్థాయిల్లో యావత్తు పార్టీ పోరాడి ఉండకపోతే, పార్టీ నాయకత్వంలో కొనసాగుతున్న ప్రజాయుద్ధానికి ఇంత సాధికారత లభించేది కాదు. ప్రజాయుద్ధం ఇంతగా ప్రాధాన్యత సంతరించుకునేది కాదు. అమరుడు కామ్రేడ్ ఆజాద్ ఈ రంగంలో చేసిన సేవలు చాలా ప్రాధాన్యత గలవీ, శాశ్వతమైనవి. అమరుడు ఆజాద్ స్ఫూర్తితో ఈ రంగంలో పోరాటాన్ని మరింత దృఢంగా కొనసాగించాల్సిన అవసరం ఉంది.

ఈ ప్రధానమైన ఐదు విజయాలతో పాటు మన పార్టీ కొన్ని ప్రాంతాల్లో విస్తరించింది. పార్టీని, పిఎల్‌జిఏను మెరుగ్గా సంఘటితం చేసుకున్నాం. పార్టీకీ, సేనకూ రాజకీయ సైనిక శిక్షణ నందించాం. రాజకీయాధికార సంస్థలను సంఘటిత పరచుకోవడానికీ, నూతన ప్రాంతాలలో వాటిని ఏర్పరచడానికి కృషి చేశాం. సంవత్సర కాలంలో మనం సాధించిన ఈ సఫలతలే ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని చాలామంది విప్లవశక్తులు, ప్రజాస్వామికవాదులు, మేధావులు, ప్రగతిశీలురు, దేశభక్త శక్తులు గట్టిగా వ్యతిరేకించడానికి ప్రేరణనందించాయి. ఈ సంవత్సర కాలంలో మనం రాజకీయంగా, ప్రజా ఉద్యమపరంగా, గెరిల్లా యుద్ధపరంగా చేసిన సమరశీల పోరాటాలే, సాధించిన సత్ఫలితాలే వారందరి మద్దతును కూడగట్టడానికి ప్రధాన కారణం.

కామ్రేడ్స్,

గత సంవత్సర కాలపు అనుభవాలను సంశ్లేషించుకున్నప్పుడు, స్వీయాత్మక శక్తుల విషయంలో మనం గణనీయమైన సంఖ్యలోనే

కాకుండా, నాయకత్వపరంగా మనం భారీ నష్టాలు పొందాం. ఈ నష్టాలు పార్టీనీ, ఉద్యమాన్నీ చాలా ప్రతికూలంగా ప్రభావితం చేస్తాయని స్పష్టంగా చెప్పగలం. మనం నష్టపోయిన కామ్రేడ్స్ లేని లోటును, ప్రత్యేకించి మన ప్రియతమ నేత కామ్రేడ్ ఆజాద్ లేని లోటును పూడ్చుకునే లక్ష్యంతో మన కేంద్ర కమిటీ నుండి కింది వరకూ అన్ని పార్టీ కమిటీలు, యావత్తు పార్టీ ప్రణాళికాబద్ధంగా వారి వారసులుగా నూతన శక్తులను విస్తృతంగా తయారు చేసుకోవడానికి తీవ్రంగా కృషి చేయాల్సిన అవసరం ఉంది. ఈ లక్ష్యంతో పార్టీ కమిటీలు అన్ని స్థాయిల్లో సిద్ధాంత అధ్యయనం, రాజకీయాల అధ్యయనం, నిర్దిష్ట పరిస్థితుల అధ్యయనం, సృజనాత్మక అన్వయింపు, అనుభవాల క్రోడీకరణ, నిజాయితీతో కూడిన విమర్శ–ఆత్మవిమర్శ, పని పద్ధతులలోనూ – పనిశైలినీ మెరుగుపరచుకోవడానికి కృషి చేయాల్సిన అవసరం వుంది. చురుకైన ఆత్మరక్షణా యుద్ధ విధానాన్ని దృఢ సంకల్పంతో కొనసాగించాల్సిన అవసరం వుంది. వీటన్నిటి ద్వారా మన శక్తి సమర్థతలు పెంపొందించుకోవాల్సిన అవసరం వుంది. ఇది వరకే ఆరంభించిన దిద్దుబాటు క్యాంపెయిన్ సత్ఫలితాలు సాధించేలా ప్రభావవంతంగా కొనసాగించాల్సిన అవసరం ఉంది.

మనం పొందిన నష్టాల వల్ల కలిగిన లోటును పూడ్చుకోవడానికీ, పార్టీ శక్తి సమర్థతలను, స్థాయిని పెంపొందించుకోవడానికీ ఈ పద్ధతులన్నీ దృఢ సంకల్పంతో అమలు చేయాల్సినవే. కానీ అంతకంటే ప్రధానంగా మనం జరగబోయే నష్టాలను తప్పించడానికి గాను నష్టాలకు కారణాల గురించి, అందుకు దోహదం చేసిన పరిస్థితుల గురించి లోతైన పరిశీలన చేయాల్సిన, చర్చ నిర్వహించాల్సిన అవసరం వుంది. నష్టాలకు కారణాల్ని సరిగా అర్థం చేసుకోగలిగితే, వాటిని నివారించే మార్గం దొరుకుతుంది. కేంద్ర కమిటీ, రాష్ట్ర కమిటీలు ఈ కర్తవ్యాన్ని చేపట్టాలి. మనం ఈ కర్తవ్యాన్ని సఫలీకృతంగా నిర్వహించగలిగితే భవిష్యత్తులో నష్టాలను తగ్గించుకోగలం. మనం ఇలా చేయగలిగితే సమీప భవిష్యత్తులో పార్టీ శత్రువుకు అభేద్యమైనదిగా ఎదుగగలుగుతుంది. ఈ విషయంలో మనం సాధించే ఫలితం ఎలాంటిదనే దానిపైనే భారత విప్లవం యొక్క భవిష్యత్తూ చాలా వరకు ఆధారపడి ఉంటుంది. మన నష్టాలు మన విజయాలను ప్రభావరహితం చేస్తూ వస్తున్నాయనే సత్యాన్ని మనం ఒక హెచ్చరికగా తీసుకోవాలి. ఎంత అనుకూలమైన విప్లవకర భౌతిక పరిస్థితి ఉన్నా, తగినంత శక్తివంతమైన, సమర్థవంతమైన పార్టీ నాయకత్వం లేకుండా, అలాంటి శత్రు దుర్భేద్యమైన పార్టీగా – నాయకత్వంగా సంఘటితం చేసుకోవడానికి కృషి చేయకుండా విప్లవ విజయం గురించి ఆలోచించడం ఊహాజనితమే అవుతుంది.

మన పార్టీ గత అనుభవాన్ని, ప్రత్యేకంగా కామ్రేడ్ చారుమజుందార్ అమరత్వం తర్వాత శ్రేణుల అభిమానం చూరగొన్న, సమర్థవంతమైన నాయకత్వం లేకపోవడం భారత విప్లవం సెట్‌బ్యాక్‌కు గురయిపోవడానికి అత్యంత ముఖ్యమైన ఒక కారణం అనేది మనందరికీ స్పష్టంగానే తెలుసు. పెరూ విప్లవం ఓడిపోవడానికీ, విచ్ఛిన్నం గావడానికి ప్రధాన కారణం దాదాపు నాయకత్వపు కోరంతా శత్రు చేజిక్కడం. ప్రస్తుతం మన దేశంలో కూడా నాయకత్వాన్ని నష్టపోవడం వల్ల చాలా ప్రాంతాలు స్థబ్దతకు గురయినాయి లేదా సెట్‌బ్యాక్‌లో పడిపోయినాయి. ఐతే గతంలో మనం నష్టాలకు కారణాల్ని సరిగా అర్థం చేసుకున్న తర్వాత వివిధ ప్రాంతాల్లో తిరిగి పార్టీనీ, ఉద్యమాన్ని నిర్మించగలిగాం. మనం ఈ సమస్యని పరిష్కరించడానికి మన అనుభవాల నుండి, సోదర పార్టీల అనుభవాల నుండి నేర్చుకోవాల్సిన అవసరం ఉంది. నేడు మనం చాలా బలవంతుడైన, క్రూరుడైన శత్రువును ఎదుర్కొని విజయం సాధించాలంటే, శత్రువుకు దుర్భేద్యమైన పార్టీగా మన పార్టీని మార్చుకోవాల్సిన అవసరం వుంది.

ఇక ఆపరేషన్ గ్రీన్‌హంట్ గానీ, కౌంటర్ ఇన్‌సర్జెన్సీ సిద్ధాంతం గానీ, ఎల్ఐసి పాలసీ గానీ కాలం చెల్లిన వర్గాల సిద్ధాంతాలు, వ్యూహాలు. పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు భారత విప్లవాన్ని అడ్డుకోవడానికీ, అణచివేయడానికి వీటిని అమలు చేయడం అనేది ఈ వర్గాల దివాళాకోరుతనాన్నే తెలియజేస్తుంది. ఇప్పటికే ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా మన పార్టీ నాయకత్వంలో పిఎల్‌జిఎ, ప్రజలు, ప్రజాస్వామికవాదులు కొనసాగిస్తున్న ఆత్మరక్షణా యుద్ధాన్ని మరింత తీవ్రతరం, విస్తృతం చేయాలి. శత్రువు అనుసరిస్తున్న ఈ దివాళాకోరు వ్యూహం–పథకం ప్రజల్లో ఇప్పటికే చాలా బహిర్గతమైపోయి వుంది. మనం ప్రజలపై ఆధారపడి, పిఎల్‌జిఏని సరిగా మోహరించి పోరాడగలిగితే, మనం తప్పక గ్రీన్‌హంట్‌ను ఓడించగలుగుతాం. శత్రువు గ్రీన్‌హంట్‌ను ఎంత తీవ్రంగా, విస్తృతంగా కొనసాగిస్తే, చివరికి అది శత్రువుకే వినాశనాన్నే తెచ్చిపెట్టి తీరుతుంది.

సామ్రాజ్యవాదుల మద్దతుతో పాలకవర్గాలు ఎల్.ఐ.సి. విధానానికి అనుగుణంగా యావత్తు భారత రాజకీయ, సైనిక, ఆర్థిక, సాంస్కృతికాన్ని ప్రభావితం చేస్తూ పునర్నిర్మాణం ఏమేరకు చేస్తే సామాజిక వైరుధ్యాలు అంతగా తీవ్రతరం అవుతాయి. అంతగా భారత సమాజం సామ్రాజ్యవాదుల అదుపాజ్ఞలలోకి నెట్టివేయబడేలా చేస్తుంది. విప్లవానికీ, విప్లవ ప్రతిఘాతుకానికీ నడుమ, అంటే కొద్ది మంది ప్రతిఘాతకులకూ, అసంఖ్యాక ప్రజలకూ నడమ అంతర్యుద్ధం మరింత తీవ్రతరం అవుతుంది. అంతిమంగా ప్రజాయుద్ధ పెనుజ్వాలల్లో విప్లవ ప్రతిఘాతుకత్వం భస్మీపటలం గాకతప్పదు. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా గానీ, భారత సమాజాన్ని కనీవినీ ఎరగని విపరిణామాలకు దారితీసేలా చేస్తున్న ఫాసిజీకరణకు వ్యతిరేకంగా గానీ మన పార్టీ దీర్ఘకాలిక దృష్టితో

ఎంత సమర్థవంతంగా ప్రజలను కదలించి, ఎంత దృఢంగా, ఎంత తెగించి పోరాడుతుందనే దానిపై ఆధారపడి అంతిమ ఫలితం నిర్ణయించబడుతుంది. ఐతే చారిత్రకానుభవాలు తెలియజేసేదేమంటే, ప్రపంచంలో ఎక్కడా ప్రజలకు వ్యతిరేకంగా చేపట్టిన ఇలాంటి విధానాలు చరిత్రలో మట్టిగరవక తప్పలేదు.

కామ్రేడ్స్,

నాయకత్వపరంగా మనం తీవ్రంగా నష్టపోవడం వల్ల, పార్టీ పంథాని, విధానాలను నిర్దిష్ట పరిస్థితులకు సృజనాత్మకంగా అన్వయించుకోలేకపోవడం వల్ల, సుదీర్ఘకాలంగా గెరిల్లాజోన్ స్థాయికి సైతం ఎదగని చాలా రాష్ట్రాల్లోని ఉద్యమాలు స్థబ్దతకు నెట్టబడినాయి లేదా సెట్‌బ్యాక్‌కు నెట్టబడినాయనే విషయం మనందరికి తెలిసిందే. పట్టణాలలోనూ ఉద్యమాలు చాలా బలహీనపడినాయి. మరో రకంగా చెప్పాలంటే గెరిల్లాజోన్లు ఒంటరి చేయబడుతున్నాయి. గెరిల్లాజోన్లలో సైతం బలమైన ప్రాంతాలను తుడిచిపెట్టడానికి శత్రువు మున్నెన్నడూ లేనిస్థాయిలో దాడి కొనసాగిస్తున్నాడు. గెరిల్లా జోన్లకు బయట పార్టీ నాయకత్వాన్ని తీవ్రంగా నష్టపర్చిన తర్వాత గెరిల్లాజోన్లలోనే దెబ్బకొట్టడానికి శత్రువు తీవ్రంగా ప్రయత్నాలు చేస్తున్నాడు.

ఇలాంటి పరిస్థితులలో నేడు మనం దాదాపు పూర్తిగా మన బలమైన ప్రాంతాలపై ఆధారపడి ఏకతా కాంగ్రెస్ నిర్ధారిత కర్తవ్యాల సాఫల్యానికి కృషి చేయాలి. ఇక్కడ నాయకత్వ రక్షణకు ప్రత్యేక ప్రాధాన్యతనివ్వాలి. ప్రజాసైన్యాన్ని పటిష్టం చేసుకోవడానికి, వివిధ ప్రజా నిర్మాణాలను సంఘటితం చేసుకోవడానికి తీవ్రంగా కృషి చేయాలి. చురుకైన ఆత్మరక్షణా యుద్ధ విధానాన్ని కొనసాగించాలి. గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడం, విప్లవ ప్రజా కమిటీలను స్థాపించడాన్ని కేంద్రస్థానంలో ఉంచి పనిచేయాలి. శత్రు చుట్టివేత దాడిని వమ్ముచేయడానికి ఈ ప్రాంతాలపై ఆధారపడి ప్రజాయుద్ధ వ్యూహాత్మక కర్తవ్యాల సాధనకు ఉద్యమ ప్రాంతాలను విస్తరింపజేయాలి.

లాల్‌గఢ్ నుండి సూర్జాగఢ్ వరకూ, దేశవ్యాపితంగానూ, ప్రకృతి సంపదలు కొల్లగొట్టడానికి బహుళ జాతి సంస్థలు – బడా దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ సంస్థలు చేస్తున్న తీవ్రమైన దాడిని ఎదుర్కోవడానికి ప్రజలకు మార్గదర్శకత్వాన్ని అందించాలి. ప్రజాయుద్ధంలో ఒక ప్రధాన సమస్యగా ఉన్న ఈ సమస్యపై ప్రజలను చురుగ్గా కదిలించగలిగితే, ప్రజాయుద్ధ అభివృద్ధికి కావలసిన భౌగోళిక, మానవ, పాదార్థిక, సాంకేతిక, నైతిక, న్యాయపర వనరులను సమీకరించుకోవచ్చు. ఈ కర్తవ్యాన్ని సమర్థవంతంగా నిర్వహించగలిగితే మన దేశంలో ప్రజాయుద్ధం మరో మెట్టుకు ఎదగడానికి చాలా అవకాశాలు వున్నాయి.

నేటి పరిస్థితులలో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌కు గోరీకట్టే కేంద్రస్థానాలు మన గెరిల్లాజోన్లే. గ్రీన్‌హంట్‌కు వ్యతిరేకంగా దేశవ్యాపితంగా ప్రజాస్వామిక శక్తులను కూడగట్టడానికి, ఐక్యసంఘటనా కృషిని మెరుగుపరచుకోగలిగితే, పట్టణాల్లో, మైదానాల్లో సృజనాత్మక పద్ధతుల్లో కృషి చేయగలిగితే మనం నాయకత్వంలో ఒక పెద్ద భాగం దెబ్బతినిపోయి ఉన్న ఈ పరిస్థితుల్లో కూడా మంచి ఫలితాలు సాధించగలం. కళింగనగర్, సింగూర్, నందిగ్రాం, లాల్‌గఢ్, కందమాల్, నారాయణపట్నా అనుభవాలను మరింత సమగ్రంగా క్రోడీకరించగలిగితే, ఈ అనుభవాలపై ఆధారపడి ప్రజలను కదలించడానికి వాటిని సృజనాత్మకంగా అన్వయించుకోగలిగితే దేశంలో ప్రజా పోరాటాల నిర్వహణలో ఒక గుణాత్మక గెంతు సాధించగలం.

శత్రు మానసిక యుద్ధాన్ని ప్రభావవంతంగా తిప్పికొట్టడానికి సృజనాత్మక పద్ధతుల్లో నాయకత్వాన్నీ, ప్రచార యంత్రాంగాన్నీ, యావత్తు పార్టీనీ సరిగా కదిలించగలిగితే ఆజాద్ లేని లోటుని తీర్చుకోగలం. శత్రువు కొనసాగిస్తున్న బహుముఖ యుద్ధాన్ని ఓడించడానికే మానసిక యుద్ధాన్ని మనం ప్రభావవంతంగా కొనసాగించాలి.

ఉద్యమాలు స్తబ్ధతకు లేదా సెట్‌బ్యాక్‌కు గురికావడానికి కారణాల్ని తెలుసుకోవడానికి లోతైన అధ్యయనం, పరిశీలన అవసరం. ఇలాంటి రాష్ట్రాలలో మిగిలిన పార్టీ శక్తులలో పెంపొందే క్రియాశీలత లేమినీ, సృజనాత్మకత లేమినీ పారద్రోలాలి. స్థబ్దతకు కారణాలు తెలుసుకోవడానికి ఎట్టి పరిస్థితుల్లోనూ స్వీయాత్మకతని దరిచేరనీయరాదు. గతితార్కిక చారిత్రక భౌతికవాదాన్ని, ప్రత్యేకంగా వైరుధ్య సూత్రాన్ని సృజనాత్మకంగా అన్వయించి పరిశోధన చేయాలి. సంక్లిష్టతను, ఇలాంటి కష్టభరితమైన, తీవ్రమైన సమస్యలను ఎదుర్కొంటున్నప్పుడే వాటితో పాటు కారు చీకట్లు చెదిరిపోయి వెలుగు రేఖలు విచ్చుకునే పరిస్థితులుంటాయి. అదుగో గెరిల్లాజోన్లను చుట్టుముడుతున్న శత్రువుని మనం చుట్టుముట్టే, ఏకతా కాంగ్రెస్ కర్తవ్యాలను నెరవేర్చి భారత విప్లవంలో ఒక నూతన గెంతును సాధించగలిగే పరిస్థితులు ఎంతో స్పష్టంగా కనిపిస్తున్నాయి. అత్యంత సాహసోపేతంగా, చాకచక్యంగా ప్రజాయుద్ధాన్ని నడుప ద్విగుణీకృతోత్సాహంతో, దృఢ సంకల్పంతో సిద్ధం అవుదాం.

కామ్రేడ్స్,

పాలకవర్గాలు, సామ్రాజ్యవాదులు మనపై, మన విప్లవోద్యమంపై దాడిని తీవ్రతరం చేయడం అనేది వారు దినదినం ప్రజా వ్యతిరేక విధానాలను అమలుచేస్తూ, ప్రజలకు దూరం అవుతున్నారనే దానిని స్పష్టం చేస్తున్నది. వారు దేశంలో ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ని ఆరంభించినప్పటి నుండీ, రాజ్య వ్యవస్థను ఎల్‌పిజి విధానాలతో పునర్ వ్యవస్థీకరిస్తున్నప్పటి (రీస్ట్రక్చర్) నుండీ, మన నాయకత్వాన్ని పట్టుకొని క్రూరంగా హత్యలు చేయడంతో పాటు ప్రజలపై మహా

విధ్వంసకాండ (మాపింగ్) చేపట్టినప్పటి నుండీ, దక్షిణాసియాలో భారత పాలకులు అమెరికా సామ్రాజ్యవాదులకు జూనియర్ పార్ట్‌నర్‌గా చేరినప్పటి నుండీ, వారెన్ని ఎత్తులు వేసినా దినదినం, దేశ ప్రజలకూ, దక్షిణాసియా ప్రజలకూ శత్రువులుగానే లేదా పీడకులుగానే మరింత బహిర్గతం అయిపోతున్నారు. భారత సమాజంలో అన్ని వైరుధ్యాలు తీవ్రతరం అవుతున్నాయి. దేశంలోనూ, దక్షిణాసియాలోనూ, ప్రపంచంలోనూ దినదినం విప్లవానికి భౌతిక పరిస్థితులు అద్భుతంగా పెంపొందుతున్నాయి. వివిధ ప్రజాస్వామిక, ప్రగతిశీల, దేశభక్త, పీడిత జాతుల, పీడిత సామాజిక ప్రజా సముదాయాలు తీవ్ర వివక్షకూ, అణచివేతకూ గురవుతున్నారు. ఆర్థిక అభివృద్ధి రేట్ల సూచికలు ఎంత గొప్పగా వున్నాయని చూపినా, అవన్నీ గుప్పెడు మంది టాటా, అంబానీ, బిర్లా, మహేంద్ర తదితర ఘరానా దళారీ నిరంకుశ పెట్టుబడిదారుల అభివృద్ధి సూచికలే లేదా దేశాన్ని నిలువునా కొల్లగొట్టే బహుళ జాతి సంస్థల అభివృద్ధి సూచికలే. దేశ జనాభాలో అత్యధిక సంఖ్యాకులైన శ్రమజీవుల, పేద, మధ్యతరగతి ప్రజల బతుకులు అధఃపాతాళానికి వెళుతున్నాయి. పేదల – ధనికుల మధ్య గండి గతంలో కంటే చాలా ఎక్కువగా పెరిగిపోయింది. అంకెల గారడీ చేసి దళారీ ఆర్థికవేత్తలు వర్గవైరుధ్యాలను తారుమారు చేయలేరు. అందువల్లనే పాలకులు వివిధ ప్రాంతాల్లో పోరాడుతున్న ప్రజలపైకి ఫాసిస్టు కిరాయి బలగాలను తోలుతూ, ఈ వైరుధ్యాలను మరింత తీవ్రం చేస్తున్నారు. పోరాడే ప్రజలను సంఘటితం చేయడానికీ, వారి మధ్య సమైక్యత తీసుకువచ్చి, వారిపై మన నాయకత్వాన్ని నెలకొల్పడానికీ, ప్రజాయుద్ధాన్ని నూతన స్థాయిలోకి తీసికెళ్లడానికీ కావలసిన పరిస్థితులు పరిపక్వం అవుతున్నాయి. మన మహత్తర పార్టీ 6వ వార్షికోత్సవం సందర్భంగా ఈ అద్భుతమైన పరిస్థితులను అందుకొనేలా పార్టీని సుసంఘటితం చేయడానికి పూనుకుందాం. ప్రజాయుద్ధాన్ని అభివృద్ధి చేయడానికీ, అమరుల కలల సాఫల్యానికీ ప్రతిన బూనుదాం.

కామ్రేడ్స్,

మన పార్టీ 6వ వార్షికోత్సవాలు విప్లవోత్సాహం ఉట్టిపడేలా జరపండి. గత సంవత్సర కాలంలో చాలా తీవ్ర నిర్బంధంలో సైతం మనం సాధించిన విజయాలను గ్రామ గ్రామాన ప్రజల ముందుంచండి. అమరుల ఆదర్శాలను ఎత్తిపట్టండి. వివిధ రూపాల్లో ప్రచార క్యాంపెయిన్లు నిర్వహించండి. అద్భుతమైన విప్లవ పరిస్థితి గురించీ, ఆ పరిస్థితిని అందుకోవటానికి పార్టీ చేయాల్సిన కృషి గురించీ చాలా స్పష్టంగా యావత్తు పార్టీలో చర్చించండి! విప్లవ క్రమంలో ఎంతటి కష్టాలు, నిర్బంధాలు ఎదురయినా మునుముందుకే సాగుతామనీ, అజేయమైన ప్రజాయుద్ధం ద్వారా విజయం సాధించగలుగుతామనే అచంచల విశ్వాసంతో అంతర్జాతీయ విప్లవకర కార్మికవర్గ అరుణపతాకను దృఢంగా సమున్నతంగా నిలిపి ప్రతిన చేద్దాం.

- ✶ నాయకత్వానికీ, శ్రేణులకు కలుగుతున్న భారీ నష్టాలను అధిగమించడానికి పార్టీని శత్రు దుర్భేధ్యమైందిగా పటిష్టపరచుకుందాం!
- ✶ అద్భుత విప్లవ పరిస్థితికీ, ప్రజాయుద్ధ పురోభివృద్ధికీ తగినట్లు సమర్థవంతంగా నాయకత్వాన్నందించడానికి పార్టీని సుసంఘటితం చేద్దాం!
- ✶ మన ఉద్యమాన్ని అజేయమైన ప్రజాయుద్ధంగా అభివృద్ధి చేసే లక్ష్యంతో విశాల ప్రజలను విస్తృతంగా క్రియాశీలంగా కదిలిద్దాం!
- ✶ 'ఆపరేషన్ గ్రీన్‌హంట్'ని ఓడించడానికి ప్రతి గెరిల్లాజోన్‌లో తాడిమెట్ల (ముకరం) ఒరవడిని కొనసాగిద్దాం!
- ✶ భారత పాలకవర్గాలను, సామ్రాజ్యవాదులను ప్రజాపోరు ప్రభంజనంలో ముంచెత్తడానికి ప్రతీ రాష్ట్రంలోనూ నందిగ్రాం, లాల్‌గఢ్, నారాయణపట్నా ఒరవడిని కొనసాగిద్దాం!
- ✶ 'ప్రజలపై ప్రభుత్వ యుద్ధానికి' వ్యతిరేకంగా కొనసాగిన నిరసనోద్యమాల ఒరవడితో దేశవ్యాపితంగా బద్ధలవుతున్న ప్రజా ఉద్యమాలను అనుసంధానించి బలమైన ఐక్యసంఘటనకు పునాది వేద్దాం!
- ✶ గెరిల్లా యుద్ధం తీవ్రతరం చేస్తున్న ప్రాంతాలలో విముక్తి ప్రాంత లక్ష్యంతో 'విప్లవ ప్రజా కమిటీ'లను నెలకొల్పుదాం! సంఘటితపరుద్దాం! విస్తరిద్దాం!
- ✶ శత్రు మానసిక యుద్ధాన్ని ప్రభావవంతంగా తిప్పికొట్టడానికి కామ్రేడ్ ఆజాద్ నెలకొల్పిన ఒరవడితో విప్లవ రాజకీయ ప్రచార యుద్ధాన్ని వికసింపజేద్దాం!
- ✶ ప్రజాయుద్ధ బహుముఖ కర్తవ్యాల సాధనకు విశాల ప్రాంతాలకు విస్తరిద్దాం!

తేది : 20–8–2010

పొలిట్‌బ్యూరో,
కేంద్రకమిటీ,
సిపిఐ (మావోయిస్టు)

**అన్యవర్గ ధోరణులను వదిలించుకొని, పార్టీని బోల్షివీకరిద్దాం!**

# పాలకవర్గాల అభివృద్ధి నమూనాపై తిరగబడ్డ 'సోంపేట'

ఇవాళ పాలకులు పదే పదే జపిస్తున్న పదం 'అభివృద్ధి'. అభివృద్ధి మాయాజాలం చాటున తమ దోపిడీని దాచేస్తున్నారు. అభివృద్ధిని సాకుగా చూపించి ఉద్యమాలపై పాశవిక అణచివేతను ప్రయోగిస్తున్నారు. ఉద్యమాలపై దుష్ప్రచారానికి కూడా అభివృద్ధినే వాడుకుంటున్నారు. అంతేకాదు ఈ అభివృద్ధి కోసం ప్రజలు త్యాగాలు చేయాలని కూడా పదే పదే ప్రవచిస్తున్నారు.

అయితే పాలకులు ప్రజలపై ఎటువంటి అభివృద్ధిని రుద్దుతున్నారో, ప్రజలు వాస్తవంగా ఎటువంటి అభివృద్ధిని కోరుకుంటున్నారో మరోసారి 'సోంపేట' స్పష్టం చేసింది. అభివృద్ధి కోసం ప్రజలు ఎటువంటి త్యాగాలు చేయాలని పాలకులు కోరుకుంటున్నారో, ఆ అభివృద్ధిని కాలదన్నుతూ ప్రజలు ఎటువంటి త్యాగాలకు సిద్ధపడుతున్నారో గున్న జోగారావు, గొనప కృష్ణమూర్తిలు తమ నెత్తుటిని చిందించి మరోసారి ప్రపంచానికి చాటారు.

పాలకులు అభివృద్ధి అని మాట్లాడుతున్నారంటే దానర్థం విధ్వంసం. ప్రజలను త్యాగాలు చెయ్యమంటున్నారంటే దానర్థం విధ్వంసాన్ని మౌనంగా భరించమనడం. అయితే ప్రజలు అభివృద్ధి ముసుగులోని విధ్వంసపు నిజ స్వరూపాన్ని గుర్తిస్తున్నారు. ఈ విధ్వంసాన్ని భరించే త్యాగాలను తాము చేయలేమనీ, ఈ విధ్వంసాన్ని అడ్డుకోవడానికి ఎన్ని త్యాగాలకైనా వెనుకాడమనీ నొక్కిచెప్తున్నారు.

దీనికి గత ఉదాహరణలు గంగవరం, కళింగనగర్, సింగూర్, నందిగ్రాంలు అయితే తాజా ఉదాహరణ సోంపేట.

పాలకుల 'అభివృద్ధి' మొహంపై సోంపేట తుపుక్కున ఉమ్మేసింది. నిజమైన అభివృద్ధి కోసం నెత్తురు చిందించింది.

నిన్న మొన్నటి దాకా సోంపేట ఎంతో మందికి తెలియకపోవచ్చు. కానీ నేడది వీరగాథగా చరిత్రకెక్కింది.

ఆంధ్రప్రదేశ్‌లోని ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన శ్రీకాకుళంలో సోంపేట ఒక మండల కేంద్రం. భారత విప్లవ చరిత్రలో శ్రీకాకుళంకు వున్న ప్రాధాన్యత జగమెరిగినదే. అటువంటి గడ్డపై మైదాన ప్రాంత ఉద్యమానికి పేరుగాంచిన ఉద్దానం ప్రాంతంలో వుంది సోంపేట.

పాలకవర్గాల నిర్లక్ష్యానికీ, దోపిడీకి గురై ఉత్తరాంధ్ర ప్రాంతమంతా అభివృద్ధికి దూరంగా వుండి తీవ్రమైన వెనుకబాటుతనానికి గురవుతోంది. అందులో భాగంగా శ్రీకాకుళం జిల్లా సైతం తీవ్ర వెనుకబాటుకు గురవుతోంది. ఇన్నాళ్లూ అభివృద్ధికి దూరంగా వుంచిన ఈ ప్రాంతాన్ని ప్రస్తుతం ప్రభుత్వం శరవేగంతో 'అభివృద్ధి' చేయతలపెట్టింది.

అది తలపెట్టిన 'అభివృద్ధి'లో భాగంగా మొత్తం ఉత్తరాంధ్రలో 17, శ్రీకాకుళం జిల్లాలో ఆరు థర్మల్ విద్యుత్ కేంద్రాలు నిర్మించడానికి ప్రైవేటు సంస్థలకు అనుమతిలిచ్చింది. వీటితో పాటు శ్రీకాకుళం జిల్లాలోనే మరో రెండు అణు విద్యుత్ కేంద్రాలకు కూడా అనుమతులిచ్చింది.వీటన్నింటి విద్యుదుత్పత్తి సామర్థ్యం పన్నెండు వేల మెగావాట్లు. అంటే రాష్ట్రంలో ప్రస్తుతం ఉత్పత్తి అవుతున్న విద్యుత్ సామర్థ్యానికి సమానమైన విద్యుత్ ప్రాజెక్టులు ఒక్క శ్రీకాకుళం జిల్లాలోనే వస్తున్నాయన్నమాట.

ఈ పవర్‌ప్లాంట్లు ఉత్పత్తి చేసే కరెంటుతో ఈ ప్రాంతంలో చీకటి పారిపోయి వెలుగులు విరజిమ్ముతాయని పాలకులు ఊదరగొడుతున్నారు. కానీ నిజానికి ఈ పవర్‌ప్లాంట్ల వల్ల ఇక్కడ చీకటి పారిపోతుందా? మరింత గాఢంగా, శాశ్వతంగా ఆవరిస్తుందా? ఈ విషయం అర్థం కావాలంటే కొన్ని వాస్తవాలను తెలుసుకున్నా చాలు.

ప్రభుత్వం అనుమతినిచ్చిన ఈ పవర్‌ప్లాంట్లలో ఒకటి సోంపేట సమీపంలో నిర్మించతలపెట్టినది. 2640 మెగావాట్ల సామర్థ్యంతో ఈ పవర్‌ప్లాంటును నాగార్జున కన్‌స్ట్రక్షన్ కంపెనీ (ఎన్.సి.సి.) అనే ప్రవేటు సంస్థ నిర్మించ తలపెట్టింది. దీని కోసం ఎన్.సి.సి. అయిదు వేల ఎకరాల భూమిని అడిగింది. అయితే ప్రభుత్వం ప్రస్తుతానికి తొమ్మిది వందల ఎకరాల భూమిని కేటాయించింది. మరో 12 వందల ఎకరాల ప్రజల భూములను కొందరు ప్రయివేటు వ్యక్తుల చేత కొనిపించి ఎన్.సి.సి.కి అమ్మించింది. అయితే ఇవన్నీ తంపర, బీల భూములు (నీరు నిలువ వుండే క్షేత్రాలు, చిత్తడి భూములు) పర్యావరణపరంగా ఇవి చాలా ప్రాధాన్యత గలిగిన భూములు. ఈ భూములు భూగర్భ జలాలను పెంపొందిస్తాయి. పచ్చదనాన్ని పెంచి వాతావరణాన్ని చల్లబరుస్తాయి. మూడు నదులు, 30 కాలువల నీరు ఈ బీలలోకి చేరుతుంది. కనుక 365 రోజులూ ఈ బీలలో ఏదో ఒక స్థాయిలో నీరు నిలువ వుంటుంది. దీని వలన ఎనిమిది పంచాయితీలకు చెందిన అయిదు వేల ఎకరాల భూములకు రెండు పంటలకు సాగునీరు అందుతున్నది. కొబ్బరి వంటి తోటలతో పచ్చదనంతో విలసిల్లతున్నదీ ప్రాంతం. ఈ ప్రాంతంలోని మత్స్యకారులకు ఈ నీరే జీవనాధారం. ఈ బీల వలన చుట్టువక్కల 70 గ్రామాల్లో భూగర్భ జలాలు అడుగంటిపోకుండా ప్రజలకు తాగునీరు పుష్కలంగా లభిస్తోంది. మనుషులకే కాదు పశువులకూ ఇదే నీరు జీవనాధారం. ఏడాది పొడుగునా నీరు లభించడం వలన వందల పక్షుల జాతులు

దేశదేశాలనుండి ఇక్కడికి వలస వస్తుంటాయి. బీలలో వుండే చేపలూ, పురుగులు వీటికి ఆహారం. ఇప్పుడీ భూముల్ని పవర్‌ప్లాంటుకు కట్టబెట్టడం వలన ఈ భూమిపై, నీళ్లపై ప్రజలు హక్కును కోల్పోతారు. ఫలితంగా పోయే భూములు పోగా మిగిలిన భూములకు కూడా ఈ నీళ్లను వినియోగించుకోలేరు. ఇక్కడ చేపలు పట్టలేరు. ఈ ప్లాంటుకు నీరు భారీ ఎత్తున అవసరం కనుక ప్రజలకు జీవధారగా వున్న ఈ నీటిని ప్లాంటు తాగేస్తుంది. ప్లాంటు ఉపయోగించుకున్న నీరు వృధాగా సముద్రంలో కల్సిపోవాల్సిందే. అంతేకాక ఈ భూముల్లో ప్లాంటుకు అవసరమైన నిర్మాణాలను చేపట్టడంలో భాగంగా ఇక్కడ కొన్ని కాలువలను మట్టిపోసి నింపేసే అవకాశం వుంది. ఫలితంగా బీల అంతరించిపోతుంది. దానివలన ఈ చుట్టు పక్కల విస్తారమైన ప్రాంతంలో భూగర్భ వనరులకు తీవ్రమైన ముప్పు వాటిల్లుతుంది. పశువులకూ పక్షులకూ కూడా ముప్పు ఏర్పడుతుంది.

ఇక ఇక్కడ పవర్‌ప్లాంటు ప్రారంభమయితే ఈ వినాశనానికి అంతే వుండదు. థర్మల్ విద్యుత్ కేంద్రాలు తీవ్రమైన కాలుష్యాన్ని వెదజల్లుతాయి. దేశాన్ని ఉక్కిరి బిక్కిరి చేస్తోన్న పారిశ్రామిక కాలుష్యంలో 82 శాతం థర్మల్ విద్యుత్ కేంద్రాల వల్లనేనని పార్లమెంటరీ సబ్‌కమిటీ నివేదిక వెల్లడించింది. కాబట్టి దీని వల్ల చుట్టుపక్కల గ్రామాలన్నీ కాలుష్యం బారిన పడుతాయి. ముఖ్యంగా ఇవి బూడిదను వెదజల్లుతాయి కనుక గ్రామాలన్నీ బూడిదమయమైపోతాయి. బీల అంతరించిపోవడం వల్ల నీటి సంక్షోభానికి గురయ్యే వ్యవసాయం కాలుష్యం బారిన కూడా పడి తీవ్రంగా దెబ్బతింటుంది. ఈ పవర్ ప్లాంటు ఉపయోగించుకున్న తర్వాత వేడెక్కిన నీటిని సముద్రంలోకి వదులుతారు. అలా వదిలే ప్రాంతంలో వేడిని భరించలేక చేపలూ తదితర జలచరాలు చచ్చిపోతాయి. అంతేకాదు ఆ నీటిని వదలడం వల్ల అక్కడ నీరు అల్లకల్లోలానికి గురై జలచరాల పునరుత్పత్తి దెబ్బతింటుంది. ఫలితంగా ఆ పరిసర ప్రాంత మత్స్యకారులు జీవనోపాధిని కోల్పోతారు. ఇలా వ్యవసాయమూ, చేపల వృత్తీ దెబ్బ తినడం వల్ల జీవనోపాధిని కోల్పోయే ప్రజలు గాలీ, నీరూ, భూమి అన్నీ కాలుష్యభరితం కావడం వలన అనారోగ్యాలూ, అంగవైకల్యాలకు గురవుతారు. ప్రజల జీవితాలు అస్తవ్యస్తమూ, అల్లకల్లోలమూ అవుతాయి. మొత్తంగా ఈ ప్లాంటు వలన 30 గ్రామాలకు చెందిన లక్షన్నర మంది రైతులూ, మత్స్యకారుల జీవితాలు అల్లకల్లోలం కానున్నాయి. ఇది సోంపేట సమీపంలో ఎన్.సి.సి. నిర్మించతలపెట్టిన ఒక్క పవర్‌ప్లాంటు వలన కలగబోయే వినాశనం. తలపెట్టిన పవర్‌ప్లాంట్లన్నీ నిర్మాణమైతే పరిస్థితి మరెంత విపరీతంగా వుంటుందో ఊహించుకోవచ్చు. భవిష్యత్‌లో ఈ జిల్లాలో థర్మల్ కారిడార్‌ను ఏర్పాటు చేసే యోచనతో వుంది ప్రభుత్వం. దీనితో పాటు మరికొన్ని పరిశ్రమలను కూడా ఏర్పాటు చేసే లక్ష్యంతో వుంది. మొత్తంగా ఇచ్ఛాపురం నుండి తడ వరకూ తీరం పొడవునా, లక్ష మెగావాట్ల సామర్థ్యంతో 73 థర్మల్ విద్యుత్ కేంద్రాలను ఏర్పాటు చేయాలనే ప్రయత్నాలు కొనసాగుతున్నాయి. వీటితో పాటు వందలాది ఫార్మా, రసాయన కర్మాగారాలు నెలకొల్పే ప్రయత్నం కూడా జరుగుతోంది. ఇవన్నీ పూర్తయితే మత్స్యకారులే 80 లక్షల మంది ఉపాధి కోల్పోతారని ఒక అంచనా.

సమీప భవిష్యత్‌లోని ఈ వినాశనాన్ని సోంపేట ప్రాంత ప్రజలు అర్థం చేసుకున్నారు. ఇలా అర్థం చేసుకోవడానికి వాళ్లేమీ ఊహల మీద ఆధారపడలేదు.విశాఖలోని పరవాడ థర్మల్ పవర్‌ప్లాంటుకు వెళ్లి పరిశీలించారు. అక్కడి ఇండ్లూ, ఇంట్లోని వస్తువులూ మసిబారి వుండడం చూశారు. అన్నం గిన్నె మూత తీసి చూస్తే అన్నంపై నల్లని బూడిద పొర పేరుకొని వుండడం చూశారు. ప్రజలు అనారోగ్యానికీ, చర్మవ్యాధులకు గురికావడం, పిల్లలు సైతం అంగవైకల్యంతో పుట్టడం చూశారు. అంతేకాదు శ్రీకాకుళం జిల్లాలోని పైడి భీమవరం పారిశ్రామిక ప్రాంతంలో పనిచేస్తున్న మందుల కంపెనీల వల్ల కాలుష్యంతో ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్న తీరును తెలుసుకున్నారు. సోంపేట దగ్గర్లోని తేలినీలాపురంలో పక్షుల అభయారణ్య కేంద్రం వుంది. 123 రకాల పక్షులు దేశ, విదేశాల నుండి తరలి వస్తాయిక్కడికి. ఇక్కడి చిత్తడినేలలను ఇప్పటికే ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ అనే పవర్‌ప్లాంటుకు అప్పజెప్పారు. ఇక్కడ ప్లాంటు నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి. దీని వల్ల పక్షుల రాక ఇప్పటికే సగానికి తగ్గింది. ఇవన్నీ చూసిన ప్రజలు ఈ ప్లాంటు బారినుండి తమ భూములనూ, జీవనోపాధినీ, పంటలనూ, నీటినీ, పశువులనూ, పక్షులనూ, పుట్టబోయే తమ బిడ్డలనూ కాపాడుకోవాలనుకున్నారు. ప్రజలే కాదు పర్యావరణవాదులూ, ప్రజాస్వామికవాదులూ ఈ ప్లాంటును తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు.

రెండున్నర సంవత్సరాల క్రితం 2008 ఫిబ్రవరిలో రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం ఈ పవర్‌ప్లాంటును ఏర్పాటు చేస్తున్నట్టు ప్రకటించింది. 2008 ఆగస్ట్ 18న పబ్లిక్ హియరింగ్ జరిపింది. దీనిలో 'ప్రాజెక్ట్ మాకొద్దు మా భూములను వదులుకోం' అని 90 శాతం ప్రజలు ముక్త కంఠంతో మాట్లాడారు. ఇక అప్పటి నుండి నిరంతరాయంగా ఆందోళనలు జరుపుతూనే వున్నారు. 'పర్యావరణ పరిరక్షణ సమితి', 'మత్స్యకారుల ఐక్య వేదిక' పేరిట ప్రజలు సంఘటితమై పోరాడుతున్నారు. 2009 ఆగస్ట్ 29న ఈ ప్రాంతం నుంచి ఒక ప్రతినిధి బృందం హైదరాబాద్ వెళ్లి నాటి ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి, ప్రతిపక్ష నేతలు చంద్రబాబు, చిరంజీవి సహా పలు పార్టీల నాయకులకు ప్రాజెక్టును ఏర్పాటు చేయవద్దని విజ్ఞప్తి చేస్తూ మెమొరాండంలు అందజేశారు. దాదాపు ఎనిమిది నెలలుగా నిరంతరాయంగా నిరాహారదీక్షలు జరుపుతున్నారు. న్యాయస్థానాల్నీ ఆశ్రయించారు. తప్పుడు నివేదికల ఆధారంగా అనుమతులు

పొందారని న్యాయస్థానాల్లో నిరూపించారు కూడా.

అయితే ప్రభుత్వం కానీ, ఎన్.సి.సి. కానీ ఖాతరు చేసిందా? శాంతియుత పోరాటాల గురించి ప్రభుత్వాలు ప్రవచిస్తాయి. కానీ ఆచరణలో వాటిని పరిహసిస్తాయి. అందుకే ప్లాంటు నిర్మాణం గురించి కొంచెం కూడా వెనక్కి తగ్గలేదు. ఎన్.సి.సి. భూమి కొలతలను కూడా మొదలుపెట్టింది. అలా మొదలు పెట్టిన రోజునే ప్రజలు విస్తృతంగా కదిలి ఎన్.సి.సి. సిబ్బంది వేసుకున్న డేరాలు తగులబెట్టి తమ నిరసనను తెలిపారు. ఇంకా వివిధ ప్రజాసంఘాలను కలుపుకొని తమ ఆందోళనను ఉధృతం చేశారు. అయినా వెనక్కి తగ్గకపోగా ఆందోళన చేస్తున్న ప్రజలపైనే అక్రమ కేసులను బనాయించారు. జూలై 14న ఎన్.సి.సి. పునాదులు తవ్వే కార్యక్రమాన్ని పెట్టుకుంది. ప్రజలు అడ్డుకుంటారని తెలుసు కనుక కిరాయి గూండాలను మోహరించారు. ప్రజలను భయభ్రాంతులను చేసే ఉద్దేశ్యంతో వేల మంది పోలీసులు రెండు రోజుల ముందు నుంచే ఈ ప్రాంతంలో కవాతు చేశారు. అయినా ఈ కార్యక్రమానికి వ్యతిరేకంగా ప్రజలు కదులుతున్నారని అర్థమై చేతిలో కర్రలు వంటివేమీ లేకుండా ప్రజలు వచ్చి మాట్లాడాలని రెండు రోజుల ముందు నుంచే పోలీసులు కరపత్రాలు పంచారు. దానితో జూలై 14న చుట్టుపక్కల గ్రామాలన్నింటి నుండి వేలాది ప్రజలు చేతిలో కర్రలు వగైరాలేమీ లేకుండా చేతులు జోడిస్తూ బీల ప్రాంతానికి చేరుకున్నారు. కెరటంలా కదిలి వచ్చిన ప్రజలను చూసి అధికారులు భయపడిపోయి ప్రజలను తిరిగి వెళ్లిపొమ్మన్నారు. సమస్య పరిష్కారం కాకుండా వెనుతిరిగి పోవడానికి ప్రజలు నిరాకరించారు. దానితో పోలీసులు, గూండాలు లాఠీలతో విచక్షణారహితంగా బాదడం మొదలుపెట్టారు. తలలు పగులగొట్టారు. భాష్పవాయువు వదిలారు. కంపెనీ సాయుధ గూండాలూ, గూండాలను మించిన పోలీసులు మొత్తం మూడువేల మంది వుండినారు. వీరంతా నిరాయుధ ప్రజలపై విచక్షణా రహితంగా వీరంగానికి పాల్పడ్డారు. ఇక ప్రజలు శాంతియుతంగా ఎలా వుండగలరు? అలా వుండడం ఆత్మహత్యా సదృశ్యమే అవుతుంది కనుక పక్కనే వున్న సరుగుడు చెట్ల నుండి కర్రలు విరుచుకొని పోలీసులపైనా గూండాలపైనా తిరగబడ్డారు. ఆ జన ఆగ్రహశక్తిని తట్టుకోవడం తమ వల్ల కాదని అర్థం చేసుకున్న కంపెనీ, పోలీసు అధికారులు టోపీలు తీసేసి, చేతులెత్తేసి శాంతియుతంగా వుండాలని పనులు ఆపి వెళ్లిపోతున్నామని ప్రకటించారు. దాంతో ప్రజలు శాంతించారు. పోలీసులు వెనుతిరిగారు. పోలీసుల వెనుకే ప్రజలూ బయల్దేరారు. తిరిగి వెళ్లిపోతున్న పోలీసులు సోంపేట ఎస్.ఐ. ఆదేశాల మేరకు జీపులోంచే రోడ్డు పక్కన నిలబడ్డ ప్రజలపై కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో లక్కవరం గ్రామానికి చెందిన గొనప కృష్ణమూర్తి (57), పలాసపురం గ్రామానికి చెందిన గున్న జోగారావు (45)లు మరణించారు. మరెందరో గాయపడ్డారు. దీనితో నిరసనకారుల

## సిక్కోలును బూడిదమయం చేయనున్న మరికొన్ని విద్యుత్‌ప్లాంట్లు

ఎన్.సి.సి. పవర్ ప్రాజెక్ట్‌తో పాటు జిల్లాలో నిర్మాణం కాబోతున్న మరికొన్ని విద్యుత్ ప్లాంట్ల వివరాలు ఇవీ:

**ఈస్ట్ కోస్ట్ ఎనర్జీ:** సంతబొమ్మాళి మండలం కాకర్లపల్లి వద్ద 2640 మెగావాట్ల సామర్థ్యంతో చేపట్టారు దీన్ని. తేలినీలాపురం పక్షుల అభయారణ్య కేంద్రానికి ముప్పుగా వున్న ప్రాజెక్ట్ ఇదే. ప్రజల నుండి తీవ్ర నిరసన వ్యక్తం అవుతున్నా ఇక్కడ నిర్మాణం మొదలైంది.

**మేగవరం ప్రాజెక్ట్:** 500 మెగావాట్ల సామర్థ్యంతో సంతబొమ్మాళి మండలంలోనే చేపట్టారు దీన్ని. ఈస్ట్‌కోస్ట్ ఎనర్జీ ప్రాజెక్ట్ నుండి వెలువడే బూడిదను తరలించడానికి కేటాయించిన 500 ఎకరాల భూమిలో దీన్ని చేపట్టడం వివాదస్పదమవుతోంది.

**అణువిద్యుత్ ప్రాజెక్ట్:** కొవ్వాడ మండలం రణస్థలంలో జాతీయ అణువిద్యుత్ సంస్థ 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించ తలపెట్టినది. భూసేకరణకు స్థానికుల నుండి నిరసన వ్యక్తమవుతోంది.

**జెన్‌కో ప్రాజెక్ట్:** ఇచ్ఛాపురం మండలం డొంకూరు వద్ద ఎపి జెన్‌కో 2500 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించతలపెట్టినది.

ఇవి కాక కవిటి మండలంలో మరో ప్రయివేటు ప్లాంటు చేపట్టడానికి ప్రయత్నాలు సాగుతున్నాయి.

**నెల్లూరు జిల్లాలో...**

సిక్కోలు తర్వాత అత్యధికంగా విద్యుత్ ప్లాంట్లను నెల్లూరులో నిర్మించ తలపెట్టారు. ఇక్కడ కూడా దాదాపు 12 వేల మెగావాట్ల సామర్థ్యంతో ప్రాజెక్టుల నిర్మాణానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. సుమారు 48 వేల కోట్ల పెట్టుబడులను అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టుల కోసం పెద్ద ఎత్తున భూ సేకరణ ప్రయత్నాలు జరుగుతున్నాయి. స్థానికుల్లో తీవ్ర నిరసన వ్యక్తం అవుతోంది. నిర్మించ తలపెట్టిన ప్లాంట్ల వివరాలు ఇవీ:

**సింహపురి ఎనర్జీ:** చిల్లకూర్ మండలంలో 540 మెగావాట్ల సామర్థ్యంతో దీన్ని చేపట్టనున్నారు.

**మీనాక్షి ఎనర్జీ:** కృష్ణపట్నంలో 600 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించతలపెట్టారు.

**కినేట పవర్:** కృష్ణపట్నంలో 1980 మెగావాట్ల సామర్థ్యంతో నిర్మించతలపెట్టారు.

**థర్మల్ పవర్ టెక్:** కృష్ణపట్నంలో 1980 మెగావాట్ల సామర్థ్యంతో తొలిదశ ప్రాజెక్ట్ ఇది. ఎంపీ సుబ్బిరామిరెడ్డికి చెందిన గాయత్రి చేపట్టిన ఈ ప్రాజెక్ట్ 4 వేల మెగావాట్లకు విస్తరించాలన్న ప్రణాళిక వుంది. దీనికి ఎ.పి.ఐ.ఐ.సి. నుండి భూములు సేకరించారు.

**రిలయన్స్:** కృష్ణపట్నంలో 4 వేల మెగావాట్ల సామర్థ్యంతో చేపట్టింది. భూ సేకరణ పూర్తయి, నిర్మాణం పనులు ప్రారంభమయ్యాయి.

ఆగ్రహం మరింత పెల్లుబుకింది. పోలీసులపైకి తిరగబడ్డారు. వాళ్ల వాహనాలను తగులబెట్టారు. దాన్ని ఫోటోలు తీస్తున్న మీడియా వాళ్లను కూడా కొట్టారు. భూమి కొలతల సమయంలో ఎన్‌సిసి వాళ్ల కిరాయి ఫోటోగ్రాఫర్లను మీడియా ముసుగులో తీసుకువచ్చారు. ఆ సమయంలో ప్రజలు దేరాలు కాలబెట్టిన దృశ్యాలను వాళ్లు చిత్రీకరించారు. వాటి ఆధారంగా పోలీసులు ప్రజలను అరెస్ట్ చేసి కేసులు పెట్టారు. కనుక మీడియా కూడా ఎన్.సి.సి.కి అమ్ముడుపోయిందని ప్రజలు భావించారు. అందుకే తమ ప్రతిఘటనను చిత్రీకరిస్తున్న మీడియా వాళ్లను కూడా వదలకుండా కొట్టారు. ఆ తర్వాత పోలీసులూ, గూండాలూ, అధికారులూ అందరూ ఆ ప్రాంతాన్ని ఖాళీ చేసి వెళ్లారు.

పోలీసుల దౌర్జన్యాన్ని రాష్ట్రవ్యాప్తంగా ప్రజాసంఘాలు, వివిధ రాజకీయ పార్టీలు ఖండించాయి. ప్రజల ప్రతిఘటనను ప్రజలూ, ప్రజాస్వామికవాదులూ ప్రశంసించారు.

ఆ తర్వాత రోజు జూలై 15న ఈ విద్యుత్ కేంద్రానికి పర్యావరణ శాఖ ఇచ్చిన అనుమతులను రద్దు చేస్తూ జాతీయ పర్యావరణ అప్పిలేట్ ట్రిబ్యునల్ తీర్పు చెప్పింది. దాంతో ముఖ్యమంత్రి రోశయ్య ప్రాజెక్ట్ పనులను ఆపేస్తామని ప్రకటించాడు. ఇది ప్రజలు తమ ప్రాణాలను ఒడ్డి సాధించుకున్న చారిత్రాత్మక విజయం.

అయితే దీనితో ఇక ఎన్.సి.సి. కథ కంచికి చేరినట్టేనని భావించక్కర్లేదు. అది మళ్లీ మళ్లీ కుటిల ప్రయత్నాలు చేయకుండా మానదు. ఒకవేళ అది విరమించుకుంటే మరో కంపెనీ అయినా ఆ ప్రయత్నాలు చేస్తుంది. ఎందుకంటే ప్లాంటు నిర్మాణం అనేది ప్రస్తుతం పాలకవర్గాలు అనుసరిస్తున్న రాజకీయ ఆర్థిక విధానాల్లో భాగం. కాబట్టి ఆ ప్రతిపాదన నుంచి శాశ్వతంగా వైదొలిగినట్టేనని భావించలేం. భవిష్యత్‌లో కూడా మిలిటెంట్‌గా పోరాడ్డం ద్వారానే ప్లాంటు ముప్పును ప్రజలు ఎదుర్కోగలరు.

ఈ ప్లాంటును నిర్మించడం కోసం ప్రభుత్వమూ, ఎన్.సి.సి. ఎన్ని అవకతవకలకూ, చట్ట ఉల్లంఘనలకూ, అబద్ధాలకూ, వక్రీకరణలకూ పాల్పడ్డాయో లెక్కేలేదు.

మొదటగా ఇటువంటి చిత్తడి నేలలను పరిరక్షించడం అనేది పర్యావరణపరంగా చాలా ప్రాముఖ్యమైనది. వీటి పరిరక్షణ కోసమే 1971లో రామ్‌సర్ అంతర్జాతీయ ఒప్పందం జరిగింది. ఈ ఒప్పందంపై భారత్ 1982లో సంతకం చేసింది. కనుక వీటిని కాపాడ్డం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల విధి. ప్రస్తుతం ప్రభుత్వం ఈ చిత్తడి భూములను ఎన్.సి.సి.కి కట్టబెట్టి ఈ ఒప్పంద ఉల్లంఘనకు పాల్పడింది. అంతేకాదు తమ జిల్లాలోని వాగుల్నీ, చెరువుల్నీ, బీల భూముల్నీ ఎటువంటి ఆక్రమణలు జరగకుండా కాపాడాలని 2003, సెప్టెంబర్ 20న ప్రభుత్వం అన్ని జిల్లా కలెక్టర్లకూ ఒక సర్క్యులర్‌ను జారీ చేసింది. అవి సాగునీటికీ తాగునీటికీ వుపయోగకరంగా వుండడమే కాక భూగర్భ జలాలను పెంపొందిస్తాయని, పర్యావరణపరంగా విలువైనవని కూడా ఈ సర్క్యులర్ తెలియజేసింది. అలాంటిది ఇప్పుడు ప్రభుత్వమే తాను జారీ చేసిన సర్క్యులర్‌ను తానే విస్మరించింది. మరొక పెద్ద అబద్ధపు వాదన ఏంటంటే ఇవి బీల భూములు కావు బీడు భూములనేది. ఈ ప్రాంతపు ప్రజలూ, పర్యావరణ వాదులూ, ప్రభుత్వ పత్రాలూ, మ్యాపులు అన్నీ ఇవి బీల భూములని చాటి చెప్తుంటే ప్రభుత్వమూ, ఎన్.సి.సి., అటవీ శాఖ, శ్రీకాకుళం జిల్లా కలెక్టర్, పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ ఇవి బీల భూములు కావని ఘోర అబద్ధానికి దిగజారాయి.

తాను భూముల్ని కేటాయించడమే కాకుండా ప్రజల భూములను కూడా ప్రభుత్వం మోసపూరితంగా కంపెనీకి కట్టబెట్టించింది. కంపెనీ కోసం అయితే ప్రజలు ఎవ్వరూ భూములను అమ్మరు కనుక చేపల చెరువుల కోసమని చెప్పి కొందరు ప్రవేటు వ్యక్తులతో భూముల్ని కొనిపించి కంపెనీకి అమ్మించింది.

ఇటువంటి ఏ ప్రాజెక్టు నిర్మించాలన్నా ఎన్విరాన్‌మెంటల్ ఇంపాక్ట్ అసెస్‌మెంట్ (పర్యావరణ ప్రభావ మదింపు వేదిక) నివేదిక తయారు చేయవలసి వుంటుంది. అందులో ప్రజా జీవనానికీ ప్రకృతికీ, జీవజాలానికీ జరగనున్న మేలునూ, కీడునూ చెప్పవలసి వుంటుంది. అయితే ఎన్.సి.సి. ఈ నివేదిక పనిని విమతా లాబరేటరీస్ అనే దొంగ సంస్థతో చేయించింది. ఈ సంస్థ ప్రకృతికీ, ప్రజలకూ జరిగే నష్టం ఏమీ లేదని పచ్చి అబద్ధాలు తన నివేదికలో రాసింది. ఇలా ఎన్.సి.సి. అబద్ధాలపై ఆధారపడి కొన్ని తప్పుడు అనుమతులు తెచ్చుకుంది. మరి కొన్ని అనుమతులు లేకుండానే వున్నాయని తప్పుడు కాగితాలను సృష్టించుకుంది. ప్రభుత్వమే దాని పక్షాన వున్నపుడు అది ఎన్ని అబద్ధాలు ఆడడానికైనా ఎన్ని చట్టాలను వుల్లంఘించడానికైనా ఎందుకు భయపడుతుంది?

తేలినీలాపురం వచ్చే పక్షులు మొదట సోంపేటకే వస్తాయని జంతు శాస్త్రజ్ఞులు చెప్తుండగా రాష్ట్ర అటవీ శాఖ ఇక్కడికి పక్షులే రావని తన నివేదికలో అబద్ధాలు రాసింది.

ఈ సంవత్సరం జూన్ 29న చిత్తడి నేలల నిపుణులు, జాతీయ పర్యావరణ అప్పిలేట్ అథారిటీ ప్రతినిధులు ఆ ప్రాంతానికి వెళ్లి పరిశీలించారు. అది పర్యావరణ దృష్ట్యా ప్రాధాన్యత వున్న స్థలంగా గుర్తించారు. ప్రభుత్వమూ, కంపెనీ నియమించిన నిపుణుల బృందాలు ఇచ్చిన నివేదికలు తప్పుడువని తేల్చారు.

ఇటువంటి ఏ ప్రాజెక్టులనయినా పబ్లిక్ హియరింగ్ జరిపి ఆ ప్రాంత ప్రజాభిప్రాయంతోనే వాటిని నిర్మిస్తామని ప్రభుత్వాలు చెప్పుకుంటాయి. కానీ 2008 ఆగస్ట్ 18న ఈ ప్రాజెక్ట్‌పై జరిపిన

పబ్లిక్ హియరింగ్‌లో 90 శాతం ప్రజలు ఈ ప్రాజెక్ట్ మాకొద్దనీ, మా భూముల్ని వదులుకోమనీ ఎలుగెత్తి చాటారు. అయినా ప్రభుత్వం లెక్క చేయలేదంటే పబ్లిక్ హియరింగ్ అనేది ఎంత బూటకమైనదో అర్థం అవుతుంది.

ఇలా చట్ట ఉల్లంఘనకు పాల్పడినందుకూ, మోసాలూ చేసినందుకూ తప్పుడు అనుమతి పత్రాలు సృష్టించినందుకూ ప్రభుత్వంపై, ఎన్.సి.సి. యాజమాన్యం తదితరులపై చర్యలు తీసుకోవాలి, శిక్షించాలి. కానీ దోషి అయిన ప్రభుత్వమే, చట్టాలను అమలు చేయమని అడిగిన 'నేరానికి' కాల్పులు జరిపి ప్రజలనే శిక్షించింది.

ఇన్ని మోసాలు చేసి, అబద్ధాలు ఆడి, ప్రజలను చంపి పైగా ఇదంతా అభివృద్ధి కోసమేనని ప్రభుత్వం చెబుతోంది. కాల్పులు జరిగి, ఇద్దరు ప్రాణాలు పోయి, దేశవ్యాప్తంగా ప్రజల నుండి నిరసన వెల్లువెత్తిన తర్వాత కూడా, జాతీయ పర్యావరణ అప్పిలేట్ దీనికి వ్యతిరేకంగా తీర్పు వెలువరించిన రోజునే రెవెన్యూ మంత్రి, ఈ ప్రాంతపు వాడూ అయిన ధర్మాన ప్రసాద్, ఇది అభివృద్ధేననీ ఆ అభివృద్ధికి పూనుకున్నందుకు తాను గర్వపడుతున్నాననీ, అవి వ్యవసాయానికి పనికిరాని భూములని అసెంబ్లీలో ప్రకటించాడంటే ప్రజల జీవితాల పట్ల, ప్రాణాల పట్ల 'ప్రజా ప్రతినిధుల'కు ఎంత పట్టింపు వుందో, ప్రైవేటు పెట్టుబడులకు ఎంతగా దాసోహం అవుతున్నారో అర్థం చేసుకోవచ్చు.

దేనిని బట్టి వీళ్లు అభివృద్ధి అని చెబుతున్నారు అంటే, ఈ ప్లాంట్ల వల్ల ఈ ప్రాంతవాసులకు ఉద్యోగాలు వస్తాయనీ, టౌన్‌షిప్స్ అభివృద్ధి చెంది ఆర్థిక కార్యకలాపాలు పెరుగుతాయనీ. ఉన్న వుపాధిని లాగేసుకుంటూ ఉద్యోగాలను ఎరచూపుతున్నారు. కానీ ప్రజలు ఈ ఎరను ఎంత మాత్రమూ నమ్మడంలేదు. చదువు రాని, వ్యవసాయం చేయడం, చేపలు పట్టడం మాత్రమే తెల్సిన తమకు ప్లాంట్లలో ఏం ఉద్యోగాలిస్తారని ప్రశ్నిస్తున్నారు. ఉపాధి కోల్పోయే లక్షన్నర మందికి ఉద్యోగాలివ్వడం సాధ్యమా అని అడుగుతున్నారు. నష్టపరిహారం కోసం డబ్బులిస్తే అవి ఎన్నాళ్లు వుంటాయి. భూములూ, నీళ్లూ వుంటే తమ జీవితకాలమే కాక తమ పిల్లలకూ, వాళ్ల పిల్లలకూ కూడా ఆధారంగా వుంటాయని మాట్లాడుతున్నారు. భూమిని కోల్పోతున్న వాళ్లకూ, చేపల వేటను కోల్పోతున్న వాళ్లకూ నామమాత్రపు పరిహారాన్నయినా ఇస్తారేమో కానీ సొంత భూములు లేకపోయినా, చేపలవేట చేయకపోయినా ఈ భూముల్లో కూలీ చేసి చేపల అమ్మకాలు చేసి బతికే వేలాది మంది ప్రజలకు ఏ వుపాధిని చూపుతారని ప్రశ్నిస్తున్నారు.

నిజానికి ఉపాధి పెంచడమే ప్రభుత్వ సదుద్దేశం అనుకుంటే దానికి మార్గాలెన్నో వున్నాయని కూడా ఇక్కడి ప్రజలూ, ప్రగతిశీలవాదులూ సూచిస్తున్నారు. శ్రీకాకుళం జిల్లా ప్రధానంగా వ్యవసాయంపై ఆధారపడిన జిల్లా. 4,25,142 హెక్టార్ల భూమి వున్నది. ఇందులో పావు వంతుకంటే తక్కువగా 1,06,719 హెక్టార్ల భూమికి మాత్రమే నీరు లభించి రెండు పంటలు పండుతున్నాయి. ఈ భూములన్నింటికీ నీరు లభిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందే అవకాశం వుంది. ఈ భూములకు నీరు అందించడానికి ఎటువంటి పథకాలూ చేపట్టని ప్రభుత్వం రెండు పంటలు పండే భూములను మాత్రం బీడు భూములుగా చూపుతోంది. వున్న నీటిని పవర్‌ప్లాంట్లకు కట్టబెట్టి మరిన్ని భూములను బీడు పెట్టే పథకాలు వేస్తున్నది. ఇక్కడ ఏ పరిశ్రమలైనా వ్యవసాయంపై ఆధారపడి నిర్మించడం వల్ల ప్రయోజనం వుంటుంది. అందుకు ఎన్నో అవకాశాలు వున్నాయి. ఉదాహరణకు జనుము పంటకు ఈ జిల్లా చాలా అనుకూలమైనది. దాన్ని మరింతగా ప్రోత్సహించి జనపనార మిల్లులను పెట్టవచ్చు. అలాగే ఉద్దానం ప్రాంతంలో వున్న విస్తారమైన కొబ్బరితోటలపై ఆధారపడి కొబ్బరినూనె, కొబ్బరి పీచు పరిశ్రమలు పెట్టవచ్చు. దీని వల్ల ప్రజలకు ఉపాధి లభిస్తుంది. వ్యవసాయానికి ప్రోత్సాహకంగా కూడా వుంటుంది.

పవర్‌ప్లాంట్ అనేది అభివృద్ధికి సూచిక మాత్రమే కానీ దానికదే అభివృద్ధి కాదు. ప్రజల ప్రయోజనాలను ఈడేర్చినప్పుడు మాత్రమే అది అభివృద్ధికి దోహదపడినట్టు అవుతుంది. ఇక్కడ ఉత్పత్తి అయ్యే విద్యుత్ ప్రజలకు అందుబాటులోకి వస్తుందా అంటే అదికూడా లేదు. ఎందుకంటే ఇది మర్చంట్ పవర్‌ప్లాంటు. ఇదే కాదు ఈ ప్రాంతంలో అనుమతి పొందినవన్నీ మర్చంట్ ప్లాంట్లే. అంటే ఎవరు ఎక్కువ డబ్బులిస్తే వాళ్లకే అమ్ముకుంటారు. కాబట్టి సగటు ప్రజలకు ఈ విద్యుత్తు వెలుగుల్ని పంచేదేమీ వుండదు. పైగా ఇది పేరుకే దేశీయ ప్లాంటుకానీ 49 శాతం వాటాతో విదేశీ కంపెనీలే దీనిపై పెత్తనం చేసే అవకాశం వుంది.

ప్లాంటు నిర్మాణం వెనుక వున్న ఉద్దేశ్యం ప్రభుత్వం చెప్తున్నదేదీ కాదు. పొరుగున వున్న ఒడిషా, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాలలో విస్తారంగా వున్న బాక్సైట్, ఇనుప ఖనిజాల తవ్వకాలకూ, రవాణాకూ విద్యుత్ అవసరం. గనుల నుండి తక్కువ దూరమూ సముద్రతీరానికి దగ్గరగా వుండే శ్రీకాకుళం జిల్లా విద్యుత్ కేంద్రాలకు చాలా అనుకూలమైనది. అందుకే తీరప్రాంతమంతా విద్యుత్ కేంద్రాల ఏర్పాటుకు పథకాలు రచించింది. అంటే మొత్తంగా దేశాన్ని బహుళజాతి కంపెనీలకు దోచిపెట్టడానికే ఈ విద్యుత్ కేంద్రాల ఏర్పాటు. ఇలా దోచిపెట్టడం అనేది నేడు ప్రభుత్వాలు అనుసరిస్తున్న సామ్రాజ్యవాద అనుకూల రాజకీయార్థిక విధానంలో భాగం. ఈ ఆర్థిక విధానాలకు ప్రభుత్వాలు దృఢంగా కట్టుబడి వున్నాయి కనుక వీటిని ముందుకు తీసికెళ్లడానికి అవరోధంగా ఉన్నాయనుకున్న ప్రజా వుద్యమాలపైనైనా, మావోయిస్టు

*(మిగతాది 59వ పేజీలో...)*

# అణు పరిహార బిల్లు-2010ని సమైక్యంగా తిప్పికొడదాం!
# ప్రజల జీవించే ప్రాథమిక హక్కును కాపాడుకుందాం!!

2010 ఆగస్టు 25న లోక్‌సభ, ఆగస్టు 29న రాజ్యసభ 'అణుపరిహార బిల్లు-2010'ని ఆమోదించాయి. ఇది అతి ప్రమాదకరమైన, ప్రజావ్యతిరేకమైన బిల్లు. ఈ బిల్లును ఆమోదించడం అంటే సామ్రాజ్యవాదులకు, వారి ప్రైవేట్ గుత్త సంస్థలకు పూర్తిగా దాసోహం అనడమే. మన దేశ సార్వభౌమాధికారాన్ని వాళ్ల పాదాల చెంత వుంచడమే. మన దేశ పాలకులు ప్రజల్ని వంచించి కుట్రపూరితంగా మనదేశ సంపదను సామ్రాజ్యవాదులకు దోచిపెట్టడానికి, ప్రజల ప్రాణాలకు ప్రమాదాన్ని తెచ్చిపెట్టడానికి సిగ్గు ఎగ్గు లేకుండా అమెరికా సామ్రాజ్యవాదులతో చేతులు కలిపారు.

2010 నవంబర్‌లో బరాక్ ఒబామా (అమెరికా అధ్యక్షుడు) భారతదేశ పర్యటనకన్నా ముందే స్వామిభక్తిని చాటుకోవడానికి ఈ బిల్లును ఆమోదింపచేయడంలో చాలా ఆత్రుత కనబరిచారు మన పాలకులు. అమెరికా-ఇండియా అణు ఒప్పందంలో (బంధంలో) 'అణుపరిహార బిల్లు' అత్యంత కీలకమైనది. దానికి చట్టరూపమిచ్చి అణు రియాక్టర్ల వాణిజ్యానికి బాటలు వేయాలని కేంద్ర ప్రభుత్వం కంకణం కట్టుకుంది. అణు విద్యుత్ కేంద్రాల స్థాపన, అణువిద్యుత్ ఉత్పత్తి వలన ప్రత్యక్ష పరోక్ష ప్రభావానికి గురయ్యే ఆరోగ్య, పర్యావరణ, వ్యవసాయ శాఖలను, కార్మిక - ఉపాధి రంగాలను అసలు పట్టించుకోలేదు. వాటికి ప్రాధాన్యత ఇవ్వలేదు. 2009 నవంబర్‌లో కేంద్ర కేబినేట్ ముసాయిదా బిల్లును ఆమోదించినపుడు కూడా అటవీ, ఆర్థిక, పర్యావరణ శాఖల నుండి వచ్చిన సహేతుకమైన అభ్యంతరాలను లక్ష్యపెట్టలేదు. మార్చి 2010లో ప్రతిపక్షాలతో పాటు యు.పి.ఎ.లోని కొందరు కూడా ఈ బిల్లును వ్యతిరేకించడంతో ప్రభుత్వం తాత్కాలికంగా వెనక్కి తగ్గి పార్లమెంటరీ స్థాయీ సంఘం పరిశీలనకు పంపింది. 18 సవరణలతో పార్లమెంటు ముందుకు తెచ్చిన ఈ బిల్లు ప్రైవేట్ గుత్తసంస్థలను మరింతగా కాపాడేలా వుంది. అయినాగాని చిన్న చిన్న మార్పులతో దానినే ఆమోదించడం ఆందోళనాకరమైనది. 17(ఎ), (బి) క్లాజుల మధ్య వున్న 'మరియు' పదాన్ని, 17(బి)లో 'ఉద్దేశపూర్వకంగా' అన్నమాటను తొలగించారు. నష్టపరిహారాన్ని 500 కోట్ల నుండి 1500 కోట్ల రూపాయలకు, పరిహార కాలాన్ని 10 సంవత్సరాల నుండి 20 సంవత్సరాలకు పెంచారు. కనీసం ప్రమాదం జరిగితే క్రిమినల్ కేసు పెట్టడానికి, ఉత్పత్తిని అదుపు చేయడానికి కనీస చర్చకూడా చేయలేదు.

అణు ప్రమాదాల అనుబంధ పరిహారం ఒప్పందం (సి.ఎస్.సి.-కన్‌వెన్షన్ ఆన్ సప్లమెంటరీ కంపెన్‌సేషన్)కి కట్టుబడి వుంటామని 2008 సెప్టెంబర్‌లో ప్రధాని మన్‌మోహన్‌సింగ్ అమెరికాకు మాట ఇచ్చాడు. అలా జరిగితే బాధితులు పరిహారం కోసం అమెరికన్ కోర్టులను ఆశ్రయించకుండా నిరోధించవచ్చు. అణుశక్తి రంగంలోని తన ప్రైవేట్ గుత్తసంస్థలను అమెరికా ఈ విధంగా కాపాడుతుంది. ఈ గుత్త సంస్థలకు రక్షణ కల్పించి, వారి వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించడానికి దురాక్రమణ యుద్ధాలు చేయడంతో సహా, ప్రపంచ ప్రజలపై అన్ని రకాల అణచివేత పద్ధతులను అనుసరించి అమెరికన్ అగ్రరాజ్యం దేశ విదేశాల్లో దోపిడీకి అనుకూల వాతావరణం కల్పిస్తుంది. అందులో భాగమే భారత్‌తో చేసుకున్న ఈ అణు ఒప్పందం, అణు ప్రమాద పరిహార బిల్లు. గుత్త సంస్థలకు ఇక ఎటువంటి ఆటంకం వుండదు.

ప్రపంచీకరణ విపరిణామపు పుణ్యమిది. అనేక షరతులు విధించి, పీడిత ప్రజలను లోబరుచుకుని ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అమ్ముకునే గుత్త సంస్థల ప్రయోజనమిది. ప్రపంచీకరణకు మన పాలకులు ఇతోధికంగా సేవలందిస్తున్నారు. భారతదేశ ప్రజల్ని పావులను చేసి ఆడుకుంటున్నారు. వారి ప్రాణాలతో చెలగాటమాడుతూ, సంపదలను కొల్లగొడుతూ భారత దేశ 'స్వాతంత్ర్యాన్ని' పొగుడుతున్నారు. ఇటువంటి బిల్లులను ఆమోదించడం ద్వారా 'భారత బడా ప్రజాస్వామ్యం' వర్ధిల్లుతుందని ప్రచారం చేస్తున్నారు. అమెరికాలో బుష్‌లు ఉన్నా ఒబామా వచ్చినా పాలసీ ఒక్కటే. భారతదేశంలో బి.జె.పి. పాలించినా, కాంగీ ప్రభుత్వం ఉన్నా జరిగే విధానం ఇదే. 1984 భోపాల్ ఉదంతం జరిగిన 26 సంవత్సరాల తర్వాత కోర్టులు అన్యాయమైన తీర్పును ఇచ్చిన తర్వాత కూడా మనకు బలమైన చట్టాలున్నాయని, ప్రజా ప్రాతినిధ్య వ్యవస్థ కాపాడుతుందని, క్రియాశీల న్యాయవ్యవస్థ న్యాయం చేస్తుందని, భద్రత కల్పిస్తుందని ఇంకా ఎవరైనా నమ్మితే వాళ్లు పిచ్చివాళ్లే అవుతారు. విదేశీ గుత్త సంస్థపై క్రిమినల్ కేసులు పెట్టకుండా, ఉత్పత్తిని నియంత్రించకుండా, వారిని శిక్షించకుండా నష్టపరిహారం డిమాండ్ చేయకుండా, వారిపై ఆంక్షలు విధించకుండా వుండేందుకు ఈ బిల్లు వీలు కల్పిస్తుంది. ప్రమాదం జరిగితే ప్రభుత్వమే నష్టపరిహారం చెల్లించాలి. వారు ఉత్పత్తి చేసే విద్యుత్‌ను వారు చెప్పిన ధరకు కొని వారికి లాభాల పంట పండించి పంపాలి.

భూమి, నీరు, రవాణా, విద్యుత్ లాంటి మౌలిక సదుపాయాలు కల్పించి ఆ సబ్సిడీల భారాన్ని, అణు ప్రమాద నష్టం భారాన్ని, వారు ఉత్పత్తి చేశాక అణు విద్యుత్ అధిక ధరల భారాన్ని, ఇంకా వారికి చెల్లించే సాంకేతిక పరిజ్ఞాన ఖర్చులను భరించాలి. సాంకేతిక పరిజ్ఞానం బదిలీకి అమెరికా పూర్తిగా సహకరిస్తుందని ప్రధాని ఇచ్చిన హామీ ఆచరణలో నెరవేరలేదు. భారతదేశంలోని పీడితులు శ్రమచేసి సృష్టించే విలువ నుండి, కట్టే ప్రత్యక్ష, పరోక్ష పన్నుల నుండీ భరించాలి. మన పాలకులు 'సక్రమంగా' నిర్వహించి, అమెరికన్ సామ్రాజ్యవాదుల నుండి మెప్పును, పారితోషికాన్ని అందుకుంటారు. అందుకు దేశ ప్రజల జీవించే హక్కును ఫణంగా పెడతారు. ఇదీ మన ఆత్మగౌరవం!

ఈ బిల్లు గుత్త సంస్థల ప్రయోజనాలకు రక్షణ కల్పిస్తుంది. ఇంత నగ్నంగా విషయం కనబడుతున్నా, అణు ప్రమాద హెచ్చరికలు ఎన్ని వున్నా లక్ష్యపెట్టకుండా యు.పి.ఎ. ప్రభుత్వానికి సంపూర్ణ మద్దతు ప్రకటించి ఉభయ సభల్లోను ఆమోదింపజేసిన ప్రతిపక్షాలు మాటల్లో ఏమి చెప్పినా ఆచరణలో మాత్రం అమెరికన్ సామ్రాజ్యవాదుల ప్రయోజనాలకు పూర్తి అనుకూలమేనని చాటుకున్నాయి. ప్రపంచ బ్యాంకు విధానాలను అమలు చేయడంలో బి.జె.పి. తాను కాంగ్రెస్ కన్నా భిన్నం కాదని ఎప్పుడో నిరూపించుకుంది. మరల అధికారంలోకి వస్తే కూడా అమెరికా అనుకూల విధానాన్ని అనుసరిస్తానని తన చర్యల ద్వారా తెలియజేస్తున్నది. ఈ బిల్లు ప్రజా వ్యతిరేకమని వామపక్షాలు మాట్లాడుతున్నాయి. నష్టపరిహారం 10 వేల కోట్ల రూపాయలకు పెంచాలని డిమాండ్ చేసి బిల్లును ఉభయసభల్లో వ్యతిరేకించాయి. అయినా వారి వాదన నెగ్గలేదు. నిజానికి ఇటువంటి ప్రమాదాలు జరిగినపుడు అమెరికాలో 40 వేల కోట్ల రూపాయల వరకు పరిహారం చెల్లించాలనే చట్టాలున్నాయి. జపాన్, ఆస్ట్రియా, జర్మనీ, స్విట్జర్లాండ్ దేశాలలో నష్టపరిహారం విషయంలో పరిమితి లేనేలేదు. గతంలో వున్న పరిమితులను కూడా ఎత్తివేసారు. రష్యాలో చెర్నోబిల్ దుర్ఘటన తర్వాత ప్రమాద తీవ్రత ఎంత వుంటుందో తెలిసీ మనం కర్బన ఉద్గారాల ప్రమాద భయంతో అణు ఉద్గారాల ప్రమాదంలోకి అంటే 'పెనం నుండి పొయ్యిలోకి' వెడుతున్నాం. పరిహారానికి పరిమితులు విధించుకుని మన కాళ్లు, చేతులు, మన నోరు మనమే బంధించుకుంటున్నాం. మన వేలితో మన కన్నునే పొడుచుకుంటున్నాం. " 2 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేసే అణురియాక్టర్లలో తీవ్రమైన ప్రమాదం జరిగితే వెయ్యి కోట్ల డాలర్లు అంటే 50 వేల కోట్ల రూపాయల వరకు నష్టం వుంటుందని" శాస్త్రవేత్తలు అంటున్నారు. "1960లోనే చిన్న చిన్న అణు రియాక్టర్లకే 2500 కోట్ల రూపాయల బీమా మొత్తాన్ని నిర్ధారించారు. నష్టపరిహారం అంతకన్నా తగ్గించడం సరైనది కాదని" ఇస్రో మాజీ ఛైర్మన్ యు.ఆర్.రావు అన్నారు. భారత ప్రజల ప్రయోజనాలకు విఘాతం కలిగించే ముఖ్యమైన విషయంలో వామపక్షాలు ప్రజల్లోకి వెళ్లి చైతన్యపరచి ప్రజల మద్దతు కూడగట్టి ఆందోళనల ద్వారా బిల్లును అడ్డుకునే కార్యక్రమాన్ని తీసుకోలేదు. అమెరికాతో వ్యూహాత్మక భాగస్వామ్యం పేరుతో యు.పి.ఎ. ప్రభుత్వం దేశాన్ని తాకట్టుపెడుతున్నదని, మిలిటరీతో సహా అన్ని రంగాలలోకి అమెరికాను ప్రవేశపెడ్తున్నదని మాట్లాడుతున్న సి.పి.ఎం. నిజానికి కాంగ్రెస్ నిలదొక్కుకోవడానికి, 2004లో కేంద్రంలో ప్రభుత్వ ఏర్పాటుకు తోడ్పడింది. తర్వాత కూడా అవకాశవాద రాజీ పద్ధతుల్లో పరోక్షంగా సహకరించడంతో కాంగ్రెస్ మరింతగా బలపడి, కేంద్రీకృతమై నిరంకుశంగా మారింది. మరోపక్కన ప్రజా వ్యతిరేక విధానాలతో సి.పి.ఎం. బెంగాల్, కేరళలలో మొత్తం దేశంలో పీడిత ప్రజల నుండి దూరం అయింది. ఈ దేశానికి మేమే ప్రత్యామ్నాయం అని ఎన్ని ప్రగల్భాలు పలికినా ప్రయోజనం లేకుండా పోయింది. సి.పి.ఐ., ఆర్.ఎస్.పి. లాంటి పార్టీలు సి.పి.ఎం. వెనుక తోక పట్టుకుపోవడం తప్ప స్వతంత్ర విధానం లేకుండా అస్తిత్వ సమస్యతో కొట్టుమిట్టాడుతున్నాయి. ఈ బలహీనత అధికార పార్టీకి ఇతోధికంగా తోడ్పడుతుంది. సుదీర్ఘ కాలంగా జిమ్మిక్కులతో పాలిస్తూ అణు ఒప్పందం విషయంలో సాధించిన అనుభవంతో ఆరితేరిన కాంగ్రెస్ ఈ బిల్లు విషయంలోనూ విజయవంతమైంది. మేధావులు, కొన్ని పత్రికలు, సంస్థలు రాబోయే ప్రమాదాన్ని గురించి ఆందోళనతో హెచ్చరించినా ఫలితం లేకుండా పోయింది.

"ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించడంతో పాటు బాధితులకిచ్చే పరిహారంపై పరిమితులు విధించడం కూడా ప్రజల హక్కులను హరించడమే. ఇది ప్రాథమిక హక్కుకు భంగకరం. దీనిని హరించే హక్కు ప్రభుత్వానికి లేదు" అని మాజీ అటార్నీ జనరల్ సోలీసోరాబ్జీ చెపుతున్నారు. "కార్మికుల, ప్రజల భద్రతకు బాధ్యత వహించాలని" సుప్రీంకోర్టు గతంలోనే తీర్పునిచ్చింది. రాజ్యాంగ నిపుణులందరూ ఇదేమాట అంటున్నారు. వర్ధమాన దేశాలు ఎంతో శ్రమకోర్చి పోరాడి సాధించుకున్న ప్రజాస్వామిక హక్కులు, కార్మికుల హక్కుల పరిరక్షణ కుప్పకూలిపోతున్నాయి. 36 సంవత్సరాలుగా అమెరికా గుత్త సంస్థల దగ్గర పేరుకుపోయిన అణు రియాక్టర్లకు మార్కెట్ లేదు. అమ్మకాలు నిలిచిపోయాయి. అమెరికాతో పాటు ఫ్రాన్స్, రష్యాలలోని బహుళజాతి సంస్థల నుండి వచ్చే 10 సంవత్సరాలలో భారతదేశం 60 వేల కోట్ల రూపాయల విలువైన అణు రియాక్టర్లు కొనడానికి పథకాలు సిద్ధమయ్యాయి. ఇప్పటికే వీరికోసం నాలుగు రాష్ట్రాల్లో ఒక్కోచోట ఆరు అణు రియాక్టర్లు నెలకొల్పడానికి అణు పార్కులను కొవ్వాడ (ఆంధ్ర), మిధివిలి (గుజరాత్), జైతాపూర్ (మహారాష్ట్ర),

కుడంకులం (తమిళనాడు)లలో రిజర్వ్ చేసాయి మన ప్రభుత్వాలు.

మనం దశాబ్దాలుగా రష్యన్ అణు రియాక్టర్లతో అణు విద్యుత్ ఉత్పత్తి చేస్తున్నాం. ఎప్పుడూ లేనిది ఇపుడు ఇంత హడావిడి, గందరగోళం ఏమిటి? అంటే "విదేశీ సంస్థలు పరిజ్ఞానం, పరికరాల్లో లోపాలకు బాధ్యత వహించి నష్టపరిహారం చెల్లించాలి" అని సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు మింగుడుపడని అమెరికా సామ్రాజ్యవాదం ఈ మెలిక పెట్టింది. "అణు పరిజ్ఞానం, పరికరాలు సరఫరాదారులతో దేశీయ నిర్వహణదారు కుదుర్చుకునే ప్రత్యేక ఒప్పందంమేరకే వారి పరిహార బాధ్యత పరిమితం అవుతుంది." ఈ రకమైన ఒప్పందం (మెలిక)తోనే మన కేంద్ర ప్రభుత్వం దేశ ప్రయోజనాలకు తిలోదకాలిచ్చింది. మన గుండెలపై అణు కుంపట్లు పేర్చి అవి పేలితే వారి చేతికి ఏమాత్రం మట్టి అంటకుండా కాపాడే బాధ్యతను తీసుకుంది.

ప్రస్తుతం మన దేశంలో మొత్తం 1 లక్షా 60 వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తిలో, జలవిద్యుత్ 23 శాతం, థర్మల్ విద్యుత్ 53 శాతం వుండగా, అణువిద్యుత్ 3 శాతం మాత్రమే వుంది. మన అవసరాలు సరఫరాల మధ్య 20 శాతం తేడా కొనసాగుతోంది. ప్రపంచీకరణలో భాగంగా రాబోయే రెండు దశాబ్దాల్లో పెరిగే పారిశ్రామికీకరణకు అనుగుణంగా 9 లక్షల 50 వేల మెగావాట్ల విద్యుత్ అవసరం వుంటుందని అంచనా. 19 కేంద్రాల్లో 3 శాతం ఉత్పత్తి జరుగుతున్న అణువిద్యుత్‌కు తోడుగా మరిన్ని కేంద్రాలు (అణు పార్కులు) అభివృద్ధి చేసి 25 శాతంకు ఉత్పత్తిని పెంచాలని కేంద్ర ప్రభుత్వం ఆలోచన. ఇది ప్రమాదం, ఖరీదు కూడా. అయినా తప్పదని, అమెరికా దగ్గరున్న అణు రియాక్టర్లకు మార్కెట్ కల్పించాల్సిందేనని అంటుంది కేంద్రం.

నిజానికి జల విద్యుత్‌తో పోల్చితే అణువిద్యుత్ ఉత్పత్తికి 40 వేల మెగావాట్లకు 3 లక్షల కోట్ల రూపాయలు అధికంగా ఖర్చు అవుతుంది. ఇంత ఖర్చు భరించాల్సిందేనా? ఒకప్పుడు 49 శాతం జలవిద్యుత్‌ను ఉత్పత్తి చేసిన మనం ఆ వనరులన్నీ వున్నాయి కాబట్టి జలవిద్యుత్‌ను పెంచుకోవచ్చు. సౌరశక్తి కూడా మనకు అపారంగా వుంది. సౌర విద్యుత్‌ను పెంచుకోవచ్చు. ఈ రెండూ పర్యావరణానికి అసలే సమస్య లేనివి. ప్రమాదాలకు ఆస్కారం లేనివి.

ఆధునిక అణు రియాక్టర్ల డిజైన్ లోపాలు, నాసిరకం వుపకరణాల వినియోగం, నాణ్యతా నియంత్రణ సరిగా లేకపోవడం వలన ప్రమాదాలు జరుగుతున్నాయి. 1978లో త్రీమైల్ ఐలాండ్ (అమెరికా)లో జరిగిన ప్రమాదంపై విచారణ జరిపిన 'జాన్‌కెమిని కమీషన్' రియాక్టర్ సరఫరాదారుల అశ్రద్ధ వలననే ప్రమాదం జరిగిందని తేల్చి చెప్పింది. భారీ లాభాల వేటలో నాసిరకం సరఫరాలతో భారతదేశ ప్రజల ప్రాణాలకు కూడా ముప్పు వాటిల్లే ప్రమాదం వుంది.

అంతర్జాతీయంగా దక్షిణ కొరియా, హంగరీ లాంటి దేశాలు పటిష్టమైన శాసనాలతో విదేశీ సంస్థల జవాబుదారీతనం ఉండేలా ఒప్పించి ప్రజల భద్రతకు పూచీపడుతున్నాయి. మన దేశ పాలకులు దీనికి భిన్నంగా వ్యవహరిస్తున్నారు. అణు సంబంధమైన ఒప్పందాలు వాటికవి విడిగా వుండవు. ఇవి అనేక విషయాలపై ప్రభావాన్ని చూపుతాయి. అమెరికాతో ఈ అణుబంధం దక్షిణాసియా రాజకీయాలను, ప్రపంచ రాజకీయాలను ప్రభావితం చేస్తుంది. అమెరికా యుద్ధోన్మాద రథచక్రాలకు భారతదేశాన్ని కట్టిపడవేసే ప్రమాదం రోజు రోజుకు పెరుగుతుంది.

"2009-10 ఆర్థిక దృక్పథం"లో ప్రైవేటుకు పెద్ద పీట వేయాలని, చట్టంలో మార్పులు తేవాలని రాసారు. అదే జరిగి అణువిద్యుత్ ఉత్పాదన, నిర్వహణ వారి చేతుల్లోకి చేరితే అణు ప్రమాదాలకు మరింత దగ్గరయినట్లేనని గుర్తుంచుకోవాలి. ఇప్పటికీ 49 శాతం వరకు ప్రైవేటుకు అనుమతి వుందన్న విషయాన్ని సదా గుర్తుంచుకోవాలి. ప్రైవేటు సంస్థలే అన్ని స్థాయిల్లో నిర్ణయాత్మకంగా ఉంటున్నాయని మరచిపోకూడదు. అణ్వాయుధాల నియంత్రణ, పరిహారం విషయాల్లో అమెరికా ఇతరులపై ఆంక్షలు విధిస్తూ ద్వంద్వ నీతితో తాను మాత్రం దేనికీ కట్టుబడకుండా 5 వేల అణ్వాయుధాలు గుప్పిట్లో పట్టుకొని అగ్రరాజ్య ఆధిపత్య ధోరణితో వ్యవహరిస్తుంది. దాని తోక పట్టుకుపోయే ధోరణిలో భారత పాలకవర్గాలు ప్రపంచ ప్రజల నుండి వ్యతిరేకతను మూటకడుతున్నారు. అంతర్జాతీయ వేదికల మీద ఇండియా అనుసరిస్తున్న విధానాలు వర్ధమాన దేశాల విమర్శలకు గురవుతున్నాయి. ఒంటరిని చేసి నిలబెడుతున్నాయి. అమెరికా వ్యూహాత్మకంగా భారతదేశాన్ని లోబర్చుకుంటున్నది. మన పాలకులు తెలిసి తెలిసి ఆ ఊబిలోకి దేశాన్ని లాగుతున్నారు.

భారత ప్రభుత్వం ఇప్పుడు అణు రియాక్టర్ల పెద్ద కొనుగోలుదారు. గుత్త సంస్థల దోపిడీకి తలుపులు బార్లా తీసి, దేశ ప్రజల సంపదకు, ప్రాణాలకు నష్టం కలిగించేందుకు సిద్ధమైంది. భారత దళారీ పాలకుల, సామ్రాజ్యవాద విధానాలను ఓడించాలంటే అన్ని సెక్షన్ల ప్రజల్ని సమీకరించి బలమైన ఉద్యమం నడపాలి. ఈ ఒప్పందాలు రద్దు చేసేవరకు అవిశ్రాంతంగా పోరాడాలి. ప్రభుత్వం, ప్రతిపక్షాలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ఎండగట్టాలి. ప్రజల ప్రయోజనాలకు కట్టుబడి పనిచేసే ప్రజా రాజ్యాధికారానికి

*(మిగతాది 49వ పేజీలో...)*

# అధికార కుమ్ములాటల్లో నలుగుతోన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో నడుస్తోన్న ఆధిపత్యపోరు ప్రస్తుతం ఆ పార్టీ అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా పరిణమించింది. నిజానికి ఏ బూర్జువా రాజకీయ పార్టీకైనా ఆధిపత్య పోరు అనేది అసాధారణ విషయమేమీ కాదు. అశేష పీడిత ప్రజలపై దోపిడీ వర్గాల ఆధిపత్యాన్ని నెలకొల్పడానికే, దోపిడీ వర్గాల ప్రతినిధిగానే ఏ బూర్జువా రాజకీయ పార్టీ అయినా ఉనికిలోకి వస్తుంది. దోపిడీ వర్గాల నడుమనున్న వైరుధ్యాల ఫలితమే అనేక బూర్జువా రాజకీయ పార్టీల పుట్టుకకు కారణం. స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా వుంటాయి కనుక ఒకే రాజకీయ పార్టీలోని శక్తుల మధ్య సైతం వైరుధ్యాలూ వుంటాయి, ఆ మేరకు ఆధిపత్యపోరూ వుంటుంది. అయితే పోటీ పడుతున్న శక్తుల బలాబలాలు సమంగా లేనపుడు ఆ ఆధిపత్యపోరు బలహీనంగా వుంటుంది, అదుపులో వుంటుంది.

వై.ఎస్.ఆర్. బతికి వున్నన్నాళ్లూ అదే జరిగింది. ఆయనపై అధిష్టానానికీ, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలోని కొందరికీ ఎన్ని అసంతృప్తులు వున్నా అవి కూనిరాగాలుగానే బయటకు వచ్చాయి కానీ ధిక్కార నినాదాలు కాలేదు. ఆయన వెనక వున్న బలమైన పెట్టుదారుల లాబీ ఆయన నిరంకుశత్వాన్నీ, ఏకఛత్రాధిపత్యాన్నీ కాపాడింది. అయితే ఆయనను మాత్రం కాపాడలేకపోయింది. అధికారంలోకి వచ్చిన తర్వాత వై.ఎస్.ఆర్. అనతికాలంలోనే అడ్డదారుల్లో తన శక్తిని మరెన్నో రెట్లు పెంచుకొని ఎదురులేని నాయకుడిగా విర్రవీగాడు, పార్టీకి విధేయుడుగా కాక పార్టీ కంటే అధికుడిగా భావించాడు. రిలయెన్స్ వంటి బడా పెట్టుబడిదారీ శక్తులతో బేరసారాల్లో పట్టువిడుపులు లేకుండా వ్యవహరించాడు. ఇలా పార్టీలోని మరో బలమైన లాబీ ప్రయోజనాలకు అడ్డంకిగా (తన స్వార్థ ప్రయోజనాల కోసం మాత్రమే) మారినందువల్లనే ఆయన 'దుర్మరణం' పాలయ్యాడని ఒక అభిప్రాయం బలంగానే ప్రచారంలో వుంది.

ఒకవేళ వైఎస్ దుర్మరణం ఏ కుట్ర ఫలితం కాకపోయినా, అది అక్షరాలా ప్రమాదవశాత్తే సంభవించినా, కాంగ్రెస్ అధిష్టానానికి 'కాగల కార్యం గంధర్వులే తీర్చినట్ట'ని మాత్రం నిస్సందేహంగా చెప్పుకోవచ్చు.

వైఎస్ చావుతో ఇన్నాళ్లూ కాస్త అణిగిమణిగి వున్న ఆధిపత్య పోరు నేడు వీధికెక్కింది. తండ్రి ఇటు చచ్చీ చావక ముందే తండ్రి స్థానంలో ముఖ్యమంత్రి పీఠాన్ని అధిష్టించడానికి జగన్ తయారైపోయాడు. ఎందుకు తయారు కాడూ? అది మన 'ప్రజాస్వామ్యపు' గొప్ప తనం. ఇందిరా గాంధీ చనిపోగానే రాజీవ్ గాంధీ దేశానికే, అది కూడా ఒక పెద్ద 'ప్రజాస్వామ్య' దేశానికి ప్రధానమంత్రి అయినప్పుడు, జగన్ ఆఫ్టరాల్ ఒక రాష్ట్రానికి ముఖ్యమంత్రి కావడానికి తయారవడంలో తప్పేం వుంది? జగనే కాదు కాంగ్రెస్ పార్టీలోని వైఎస్ అనుయాయులు కూడా 'యువరాజావారే' ముఖ్యమంత్రి సింహాసనాన్ని అధిష్టించాలని బహిరంగంగానే కోరుకున్నారు. మన్‌మోహన్, ప్రణబ్ ముఖర్జీలంతటి వారే 'రాహులే భావి భారత నేత' అని బహిరంగంగా ప్రకటిస్తున్నప్పుడు, కాంగ్రెస్ పార్టీ అధ్యక్ష పదవికి గాంధీ–నెహ్రూల కుటుంబం నుంచి తప్ప మరొకరు పోటీ చేయడానికే సాహసించనప్పుడు, వైఎస్ 'కష్టపడి' సంపాదించిన ముఖ్యమంత్రి కుర్చీ జగన్‌కు కాక మరొకరికి చెందాలని వాళ్లెట్లా కోరుకుంటారు?

అయితే అధిష్టానం కానీ కాంగ్రెస్‌ను శాసించే పెట్టుబడిదారీ లాబీ గానీ అలా కోరుకోవడం లేదు. కారణం, వారసత్వ రాజకీయాలంటే దానికి మక్కువ లేకపోవడం కాదు. మేకులా తయారయిన వైఎస్ ఎలాగోలా వదిలి పోయాక, లేదా వదిలించేసుకున్నాక మళ్లీ కోరి కోరి జగన్‌ను మేకులా ఎలా తయారు చేసుకుంటారు? అందుకే సొంత లాబీలు ఏమీ లేని, అధిష్టానానికి విధేయుడిగా వుండే, కాంగ్రెస్ తరహా రాజకీయాల్లో అనుభవమూ వున్న రోశయ్యను ముఖ్యమంత్రిగా అధిష్టానం నియమించింది.

ఇది జగన్‌కు ఎంత మాత్రమూ మింగుడు పడలేదు. తండ్రిని కోల్పోవడం అంటే జగన్‌కు ఒక భౌతికమైన, ఆత్మీయమైన వియోగపు బాధ మాత్రమే కాదు, కుప్పలు తెప్పలుగా మేటలు వేసుకున్న తమ ఆస్తులను కాపాడుకునే, మరింతగా ఇబ్బడి ముబ్బడిగా పెంచుకునే అవకాశాన్ని కోల్పోవడం! ఆ అవకాశం కోల్పోకూడదంటే అధికారాన్ని అందిపుచ్చుకోవడం జగన్‌కు తక్షణావసరం. అందుకే ఆ ప్రయత్నాలు తక్షణమే మొదలు పెట్టాడు. తండ్రి దుర్మరణం వెనుక కుట్ర వుందనే ప్రచారంతో రాష్ట్రంలో ఆందోళనకూ, విధ్వంసాలకూ తన అనుచరులను ప్రేరేపించాడు. ఈ ఆందోళనలూ, విధ్వంసాల వల్ల జగన్ తన బలాన్ని ప్రదర్శించాలనుకున్నాడు. అంతే కాదు ప్రజల్లో వైఎస్ మరణం పట్ల సానుభూతిని మరింతగా పెంచి దాన్ని తన ప్రయోజనాలకు వాడుకోవాలనుకున్నాడు. కానీ ఈ ఆందోళన ఎక్కువ కాలం కొనసాగలేదు. ఆందోళన కొనసాగితే జగన్ భవిష్యత్‌కు మంచిది కాదని సోనియా భావిస్తున్నట్లు ఢిల్లీ నుండి వచ్చిన ఒక్క ఫోన్ కాల్‌తో ఆందోళనకు ఫుల్‌స్టాప్ పడిందని వార్తా కథనాలు వచ్చాయి. అంటే ఏ అధికారం కోసం జగన్ ఆందోళనకు దిగాడో, ఆ అధికారానికి అవరోధంగా వుంటుందనిపించినపుడు వెంటనే దాన్ని విరమించుకున్నాడు.

అధికార పగ్గాలు జగన్ చేతిలో పెట్టడానికి అధిష్టానం సిద్ధంగా లేదు. అయితే ఆ విషయాన్ని జగన్‌తో కరాఖండిగా చెప్పకుండా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది. ఘర్షణకు దిగకుండా మొదట జగన్‌ను జోకొట్టాలని ప్రయత్నించింది. సోనియా ఆయనను పిలిపించుకొని మాట్లాడింది. ఆ తర్వాత జగన్ 'అంతా తాను చూసుకుంటానని, తనకు వదిలెయ్యమన్నదనీ మేడమ్ హామీనిచ్చారు' అని కొంచెం ధీమాగానే మాట్లాడాడు. కానీ ఎంతో కాలం ఆయన ఆ ధీమాతో వుండలేకపోయాడు. అధిష్టానం అంతరంగం ఆయనకు స్పష్టంగా తెల్సివచ్చింది. ఇక పావులు కదపడం మొదలుపెట్టాడు.

అందులో భాగమే ఓదార్పు యాత్ర. దీని ద్వారా వైఎస్ వారసుడిగా ప్రజలు తనను మాత్రమే కోరుకుంటున్నారనే వాతావరణాన్ని రాష్ట్ర వ్యాప్తంగా సృష్టించడమే కాక బల ప్రదర్శన ద్వారా అధిష్టానంపై వత్తిడిని పెంచడం జగన్ ఉద్దేశ్యం. అంతేకాదు ఈ యాత్ర ద్వారా తన బలాన్ని మరింతగా పెంచుకునే ప్రయత్నాలు చేస్తున్నాడు. పార్టీలోని రెండవ శ్రేణి నాయకులైన జడ్.పి.టి.సి., ఎం.పి.టి.సి.లను తన వైపుకు సమీకరించుకుంటున్నాడు. ఇందులో భాగంగానే ఈ యాత్రలో రోజుకు అయిదు, ఆరు కోట్లు ఖర్చు పెడుతున్నాడు.

సహజంగానే దీన్ని అధిష్టానం సహించదు కనుక జగన్‌కు కూడదని చెప్పింది. కానీ జగన్ వినలేదు. వినకపోవడం కూడా సహజమే. ఎందుకంటే ముందే చెప్పుకున్నట్టు ఆయనకు అధికారం తక్షణావసరం కనుక. ఎందుకు తక్షణావసరమో కూడా ఒక్కమాటలో చెప్పుకున్నాం కానీ ఇంకొంచెం వివరంగా చెప్పుకుంటే మాత్రం మన బుర్రలు తిరిగిపోతాయి. అవినీతి, అక్రమాలు అనేవి మనకు చాలా సహజ విషయాలే అయ్యాయి. అవి లేకపోవడమే అసహజ విషయంగా తోచే దుస్థితి దాపురించింది. అవినీతి, అక్రమాలే ప్రస్తుత వ్యవస్థకు పునాదులుగా వుంటాయనే విషయంతో చాలా మంది ఓ మేరకు రాజీపడిపోయారు కూడా. కానీ రాజశేఖరుడి పాలనలో మాత్రం ఈ అవినీతి, అక్రమాలు పరాకాష్టకు చేరాయని చెప్పుకోవచ్చు. 'దేశమంటే మట్టి కాదు మనుషులు' అని గురజాడ ఎంత అమాయకంగా చెప్పాడో గానీ, మన పాలకులకు దేశమంటే మట్టి, గనులు, అడవులు, నీళ్లు, వనరులే. మనుషులే వాళ్లకు చాలా అసంబద్ధంగా కన్పిస్తారు. ఈ వనరులను తాము మింగకుండా అడ్డుకునే అవాంఛనీయ శక్తులుగా కన్పిస్తారు. రాజశేఖరుడి అయిదున్నరేళ్ల పాలనను చూస్తే ఈ విషయం మనకు మరింతగా బోధపడుతుంది. దాదాపు లక్షన్నర ఎకరాల వైశాల్యంలోని బయ్యారం గనులను వైఎస్ అల్లుడికి కట్టబెట్టడం, జగన్‌కు చెందిన సరస్వతి పవర్ అండ్ ఇండస్ట్రీస్‌కు 1516 ఎకరాల వైశాల్యంలోని సున్నపురాయి గనులను కట్టబెట్టడం, ఎమ్మార్ అనే ప్రైవేటు సంస్థకు 50 వేల కోట్ల విలువైన భూములను అక్రమంగా కేటాయించడం, మూడున్నరేళ్లలో భారతీ సిమెంట్స్‌లోని తమ వాటాగా వున్న 45 కోట్ల పెట్టుబడి ద్వారా 3053 కోట్ల లాభాలను జేబులో వేసుకోవడం... ఇవి వైఎస్ అవినీతి, అక్రమాలు, ఆశ్రిత బంధుప్రీతికి చిరు ఉదాహరణలు మాత్రమే. ఈ ఐదున్నరేళ్లలో ఆ కుటుంబం స్థాపించిన కంపెనీల గురించీ, బినామీ కంపెనీల గురించీ, అక్రమ మార్గంలో పెట్టుబడులను ఆకర్షించి కోట్ల లాభాలను జేబులో వేసుకోవడం గురించి వివరాల్లోకి పోయి చూస్తే, ఎంత తవ్వినా తరగని అవినీతి పుట్టలు బయటపడుతూనే వుంటాయి. ఇక జలయజ్ఞం ధనయజ్ఞంగా మారిన వైనమూ అందరికీ తెల్సిందే. వైఎస్ పాలనలో 78 వేల కోట్ల కుంభకోణాలు జరిగాయని మాట్లాడుతున్నది ప్రతిపక్షాలో, వామపక్షాలో, మావోయిస్టులో కాదు కాంగ్రెస్ వారే. ఈ అవినీతి మూలంగా తమ సంపదను లక్ష కోట్ల రూపాయలకు పెంచుకున్నారనీ, టాటా, బిర్లాల స్థాయిలో వాళ్ల ఆస్తులు వున్నాయనీ, ప్రపంచంలోని ఏ పారిశ్రామికవేత్త కూడా ఇంత వేగంగా ఎదగలేదనీ ఆరోపణలు సొంత పార్టీ వారే చేస్తున్నారు. ఇదంతా వైఎస్ చేతిలో అధికారం వుండడం వల్లే సాధ్యమయింది. ఈ సంపదను పెంచుకోవడం మాట అటుంచి, దీన్ని కాపాడుకోవాలంటే కూడా జగన్‌కు అధికారం తక్షణావసరం.

వైఎస్ తన పాలనలో ఆర్థికంగా అనేక రెట్లు బలపడ్డమే కాదు, ఈ కాలంలో ఎందరో పెట్టుబడిదారుల ప్రయోజనాలకు పెద్దపీట వేసి తనకు అండగా వుండే పెట్టుబడిదారుల లాబీని బలోపేతం చేసుకున్నాడు. కాంగ్రెస్ పార్టీలో తన అనుయాయులకు కూడా కోట్లు పోగేసుకునే అవకాశాలను కల్పించి పార్టీపరంగానూ తన మద్దతుదారులను పెంచుకున్నాడు. వైఎస్ వెనుక వున్న పెట్టుబడిదారుల లాబీకీ, కాంగ్రెస్ పార్టీ వారికి కూడా తమ ప్రయోజనాలు నిరాటంకంగా నెరవేరాలంటే జగన్ చేతికి అధికార పగ్గాలు రావడం అవసరం. అందుకే జగన్‌ను కుర్చీలో కూర్చోబెట్టాలని తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. వైఎస్ చనిపోయిన రెండో రోజునే ఎమ్మెల్యేలను కొనడం కోసం జగన్ రెండు వందల కోట్ల రూపాయలను సేకరించాడని చెప్తున్నారు. దీన్ని బట్టి జగన్‌కు ఎంత బలమైన అండ వున్నదో అర్థమవుతుంది. అంతేకాదు ఆయనను కుర్చీలో కూర్చోబెట్టాలనే ఆకాంక్షలు దోపిడీ వర్గాల్లో ఎంత బలంగా వున్నాయో కూడా అర్థమవుతుంది.

అందుకే అధిష్టానం హెచ్చరికలను జగన్ ఎంత మాత్రం ఖాతరు చేయడం లేదు. అధికారం చేతికందదనుకున్నప్పుడు తాడో పేడో తేల్చుకోవడానికే సిద్ధపడుతున్నాడు. సొంత పార్టీ పెట్టడం ఖాయం అని కూడా వార్తలు వస్తున్నాయి. ఈ నేపథ్యంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ తీవ్ర సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నదని చెప్పుకోవచ్చు.

నిజానికి జగన్ పాల్పడుతున్న క్రమశిక్షణా రాహిత్యానికి పార్టీ, పరంగా ఎప్పుడో చర్యలు తీసుకోవాల్సి వుండె. జగన్‌కు ఇది ఆఖరి అవకాశమనీ, కథ క్లైమాక్స్‌కు చేరిందనీ, నేడే ఫైనల్స్ అనే వార్తలు దాదాపు రెండు నెలల నుండీ – సెప్టెంబర్ మొదటి వారం నుండీ– వస్తున్నాయి. కానీ ఫైనల్స్ ఎంతకీ ముగియడం లేదు. జగన్‌ను పార్టీ నుండి బయటకు గెంటెయ్యాలని కాకుండా విధేయుడిగా మల్చుకోవాలని అధిష్టానం కోరుకుంటున్నది. ఇది జగన్ పట్ల అధిష్టానానికి వున్న ఔదార్యం కాదు. జగన్‌ను గెంటెయ్యడం దానికంత సులువైన విషయం కాదు. రాష్ట్రంలో పార్టీని చాలా బలహీన పర్చే విషయం అది. ప్రత్యేక తెలంగాణా ఉద్యమ నేపథ్యంలో తెలంగాణా ప్రాంతంలో కాంగ్రెస్ దీన స్థితి మొన్నటి ఉప ఎన్నికల్లో మరింత స్పష్టంగా తెల్సింది. కాబట్టి దాని ఆశలు ఇప్పుడు కోస్తాంధ్ర ప్రాంతంలోనే. జగన్ పార్టీ నుండి వెళ్లిపోతే సమైక్యవాదిగా పేరు తెచ్చుకున్న జగన్ వెనుకనే మెజారిటీ కోస్తాంధ్ర ప్రాంతపు నేతలు నిలబడుతారనే భయం దానికుంది. ఇరువర్గాలు తమ తమ బలాలను నిర్ధారించుకోవడం కోసం రకరకాల సర్వేలు కూడా చేయించుకుంటున్నాయి. అధిష్టానం ఎప్పటికప్పుడు ఇంటెలిజెన్స్ నివేదికలు తెప్పించుకుంటున్నది. కోస్తాంధ్రలో 50 శాతం మద్దతు జగన్‌కు వుందని కొన్ని సర్వేలు చెబుతున్నాయనే ప్రచారం జరుగుతోంది. జగన్‌ను గెంటెయ్యడం వల్ల ప్రజల్లో అతనిపై సానుభూతి వెల్లువెత్తుతుందని కూడా అధిష్టానం భావిస్తోంది. కాబట్టి అధిష్టానం జగన్‌ను తానుగా గెంటెయ్యకుండా జగనే పార్టీని వీడిపోయేలాగా చాలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తోంది.

కుప్పలు తెప్పలుగా పెరిగిన ఏ ఆర్థిక వనరులను చూసుకొని జగన్ అధిష్టానానికి ఎదురు తిరుగుతున్నాడో ఆ ఆర్థిక వనరులను దెబ్బతీయాలని చూస్తోంది. అందులో భాగంగానే కోట్ల లాభాలను తెచ్చిపెట్టే బయ్యారం గనులను తాత్కాలికంగా నిలిపివేసింది. జగన్ పట్ల ప్రజల్లో వున్న సానుభూతిని పోగొట్టే ప్రయత్నం చేస్తోంది. అందులో భాగంగా వైఎస్ పాలనలో జరిగిన అవినీతి, అక్రమాలు బహిర్గతమయ్యేలా చేస్తోంది. వైఎస్, జగన్‌లు పెంచుకున్న ఆస్తుల వివరాలు బహిర్గతమయ్యేలా చేస్తోంది. ఈ అవినీతి ఆరోపణల నేపథ్యంలో వైఎస్ పాలనలో జరిగిన అవినీతిపై, జగన్ ఆస్తులపై విచారణ జరిపించాలనే డిమాండ్ బలంగా వస్తోంది. కొన్ని అవినీతి ఆరోపణలపై సిబిఐ విచారణకు కూడా ఇప్పటికే కేంద్రం ఆదేశించింది. వైఎస్ పాలనలో జరిగిన కుంభకోణాలపై కాంగ్రెస్ పార్టీ ఎంపీలే సోనియాకు డాక్యుమెంట్లను సమర్పించారు. ఈ చర్యలతో పాటు పార్టీ వర్గాల్లో జగన్‌కున్న మద్దతును దూరం చేస్తోంది. ఇందులో భాగంగా 'ఓదార్పు'లో పాల్గొన కూడదని అందరికీ అల్టిమేటం జారీ చేసింది. లెక్కచేయని వారిపై క్రమశిక్షణా చర్యలు తీసుకుంటోంది. వాళ్ల అవినీతిని కూడా బహిర్గతమయ్యేలా చేస్తోంది. ఉదాహరణకు జగన్‌కు గట్టి మద్దతుదారుగా వున్న పిసిసి కార్యదర్శి అంబటి రాంబాబును సస్పెండ్ చేసింది. ఆంధ్ర ప్రదేశ్ పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన సంస్థ (ఏ.పి.ఐ.ఐ.సి.)కి ఆయన అధ్యక్షుడిగా వుండిన కాలంలోనే ఎమ్మార్ సంస్థకు వేల కోట్ల విలువైన భూములను అక్రమంగా కట్టబెట్టాడనే విషయాన్ని బహిర్గతం చేసింది. టి.టి.డి.లో కుంభకోణం బయటపడ్డం, ఆ కారణంగా ప్రత్యేకాధికారి ధర్మారెడ్డిపై వేటు వేయడం, శ్రీకృష్ణ దేవరాయ విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్ కుసుమకుమారిపై అవినీతి ఆరోపణలు, ఆమెపై వేటు, కడప జిల్లా ఎస్పీ బదిలీ... ఇవన్నీ కూడా జగన్ వర్గాన్ని దెబ్బతీయడానికే! ఈ చర్యలు చాలా మేరకు పనిచేశాయి. ముందు ఓదార్పులో పాల్గొంటామని ప్రకటించిన చాలా మంది ఆ తర్వాత తప్పుకున్నారు. వైఎస్ మద్దతు దారులుగా పేరుపడిన కొంతమంది ఇప్పుడు అవినీతిపై విచారణ చేయాలని కోరుతున్నారు. జగన్ ముఖ్యమంత్రి అవుతాడనే ఆశలు వాళ్లలో చచ్చిపోవడం వల్ల తాము అధిష్టానం పక్షమని నిరూపించుకుని తమ ప్రయోజనాలను కాపాడుకునే అవకాశవాదమిది.

నిజానికి ఈ అవినీతి ఆరోపణలు చాలా వరకూ పాతవే. కానీ ఇన్నాళ్లూ అధిష్టానం కళ్లు మూసుకున్నట్టు నటించింది. ఇప్పుడు కేవలం జగన్‌ను లొంగదీసుకోవడానికే కళ్లు తెరుచుకున్నట్టు నటిస్తోంది. బయ్యారం గనులను తాత్కాలికంగా మాత్రమే నిలిపివేసింది. అంటే ఇప్పటికైనా జగన్ లొంగివస్తే మళ్లీ వాటిని ఆ కుటుంబానికే కట్టబెట్టినా ఆశ్చర్యం లేదు. అంటే ఇప్పుడు జగన్ విధేయుడిగా వుంటే గత వైఎస్ పాలన అంతా నీతివంతమైనదీ, సక్రమమైనదీ అయిపోతుంది!

జగన్‌ను దిగ్బంధించే చర్యలు అధిష్టానం ఇంతటితో సరిపెట్టలేదు. ప్రజల్లో వైఎస్‌కున్న సానుభూతిని ఒకవైపు దూరం చెయ్యాలని చూస్తూ మరోవైపు మిగిలి వున్న కాస్త సానుభూతిని కూడా జగన్‌కు కాకుండా పార్టీకే తోడ్పడేలా పథకాలు వేస్తోంది. ఈ కారణంగానే ఓదార్పు యాత్రను జగన్ వ్యక్తిగత యాత్రగా కాకుండా పార్టీ తరుపునే జరపాలని భావించింది. వైఎస్ దుర్మరణానికి తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నారని భావిస్తున్న వారి కుటుంబాలకు లక్ష రూపాయలు పార్టీ తరుపున ఇస్తామని ప్రకటించింది. అధిష్టానం వేసిన ఈ ఎత్తుగడ ఉద్దేశ్యం ఏంటంటే ఒకవైపు ఓదార్పుకు తాను వ్యతిరేకం కాదని ప్రకటించుకుంటూ, మరోవైపు జగన్ ఓదార్పు యాత్రను దెబ్బ కొట్టడం. అలాగే 'ఓదార్పు' ద్వారా జగన్ కాకుండా పార్టీనే ప్రయోజనాన్ని పొందడం.

అధిష్టానం వేసిన ఈ ఎత్తుగడకు కూడా జగన్ లొంగకపోయినప్పటికీ ఒక మేరకు అధిష్టానం లక్ష్యం నెరవేరినట్టే.

పార్టీయే 'ఒదార్పు'ను చేపట్టాలనుకుంటున్నప్పుడు జగన్‌కు ఎందుకీ మొండి పట్టుదల అనే అభిప్రాయం కొంత మేరకు వచ్చింది.

ప్రస్తుతం పార్టీలో నెలకొన్న ఈ పరిస్థితి రాష్ట్ర ప్రభుత్వంపై, పాలనపై చాలా ప్రభావాన్ని వేస్తోంది. రోశయ్యకు ఇప్పుడు ప్రతిపక్షపోరు కంటే, 'స్వపక్ష' పోరే ప్రధానంగా మారింది. వైఎస్ ప్రవేశపెట్టిన పథకాలు సరిగా అమలు కావడం లేదని జగన్ వర్గం దుమ్మెత్తిపోస్తోంది. జగన్ పత్రిక కూడా ఈ విషయంలో చురుకైన పాత్ర వహిస్తోంది. నిజానికి వైఎస్ఆర్ ప్రవేశ పెట్టిన ఎన్నో జనాకర్షక పథకాలు ప్రచార్భాటానికి తప్ప ప్రజలకు వాస్తవంగా పెద్దగా ప్రయోజనం చేకూర్చిందేమీ లేదు. ప్రయోజనం పొందిన వాళ్లెవరైనా వుంటే అది కాంగ్రెస్ నేతలే. ప్రస్తుతం ప్రచారం కోసం నామమాత్రంగానైనా ఈ పథకాలను కొనసాగించడం రోశయ్య ప్రభుత్వానికి పెనుభారంగా వున్నది. కానీ ఆపివేస్తే ప్రజలూ, ప్రతిపక్షాల కంటే జగన్ వర్గం ఊరుకునేలా లేదు.

రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత ఎన్నికలు జరుపవల్సి వుంది. కానీ జగన్ వర్గాన్ని పదవుల్లోకి రాకుండా చేయడం కోసం అధిష్టానం ఎన్నికలను కూడా వాయిదా వేస్తోంది. పార్టీలోని రెండవ శ్రేణి నాయకుల్లో, యువజన సంఘంలో జగన్ ప్రభావం పెరిగిపోతోందనే అభిప్రాయంతో రాహుల్ గాంధీ గ్రామ స్థాయి నుండి జిల్లా స్థాయి వరకూ యువజన కాంగ్రెస్ కమిటీలను రద్దు చేశాడు.

రాష్ట్రంలో పార్టీ దెబ్బ తిన్నా సరే జగన్‌కు పగ్గాలు అప్పగించేది లేదని అధిష్టానం గట్టిగానే యోచిస్తున్నది. అదే సమయంలో జగన్ కూడా అధికారం కోసం తాడో పేడో తేల్చుకోవడానికి అంతే పట్టుదలగా వున్నాడు. అయితే జగన్ తెగతెంపులు చేసుకోగలడే గానీ అధికారాన్ని పొందడం మాత్రం అంత సులువైన విషయం కాదు. రెండు వర్గాలకు కూడా ప్రస్తుత పరిణామాలు నష్టదాయకమే. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ వరుసగా రెండో దఫా అధికారంలోకి వచ్చిన శక్తివంతమైన పార్టీగా విర్రవీగుతున్న కాంగ్రెస్‌కు ఇది తీవ్రమైన దెబ్బ.

జగన్‌ను లొంగదీయడానికి వైఎస్ పాలనలో జరిగిన అవినీతిని నేడు కాంగ్రెస్ పార్టీ తవ్వుతోంది కానీ, మరి ఇన్నాళ్లూ ఎందుకు చూస్తూ ఊరుకున్నట్టు? అయిదేళ్లు అవినీతి అక్రమాలతో రాజ్యమేలిన వైఎస్‌ను రెండో దఫా కూడా ముఖ్యమంత్రిగా ఎందుకు నియమించినట్టు? నేడు బయటపెడుతున్న వైఎస్ తదితర కాంగ్రెస్ నేతల అవినీతితో పార్టీకి ఏ సంబంధమూ లేదా? ఇంత అవినీతికి పాల్పడినా విధేయుడిగా వుంటే జగన్ భవిష్యత్‌కు ఎటువంటి ఢోకా వుండదని ఎందుకు హామీ ఇస్తున్నట్టు? వైఎస్, జగన్ తదితరుల అవినీతిని బయటపెట్టడం ద్వారా కాంగ్రెస్ పార్టీ తన అవినీతిని తాను బయటపెట్టుకుంటున్నట్లు కాదా? వై.ఎస్., జగన్‌ల అవినీతి వల్లా, ఆ అవినీతిని ఇన్నాళ్లూ చూస్తూ ఊరుకున్న అధిష్టానం వల్లా ప్రజలకు ఎంత నష్టం వాటిల్లినట్టు? ఈ సందేహాలేవీ ప్రజలకు రాకుండా వుంటాయా? బూర్జువా రాజకీయ పార్టీలకు ప్రజల చైతన్యం పట్ల ఎంత చిన్నచూపు!

జగన్ కూడా తన కుటుంబపు అవినీతి గుట్టలు, గుట్టలుగా బయట పడుతుంటే కూడా ఇంకా ప్రజలు తననే ముఖ్యమంత్రిగా కోరుకుంటున్నారని మాట్లాడగల్గుతున్నాడు. తనను ముఖ్యమంత్రిగా చేసేది ప్రజలు కాదనీ తన వెనుక వున్న డబ్బుల మూటలేనని ఆయనకు స్పష్టంగానే తెల్సు కాబట్టే ఆ ధీమా.

ఇక్కడ ప్రతిపక్షాల, వామపక్షాల పాత్రను కూడా నిలెయ్యాల్సి వుంది. ఇంతగా అవినీతికి పాల్పడుతున్నా, ప్రజల ప్రయోజనాలను హరిస్తున్నా పాలక పక్షానికి వ్యతిరేకంగా అవి ఒక్క ఆందోళనను కూడా చేపట్టకుండా ప్రేక్షకపాత్ర వహిస్తున్నాయి. కేవలం పత్రికా ప్రకటనలకే తమ 'ఆందోళనలను' పరిమితం చేస్తున్నాయి.

మొత్తంగా ఈ పరిణామాలు విప్లవ పరిస్థితికి మాత్రం చాలా అనుకూలమైనవి. బూర్జువా రాజకీయ పార్టీలు ఎంత భ్రష్టు పట్టి వున్నాయో, ప్రజాస్వామ్యాన్ని ఎంతగా అపహాస్యం చేస్తాయో, ప్రజాసేవ కోసమే పదవులు అనే ప్రవచనాలు ఎంత బూటకమైనవో, స్వార్థ ప్రయోజనాలే పరమావధిగా పదవులను ఎలా వుపయోగించుకుంటారో, ప్రజల ప్రయోజనాలను ఎంతగా బలిపెడతారో ప్రజలకు మరింతగా అర్థం కావడం పార్లమెంటరీ వ్యవస్థపై వున్న కాస్త భ్రమలు కూడా కోల్పోవడానికి తోడ్పడుతుంది.

ఒకవైపు పాలకవర్గాలు అధికార కుమ్ములాటల్లో మునిగి వుంటే మరోవైపు రాష్ట్రంలో ప్రజా సమస్యలు తీవ్రమవుతున్నాయి. ఈ సమస్యలపైనా, పాలకుల అవినీతిపైనా కేంద్రీకరించి పోరాడ్డం ద్వారా పాలకవర్గాలను మరింతగా వంటరి చేయవచ్చు. వారి నడుమ వైరుధ్యాలను మరింతగా తీవ్రతరం చేయవచ్చు.

ఆ దిశగా ప్రగతిశీల, ప్రజాస్వామ్య, దేశభక్త శక్తులూ, విద్యార్థులూ, యువజనులూ, రచయితలూ, కళాకారులూ ఐక్యం కావాలి. అధికార కుమ్ములాటల్లో మునిగిపోయి ప్రజా ప్రయోజనాలను బలిపెడుతున్న పాలకపార్టీల స్వార్థప్రయోజనాలను ఎండగట్టాలి.

విప్లవ పార్టీ ఈ పరిస్థితిని సమర్థవంతంగా ఉపయోగించుకొని విప్లవోద్యమాన్ని పురోగమింపచేయాలి. ఈ విషయంలో అది ఏమాత్రం వెనుకబడినా ఈ పరిస్థితిని ఉపయోగించుకొని బూర్జువా ప్రతిపక్షాలే ప్రయోజనం పొందుతాయి. ★

# అద్భుతమైన నమూనాను నెలకొల్పిన మమాయిల్ వీరోచిత ప్రతిఘటన

పాలక వర్గాలు తలపెట్టిన గ్రీన్‌హంట్‌లో భాగంగా బీహార్–ఝార్ఖండ్ స్పెషల్ ఏరియా కమిటీ పరిధిలో విప్లవోద్యమానికి తీవ్ర నష్టం కల్గించే దుష్ట తలంపుతో శత్రువు భారీ సన్నాహాలతో చేసిన ఒక ఆపరేషన్‌ను పిఎల్‌జిఎ వీరయోధులు 13 గంటల పాటు ఏకధాటిగా, అత్యంత సాహసోపేతంగా పోరాడుతూ తిప్పికొట్టి ప్రతిఘటనా చరిత్రలో ఒక అద్భుతమైన నమూనాను నెలకొల్పారు. ఈ ప్రతిఘటనలో పిఎల్‌జిఎ గెరిల్లాలు, ఇద్దరు ముగ్గురు కోబ్రా బలగాలను హతమార్చి, దాదాపు పదిమందిని గాయపర్చారు. కాగా ప్రతిఘటనా క్రమంలో కామ్రేడ్ డేవిడ్ వీరమరణం పొందాడు.

భారీ పథకంతో చేపట్టిన ఈ ఆపరేషన్ విఫలం కావడంతో బిక్కచచ్చిన శత్రువు తమ దాడిలో 10 మంది మావోయిస్టులు హతమయ్యారనే అబద్ధపు ప్రచారానికి పూనుకున్నాడు.

ఈ స్పెషల్ ఏరియాలోని పశ్చిమ సింగ్‌భూం జిల్లా సోనువా పోలీస్ స్టేషన్ పరిధిలోని మమాయిల్ గ్రామ సమీపంలో సమావేశాల నిర్వహణ కోసం పార్టీ, పిఎల్‌జిఎ కార్యకర్తలు కొద్ది రోజులుగా మకాం వేసి వుండినారు. దీన్ని పసిగట్టిన పోలీసులు ఈ క్యాంపులో ఉన్నతస్థాయి నాయకత్వం వున్నారనే అంచనాతో, వారిని హత్యచేసే లక్ష్యంతో ఒక భారీ దుష్ట పథకాన్ని పన్నారు. ఈ పథకాన్ని సమర్థవంతంగా అమలు చేయడానికి గాను ఆపరేషన్ గ్రీన్‌హంట్ కోసం ఏర్పడిన ఉన్నత కమాండ్‌కు కమాండర్ ఇన్ చీఫ్ అయిన విజయ్ రమణ్ జిల్లా కేంద్రం చాయిబాసాలో వుంటూ బలగాలను నడిపించాడు. ఐజి, డిఐజిలు బంద్‌గావ్‌లో వుంటూ సమన్వయించారు. ఇందులో సుశిక్షితమైన నాలుగు కోబ్రా బెటాలియన్లూ, ఖుంటీ నుండి రెండూ, చాయిబాసా నుండి ఆరు, రాంచీ నుండి నాలుగు మొత్తం 12 సి.ఆర్.పి.ఎఫ్. బెటాలియన్లు, వీటితో ఝార్ఖండ్ జాగ్వార్ బలగాలు కూడా పాల్గొన్నాయి. మొత్తంగా ఏడు వేల బలగాలు ఈ దాడిలో పాల్గొన్నాయని పత్రికలు రాసాయి. ఇంతేకాక రాష్ట్ర సరిహద్దులో నాలుగైదు వందల సంఖ్యలో బలగాలను మోహరించారు. జిపిఎస్ వంటి అత్యాధునిక పరికరాలనూ, రెండు హెలీకాప్టర్లనూ ఈ దాడిలో వినియోగించారు.

పొరుగు గ్రామానికి పోలీసులు వచ్చారనే సమాచారం జూన్ 12న ఉదయం దాదాపు పదిన్నర గంటలకు పిఎల్‌జిఎ బలగాలకు తెల్సింది. వెంటనే అందరినీ తమ తమ కవర్స్‌లోకి వెళ్లమనే ఆదేశాలు వెలువడ్డాయి. సమావేశ స్థలం నుండి కవర్స్‌లోకి వెళ్తుండగానే తూర్పు దిక్కు వున్న సెంట్రీ పోస్ట్ వైపుకు శత్రు బలగాలు చేరుకొని కాల్పులు ప్రారంభించాయి. వెంటనే పిఎల్‌జిఎ బలగాల వైపు నుండి ప్రతిఘటన మొదలయింది. మొదటి రౌండ్ కాల్పుల్లోనే ఇద్దరు ముగ్గురు కోబ్రా పోలీసులు హతమయ్యారు. రెండో మూడో రౌండ్‌లో 8–10 మంది గాయపడ్డారు. ఇందులో ఇద్దరు ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వీళ్లు తర్వాత చనిపోయారని భావిస్తున్నారు.

మొదట శత్రువు పశ్చిమ దిశ నుండి వస్తున్నట్టు సమాచారం వచ్చింది. కానీ శత్రువు అకస్మాత్తుగా తూర్పు దిక్కు నుండి దాడి చేశాడు. తూర్పు దిక్కున వున్న మూడు సెంట్రీ పోస్టులపై దాడి చేశారు. రెండు సెంట్రీ పోస్టుల నుండి శత్రువును త్వరగానే పిఎల్‌జిఎ బలగాలు తరిమివేశాయి. మరో పోస్ట్ ఆక్రమించుకోవాలని శత్రువు మూడు సార్లు చేసిన ప్రయత్నాన్ని గెరిల్లాలు విఫలం చేశారు. నాలుగోసారి మళ్లీ ప్రయత్నం చేసిన సమయంలో గెరిల్లాల తూటాలు అయిపోవడమూ, ఎస్‌ఎల్‌ఆర్‌లో సమస్య రావడం వల్ల శత్రువు ఆ సెంట్రీ పోస్టును ఆక్రమించుకోగల్గాడు. అయితే తర్వాత మరి కొందరు కామ్రేడ్స్ ఫ్లాంక్‌లో వెళ్లి పోలీసు బలగాలను తరిమివేసి సెంట్రీ పోస్ట్‌ను తమ స్వాధీనంలోకి తెచ్చుకున్నారు. ఒక వైపు క్యాంపులోకి పోలీసులను అడుగుపెట్టనీయకుండా ప్రతిఘటిస్తూనే మరో వైపు ఒక గెరిల్లా బృందం గ్రామంలోని ఒక వీధిలో వుండి దాడిని సమన్వయిస్తున్న ఎస్పీ దరిదాపుల్లోకి వెళ్లి దాడి చేసింది. కానీ రాత్రి కావడంతో ఒకసారి దాడి చేసి వెనుతిరిగింది. ఇలా రాత్రి పదకొండున్నర గంటల వరకూ ప్రతిఘటన కొనసాగింది. ఆఖరుగా పదకొండున్నరకు సెంట్రీపోస్ట్‌ను స్వాధీనం చేసుకునే శత్రు ప్రయత్నాన్ని కూడా గెరిల్లాలు తిప్పి కొట్టారు.

ఇక తర్వాత బాగా అలసిపోవడమూ, ఆహార సమస్య ఏర్పడ్డమూ, అదనపు బలగాలు పెరుగుతుండడమూ వల్ల గెరిల్లాలు అర్ధరాత్రి రిట్రీట్ అయ్యారు. అయితే ఆ తర్వాత కూడా పోలీసులు క్యాంపులోకి అడుగుపెట్టే ధైర్యం చేయలేకపోయారు. సెంట్రీ పోస్ట్ దగ్గరే బంకర్ నిర్మించుకొని వుండిపోయారు. ఉదయం క్యాంపులోకి చొరబడి కొన్ని ఆహార పదార్థాలు, మరి కొన్ని సామాన్లు దగ్ధం చేశారు. కాల్పుల మధ్యనే గెరిల్లాలు చాలా మేరకు సామానును తరలించుకు పోయారు. తెల్లవారి కూడా ఒక గెరిల్లా బృందం శత్రు చర్యలపై కన్నువేసే వుంచింది. అవకాశం దొరికితే దాడి చేయడానికి ప్రయత్నించింది. రెండో రోజు పోలీసులు మళ్లీ క్యాంపు ప్రదేశానికి వచ్చి గాలింపు చేయాలనుకున్నారు. ఈ విషయం తెల్సి మరో గెరిల్లా బృందం వెళ్లి శత్రువును వెంటాడుతూ, చికాకు పరిచే చర్యలు నిర్వహించింది. శత్రువు వెనుదిరిగే వరకూ రోజంతా వుండిపోయింది. ఇలా 13 గంటలు శత్రువుతో హోరాహోరీగా

*(మిగతాది 37వ పేజీలో...)*

# రైతుకూలి సంఘం ముసుగులో, విప్లవ ద్రోహిగా మారిన కేంద్రుక అర్జున్‌ను ఖతం చేసిన నారాయణపట్నా విప్లవ ప్రజానీకం

రైతుకూలి సంఘం ముసుగులో దోపిడీ వర్గాలతో అంటకాగుతూ, రాజ్యం అండతో నారాయణపట్నా ఆదివాసీ రైతాంగ భూపోరాటాన్ని దెబ్బతీసేందుకు ప్రయత్నించిన కేంద్రుక అర్జున్‌ను విప్లవ ప్రజలు అడ్డు తొలగించుకున్నారు. 2010 ఆగస్టు 9న సి.పి.ఐ.(మావోయిస్టు)కు చెందిన పి.ఎల్.జి.ఎ. అర్జున్‌ను ఖతం చేసింది.

కేంద్రుక అర్జున్ సి.పి.ఐ.(ఎం-ఎల్) కానూసన్యాల్ గ్రూపుకు చెందిన ఆదివాసీ రైతుకూలి సంఘం నాయకుడు. ఈ సంఘం ఆంధ్ర-ఒడిషా సరిహద్దు ప్రాంతంలోని బందుగాం, నారాయణపట్నా బ్లాక్‌లలోనూ, పార్వతీపురం మండలంలోనూ పని చేస్తున్నది. ఒడియా భాషలో ఈ సంఘాన్ని ఛసి ములియా ఆదివాసీ సంఘం అంటారు. ఈ సంఘానికి కేంద్రుక అర్జున్‌తో పాటు, ఈ ప్రాంతంలో పైడమ్మ మరో నాయకురాలు.

మితవాద అవకాశవాద రాజకీయాలు కల్గిన కానూసన్యాల్ గ్రూపు ఈ ప్రాంతంలో ఆదివాసేతర భూస్వాములతోటి, బీహార్ సారా బట్టి యజమానులతోటి మిలాఖతు అయింది. ఈ ప్రాంతంలో వేలాది ఎకరాల ఆదివాసీ ప్రజల భూములను, ఆంధ్ర నుంచి వచ్చిన బ్రాహ్మణులు, షావుకార్లు, సొండీలు మోసపూరితంగా కబ్జా చేసారు. వీరు భూములను స్వాధీనం చేసుకోవడంతో పాటు స్థానిక ఆదివాసీలపై అమానుషమైన దోపిడీ పీడనలను కొనసాగించేవారు. మరోవైపు ఆదివాసీలపై సారా యజమానుల దౌర్జన్యాలు విపరీతంగా వుండేవి. ఇటువంటి దయనీయమైన పరిస్థితుల్లో అర్జున్, పైడమ్మలు భూస్వాముల నుండి, సారా యజమానుల నుండి నిధులు సేకరించుకుంటూ, ఆదివాసీ రైతాంగాన్ని మోసం చేస్తూ వచ్చారు. తమ భూములు తమకు కావాలంటున్న ఆదివాసీ రైతాంగపు చైతన్యాన్ని నీరుగారుస్తూ కేవలం అటవీ, పోరంబోకు భూముల ఆక్రమణకు పోరాటాన్ని పరిమితం చేశారు.

అర్జున్, పైడమ్మలు ఒకవైపున ప్రజల్ని పోరాటాల్లోకి సమీకృతులు కాకుండా అడ్డుకుంటూ, మరోవైపు సంఘంలో పెత్తందార్లుగా వ్యవహరించేవారు. సంఘం నిధులను స్వాహా చేసేవారు. తమ మాటలకు ఎదురు చెప్పి ఎవరైనా భూస్వాములతో ఘర్షణపడితే పోలీసులతో అరెస్టు చేయించి, వారే విడుదల చేయించేవారు. అరెస్టు అయిన వారి విషయంలో వారు తప్పు చేశారు కనుక వాళ్లకు ఆ కష్టాలు వచ్చాయని ప్రచారం చేసేవారు.

అర్జున్, పైడమ్మలు ప్రధానంగా బందుగావ్ బ్లాకును కేంద్రంగా చేసుకొని పని చేసేవారు. బందుగాంను ఆనుకొని వున్న నారాయణపట్నా బ్లాకులో, ఆదివాసీ రైతుకూలి సంఘానికి (ఛసి ములియా ఆదివాసీ సంఘం) కామ్రేడ్ లింగా సారథ్యం వహిస్తూ వుండేవాడు. ఇక్కడ ప్రారంభం నుండి కామ్రేడ్ లింగా నాయకత్వంలో ఆదివాసీ ప్రజలు భూస్వాములకు, బీహార్ సారా బట్టి యజమానులకు వ్యతిరేకంగా చైతన్యవంతమవుతూ వచ్చారు. ఈ దోపిడిదారులకు వ్యతిరేకంగా అనేక చిన్న చిన్న పోరాటాలు చేపట్టారు. ఇక్కడ నాచిక లింగా నాయకత్వంలో ప్రజలను మిలిటెంట్ పోరాటాలు చేసే వైపుగా సంఘటితపరచడం జరిగింది. మరోవైపు ఈ ప్రాంతంలోని సంఘం, ప్రజలు, కోరాపుట్ మల్టీ రెయిడ్ నుండి నాల్కో దాడి వరకు పి.ఎల్.జి.ఎ. బలగాలకు పూర్తి సహాయ సహకారాలు అందించారు. అంతేకాకుండా సాయుధ పోరాట రాజకీయాలతో ప్రభావితులయ్యారు.

నారాయణపట్నాలో జరుగుతున్న ఈ కార్యకలాపాలను అర్జున్ ముఠా తీవ్రంగా వ్యతిరేకించింది. ముఖ్యంగా మావోయిస్టులకు సహకరించడాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అయితే కామ్రేడ్ లింగా మాత్రం, తోటి విప్లవకారులుగా సహకరించడంలో తప్పు లేదని వాదించాడు. ఈ క్రమంలోనే స్థానిక భూస్వాములు, సారా యజమానులు, స్థానిక పోలీసుల ద్వారా కామ్రేడ్ లింగాపై తప్పుడు కేసులు పెట్టించి అరెస్టు చేయించారు. ఈ కేసుల్లో మావోయిస్టులతో సంబంధాలున్నాయనేది కూడా ఒకటి.

కామ్రేడ్ లింగా జైలులో వుంటూనే, తన ప్రజలను భూమి పోరాటానికి సమాయత్తం చేస్తూ వచ్చాడు. అర్జున్, పైడమ్మలు మాత్రం లింగా తప్పు చేయడం వల్లనే అరెస్టు అయ్యాడని ప్రచారం చేస్తూ, విడుదలకు వేల రూపాయలు ప్రజల నుండి వసూలు చేసి తిన్నారు. చివరకు చాలా కష్టాలతో వున్న కామ్రేడ్ లింగా భార్య నుండి కూడా 5 వేల రూపాయలు తీసుకున్నారు.

కామ్రేడ్ లింగా జైలు నుండి బయటకు రాగానే, ప్రజలకు అత్యంత బాధాకరంగా తయారైన, సారా యజమానుల దోపిడీ దౌర్జన్యాలను అడ్డుకొనేందుకు పోరాటం చేపట్టాడు. ఈ పోరాటంలో ప్రధానంగా వేలాది మంది మహిళలు మిలిటెంట్‌గా కదిలి సారా బట్టీలను ధ్వంసం చేశారు. సారా యజమానుల నుండి నిధులు

దండుకొనే అర్జున్‌కు మాత్రం ఈ పోరాటం కంటగింపైంది. అందువలన కామ్రేడ్ లింగాకు, నారాయణపట్నా సంఘానికి వ్యతిరేకంగా ప్రచారానికి పూనుకున్నాడు. రోజు రోజుకూ నారాయణపట్నా సంఘంపై అర్జున్ సంఘం వత్తిడి, ఆధిపత్యం పెరుగుతూ వచ్చింది.

ఈ క్రమంలోనే 2009 ఏప్రిల్‌లో పార్లమెంటరీ, అసెంబ్లీ ఎన్నికలలో పాల్గొనాలనీ, అర్జున్‌ను పార్టీ తరపున ఎం.ఎల్.ఎ.గా పోటీ చేయించాలనీ కానూసన్యాల్ గ్రూపు నిర్ణయించింది. భూముల స్వాధీనానికి సమాయత్తమవుతున్న నారాయణపట్నా రైతాంగానికి ఈ నిర్ణయం ఆశనిపాతంగా మారింది. వారు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. కామ్రేడ్ లింగా రైతుకూలి సంఘం కార్యవర్గ సమావేశంలో ఎన్నికల్ని బహిష్కరించాలని, బందుగావ్, నారాయణపట్నా బ్లాకులలో ఒకేసారి భూ ఆక్రమణ చేపట్టాలనీ ప్రతిపాదించాడు. అర్జున్ ముఠా ఈ ప్రతిపాదనను తీవ్రంగా వ్యతిరేకించింది. ప్రస్తుత పరిస్థితులలో భూస్వాముల భూములు ఆక్రమించరాదనీ, అటవీ, పోరంబోకు భూముల ఆక్రమణకు మాత్రమే పరిమితం కావాలని తేల్చి చెప్పింది. ఈ అభిప్రాయాన్ని కామ్రేడ్ లింగాతో పాటు పార్టీ నాయకులైన కామ్రేడ్స్ గణనాథ్ పాత్రో, తపన్ మిశ్రా, మరికొందరు వ్యతిరేకించారు. దీంతో మితవాద అవకాశవాద ముఠాకు చెందిన అర్జున్, భాషా, ఝూన్సీ, వర్మ, శ్రీకాంత్ పాండా తదితరులు కామ్రేడ్స్ లింగా, గణనాథ్ పాత్రో, తపన్ మిశ్రాలను పార్టీ నుండి, సంఘం నుండి బహిష్కరించారు.

అవకాశవాదులు తీసుకున్న నిర్ణయం, నారాయణపట్నా రైతాంగ పోరాటానికి మేలు చేకూర్చింది. అప్పటిదాకా భూపోరాటం చేపట్టడానికి అనేక అడ్డంకులు కల్గించిన అర్జున్ ముఠా నుండి వారు పూర్తిగా స్వేచ్ఛ పొందారు. ఫిబ్రవరి నుండి సారా వ్యతిరేక పోరాటంతో పాటు, భూఆక్రమణ పోరాటానికి సన్నాహాలు ప్రారంభించారు. మరోవైపు ఎన్నికలను పూర్తిగా బహిష్కరించారు. ఈ ఎన్నికలలో అర్జున్ ఘోర పరాజయం పొందాడు. దీంతో అతడు కామ్రేడ్ లింగా పైనా, నారాయణపట్నా సంఘం పైనా తీవ్రంగా వ్యతిరేకతను పెంచుకొన్నాడు.

రైతాంగం ఎప్పుడైతే భూపోరాటానికి సన్నాహాలు ప్రారంభించిందో, స్థానిక షావుకార్లు, భూస్వాములు, సారా యజమానులు, రాజకీయ నాయకుల తోటి, పోలీసుల తోటి కుమ్మక్కై శాంతి సంఘాన్ని ఏర్పరిచారు. ఇదే అవకాశంగా అర్జున్ ముఠా శాంతి సంఘంతో చేతులు కలిపింది. మే 5న ఏర్పడిన శాంతి సంఘం పెద్దయెత్తున సాయుధంగా గ్రామాలపై దాడిని ప్రారంభించింది. ఈ దాడిలో అర్జున్ ముఠాకు చెందినవారు కూడా చురుగ్గా పాల్గొన్నారు. వీరు డుంశిడి, పొడిపొద్రా, డెక్కపార గ్రామాలపై పెద్దయెత్తున దాడి చేసి, ప్రజల ఇళ్లను తగులబెట్టారు. కేప్ తుపాకులతో ప్రజలపై కాల్పులు జరిపారు. ప్రజలకు చెందిన కోళ్లు, గొర్రెలు, ధాన్యం, కొద్దిపాటి డబ్బు, బంగారం దోచుకున్నారు. ఈ అరాచకపు దాడిని, అమరుడు కామ్రేడ్ సింగన్న నాయకత్వంలో ఘెనువా బాహిని మిలీషియా, ప్రజలు వీరోచితంగా ఎదుర్కొన్నారు. ఈ ప్రతిఘటనలో గొత్తిగూడకు చెందిన శాంతి సంఘం సభ్యుడు నిత్యానంద్ మల్లిక్ (నీతియ్య) చనిపోవడంతో, ఆ రౌడీ మూకలు వెనక్కు తిరిగాయి.

ఈ విజయోత్సాహంతో వేలాది మంది రైతాంగం కుంబారి గ్రామంలో జమై, జూన్ 12ను భూ ఆక్రమణ దినంగా నిర్ణయించారు. అనుకున్నట్లుగానే జూన్ 12న బ్లాక్‌లోని 2 వేల 500 ఎకరాల భూమిని ఆక్రమించారు. ఈ భూమిని కువ్వి ఆదివాసీలకే కాకుండా, కొన్ని గ్రామాలలో పేద డుంబా ప్రజలకు నారాయణపట్నాలో పేద కళాసీలకు పంచారు. ఉప్పెనలాగా కదిలిన రైతాంగాన్ని చూసి, షావుకార్లు, భూస్వాములు, సారా యజమానులు గ్రామాలను వదిలి, పట్టణాలు పట్టారు.

ఎప్పుడైతే నారాయణపట్నా భూపోరాటం విజయవంతం అయ్యిందో, బందుగావ్ రైతాంగం నారాయణపట్నా బాట పట్టారు. దీనితో అర్జున్‌కు కాళ్ల కింద భూమి కదిలినట్లయింది. ఫలితంగా కామ్రేడ్ లింగా పైన, నారాయణపట్నా సంఘంపైన తీవ్రంగా ద్వేషం పెంచుకున్నాడు.

జూలై నెలలో బందుగాం బ్లాక్‌కు చెందిన కౌరుబడి, ఆలమండ, వల్లాడ పంచాయితీలలోని 5 వేల మంది కామ్రేడ్ లింగా నాయకత్వంలో భూ ఆక్రమణకు సిద్ధమయ్యారు. ఈ పోరాటం విజయవంతమైతే, తనకు పుట్టగతులుండవని భావించిన అర్జున్ అప్పటికప్పుడు తన నాయకత్వంలో కొద్దిమంది ప్రజలను కదిలించి, కామ్రేడ్ లింగా వాళ్లు ఆక్రమించుకున్న భూముల్లో జెండాలు పాతించాడు. ఆ భూముల్లో షావుకార్లు, భూస్వాములు సెంటుగడ్డి (దీని నూనెను సెంటు తయారిలో వాడుతారు) పండిస్తున్నారు. ఈ భూముల కోసం ఎప్పటినుండో ప్రజలు డిమాండ్ చేస్తున్నప్పటికీ పట్టించుకోని అర్జున్‌కు ఈసారి జెండాలు పాతటం తప్పనిసరైంది. ఈ పోరాటంలో కూడా రాజీ వైఖరినే అనుసరించాడు. షావుకార్లు ఈ సంవత్సరం సెంటు గడ్డీ వేసుకొన్నారు కనుక వాళ్లకు నష్టం కలుగకుండా, పంట కోసుకొన్న తరువాత భూమి స్వాధీనం చేసేటట్లు షావుకార్లతో ఒప్పందం చేసుకొన్నాడు. ఈసారి కూడా అర్జున్ అక్కడి రైతాంగాన్ని మోసం చేశాడు.

ఈ సంఘటన జరిగిన తరువాత తన సొంత గ్రామం కేశబద్రలోనే కామ్రేడ్ లింగాకు అనుకూలత పెరుగుతుండటంతో అనేక ఇళ్లపై దాడి చేసి, వాటిని తగులబెట్టి, మొత్తం కుటుంబాలను గ్రామం నుండి తరిమేశారు. అంతటితో ఆగకుండా ఘెనువా బాహిని మిలీషియాకు నాయకత్వం వహిస్తున్న కామ్రేడ్ సింగన్న (ఛసి ములియా ఆదివాసీ సంఘంలో నాయకుడు)ను చంపాలని పథకం పన్నాడు. బందుగావ్ బ్లాక్‌లోని కాట్రగడ్డ, బాస్‌పుట్ గ్రామాల వద్దకు కామ్రేడ్ సింగన్నను రెచ్చగొడ్తూ పిలిపించి, వేయి మందితో దాడి చేయించాడు. వీరిలో చాలా మందిని మీటింగ్ పేరుతో జమ చేశాడు. వీరంతా కామ్రేడ్ సింగన్న నాయకత్వంలోని ఘెనువా బాహిని ధాటికి తట్టుకోలేక పారిపోయారు. ఈ దాడిలో అర్జున్ ముఠాలో రెల్లి కులానికి చెందిన సురేష్ చనిపోయాడు.

అర్జున్‌కు తాను చేస్తున్న కుట్రలన్నీ ఫలించకపోవటంతో ఎ.పి. పోలీసుల పంచన చేరాడు. ఇదే సమయానికి కామ్రేడ్ లింగా, కామ్రేడ్ సింగన్న మిగిలిన కామ్రేడ్స్ మావోయిస్టు పార్టీ నేతృత్వంలో పని చేసేందుకు సిద్ధపడ్డారు. మావోయిస్టులంటేనే గిట్టని అర్జున్‌కు ఈ కలయిక పుండు మీద కారం పోసినట్లయింది. ఈ ఐక్యతను సాకుగా చూపి లింగా నాయకత్వంలోని సంఘాన్ని బందుగావ్ బ్లాకులోకి రానీయకుండా చేసేందుకు, ఎ.పి. పోలీసుల మద్దతును కోరాడు. దీంతో ఎ.పి. పోలీసులు సంఘ నాయకులైన కామ్రేడ్స్ లింగా, సింగన్న రాంఫాడిల పోస్టర్లు వేసి, వీరు సంఘ విద్రోహులనీ, ఈ ప్రాంతానికి వస్తే అరెస్టు చేస్తామనీ, ఎన్‌కౌంటర్ చేస్తామని ప్రకటించారు. మరోవైపు బందుగావ్ బ్లాక్‌లోని అనేక గ్రామాలలో కామ్రేడ్స్ లింగా, సింగన్నలపైన, సంఘాలపైన అర్జున్ గోబెల్స్ ప్రచారానికి పూనుకొన్నాడు. కామ్రేడ్ లింగా సంఘం వాళ్లు వస్తే ఊళ్లన్నింటినీ ధ్వంసం చేస్తారనీ, లింగా ఒక్కసారే ఒక గొడ్డును తింటాడనీ, ప్రజల్లో భయాన్ని కల్పించాడు. ఈ దుష్ప్రచారం కారణంగా కొన్ని గ్రామాలలో రైతులు తమ ధాన్యమంతా బయట దాచుకొని ఏ రోజు బత్తెం ఆ రోజు తెచ్చుకొనేవారు. లింగా నాయకత్వంలో సంఘం చేపట్టిన భూమి స్వాధీన పోరాటానికి ఆకర్షితులైన ప్రజలు బందుగావ్, లక్కింపూర్ తదితర చుట్టుపక్కల బ్లాకుల నుండి వచ్చే ప్రజల్ని దారిలోనే అడ్డగించి, వాళ్లను కలవవద్దని తిప్పి పంపేవాడు అర్జున్.

ఈ విషయాలన్నీ ఎప్పటికప్పుడు మావోయిస్ట్ పార్టీ పోస్టర్లు, పత్రికా ప్రకటనల ద్వారా బహిర్గతం చేస్తూ వచ్చింది. అర్జున్, పైడమ్మలు చేస్తున్న అరాచకాలను, ఆగడాలను భరిస్తూనే, ఘర్షణను తగ్గించేందుకు మావోయిస్ట్ పార్టీ చర్చలకు ఆహ్వానించింది. అంతకు ముందు కూడా అర్జున్‌ను కలిసేందుకు పార్టీ ప్రయత్నించింది. ఈ ప్రయత్నాలేవీ సఫలం కాలేదు. పిలిచిన ప్రతి సందర్భంలోనూ తప్పుకొంటూ వచ్చాడు.

గతంలో వాళ్ల సంఘానికి చెందిన కిర్మమ్మను, లోక్‌నాథంతో పాటు అతని ముఠాకు చెందిన 17 మంది సభ్యులు సామూహిక లైంగిక అత్యాచారం చేసారు. లోకనాథం ఆ ప్రాంతంలో ప్రజా వ్యతిరేకిగా అరాచకాలు చేస్తుంటాడు. ఇతడికి ఎ.పి., ఒడిషా పోలీసుల మద్దతు వుంది. మావోయిస్టు పార్టీకి వ్యతిరేకంగా కార్యకలాపాలు నిర్వహిస్తుంటాడు. కిర్మమ్మపై అత్యాచారం చేసిన తర్వాత అర్జున్ వాళ్లు కేసు పెట్టారు. ఒడిషా పోలీసుల నుండి స్పందన లేదు. ఎ.పి. పోలీసులు మాత్రం ఒకసారి విచారణకు వచ్చారు. చివరికి లోకనాథంపై ఎటువంటి చర్య తీసుకోలేదు. దీంతో అతడి ఆగడాలు పెచ్చుమీరటంతో, పి.ఎల్.జి.ఎ. కామ్రేడ్స్ స్థానిక ప్రజల మద్దతుతో అతడిని ఖతం చేసారు. ఈ దాడితో ప్రజలు మావోయిస్టులకు మరింత దగ్గరవుతారనే భయంతో, అర్జున్ అప్పటికప్పుడు ఎ.పి. పోలీసులను పిలిపించి, మిగిలిన ముఠాను అరెస్టు చేయించాడు. మరోవైపు లోకనాథంను చంపినందుకు మీపై కేసులుంటాయని, మావోయిస్టు సానుభూతిపరులను బెదిరిస్తూ, తన పట్టును నిలబెట్టుకొనేందుకు ప్రయత్నించాడు. అర్జున్ వాళ్లు ప్రతి గ్రామంలోనూ, తమను పోలిన దళారీలను సంఘ నాయకులుగా నియమించి, తమ పట్టును నిలబెట్టుకొనేందుకు ప్రయత్నించేవారు.

కామ్రేడ్ రాంఫాడిని చంపడానికి ఎ.పి. పోలీసులతో కలిసి ప్లాన్ చేసి, బందుగావ్ సంఘంలో పని చేస్తున్న ప్రకాష్ అనే దళితుడిని పంపారు. రాంఫాడి సొంత గ్రామమైన హంగుణి గ్రామ పరిసరాలకు ఆ ద్రోహి వస్తుండగా, బక్కలు (ఎద్దులు) కాసే పిల్లలకు అనుమానం వచ్చి కళ్లలో మట్టికొట్టి అతడిని పట్టుకొన్నారు. ఆ తర్వాత గ్రామస్తులు అతడి జేబు చెక్ చేయగా, జేబులోని లెటర్‌లో మా సంఘ సభ్యుడే రాంఫాడి మేమే పొరపాటున చంపాం అని ఛసి ములియా ఆదివాసీ సంఘం పేరుతో ప్రకటన రాసి వుంది. దానితో ఆ దుర్మార్గుల కుట్ర విఫలమయింది.

ఈ మధ్య కాలంలో అర్జున్ ఎ.పి., ఒడిషా పోలీసులతో మరింతగా మిలాఖతయి, ఛసి ములియా ఆదివాసీ సంఘంలో పని చేస్తున్న వారిని వివిధ రూపాలలో సంప్రదిస్తూ, సరెండర్ అయితే కేసులు లేకుండా చేస్తానని మాట్లాడేవాడు. అర్జున్, పైడమ్మల ముఠా రోజు రోజుకూ ప్రజల్లో పట్టుకోల్పోతూ, తాము కప్పుకున్న విప్లవ ముసుగును చించేసుకొని మరింతగా బరితెగించి ప్రజా వ్యతిరేకులుగా బహిర్గతం కావటంతో విప్లవ ప్రజానీకం, పి.ఎల్.జి.ఎ. సహాయంతో అర్జున్‌ను తొలగించుకొని తమ మార్గాన్ని సుగమం చేసుకున్నారు. భూపోరాటాల విస్తరణకు ఈ చర్య దోహదపడ్తుంది. ★

# గ్రంథ పూజను

**మే, 1930**

1. పరిశోధన చేయకపోతే, మాట్లాడే హక్కు వుండదు

మీరు ఒక సమస్యను పరిశోధిస్తే తప్ప, మీరు ఆ సమస్యపై మాట్లాడే హక్కును కోల్పోతారు. ఇది చాలా కఠినంగా కనబడుతోందా? ఏమాత్రం కాదు. మీరు ఒక సమస్య లోతుల్లోకి, దాని ప్రస్తుత వాస్తవాలు, దాని గత చరిత్రల్లోకి వెళ్ళి వాటిని శోధించకపోతే, దానికి సంబంధించిన ప్రధానాంశాల గురించి మీకు ఏమీ తెలియకపోతే, మీరు దానిపైన మాట్లాడేదంతా, నిస్సందేహంగానే, అర్థంపర్థంలేని వాగుడే అవుతుంది. అర్థంపర్థం లేకుండా మాట్లాడడం వల్ల ఏ సమస్యా పరిష్కృతమవదు. ఇది అందరికీ తెలిసిన విషయమే. అందువల్ల మీకు మాట్లాడే హక్కు లేకుండా చేస్తే, అది అన్యాయం ఎలా అవగలదు? కామ్రేడ్లు చాలామందే, ఎప్పుడూ కళ్లను మూసే ఉంచుకుంటారు. అర్థంపర్థం లేకుండా మాట్లాడతారు. ఇలా చేయడం ఒక కమ్యూనిస్టుకు చాలా సిగ్గుచేటైన విషయం. కళ్లు మూసుకోవడం, అర్థంపర్థం లేకుండా మాట్లాడడం – ఒక కమ్యూనిస్టుకు ఇది తగినదేనా?

అది కుదరదు!
అది కుదరదు!
మీరు తప్పనిసరిగా పరిశోధించాలి!
మీరు అర్థంపర్థంలేని వాగుడును కట్టిపెట్టాలి!

2. ఒక సమస్యను పరిశోధించడం అంటే, దాన్ని పరిష్కరించడం అన్నమాటే

మీరొక సమస్యను పరిష్కరించలేకపోతున్నారా? మంచిది, ప్రస్తుత వాస్తవాలను, దాని పాత చరిత్రను పరిశోధించడానికి సమాయత్తం కండి! మీరు ఆ సమస్యను కూలంకషంగా పరిశోధించినపుడు, దాన్ని ఎలా పరిష్కరించాలో మీకు తెలియవస్తుంది. నిర్ధారణలు విధిగా, పరిశోధన తర్వాతనే వస్తాయే తప్ప, పరిశోధనకు ముందుగా కాదు. కేవలం మూఢుడు మాత్రమే ఏ పరిశోధనా చేయకుండానే "ఒక పరిష్కారాన్ని కనుగొనడాని"కో లేదా "ఒక అభిప్రాయానికి రావడాని"కో తన బుర్ర బద్దలు కొట్టుకుంటాడు లేదా కొంతమందితో చేరి బుర్ర బద్దలు కొట్టుకుంటాడు. ఈ పద్ధతి, ఎటువంటి పరిష్కారానికిగానీ, ఏ మంచి అభిప్రాయానికిగానీ దారితీయగల అవకాశం అసలు లేనేలేదు అని గట్టిగా నొక్కి చెప్పాలి. వేరే మాటల్లో చెప్పాలంటే, అతడు తప్పనిసరిగా ఒక తప్పుడు పరిష్కారానికిగానీ, తప్పుడు అభిప్రాయానికి గానీ చేరుకుంటాడు.

తనిఖీ (ఇన్‌స్పెక్షన్) నిర్వహిస్తున్నప్పుడు, చాలా మంది కామ్రేడ్లేగాక, గెరిల్లా నాయకులూ, కొత్తగా బాధ్యతలను చేపట్టిన కేడర్లల్లో కూడా చాలామందే, ఒక చోటుకు చేరుకున్న మరుక్షణం నుండే గంభీర రాజకీయ ప్రకటనలను చేయాలని ఉవ్విళ్లూరుతుంటారు. వారు విషయాలను కేవలం పైపైన మాత్రమే చూసి ఉన్నప్పటికీ, లేదా వారు అల్ప వివరాల గురించి మాత్రమే తెలుసుకొని ఉన్నప్పటికీ, వారు దీన్ని విమర్శిస్తూ, దాన్ని తూర్పారబడుతూ హడావుడిగా చిందులేస్తుంటారు. ఇటువంటి స్వీయాత్మకమైన అర్థంపర్థంలేని చెత్తవాగుడు నిజంగానే అసహ్యించుకోదగ్గది. వీరు విధిగా విషయాలను గందరగోళ పరుస్తారు. ప్రజల విశ్వాసాన్ని కోల్పోతారు. అసలు ఏ సమస్యనూ పరిష్కరించలేని అసమర్థులుగా తేలుతారు.

నాయకత్వ స్థానాల్లో ఉన్నవారిలో చాలామందే కఠిన సమస్యలు ఎదురైనపుడు వాటిని పరిష్కరించలేక ఉత్తినే నిట్టూర్పులు విడుస్తూ వుంటారు. తమ సహనాన్ని కోల్పోతారు. "తమకు సమర్థత లేదనీ, ఆ పనిని తాము చేయలేమనీ" అందుచేత తమల్ని వేరే చోటుకు బదిలీ చేయమనీ కోరుతారు. ఇవి పిరికిపందలు పలికే పలుకులు. మీ రెండు కాళ్లమీదా నడవండి. మీ బాధ్యత కిందవున్న అన్ని సెక్షన్లనూ చుట్టిరండి. కన్‌ఫ్యూసియస్‌లానే "ప్రతి ఒక్క విషయాన్ని గురించి అడిగి తెలుసుకోండి"[1]. అంతే, ఇక ఆపైన మీ సామర్థ్యం ఎంత కొద్దిపాటిదైనప్పటికీ, మీరు సమస్యలను పరిష్కరించగల్గుతారు. మీరు బైటకు అడుగువేసినపుడు మీ బుర్రంతా ఖాళీగానే వున్నప్పటికీ, మీరు తిరిగి వచ్చేటప్పటికీ అది ఇంకెంతమాత్రం ఖాళీగా వుండదు. సమస్యల పరిష్కారానికి అవసరమైన అన్ని రకాల సమాచారాలు అందులో చేరే వుంటాయి. సమస్యలు పరిష్కృతమయే తీరు ఇదే.

**మూలం:** ఎర్ర సైన్యంలో నెలకొని వున్న పిడివాదాన్ని వ్యతిరేకించడానికి, 1930 వసంత కాలంలో ఈ వ్యాసాన్ని కామ్రేడ్ మావో రాశారు. ఆ రోజుల్లో తాము పిడివాదం అనే పదాన్ని (చియావో-టియావో-చు-ఐ) వాడేవాళ్లంకాదనీ, గ్రంథపూజ (పెన్-పెన్-చు-ఐ) అనే పదాన్ని వాడే వాళ్లమనీ కామ్రేడ్ మావో 1961 మార్చి నెలలో ఈ వ్యాసాన్ని పునర్ ముద్రించినపుడు, దానికి ముందుమాటలో రాశారు.

# వ్యతిరేకించండి

- కామ్రేడ్ మావో

మీరు బైటకు వెళ్లాలా? అవసరం లేదు. మీరు గడ్డు సమస్యగా భావిస్తున్న దాని మూలంలోకి వెళ్లడానికిగానూ పరిస్థితి గురించి బాగా తెలిసివున్నవారితో వాస్తవాలను కనుగొనే సమావేశాన్ని నిర్వహించండి, ఆ సమస్య ప్రస్తుతంలో ఎలా వుందో అడిగి తెల్సుకోండి, ఇక అపుడు మీ గడ్డు సమస్యలను తేలికగానే పరిష్కరించుకోవచ్చు.

పరిశోధనను, నవమాసాలు గరళాన్ని మోయడంతో పోల్చవచ్చు. సమస్యను పరిష్కరించడాన్ని ప్రసవంతో పోల్చవచ్చు. ఒక సమస్యను పరిశోధించడం అంటే, నిజానికి దాన్ని పరిష్కరించడమే.

3. గ్రంథపూజను వ్యతిరేకించండి

పుస్తకంలో రాసి వుండేదంతా సరైనదే. సాంస్కృతికంగా వెనకబడివున్న చైనా రైతాంగపు మనస్తత్వం ఇప్పటికీ ఇలానే వుంది. తమాషా ఏమిటంటే, కమ్యూనిస్టు పార్టీలో కూడా, ఒక చర్చ సాగుతున్నపుడు "అలా అని పుస్తకంలో ఎక్కడ రాసుందో నాకు చూపించు" అని సదా అంటుండేవారు వున్నారు. ఒక ఉన్నతస్థాయి నాయకత్వ శాఖ జారీ చేసిన ఆదేశం సరైనది అని మనం చెప్పుకుంటున్నప్పుడు, అది కేవలం "ఉన్నత స్థాయి నాయకత్వం నుండి వచ్చిన ఆదేశమైనందువల్ల" కాక, దాని సారాంశం పోరాటపు భౌతిక, వస్తుగత (సబ్జెక్టివ్) పరిస్థితులు రెంటికి అనుగుణ్యంగా వుండినందువల్లనే అది సరైనది అవుతుంది. పైస్థాయి శాఖ నుండి వచ్చిన ఆదేశాలన్న కారణంతో, లాంఛనప్రాయ వైఖరిని చేపట్టి, ఆ ఆదేశాల గురించి వాస్తవ పరిస్థితుల వెలుగులో చర్చించి వాటిని పరీక్షించకుండా గుడ్డిగా అమలుచేయడం అన్నది పూర్తిగా తప్పుడుదైన పద్ధతి. పార్టీ పంథా, ఎత్తుగడలు ఎందుచేత ప్రజలలోకి బాగా లోతుగా వేళ్లూనుకోలేకపోయాయి అనే సమస్యకు మూలం ఈ లాంఛనప్రాయ వైఖరి కల్పించే చిక్కుల్లోనే వుంది. పైస్థాయి శాఖ ఆదేశాన్ని గుడ్డిగానూ, ఏ బేధాభిప్రాయం లేనట్టు కనబడే విధంగానూ అమలుచేయడం అంటే, అది దాన్ని వాస్తవంగా అమలుచేయడం అవబోదు, అది ఆ ఆదేశాన్ని చాలా చాకచక్యంతో కూడిన పద్ధతుల్లో వ్యతిరేకించడమే అవుతుంది లేదా దానికి తూట్లు పొడవడమే అవుతుంది.

కేవలం పుస్తకాల పైన ఆధారపడే సామాజిక శాస్త్రాలను అధ్యయనం చేసే పద్ధతి కూడా, అదే విధంగా అత్యంత ప్రమాదకరమైనది. ఆ పద్ధతి, అలా అధ్యయనం చేసినవారిని ప్రతీఘాతక విప్లవ మార్గంలోకి తీసుకెళ్లే అవకాశం కూడా వుంది. సామాజిక శాస్త్రాల అధ్యయనానికి కేవలం పుస్తకాల మీదనే ఆధారపడ్డ చైనా కమ్యూనిస్టులు అనేకులు విప్లవ ప్రతీఘాతకులుగా తయారయ్యారు అనే వాస్తవం ఇందుకో స్పష్టమైన నిదర్శనం. మార్క్సిజం సరైనది అని మనం చెప్పుకుంటున్నప్పుడు, మార్క్స్ ఒక "ప్రవక్త" కాబట్టి మార్క్సిజం సరైనది అన్నది దాని అర్థం కాదు. ఆయన సిద్ధాంతం మన ఆచరణలోనూ, మన పోరాటంలోనూ సరైనదిగా రుజువైంది కాబట్టే మనం అలా చెప్పుకుంటున్నాం. మన పోరాటంలో మనకు మార్క్సిజం అవసరం. ఆయన సిద్ధాంతాన్ని స్వీకరిస్తునపుడు మన మనస్సుల్లోకి "భవిష్యవాణి" అనే లాంఛన లేదా మార్మిక భావన ఎన్నడూ ప్రవేశించదు. మార్క్స్ పుస్తకాలను చదివినవారిలో అనేకులు విప్లవం నుండి రెనెగేడులుగా తయారుకాగా, కార్మికులు, మార్క్సిజాన్ని తరచుగానే చాలా బాగానే అర్థం చేసుకుంటారు. అయితే, మనం మార్క్సిస్టు గ్రంథాలను అధ్యయనం చేయాలి అన్నది నిజమే. కానీ మనం ఈ అధ్యయనాన్ని మన దేశ వాస్తవ పరిస్థితులతో జోడించి సాగించాలి. మనకు పుస్తకాలు అవసరమే, అయితే, వాస్తవ పరిస్థితి నుండి వేరుపడి వుండే గ్రంథపూజను మనం తప్పనిసరిగా అధిగమించాలి.

4. వాస్తవ పరిస్థితిని గురించిన పరిశోధన లేకపోతే, అపుడు వర్గ బలగాల గురించి భావవాద అంచనా, పనిలో భావవాద మార్గదర్శకత్వమూ విధిగా చోటుచేసుకుంటాయి, అవి అవకాశవాదానికి గానీ, దుందుడుకు తత్వానికి (పుట్చిజం)గానీ దారితీస్తాయి.

ఈ నిర్ధారణ పైన మీకు సందేహం వుందా? వాస్తవాలు మీ మెడలు వంచి మరీ దాన్ని ఒప్పిస్తాయి. ఏ పరిశోధనా చేయకుండా, పరిస్థితిని గురించి అంచనా వేసే ప్రయత్నం కొంచెం చేసి చూడండి, లేదా కొంచెం పోరాటాన్ని గైడుచేసి చూడండి, ఇకపైన అటువంటి అంచనాగానీ లేదా అటువంటి గైడెన్సు గానీ నిరాధారమైనదీ, భావవాద పూరితమైనదీ అవుతుందో అవదో మీరే గమనించండి, అవి అవకాశవాద తప్పులకో, లేదా దుందుడుకుతత్వ తప్పులకో దారితీస్తాయో లేదో గమనించి చూడండి. అది ఖచ్చితంగా అక్కడికే

దారి తీస్తుంది. అది చర్యను చేపట్టే ముందు జాగ్రత్తగా పథకాలు వేసుకోకపోవడం మూలంగా వచ్చింది కాదు. ఇది మన ఎర్రసైన్య గెరిల్లా యూనిట్లలో తరచుగా జరుగుతున్నట్టుగానే, పథకాలను వేసుకొనబోయేముందు, నిర్దిష్ట సామాజిక పరిస్థితిని అధ్యయనం చేయడంలో వైఫల్యం చెందిన కారణంగానే వచ్చింది. లికుయె[2] లాంటి అధికారులు, తప్పులకుగానూ శిక్షలు విధిస్తున్నపుడు విచక్షణ చూపరు. ఫలితంగా దోషులు తమకన్యాయం జరిగిందని భావిస్తారు, పలు తగాదాలు ఉత్పన్నమవుతాయి, నాయకులు ఉన్న ప్రతిష్టనంతా పోగొట్టుకుంటారు. ఎర్రసైన్యంలో తరచుగానే ఇలా జరగడంలేదా?

మనం ప్రజారాశులను మనవైపుకు తిప్పుకొని శత్రువును ఓడించగల్గాలంటే, మనం అంతకు ముందుగానే భావవాదాన్ని రూపుమాపాలి. అన్ని అవకాశవాద, దుందుడుకుతత్వ తప్పులపట్ల అప్రమత్తంగా ఉండాలి. భావవాదాన్ని రూపుమాపడానికి ప్రయత్నం చేయడం, వాస్తవ పరిస్థితిని అధ్యయనం చేయడం అన్నదే ఏకైక మార్గం.

5. సామాజిక, ఆర్థిక పరిశోధన లక్ష్యం ఏమిటంటే, వర్గ బలగాల గురించి సరైన అంచనాకు రావడం, ఆ తదుపరి పోరాటానికి సరైన ఎత్తుగడలను రూపొందించుకోవడమూనూ.

మనం సామాజిక, ఆర్థిక పరిస్థితులను ఎందుకు పరిశోధించాలి? ఈ ప్రశ్నకు మన సమాధానం ఇదే. ఇక పైదానికి అనుగుణంగానే మన పరిశోధన సమాజంలోని అన్ని వర్గాలను తన ధ్యేయంగా పెట్టుకుంటుంది. అంతేకాని, సమాజంలోని అరాకొరా పరిణామాలను కాదు (ఫ్రాగ్మెంటెరీ ఫినామినా). ఈమధ్య, ఎర్రసైన్యంలోని ఫోర్త్ ఆర్మీ కామ్రేడ్లు పరిశోధనా కృషి[3] మీద సాధారణంగా శ్రద్ధ చూపారు. కానీ, వారిలో అనేకులు చేపట్టిన పద్ధతి తప్పుడు పద్ధతి. అందుచేత వారి పరిశోధనల ఫలితాలు, చిల్లర కొట్టు నడిపేవాడి లెక్కలు ఎంత అల్పమైనవో, అంత అల్పమైనవి, లేదా వాటిని పల్లెటూరి బడుద్దాయి పట్నానికి వచ్చినపుడు వినే వింత వింత కథలతో పోల్చవచ్చు లేదా ఒక పర్వత శిఖరంపై నుండి, ఒక అధిక జనాభాగల నగరాన్ని చూసే దూరపు చూపులాంటివి. ఇటువంటి పరిశోధన ఎందుకూ వుపకరించదు, మన ధ్యేయాన్ని సాధించలేదు. సమాజంలోని వివిధ వర్గాల రాజకీయ, ఆర్థిక పరిస్థితులను గురించి తెలుసుకోవడం – ఇదే మన ప్రధాన ధ్యేయం. ప్రతి ఒక్క వర్గపు తాజా పరిస్థితి గురించిన, దాని అభివృద్ధిలోని ఒడిదుడుకుల గురించిన చిత్రం – ఇదే మన పరిశోధన తాలూకు ఫలితంగా వుండాలి. ఉదాహరణకు మనం రైతాంగంలో ఎవరెవరు ఉంటారు అనే విషయాన్ని పరిశోధిస్తునపుడు, భూమితో ఆ రైతుకుండే సంబంధాన్ని బట్టి వేరుచేసి చూసి, స్వంత కమతాలు గల రైతులెంతమంది, పాక్షికంగా స్వంత కమతాలుగల రైతులు ఎంతమంది, కౌలుకు చేస్తున్న రైతులెంతమంది ఉంటారు అన్నది తెలుసుకోవాల్సి వుంటుంది. అంతేగాక, అంతకంటే ముఖ్యంగా వర్గం లేదా సామాజిక విభాగం (స్ట్రాటమ్)లను బట్టి వేరుచేసి చూస్తూ, ధనికరైతులు, మధ్యతరగతి రైతులు, పేదరైతులు, ఎంతెంతమంది ఉంటారు అన్నది మనం తప్పక తెలుసుకోవాల్సి వుంటుంది. వర్తకులలో, ఎవరెవరు వుంటారని మనం పరిశోధిస్తున్నప్పుడు ధాన్యం, బట్టలు, మూలికలు, వగైరా వ్యాపారాలలో ఎందరెందరున్నారు అన్నదేగాక, మరీ ప్రత్యేకించి చిన్న వ్యాపారులు, మధ్యస్త స్థాయి వ్యాపారులు, బడా వ్యాపారులు ఎందరెందరున్నారని మనం తప్పక తెలుసుకోవాలి. ప్రతీ వృత్తిలోని ప్రస్తుత పరిస్థితిని గురించేకాక, మరీ ప్రత్యేకించి దాని లోపల ఉన్న వర్గ సంబంధాల గురించి మనం పరిశోధించాలి. వివిధ వృత్తుల మధ్య సంబంధాలను గురించి మాత్రమేకాక, విభిన్న వర్గాల మధ్య సంబంధాల గురించి మనం ప్రత్యేకించి మరీ పరిశోధించాలి. సమాజంలోని వేరు వేరు వర్గాల మధ్య అంతర సంబంధాల గురించి అర్థం చేసుకోవడం, వర్గ బలగాల గురించి సరైన అంచనాకు చేరుకోవడం, ఇక ఆ తర్వాత విప్లవ పోరాటంలో ఏయే వర్గాలు ప్రధాన బలగంగా వుంటాయో, ఏయే వర్గాలను మిత్రులుగా చేసుకోవాల్సి వుంటుందో, ఏయే వర్గాలను కూలదోయాల్సి వుంటుందో వివరిస్తూ పోరాటానికి సరైన ఎత్తుగడలను రూపొందించుకోవడం అనే అంతిమ ధ్యేయంతో సమాజంలోని విభిన్న వర్గాలను శల్య పరీక్షకు గురి చేయడం అన్నదే మన పరిశోధనకు ముఖ్య పద్ధతిగా వుండి తీరాలి. మన ఏకైక ధ్యేయం ఇదే.

సమాజంలోని ఏయే వర్గాలను పరిశీలించాల్సి వుంటుంది?

అవి: పారిశ్రామిక కార్మికవర్గం, చేతివృత్తుల కార్మికవర్గం, వ్యవసాయ కార్మికులు, పేద రైతులు, పట్టణాలలోని పేదలు, 'లంపెన్' శ్రామికవర్గం, చేతి వృత్తులలోని 'మాస్టర్లు', చిన్న వ్యాపారులు, మధ్యతరగతి రైతులు, ధనిక రైతులు, వాణిజ్య బూర్జువా వర్గం, పారిశ్రామిక బూర్జువా వర్గం.

మన పరిశోధనలో మనం, సమాజంలోని ఈ వర్గాలన్నిటి, ఈ విభాగాలన్నిటి (స్ట్రాటా) స్థితిగతులపైన దృష్టిని కేంద్రీకరించాలి. మనం ఇవుడు పనిచేస్తున్న ప్రాంతాలలో, పారిశ్రామిక కార్మికవర్గమూ, పారిశ్రామిక బూర్జువా వర్గమూ, ఈ రెండు వర్గాలు మాత్రమే కనబడవు. ఇతర వర్గాలన్నింటిని మనం తరచుగా చూస్తుంటాం. ఈ వర్గాలన్నింటినీ, ఈ సామాజిక విభాగాలన్నింటిని మన పోరాట ఎత్తుగడలు దృష్టిలో వుంచుకుంటాయి.

పట్టణాలను అశ్రద్ధ చేస్తూ, గ్రామీణ ప్రాంతాల మీద అవసరానికి మించిన వక్కాణింపును పెట్టాం అన్నదే ఇంతకు మునుపు మన పరిశోధనలోని మరో తీవ్ర లోపం. అందుమూలంగా పట్టణ పేదలు, వాణిజ్య బూర్జువా వర్గాలపట్ల మన ఎత్తుగడల గురించి మన కామ్రేడ్లు అనేకులు ఎప్పుడూ సందిగ్ధంగానే వుండేవారు. పోరాటం అభివృద్ధి చెంది, అది పర్వతాల నుండి మైదానాలకు దిగిరావడంలో మనకు ఉపకరించింది[4]. మనం భౌతికంగానైతే పర్వతాలను దిగి వచ్చామేగానీ, మానసికంగా ఇంకా వాటిపైనే వున్నాం. పట్టణాలు, పల్లెలు, ఈ రెంటిని గురించి మనం తప్పక అర్థం చేసుకోవాలి. అలా కాకపోతే మనం మన విప్లవ అవసరాలను తీర్చజాలం.

6. చైనా విప్లవ పోరాట విజయం, చైనా కామ్రేడ్లు, చైనా పరిస్థితుల గురించిన అవగాహనకు రావడంపైనే ఆధారపడి వుంటుంది.

ప్రజాస్వామ్య దశ ద్వారా సోషలిజాన్ని సాధించడం అన్నదే మన పోరాట లక్ష్యం. ఈ కర్తవ్య సాధనకు, భూస్వామ్య వర్గం, సామ్రాజ్యవాదం, కొమింటాంగ్‌ల పాలనను కూలదోయడానికి కార్మికవర్గంలోని మెజారిటీని మనవైపుకి తిప్పుకోవడమూ, రైతాంగ ప్రజారాశులను, పట్టణ పేద ప్రజానీకాన్ని జాగృతం చేయడం అన్నది మొదటి మెట్టుగా వుంటుంది. సోషలిస్టు విప్లవాన్ని సాగించడం అన్నది రెండవ మెట్టు. ఇది పై పోరాటపు అభివృద్ధిని అనుసరించి వస్తుంది. ఈ మహత్తర విప్లవ బాధ్యతను నెరవేర్చడం అంత సామాన్యమైన పనీ కాదు, అంత తేలికైన పనీకాదు. అది కార్మికవర్గ పార్టీ అవలంభించే సరైన, దృఢమైన ఎత్తుగడలపైనే పూర్తిగా ఆధారపడి వుంటుంది. దాని పోరాట ఎత్తుగడలు తప్పుడివి అయితే, లేదా అవి నిశ్చయాత్మకత లోపించిన ఊగిసలాడే ఎత్తుగడలు అయితే అపుడు విప్లవం నిశ్చయంగానే, తాత్కాలిక ఓటమికి గురవుతుంది. బూర్జువా పార్టీలు కూడా నిరంతరాయంగా తమ పోరాట ఎత్తుగడలను గురించి చర్చిస్తూనే వుంటాయి. దీన్ని మనం విస్మరించకూడదు. కార్మికవర్గాన్ని తప్పుదారి పట్టించి, దాన్ని కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం నుండి దూరం చేయడానికిగాను కార్మికవర్గంలోని సంస్కరణవాద ప్రభావాలను ఎలా వ్యాప్తి చెందించాలి అనీ, పేద రైతుల తిరుగుబాట్లను అణచివేయడానికి ధనిక రైతులను ఎలా పురిగొల్పాలా అనీ, విప్లవ పోరాటాలను అణచివేయడానికి హంతక ముఠాలను ఎలా సంఘటితం చేయాలా అనీ అవి యోచిస్తూనే వున్నాయి. వర్గ పోరాటం నానాటికీ తీవ్రతరమయి, ముఖాముఖి పోరాటంగా పరిణమించిన పరిస్థితిలో, కార్మికవర్గం, తన విజయం కోసం తన స్వంత పార్టీయైన కమ్యూనిస్టు పార్టీ చేపట్టే సరియైన, దృఢమైన పోరాట ఎత్తుగడలపైనే పూర్తిగా ఆధారపడుతుంది. ఒక కమ్యూనిస్టు పార్టీ తాలూకు సరైన, ఏ ఊగిసలాటకు తావివ్వని దృఢమైన ఎత్తుగడలను ఆఫీసుల్లో కూర్చుని ఉండే ఏ కొద్దిమందో సృష్టించలేరు, అవి ప్రజా పోరాట క్రమంలో, అంటే వాస్తవ అనుభవం ద్వారా ఆవిష్కృతమవుతాయి. అందుచేత మనం ఎల్లవేళలా సామాజిక పరిస్థితులను అధ్యయనం చేయాలి, వాస్తవాత్మక పరిశోధనలను నిర్వహించాలి. పట్టు విడుపులేని యథాతథవాద, లాంఛనాత్మక వైఖరిని అవలంభిస్తూ, నిరాధారమైన ఆశాభావాన్ని కలిగివున్న కామ్రేడ్లు, పోరాటంలోని ప్రస్తుతపు ఎత్తుగడలు సరైనవేనని, పార్టీ ఆరవ జాతీయ మహాసభ తాలూకు "పత్రాల పుస్తకం"[5] శాశ్వత విప్లవానికి హామీ ఇస్తుందనీ, వాడుకలో వున్న పద్ధతులకు అంటిపెట్టుకుంటే చాలు, సదా విజయాన్ని సాధించవచ్చును అనీ భావిస్తున్నారు. ఈ అభిప్రాయాలు పరమ తప్పుడివి. కమ్యూనిస్టులు పోరాటం ద్వారా సానుకూలమైన కొత్త పరిస్థితులను సృష్టించుకోవాలి అనే భావానికి వీటికీ ఏ పొంతనా లేదు; ఈ అభిప్రాయాలు శుద్ధ యథాతథవాద పంథాకు ప్రాతినిధ్యం వహించే భావాలే. ఈ పంథాను మొత్తంగా తుంగలో తొక్కితే తప్ప అది విప్లవానికి గొప్ప నష్టాలను కలుగజేస్తుంది. స్వయంగా ఆ కామ్రేడ్లకు కూడా హాని చేస్తుంది. విషయాలను ఎలా వున్నవాటిని అలానే వుంచేసి సంతృప్తి పడేవాళ్లు, ఏ విషయాన్ని గురించైనా సమగ్ర అవగాహనను పొందడానికి కృషి చేయనివాళ్లు, నిరాధారమైన ఆశాభావంతో వుండేవాళ్లు అయిన కామ్రేడ్లు కొందరు ఎర్రసైన్యంలో వున్నారు అన్నది స్పష్టంగానే కనబడుతుంది; వారు దీన్ని "కార్మికవర్గ వైఖరి" అనే తప్పుడు భావాన్ని వ్యాప్తి చేస్తున్నారు. వారు కడుపునిండా తిని రోజస్తమానమూ ఆఫీసుల్లో కునుకులు తీస్తుంటారు, ప్రజారాశులలోకి వెళ్లి పరిశోధన జరపడానికి ఎన్నడూ కాలుకదిపిన పాపాన పోరు. వారు నోరు విప్పితే చాలు, వారి ప్రగల్భాలు శ్రోతలకు వాంతిని తెప్పిస్తాయి. ఈ కామ్రేడ్లను మేల్కొల్పడానికి గాను మనం మన స్వరాలను పెంచి ఇలా బిగ్గరగా చెప్పాలి.

మీ యథాతథవాద భావాలను మార్చుకోండి, ఏమాత్రం జాగు చేయవద్దు!

వాటి స్థానంలోకి పురోగామి, సమరశీల కమ్యూనిస్టు భావాలను ప్రవేశపెట్టండి!

పోరాటంలోకి దూకండి!

ప్రజలలోకి వెళ్లండి, వాస్తవాలను పరిశోధించండి!

7. పరిశోధనా పద్ధతి (టెక్నిక్)

1. వాస్తవాలను కనుగొనే సమావేశాన్ని నిర్వహించండి, చర్చల ద్వారా పరిశోధనను నిర్వహించండి.

సత్యానికి చేరువ కావడానికి ఇదే ఏకైక మార్గం, నిర్ధారణలకు

రావడానికి ఇదే ఏకైక మార్గం. చర్చల ద్వారా పరిశోధన జరపడానికిగానూ మీరు వాస్తవాలను కనుగొనే సమావేశాలను నిర్వహించకుండా, కేవలం ఒక వ్యక్తి తన స్వంత అనుభవాన్ని గురించి విడమర్చి చెప్పినదానిపైనే ఆధారపడితే, తప్పులు చాలా తేలిగ్గా జరుగుతాయి. ఇటువంటి సమావేశాలలో, మీరు చర్చ కోసం కీలకమైన ప్రశ్నలను వేయక, అందుకు మారుగా యధాలాపంగా ప్రశ్నలు వేస్తే మీరు ఇంచుమించుగా సరిగ్గా వుండే నిర్ధారణలకు రాగల్గే అవకాశమే వుండదు.

2. వాస్తవాలను కనుగొనే సమావేశంలో ఎవరెవరు పాల్గొనాలి?

వారు సామాజిక, ఆర్థిక పరిస్థితులతో చిరపరిచయం వున్నవారై వుండాలి. ఇక వయసు విషయానికి వస్తే, పెద్ద వయసువారు పాల్గొంటే, అది అత్యుత్తమం, ఏమంటే వారికి సంపన్న అనుభవం వుంటుంది, ఏం జరుగుతోంది అన్నది మాత్రమేగాక, దానికి గల కారణాలు, దాని ఫలితాల గురించి కూడా వారికి తెలిసి వుంటుంది. పోరాటానుభవం ఉన్న యువజనులను కూడా తీసుకోవాలి. ఏమంటే, వారికి పురోగామి భావాలు, సునిశిత దృష్టి వుంటాయి. ఇక వృత్తి, వ్యాపకాల విషయానికి వస్తే, కార్మికులు, రైతులు, మేధావులు వర్తకులు వుండాలి. అపుడపుడు సైనికులు, కొన్ని సందర్భాలలో దేశదిమ్మరులు కూడా పాల్గొనాల్సి వుంటుంది. ఒకానొక విషయంలోకి తరచి చూస్తున్నపుడు, ఆ విషయంతో అసలు సంబంధమే లేనివారు పాల్గొనక్కరలేదు. ఉదాహరణకు, వాణిజ్యం పరిశోధనా విషయంగా ఉన్నపుడు, కార్మికులు, రైతులు, విద్యార్థులు పాల్గొననక్కరలేదు.

3. వాస్తవాలను కనుగొనడానికి జరిపే సమావేశం పెద్దఎత్తున ఉంటే మేలా, చిన్నదైతే మేలా?

అది పరిశోధకుడికి సమావేశ నిర్వహణలో గల సామర్థ్యంపై ఆధారపడి వుంటుంది. అతడు అందులో ఆరితేరిన వాడైతే, పన్నెండు మందిగానీ అంతకన్నా ఎక్కువ మందిగానీ పాల్గొనే సమావేశాన్ని నిర్వహించుకోవచ్చు. పెద్ద సమావేశాల వల్ల పలు లాభాలుంటాయి. వచ్చే సమాధానాల నుండి మీకు దాదాపుగా సరిగ్గా వుండే గణాంక వివరాలు లభ్యమవుతాయి. (ఉదాహరణకు: మొత్తం రైతాంగ జనాభాలో పేద రైతుల శాతాన్ని కనుగొనడానికి) దాదాపుగా నిర్ధారణకు రాగల్గుతారు. (ఉదాహరణకు: భూమిని తిరిగి పంచి పెట్టడంలో, సరిసమానంగా పంచిపెట్టడమా లేక వ్యత్యాసాలు పాటిస్తూ పంచడమా ఈ రెంటిలో ఏది మేలు అన్నది తెలుసుకోవడానికి). ఇక సహజంగానే దానివల్ల నష్టాలూ వున్నాయి. సమావేశాల నిర్వహణలో చాకచక్యంగా వుంటే తప్ప, వాటిని ఓ పద్ధతి ప్రకారం నిర్వహించడం మీకు కష్టమవుతుంది. కాబట్టి సమావేశంలో పాల్గొనేవారి సంఖ్య పరిశోధకుడి సమర్థతపై ఆధారపడి వుంటుంది. అయితే అది హీనపక్షంలో ముగ్గురితో జరగాలి, అలా కాకపోతే, తద్వారా సేకరించబడిన సమాచారం చాలా పరిమితంగా వుండి, వాస్తవ పరిస్థితికి అనుగుణంగా వుండదు.

4. పరిశోధన కోసం స్థూలంగా వివరాలను తయారుచేసి పెట్టుకోండి

ముందుగానే స్థూలంగా వివరాలను తయారుచేసి వుంచుకోవాలి. పరిశోధకుడు దీనికనుగుణంగా ప్రశ్నలు వేయాలి, సమావేశంలో పాల్గొంటున్నవారు సమాధానాలు చెప్పాలి. స్పష్టతలేని అంశాలను, సందేహాలు ఉన్న అంశాలను చర్చకు పెట్టాలి. ఈ స్థూల వివరణలలో, ప్రధాన విషయాలు, ఉప శీర్షికలు, వివిధ రకాల అంశాలు కూడా వుండాలి. ఉదాహరణకు వాణిజ్యం ప్రధాన విషయంగా తీసుకున్నప్పుడు, దానిలో బట్టలు, ధాన్యం తదితర నిత్య జీవితావసర వస్తువులు, ఔషధ మూలికలు వగైరా వుపశీర్షికలుండాలి, ఇక క్యాలికో, చేనేత, పట్టు, శాటిన్‌ల వంటి ఇతర రకాల అంశాలు వుండాలి.

5. స్వయంగా పాల్గొనడం

నాయకత్వాన్నందించే బాధ్యత ఉన్న ప్రతి ఒక్కరూ – టౌన్‌షిప్ ప్రభుత్వ అధ్యక్షుడి నుండి కేంద్ర ప్రభుత్వ అధ్యక్షుడి దాకా, డిటాచ్‌మెంటు నాయకుడి నుండి కమాండర్–ఇన్–ఛీఫ్ దాకా పార్టీ శాఖ కార్యదర్శి నుండి ప్రధాన కార్యదర్శి దాకా– వ్యక్తిగతంగానే నిర్దిష్ట సామాజిక, ఆర్థిక పరిస్థితుల మీద పరిశోధన చేపట్టాలి, అంతేకాని కేవలం రిపోర్టులు చదవడం మీదనే ఆధారపడకూడదు. ఏమంటే, రిపోర్టులను చదవడం, పరిశోధించడం, ఇవి రెండూ పూర్తిగా వేరు వేరు అంశాలు.

6. లోతుగా శోధించండి

ఒకానొక తావును (ఒక గ్రామం లేదా పట్టణం అనుకుందాం) గురించిగానీ, ఒకానొక సమస్య (ధాన్యం, కరెన్సీ సమస్యలు అనుకుందాం) గురించిగానీ పూర్తి అవగాహనను పొందడానికి, కొత్తగా పరిశోధనను చేపట్టినవారెవరైనా సరే, వారు ఒకటికి రెండుసార్లు సమగ్రంగా పరిశోధించాల్సి వుంటుంది. ఒకానొక తావునో లేదా ఒకానొక సమస్యనో లోలోతుల్లోకి వెళ్లి శోధిస్తే అది ఇతర తావులనుగానీ ఇతర సమస్యలను గానీ మనం ముందు ముందు పరిశోధిస్తున్నపుడు, ఆ పరిశోధనను సులభం చేస్తుంది.

7. మీ నోట్సును మీరే తయారు చేసుకోండి.

ఒక పరిశోధకుడు వాస్తవాలను కనుగొనే సమావేశానికి అధ్యక్షత

వహించి, పాల్గొంటున్న వారికి సరైన గైడెన్స్‌ను అందజేస్తేనే సరిపోదు, అతడు తన నోట్సును తానే రాసుకోవాలి. ఫలితాలను స్వయంగా రికార్డు చేయాలి. ఆ పనిని ఇతరులకు అప్పజెప్పడం అతనికి మేలుచేయదు.

వివరణలు

1. కన్‌ఫ్యూసియన్ సూత్రాలు మూడవ గ్రంథం, 'పాయి' నుండి, "కన్‌ఫ్యూసియస్ తన పూర్వీకుల దేవాలయంలోకి అడుగుపెట్టగానే, ప్రతి ఒక్క విషయాన్ని గురించి అడిగి తెలుసుకున్నాడు."

2. లికుయె, ప్రఖ్యాత చీనీ నవల షుయ్ హుచువాన్ (చిత్తడి నేలల వీరులు)లోని కథానాయకుడు. ఉత్తర సుంగ్ వంశ పాలన చివరి రోజుల్లో (క్రీ.శ. 960–1127) జరిగిన రైతు యుద్ధం గురించి ఈ నవల తెలియజెప్పుంది. లికుయె సాదాసీదా మనిషి, ముక్కుసూటిగా మాట్లాడే స్వభావం కలవాడు, రైతుల విప్లవాశయానికి పరమ విధేయుడు. అయితే అతడు మొరటు మనిషి, చాకచక్యం లేనివాడు.

3. కామ్రేడ్ మావో, పరిశోధన గురించి సదా నొక్కి చెబుతూనే ఉండేవారు. నాయకత్వపు పనిలో, విధానాన్ని గురించి వివరించడానికి సామాజిక పరిశోధనే అతి ముఖ్యమైన కర్తవ్యం అనీ, దానికి పునాది అనీ ఆయన భావించేవారు. ఎర్రసైన్యంలోని ఫోర్త్ ఆర్మీలో, కామ్రేడ్ మావో తీసుకున్న చొరవ కారణంగా, పరిశోధనా కృషి క్రమపద్ధతిలో అభివృద్ధి చెందింది. సమాజ పరిశోధన పనిలో అంతర్భాగంగా ఉండాలని ఆయన నిర్దేశించారు. ఎర్రసైన్యపు రాజకీయాల శాఖ, ప్రజా పోరాటపు స్థితిగతులు, అభివృద్ధి నిరోధకుల పరిస్థితులు, ప్రజల ఆర్థిక జీవితం గ్రామీణ ప్రాంతాలలో ప్రతి ఒక్క వర్గానికి ఎంతెంత భూమి స్వంతానికి వుంది, వగైరా అంశాలను దృష్టిలో వుంచుకుంటూ వివరమైన ఫారాలను తయారుచేసింది. ఎర్రసైన్యం ఎక్కడికెడితే అక్కడే, అక్కడి పరిస్థితుల గురించి క్షుణ్ణంగా తెలుసుకునేది, ఆ తదుపరి ప్రజారాశుల అవసరాలకు అనుగుణంగా వుండే నినాదాలను రూపొందించేది.

4. ఇక్కడ ప్రస్తావనకు వచ్చిన పర్వతాలు, కియాంగ్సీ, హొనాన్ రాష్ట్రాల సరిహద్దుల వెంట వున్న చింగ్‌కాంగ్ పర్వతాలు; "మైదానాలు" దక్షిణ కియాంగ్సీ, పశ్చిమ ఫ్యూకెయిన్ ప్రాంతాలలోని మైదాన ప్రాంతాలు, రెండు పెద్ద విప్లవ స్థావరాలను నెలకొల్పడానికి గానూ, ఎర్రసైన్యంలోని ఫోర్త్ ఆర్మీ తాలూకు ప్రధాన బలగాన్ని కామ్రేడ్ మావో, చింగ్‌కాంగ్ పర్వతాల నుండి, దక్షిణ కియాంగ్సీ, పశ్చిమ ఫ్యూకెయిన్ ప్రాంతాలకు స్వయంగా నడిపించారు.

5. ఈ "డాక్యుమెంట్‌ల పుస్తకం"లో చైనా కమ్యూనిస్టు పార్టీ ఆరవ జాతీయ మహాసభ, 1928 జూలైలో ఆమోదించిన రాజకీయ తీర్మానం, రైతాంగ సమస్యపై తీర్మానాలు, భూ సమస్యపై తీర్మానం, రాజకీయాధికారాన్ని సంఘటితపర్చుకోవడంపై తీర్మానం వగైరా తీర్మానాలతో సహా, ఆ మహాసభ తీర్మానాలన్నీ ఉన్నాయి. ఎర్రసైన్యంలోని పార్టీ శాఖలకు, స్థానిక పార్టీ శాఖలకు ఈ తీర్మానాలను అందజేయడానికిగాను, ఎర్రసైన్యంలోని ఫోర్త్ ఆర్మీ తాలూకు యుద్ధరంగ కమిటీ 1929 ఫిబ్రవరిలో వీటిని పుస్తకంగా ప్రచురించింది. ★

---

*(...57వ పేజీ తరువాయి)*

ఆన్‌రాక్‌తో ఒప్పందం చేసుకున్న ప్రకారం సోమలింగం యువకులతో కమిటీలు పెట్టడం, ఉద్యోగాలిస్తామని ప్రచారం చేయడం మొదలుపెట్టాడు. దీనితో సోమలింగాన్ని 2010, ఫిబ్రవరి 18న గెరిల్లాలు చంపేశారు.

సోమలింగంతో పాటు పనిచేస్తున్న విజయ్‌కుమార్ ఇంటిపై దాడి చేయగా అతను తప్పించుకున్నాడు. ఊరు వదిలి వెళ్లిపోవాలని అతని భార్యను హెచ్చరించారు. నవీన్, నాగరాజులతో తప్పు ఒప్పించారు.

## కాఫీ మేనేజర్ ఆఫీస్ దగ్ధం

విశాఖ జిల్లా గూడెం కొత్తవీధి మండలం ఆర్‌వి నగర్‌లో ఫారెస్ట్ కాఫీ మేనేజర్‌కు చెందిన ఆఫీస్‌ను గెరిల్లాలు తగులబెట్టారు. అందులో వున్న సామాన్లు ధ్వంసం చేశారు. 'అడవి మీద అధికారం ఆదివాసీలది– పీడిత ప్రజలది', 'ప్రభుత్వ కాఫీ తోటలు ప్రజలకు పంచాలి', 'మన్యం నుంచి కాఫీ డిపార్ట్‌మెంట్ వెళ్లిపోవాలి' అని నినాదాలు చేశారు. ఈ చర్య ప్రజల్ని కాఫీ తోటలు ఆక్రమించుకునే దిశలో ఆలోచింపజేసింది.

## పోలీసు ఇన్ఫార్మర్ కాంట్రాక్టర్ చిత్తు ఖతం


కలిమెల బ్లాక్ కేంద్రంలో నివాసముంటున్న చిత్తు గత కొద్ది కాలంగా ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు చేపడుతున్నాడు. పోలీసు సంబంధాల్లో వుంటూ సంఘ సభ్యులను అరెస్టు చేయిస్తున్నాడు. అలాగే వద్దని చెప్పినా వినకుండా రోడ్లు వేయించడం, వంతెనలు కట్టించడం చేయిస్తున్నాడు. గతంలో ఒకసారి వంతెన కట్టించడానికి పూనుకోగా ప్రజలు దాడి చేసి సిమెంట్, జనరేటర్, ఇనుము తదితర సామాగ్రినంతటినీ స్వాధీనం చేసుకున్నారు. అయినా వినకుండా తన కార్యకలాపాలను కొనసాగించడంతో పిఎల్‌జిఎ సభ్యులు ఇతన్ని ఖతం చేశారు. ★

### పోస్టుమార్టం రిపోర్ట్ చెప్పిన నిజం

# కామ్రేడ్ ఆజాద్‌ను పట్టుకుని దారుణంగా హత్య చేసారు

## ప్రపంచ వ్యాపితంగా వెల్లువెత్తిన నిరసన, సర్వత్రా న్యాయ విచారణకు డిమాండ్

ఆజాద్ శరీరంలోకి చొచ్చుకుపోయినవి రెండు బుల్లెట్లు. ఒక బుల్లెట్ ఆజాద్ నిలబడి వున్నప్పుడు... మరొకటి కింద పడిపోయినప్పుడు దూసుకు వెళ్లాయి. ఆజాద్ ఛాతిలో రెండవ, మూడవ పక్కటెముకల మధ్య దిగబడి, గుండెను చీల్చి వెనుక తొమ్మిదవ, పదవ పక్కటెముకల గుండా వెన్నుపూస ప్రాంతంలో బయటికి వచ్చింది. అక్కడ గాయం 3 సెంటీ మీటర్లే వుంది. అది వృత్తాకారంలో కాలినట్లుంది. తూటా లోపలికి ప్రవేశించిన చోట గాయం నల్లగా మాడిపోయి వుంది. గాయపు అంచులు కాలి వున్నాయి. తూటాను ఒక కోణం నుండి ఫైర్ చేయడం వలన 9 ఎంఎం (.38") పిస్టల్‌తో రెండు, ఏడు అంగుళాల దూరం నుండి కాల్చడంతో గాయం అలా వుందని దేశంలో ప్రసిద్ధ ఫోరెన్సిక్ వైద్య నిపుణులు అన్నారు. రెండోది కుడి చంకకు ముందు దిగబడి... కింది భాగం నుంచి బయటికి వచ్చింది. ఎఫ్.ఐ.ఆర్.లో రాసిన సమయం, సంఘటన వివరం పోస్టుమార్టం రిపోర్ట్ వెల్లడించే నిజాలతో విభేదిస్తున్నాయి సి.డి.ఆర్.ఓ. పేర దేశంలోని 24 పౌరహక్కుల సంఘాలు ఉమ్మడిగా చేసిన నిజ నిర్ధారణలో అక్కడ ఎదురుకాల్పులు జరగలేదని ప్రజలు కూడా గతంలో జరిగిన విధంగా ఎన్‌కౌంటర్ జరగలేదని చెప్పారు. ఈ సంఘటనపై మెజిస్ట్రీరియల్ ఎంక్వైరీ కూడా జరగలేదు.



చర్చలకు సంబంధించి మాట్లాడుతున్న మనిషినే చంపేస్తే శాంతి చర్చలకు అవకాశం ఎక్కడిదని ప్రశ్నించిన అగ్నివేశ్ న్యాయవిచారణ జరపాలని కోరుతూ ప్రధాని మన్‌మోహన్‌సింగ్‌ను కలిసినట్లు పత్రికల్లో ప్రముఖంగా వచ్చింది. "చర్చల నాటకం ఆడుతూ పోలీసులు వల పన్నుతున్నారనీ, చాలా ఇబ్బందులు ఎదుర్కొని చివరికి తప్పుకున్నానని" అగ్నివేశ్ నుండి ఉత్తరం అందుకున్న మరో సీసీ సభ్యుడు ఒక బహిరంగ లేఖను పత్రికకు విడుదల చేసాడు. ఆజాద్‌ను పట్టుకొని కాల్చి చంపారని చెప్పడానికి ఇటువంటి ఘటనలు అనేకం చెప్పవచ్చు. క్యాబినెట్ స్థాయిగల కేంద్ర రైల్వే మంత్రి మమతా బెనర్జి ఆ వెంటనే లాల్‌గఢ్ బహిరంగ సభలో వేలాది మందిని ఉద్దేశిస్తూ చేసిన ప్రసంగంలో ఆజాద్‌ను హత్య చేయాల్సింది కాదనీ, అది తప్పని మాట్లాడింది. ఒకవైపు ఎ.పి.డి.ఐ.జి.తో సహా ఆజాద్‌ది ఎన్‌కౌంటరే అని ప్రజలను నమ్మించడానికి ప్రయత్నం చేస్తున్న సమయంలో ఈ ప్రకటన వెలువడటం, ఆజాద్‌ది ముమ్మాటికి పోలీసులు చేసిన హత్యేనని తేటతెల్లం చేసింది.

కామ్రేడ్ ఆజాద్ మరణంతో పార్టీకి తీవ్ర నష్టం జరిగింది. కామ్రేడ్ ఆజాద్ అగ్రశ్రేణి నాయకుడు. పాలకులు ప్రత్యేకంగానే కేంద్రీకరించి ఆయనను అంతమొందించే కుట్ర పన్నారు. ఆజాద్‌ను పట్టుకుని అత్యంత పాశవికంగా, పిరికిగా హత్య చేసారు. సోనియా, మన్‌మోహన్‌సింగ్, చిదంబరంల ముఠా, కేంద్ర ఇంటెలిజెన్స్ సంస్థలు, ఆంధ్రప్రదేశ్ ఎస్.ఐ.బి. ఈ హత్యకు ప్రత్యక్ష బాధ్యులు.

1978లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం భార్గవ కమీషన్‌ను నియమించి బూటకపు ఎన్‌కౌంటర్లపై న్యాయ విచారణ జరిపింది. దానికి కామ్రేడ్ ఆజాద్ సుదూర ప్రాంతాల నుండి సాక్షులను తీసుకువచ్చి కమీషన్ ముందు హాజరుపరిచేవాడు. మూడు దశాబ్దాల తర్వాత అదే బూటకపు ఎన్‌కౌంటర్‌కు జర్నలిస్టుతో పాటు తానూ బలయ్యాడు.

ఇలాంటి హత్యల ద్వారా గ్రీన్‌హంట్ లాంటి దుశ్చర్యల ద్వారా ప్రభుత్వం లిఖిత రాజ్యాంగాన్ని అవహేళన చేస్తోంది. ప్రభుత్వం ఆదేశిత సూత్రాలకు కట్టుబడి వుండడంలేదు. దీనులు, హీనులు, పతితులు, బాధాసర్పదష్టులే తమ రక్త సంబంధీకులుగా, ఆత్మీయులుగా భావించి వారి కోసం పోరాడిన యోధులలో కామ్రేడ్ రాజకుమార్ ఒకరు. అందుకే ప్రజలు వేలాదిగా ఆజాద్ మృత దేహాన్ని చూడడానికి జూలై 4న దూర ప్రాంతాల నుండి తరలి వచ్చారు. హైదరాబాద్‌లో జరిగిన ఆయన శవయాత్ర మీడియాలో బాగా ప్రసారమైంది.

వివిధ దేశాల మావోయిస్టు పార్టీలు ఆజాద్ హత్యను ఖండిస్తూ నిరసన తెలియజేసాయి. భారత విప్లవానికి ఆయన చేసిన సేవలను కొనియాడుతూ సి.పి.ఐ.(మావోయిస్టు) కేంద్ర కమిటీకి లేఖలు పంపారు. అలా స్పందించిన ప్రజలకు, పార్టీలకు, సంస్థలకు, వ్యక్తులకు కేంద్ర కమిటీ విప్లవాభివందనాలు, కృతజ్ఞతలు తెలియజేసింది. ఇలాంటి ప్రజాస్వామిక, విప్లవ చైతన్యమే ప్రజా ఉద్యమాలకు నిరంతరం జవజీవాలను అందిస్తూ వుంటుంది. శత్రువు ఆజాద్‌ను భౌతికంగా నిర్మూలించాడు. కానీ ఆజాద్ వ్యాపింపజేసిన

విప్లవ భావాలు పార్టీలోను, ప్రజల్లోనూ ఒక గొప్ప భౌతిక శక్తిగా మారడాన్ని అడ్డుకోవడం అసాధ్యం.

కామ్రేడ్ ఆజాద్ మన జ్ఞాపకాల్లో ఎర్ర నక్షత్రంగా నిరంతరం ప్రకాశిస్తాడు. ఇది నిజం. ఈ సంవత్సరం జూలై 28 అమరుల సంస్మరణ వారం సందర్భంగా ఆజాద్ మిత్రులు షైనింగ్ రెడ్ స్టార్ పేరుతో ఒక చిన్న పుస్తకాన్ని తెచ్చారు. అందులో వారి ప్రేమ, అనుబంధాలతో పాటు విచారం, ప్రభుత్వ దుశ్చర్య పట్ల నిరసన వున్నాయి. బాధాతప్త హృదయ స్పందనను అక్షరీకరించారు. వాళ్లు భారతదేశంలో రాజ్యం పాశవికతను, గ్రీన్‌హంట్ దాడులను ఖండించారు. భారత విప్లవోద్యమ ప్రగతిని, ఆ ప్రగతి వెనుక ఆజాద్ కృషిని గుర్తు చేసారు. కామ్రేడ్ ఆజాద్ వ్యక్తిత్వాన్నీ, దేశ విదేశాల విప్లవోద్యమాలతో సంబంధాలను, చర్చల కోసం ఆజాద్ చేసిన ప్రయత్నాలను చెబుతూ ఆజాద్ లాంటి అధికార ప్రతినిధిని హత్య చేయడం నియమాలను ఉల్లంఘించడం అన్నారు.

హైదరాబాద్‌లో జరిగిన అంతిమయాత్రలో వివిధ రంగాల ప్రముఖులు, అనేక సంస్థల ప్రతినిధులు, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో చర్చల సమయంలో మధ్యవర్తులుగా ఉన్న కామ్రేడ్స్ వరవరరావు, కళ్యాణరావు, గద్దర్, తదితర మేధావులు, బంధుమిత్రులు, విప్లవాభిమానులు, వేలాదిగా ప్రజలు పాల్గొని నివాళులర్పించారు. భారతదేశంలో అనేక రాష్ట్రాల్లో నిరసన చర్యలు, దేశవ్యాప్తంగా బంద్‌ను నిర్వహించారు. పార్టీ శ్రేణులు అన్ని రాష్ట్రాల్లో సభలు, సమావేశాలు నిర్వహించారు. వివిధ రూపాల్లో ప్రచార ఆందోళన కార్యక్రమాలు చేపట్టాయి.

కామ్రేడ్ ఆజాద్ మరణవార్త ప్రపంచ వ్యాప్తంగా విప్లవ ప్రజల్లో ఆందోళన కలిగించింది. విదేశాల్లో టర్కీలోని ఇస్తాంబుల్‌లో, గ్రీస్‌లోని ఏథెన్స్‌లో వున్న భారత దౌత్య కార్యాలయాల దగ్గర విప్లవ ప్రజలు పెద్ద ఎత్తున నిరసన ప్రదర్శనలు చేసారు. అనేక పార్టీలు, సంస్థలు ఈ హత్యలపై ఖండన ప్రకటనలు విడుదల చేసాయి. అందులో అంతర్జాతీయ ప్రజా ఉద్యమ వేదిక, పిలిప్పీన్స్ కమ్యూనిస్టు పార్టీ, గ్రీస్ కమ్యూనిస్టు పార్టీ (మార్క్సిస్టు–లెనినిస్టు), టి.కె.పి. (ఎం.ఎల్) కేంద్ర కమిటీ (టర్కీ), ఫ్రాన్స్ మావోయిస్టు కమ్యూనిస్టు పార్టీ, ఇటలీకి చెందిన పి.సి.ఎం. (ఇటలీ), కొలంబియాకు చెందిన కమ్యూనిస్టు పార్టీ (ఎం.ఎల్.ఎం.), టర్కీకి చెందిన ప్రజాస్వామిక హక్కుల సమాఖ్య–పార్టీజాన్, దక్షిణాసియా లౌకిక ప్రజాస్వామిక సంస్థ, భారత దేశంలోని ప్రజలపై జరుగుతున్న యుద్ధానికి వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న అంతర్జాతీయ సంస్థ, పీపుల్స్ యూనియన్ ఫర్ డెమోక్రటిక్ రైట్స్, శాంతి, న్యాయం కోసం వుద్యమం నడిపే సంస్థ ప్రముఖులు, పౌరులు– అనేక మంది మేధావులు, వ్యక్తులుగా అగ్నివేశ్, అరుంధతీరాయ్, వి.ఆర్.కృష్ణయ్యర్ (రిటైర్డ్ సుప్రీంకోర్టు జడ్జి), కన్నభిరాన్, సి.పి.ఐ. (ఎం.ఎల్.) జనశక్తి నాయకులు అమర్, అరుణోదయ విమల ఇలా ఎందరో ప్రముఖులు వెంటనే తమ స్పందనలను తెలియజేసారు. మెయిన్ స్ట్రీమ్ లాంటి ఆంగ్ల పత్రికలు, తెలుగు పత్రికలు సంపాదకీయాలు రాసాయి. భారత ప్రభుత్వ పాశవిక హత్యాకాండను ఖండించడంతో పాటు న్యాయ విచారణను డిమాండ్ చేసారు.

కామ్రేడ్ ఆజాద్ హత్య తర్వాత కూడా సి.పి.ఐ. (మావోయిస్టు)ను చర్చల ప్రక్రియ నుండి వెనక్కి తగ్గవద్దనీ, చర్చలకు ముందుకు రావాలని కోరుతున్నారు అగ్నివేశ్ తదితరులు. పార్టీ నేతలను ప్రభుత్వం దొంగ దెబ్బతీసి చేస్తున్న హత్యలను, ఇంకా ఇలాంటి హత్యలకు పథకాలు రచిస్తూ చేస్తున్న కుట్రలను ఆపటం కోసం పటిష్టమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం వుంది.

కామ్రేడ్ ఆజాద్‌ను ముమ్మాటికి ప్రభుత్వమే కుట్రపూరితంగా హత్య చేసింది. పోస్టుమార్టం, ఫోరెన్సిక్ రిపోర్టుల్లో కూడా దీన్ని నిరూపించే సాక్ష్యాలు బైటపడ్డాయి. కామ్రేడ్ ఆజాద్ హత్యపై న్యాయవిచారణ జరపాలనే ఖచ్చితమైన డిమాండ్‌తో ప్రజాస్వామికవాదులు, నిజమైన శాంతినికోరే మేధావులు, మానవ హక్కుల సంఘాలు ముందుకు రావాలని సి.పి.ఐ. (మావోయిస్టు) కోరుతోంది. ★

---

*(...26వ పేజీ తరువాయి)*

పోరాడుతూ శత్రువును క్యాంపులోకి అడుగుపెట్టకుండా నిరోధించగలిగారు. 18–19 గంటల పాటు శత్రువును వెంటాడుతూ చికాకు పరుస్తూ శత్రువు పన్నిన భారీ పథకాన్ని చిత్తు చేశారు.

గొప్ప సాహసంతో పోరాడి, వేల మంది సుశిక్షితులైన శత్రు బలగాలనూ, అత్యాధునిక ఆయుధాలనూ, జి.పి.ఎస్. వంటి ఆధునిక సాంకేతిక వ్యవస్థను, హెలీకాప్టర్లను చిత్తుచేసిన పి.ఎల్.జి.ఎ. వీరయోధులు; సాహసంగా, నైపుణ్యంగా పోరాడ్డం ద్వారా ఎంతటి బలమైన శక్తినైనా నిర్వీర్యం చేయవచ్చునని నిరూపించారు. తమ ప్రాణాలకు తెగించి పోరాడి నాయకత్వాన్ని కంటికి రెప్పలా కాపాడుకొని, శత్రువుకు భారీ అపజయాన్నీ అందించిన పి.ఎల్.జి.ఎ.కు జేజేలు చెబుదాం. ఈ క్రమంలో వీరమరణం పొందిన కామ్రేడ్ దేవిడ్‌కు తలవంచి వినమ్రంగా జోహార్లర్పిద్దాం.

ఈ విజయం దేశవ్యాప్తంగా పి.ఎల్.జి.ఎ.ను ఉత్తేజపరుస్తుంది. ఆ ఉత్తేజం తప్పక పీడిత ప్రజలకు మరెన్నో విజయాలనూ శత్రువుకు ఎడతెగని అపజయాలనూ అందిస్తుంది. ★

# నాల్కో (దామన్‌జోడి) అమరులకు అరుణారుణ జోహార్లు!

ఒడిషా రాష్ట్రంలోని కోరాపుట్ జిల్లా దామన్‌జోడిలోని నాల్కో బాక్సైట్ గనులపై 2009, ఏప్రిల్ 12న పి.ఎల్.జి.ఎ. దాడి చేసింది. ఈ దాడిలో సాహసోపేతంగా పోరాడుతూ కామ్రేడ్స్ రాజు, కీర్తి, సుక్‌రాం, రఘులు నేలకొరిగారు. పి.ఎల్.జి.ఎ. ఈ సందర్భంగా 11 మంది సి.ఆర్.పి.ఎఫ్. జవాన్లను చంపి, 8 మందిని గాయపర్చి, 9 మంది జవాన్లను సరెండర్ చేసుకుంది. కాగా ఈ దాడిలో 11 ఇన్సాస్‌లు, 9 బుల్లెట్‌ప్రూఫ్ జాకెట్లు, రెండు వేల తూటాలు, రెండున్నర టన్నుల జిలిటిన్ పి.ఎల్.జి.ఎ. స్వాధీనం అయింది. దామన్‌జోడి అమరులుగా చరిత్రకెక్కిన పై నల్గురు కామ్రేడ్స్‌లో కామ్రేడ్ రాజు చరిత్రను 2010 మార్చి-ఏప్రిల్ సంచికలో ప్రచురించాం. మిగతా ముగ్గురు కామ్రేడ్స్ చరిత్రలను కింద ప్రచురిస్తున్నాం.

## ఆదర్శ గెరిల్లా కామ్రేడ్ రూపాల్ (కీర్తి)

దండకారణ్య వ్యవసాయిక విప్లవోద్యమంలో పశ్చిమ బస్తర్ డివిజన్ బైరంగఢ్ ఏరియాలో ఎంతో మంది యువతీ, యువకులు భాగమయ్యారు. అందులో కామ్రేడ్ రూపాల్ (కీర్తి) ఒకరు. ఇరేపాల్ గ్రామంలో నిరుపేద ఆదివాసీ మాడవి కుటుంబంలో కామ్రేడ్ రూపాల్ జన్మించాడు. చిన్న వయసులోనే విప్లవ రాజకీయాలతో ఆకర్షితుడై బాలల సంఘంలో పని చేశాడు.



ఆ తర్వాత డి.ఎ.కె.ఎం.ఎస్.లో పనిచేస్తూ ఎన్నో చర్యల్లో చురుగ్గా పాల్గొన్నాడు. 1997-98లో మిర్తూల్ ఏరియాలో కాంగ్రెస్ లీడర్ మహేంద్రకర్మ నాయకత్వంలో 'జన్ జాగరణ్' అభియాన్ పేరుతో గూండాలు గ్రామాల మీద పడి దాడి చేశారు. దీన్ని వ్యతిరేకిస్తూ ఐదు వేల మంది ప్రజలు గూండాలపై ప్రతిదాడికి దిగారు. దీంట్లో కామ్రేడ్ రూపాల్ పాల్గొన్నాడు. పెదం అనే గ్రామంలో బోగమీ మొరకా అనే జన్‌జాగరణ్ నాయకుడిని ఖతం చేయడంలో ముందున్నాడు. తమ గ్రామంలో గ్రామ పెద్ద పెత్తందారీతనానికి వ్యతిరేకంగా చేసిన కార్యక్రమాల్లో పాల్గొన్నాడు. తునికాకు రేట్లను పెంచడం కోసం ప్రజలను కూడగట్టినాడు.

2002 మార్చి నెలలో బైరంగఢ్ దళం ఎల్.జి.ఎస్.లో భర్తీ అయి తన పేరును వర్గేష్‌గా మార్చుకున్నాడు. ఆదివాసీల సాంప్రదాయం ప్రకారం కామ్రేడ్ రూపాల్‌కు చిన్న వయస్సులోనే పెళ్లి అయింది. కానీ వర్గ పోరుకు పెళ్లి ఆటంకంగా భావించలేదతను. తనకు అర్థం అయినంతమేరకు పార్టీ విషయాలను సహచరికి అర్థం చేయిస్తూ, దళంలో రిక్రూట్ చేశాడు. అనారోగ్యం రీత్యా తిరిగి ఆమె ఇంటికి వెళ్లి ప్రస్తుతం సంఘ కార్యకలాపాల్లో కొనసాగుతోంది.

దళంలో కామ్రేడ్ వర్గేష్ క్రమశిక్షణగా మెలిగేవాడు. చాలా తక్కువ సమయంలోనే చదువు నేర్చుకున్నాడు. చిరునవ్వుతో కామ్రేడ్స్ అందరితో కలిసి పోయేవాడు. మిలిటరీ నైపుణ్యాన్ని సంపాదించడం కోసం పట్టుదలగా కృషి చేసేవాడు. పి.ఎల్.జి.ఎ. వారోత్సవాల సందర్భంగా 2003లో కాకలేర్ గ్రామ సమీపంలో బీజాపూర్-గంగులూర్ రోడ్‌లో ఆంబుష్ చేసి ఇద్దరు సి.ఆర్.పి.ఎఫ్. జవానులను గాయపర్చిన ఘటనలో పాల్గొన్నాడు. అదే సంవత్సరంలో పల్లెవాయి జాంగ్లా గ్రామాల సమీపంలో చేసిన ఆంబుష్‌లోనూ పాల్గొన్నాడు. 2004లో పాంజేర్ గ్రామం దగ్గర బూబీట్రాప్ ద్వారా పోలీసులను గాయపరిచిన ఘటనలో కామ్రేడ్ వర్గేష్ పాల్గొన్నాడు.

2005 మే నెలలో జగదల్‌పూర్ - భోపాల్‌పట్నం నేషనల్ హైవే (రాష్ట్రీయ రాజ్‌మార్గ్)-16 పైనున్న కర్రెమర్క గ్రామం దగ్గరలో పోలీస్ వాహనంపై మైన్ పేల్చగా ఐదుగురు పోలీసులు చావగా, ఏడుగురికి గాయాలయ్యాయి. ఈ ఘటనలో కామ్రేడ్ వర్గేష్ అసాల్ట్ టీంలో పాల్గొన్నాడు. 2004లో తీవ్రమయిన అనారోగ్యానికి గురై శారీరకంగా బలహీనపడినప్పటికీ వర్గ పోరాటం ఎడల తన పట్టుదల సడలలేదు.

ఫాసిస్టు సల్వాజుడుం సమయంలో ప్రజలకు దగ్గరగా వుండి శత్రువు కుట్ర, కుహకాలను అర్థం చేయించేవాడు. వాళ్లను వర్గ పోరాటానికి సిద్ధం చేశాడు. సల్వాజుడుం నాయకుల గ్రామాలైన పొందు, బోధిలీ, తారు, ధారంలపై చేసిన దాడుల్లో కామ్రేడ్ వర్గేష్ సాహసంగా పాల్గొన్నాడు. ఎంతోమంది జుడుం గూండాలను చంపి తన సాహసాన్ని చాటుకున్నాడు. 2005 సెప్టెంబర్‌లో కంపెనీ -2 కు బదిలీ అయ్యాడు.

ఫాసిస్టు దాడులను కొనసాగిస్తున్న సల్వాజుడుంను, కార్పెట్ సెక్యూరిటీలను ఓడించడంలో భాగంగా 2006 ఫిబ్రవరిలో

ఎన్.ఎం.డి.సి. జిలిటిన్ గోదాముపై దాడి చేసి 20 టన్నుల జిలిటిన్‌ను స్వాధీనం చేసుకున్న ఘటనలో పాల్గొని, పై బంకర్‌ను ఖతంచేసి దాడి సఫలం కావడంలో చురుకైన పాత్ర పోషించాడు. తర్వాత 'రోడ్ యాక్షన్ టీం'కు బదిలీ చేయబడ్డాడు. ఈ టీంలో వుంటూ, పరమక్రూరుడైన మహేంద్రకర్మ కాన్వాయ్‌పై చేసిన దాడిలో ఒక పోలీసు చావగా, నలుగురికి గాయాలయ్యాయి. 2006లో పి.ఎల్.జి.ఎ. వారోత్సవం సందర్భంగా రైలు పట్టాలను పేల్చేసి, వాకీటాకీలను స్వాధీనం చేసుకున్న ఘటనలో కామ్రేడ్ వర్గేష్ పాల్గొన్నాడు. కామ్రేడ్ వర్గేష్‌లో రాజకీయ, మిలటరీ నైపుణ్యం చూసిన పార్టీ 2006 మేలో పిపిసిలోకి ప్రమోట్ చేసింది. 2007 జూన్ 4న జుడుం నిర్బంధానికి వ్యతిరేకంగా చేపట్టిన పితూరి వారం సందర్భంగా కిరుందూల్‌కు రెక్కీ చేయడం కోసం వెళ్లినపుడు కామ్రేడ్ వర్గేష్ అరెస్టు అయ్యాడు. అనేక చిత్రహింసలను భరిస్తూ, పార్టీ మాటను పదిలంగా దాచాడు.

కామ్రేడ్ వర్గేష్ జైలులో వున్న కాలంలో ఖైదీల్లో రాజకీయ చైతన్యాన్ని పెంచాడు. 2007 డిసెంబర్ 16న దంతెవాడ జైలుబ్రేక్ చేసి, 299 మంది ఖైదీలు బయటికి రావడం చరిత్రలో చాలా ప్రముఖమైంది. ఈ సందర్భంగా జైలుకు ప్రొటక్షన్‌గా వున్న పోలీసులపై దాడి చేసి, తుపాకులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో కామ్రేడ్ వర్గేష్ భూమిక ఎంతో సాహసికమైనది. జైలులోని ఖైదీలందరితో రహస్యంగా సమావేశాలేసి, ప్లాన్ రూపొందించడంలో తన పాత్ర చురుకైనది. జహానాబాద్ జైలు బ్రేక్ తరువాత దంతెవాడ జైల్ బ్రేక్ ఘటన దేశవ్యాప్తంగా విప్లవ ప్రజానీకాన్ని, ప్రజాస్వామికవాదులను ఉర్రూతలూగించింది.

జైలు బ్రేక్ తర్వాత రీజనల్ కంపెనీ–2లో చేరిన కామ్రేడ్ వర్గేష్, కీర్తి పేరుతో 2008 మే నుండి 2009 వరకు సెక్షన్ కమాండర్‌గా పని చేశాడు. సెక్షన్ కమాండర్‌గా వుంటూ మొత్తం ప్లటూన్ సభ్యులకు రాజకీయ, మిలటరీ విషయాలను బోధించేవాడు. సమయం వృధా చేయక సభ్యులకు విజయవంతమైన దాడుల గురించి చెబుతూ యుద్ధంపట్ల ఆసక్తిని పెంచేవాడు. దామన్‌జోడి దాడిలో కామ్రేడ్ కీర్తి అసాల్ట్ టీం కమాండర్‌గా, తనకు ఇచ్చిన బాధ్యతలో పైన వున్న సెంట్రీని ఖతం చేసి, మరొక అసాల్ట్ టీంకు మద్దతు వెళ్తున్న సమయంలో శత్రువు తూటా తగిలి అక్కడికక్కడే అమరుడయ్యాడు.

కామ్రేడ్ కీర్తిలో క్రమశిక్షణ, సూటిగా విమర్శించే గుణం, అందరితో కలిసిపోయే మనస్తత్వం వుండేది. వర్గ పోరాటంలో ఎంత కష్టమయిన పనినైనా ఇష్టంగా చేశాడు. జైలులో అనేక చిత్రహింసలకు గురై ఆరోగ్యం దెబ్బతిన్నప్పటికీ, కష్టమైన పనులు చేయడంలో ఏమాత్రం వెనుకాడలేదు. సుదీర్ఘమయిన ప్రయాణంలో కూడా బరువులు మోసేవాడు. క్యాడర్ పట్ల ప్రేమగా వ్యవహరించేవాడు. మిలటరీ విషయాలను నేర్చుకునేందుకు నిరంతరం శ్రద్ధ కనపరిచేవాడు. కామ్రేడ్ కీర్తిలోని ఆదర్శాలను ఎత్తిపడుదాం.

## కామ్రేడ్ సుక్‌రాం

కామ్రేడ్ పూనెం సుక్‌రాం ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం (బీజాపూర్ జిల్లా) పశ్చిమ బస్తర్ డివిజన్ గంగలూరు ఏరియా మెట్టపాడు గ్రామంలో నిరుపేద కోయ ఆదివాసీ కుటుంబంలో 3వ సంతానంగా జన్మించాడు. తన తల్లి చిన్న తనంలోనే అనారోగ్యంతో చనిపోయింది. పశ్చిమబస్తర్‌లో విప్లవోద్యమం బలంగా వున్న గ్రామంలో మెట్టపాడు ఒకటి.

కామ్రేడ్ సుక్‌రాం చిన్ననాటి నుంచి విప్లవ ప్రజా సంఘాల కార్యక్రమాలకు ఆకర్షితుడై క్రాంతికారీ బాలల సంఘంలో చేరి గ్రామంలో జరిగే అన్ని కార్యకలాపాల్లో చురుగ్గా పాల్గొంటూ, క్రమంగా విప్లవ రాజకీయ చైతన్యాన్ని పెంచుకున్నాడు.

సల్వాజుడుం బీభత్సానికి గురైన గ్రామాల్లో మెట్టపాడు ఒకటి. కామ్రేడ్ సుక్‌రాం ఇంటిపై కూడా దాడి చేసి ఇల్లు తగులబెట్టారు. ఈ బీభత్సాల్ని కళ్లారా చూసిన కామ్రేడ్ సుక్‌రాంలో వర్గ కసి పెరిగింది. సల్వాజుడుంను ఓడించడానికి మిలీషియాలో చేరి విల్లుకాడి చేతబట్టి 24 గంటలు సెంట్రీ, పెట్రోలింగ్‌లు చేసేవాడు. సల్వాజుడుంను అడ్డుకోవడానికి ఆపరేషన్ గంగులూర్ పేరుతో గంగులూరు శిబిరంపై దాడి చేసి 8 మంది ఎస్.పి.ఒ. గూండాలను చంపిన ఘటనలో కా. సుక్‌రాం పాల్గొన్నాడు.

మెట్టపాడు, పుంబాడు, కమ్‌కకు వచ్చే సల్వాజుడుం గూండాలను పట్టుకొని, ప్రజల ముందు పెట్టి ప్రజాకోర్టు నిర్వహించడంలోనూ పాల్గొనేవాడు. ఈ గ్రామాలకు వచ్చే పోలీసులను అడ్డుకోవడానికి అనేక రకాల చర్యలతో చికాకు పర్చేవాడు. 2008 ఫిబ్రవరిలో పూర్తికాలం కార్యకర్తగా గంగులూరు దళంలో చేరాడు. కామ్రేడ్ సుక్‌రాంలో వుండే ధైర్యసాహసాలు, చురుకుదనం, క్రమశిక్షణ, కష్టపడి పనిచేసే పట్టుదలను చూసి ప్రధాన బలగంలోకి పంపాలని డీవీసీ తీర్మానం చేసింది. దాన్ని ఆమోదించి జిల్లా సరిహద్దులను చెరిపివేస్తూ కా. సుక్‌రాం కంపెనీలో చేరాడు.

2008 మేలో ఏర్పడిన సి.ఆర్.సి.–2వ కంపెనీలో సభ్యుడిగా చేరి కంపెనీ చేసిన అన్ని చర్యల్లో ముందు వరుసలో వున్నాడు. 2008 జూన్‌లో జరిగిన బండ 2వ ఆంబుష్‌లో మొదటి అసాల్ట్

టీంలో వుండి కమాండర్ కాషన్స్‌తో అడ్వాన్స్ అయ్యాడు. నవంబర్‌లో ఛత్తీస్‌గఢ్ శాసనసభ ఎన్నికల సందర్భంగా ప్రొటక్షన్‌గా వచ్చి, పూజారి కాంకేర్‌లో క్యాంపు వేసిన బి.ఎస్.ఎఫ్.పై ఫైరింగ్ చేసిన దాంట్లో, ఆల్బాకలో ఇన్‌ఫార్మర్ సతీష్‌ను చంపడంలో కామ్రేడ్ సుక్రాం పాల్గొన్నాడు.

2009లో ఒడిషా రాష్ట్రంలో మల్కన్‌గిరి జిల్లా గోవిందపల్లి ఏరియాలో సప్తధార ప్రాజెక్టుకు వ్యతిరేకంగా గోవిందపల్లి ఔట్ పోస్టుపై చేసిన దాడిలో కామ్రేడ్ సుక్రాం చురుకుగా పాల్గొన్నాడు.

దామన్‌జోడి దాడిలో కామ్రేడ్ సుక్రాం రిజర్వు టీంలో వున్నాడు. జిలిటిన్ గోడౌన్ ఓపెన్ చేసేందుకు కమాండర్ కాషన్‌తో కామ్రేడ్ సుక్రాం తన దగ్గర తుపాకీ లేకపోయినా శత్రువు రాపిడి ఫైర్ చేస్తున్నా, ప్రాణాన్ని లెక్క చేయకుండా గడ్డపార పట్టుకొని అడ్వాన్స్ అవుతున్న క్రమంలో గుండెకు శత్రువు తూటా తగిలి నేలకొరిగాడు.

కామ్రేడ్ సుక్రాంలో మంచి కష్టపడేతత్వం, సాహసం, క్రమశిక్షణ, పట్టుదల వుండేవి. గ్రౌండ్‌లో పి.టి., డ్రిల్స్‌తో పాటు అనేక కొత్త విషయాలను నేర్చుకోవడానికి ప్రయత్నం చేసేవాడు. కామ్రేడ్ సుక్రాం సాహసిక వీరత్వం పి.ఎల్.జి.ఎ. శ్రేణులకు సదా ఆదర్శం. కామ్రేడ్ సుక్రాం ఆశయాలను కొనసాగిస్తామంటూ ప్రతిజ్ఞ చేద్దాం.

## కామ్రేడ్ మంగు (రఘు)

దండకారణ్యంలోని పశ్చిమ బస్తర్ డివిజన్ పిడియా ఏరియాలోని చిన్నగొట్టోడు గ్రామంలో నిరుపేద ఆదివాసీ కుటుంబంలో నాలుగవ సంతానంగా పురుడుపోసుకున్నాడు కామ్రేడ్ రఘు. తల్లిదండ్రులు తనకు ముద్దుగా పెట్టుకున్న పేరు మంగు. తను చిన్న వయసులో వున్నప్పుడే తండ్రి తీవ్ర అనారోగ్యానికి గురై, వైద్యం చేయించుకోవడానికి డబ్బులు లేక మరణించాడు. తల్లి కూలి పనులు చేస్తేనే పొట్టగడిచేది. తన గ్రామంలో విప్లవ రాజకీయాలు కొనసాగుతున్నందున సహజంగానే మంగు విప్లవ రాజకీయాలకు ఆకర్షితుడై క్రాంతికారీ బాలల సంఘంలో చేరి, ప్రజాసంఘాలు నిర్వహించే ప్రతి కార్యకలాపంలో చురుగ్గా పాల్గొనేవాడు. క్రమంగా చైతన్యం పెంచుకొని 2006 డిసెంబర్ 16న పూర్తికాలం కార్యకర్తగా పిడియా దళంలో చేరి ఆయుధాన్ని చేతికందుకున్నాడు. కామ్రేడ్ మంగులో వున్న క్రమశిక్షణ, చొరవ, చురుకుదనంను గమనించి ప్రధాన బలగంకు మార్చారు. 2007 మే నెలలో ఏర్పడిన రీజినల్ కంపెనీకి బదిలీ అయ్యాడు. కంపెనీ నిర్వహించిన కార్యక్రమాలన్నింటిలో పాల్గొన్నాడు.



ఎ.ఒ.బి.లో హైవవర్ కరెంట్ స్థంబాలను ధ్వంసం చేయడంలోనూ, కాంట్రాక్టర్ల, భూస్వాముల ఇండ్లపై దాడులు చేసి భూస్వాములను చంపడం, ఆస్తులను స్వాధీనం చేసుకొని ప్రజలకు పంపిణీ చేసిన చర్యల్లో, బైలడిల్ల నుండి విశాఖకు వెళ్లే ఎస్.ఆర్. పైప్‌లైన్‌ను కట్ చేసిన చర్యల్లో, ప్రచార క్యాంపెయిన్‌లలో, ఇంకా అనేక చర్యల్లో కామ్రేడ్ రఘు చాలా ఉత్సాహంగా పాల్గొన్నాడు. ఈయనలో వున్న ధైర్య సాహసాలను చూసి కంపెనీ కమిటీ 2007 ఆగస్టులో కంపెనీ కమిస్సారైన కామ్రేడ్ సూర్యంకు గార్డుగా నియమించారు. అప్పటి నుండి కామ్రేడ్ రఘు గార్డు పని పద్ధతులను ఆకలింపు చేసుకొని ఎంతో క్రమశిక్షణగా తన బాధ్యతలను నిర్వర్తించాడు.


2008 ఫిబ్రవరి 15న జరిగిన 'నయాగఢ్ రోప్‌వే'లో కామ్రేడ్ రఘు 2వ టార్గెట్‌లో అసాల్ట్ గ్రూపులో వుండి పై బంకర్‌ను క్లియర్ చేసే బాధ్యతను చాలా చక్కగా నిర్వర్తించాడు. 2వ రోజు గోసామా పర్వతాల్లో జరిగిన హెూరాహెూరీ యుద్ధంలోను ప్రత్యక్షంగా పాల్గొన్నాడు. 2008 మే నెలలో సి.ఆర్.సి. కంపెనీ–2కు బదిలీ అయ్యాడు. బండ రెండవ ఆంబుష్‌లో, తేమేల్‌వాడ ఆంబుష్‌లో, 2008 ఛత్తీస్‌గఢ్ ఎన్నికలకు ప్రొటక్షన్‌గా వచ్చి పూజారీ కాంకేర్ వద్ద క్యాంపు వేసిన బి.ఎస్.ఎఫ్. బలగాలపై కాల్పులు చేసిన ఘటనలో, ఆల్బాకలో ఇన్‌ఫార్మర్‌ను చంపిన ఘటనలో, ఎ.ఒ.బిలోని మల్కన్‌గిరి జిల్లా గోవిందపల్లి ఏరియాలో సప్తధార ప్రాజెక్టుకు వ్యతిరేకంగా చేసిన దాడిలో కామ్రేడ్ రఘు అత్యంత ఉత్సాహంగా, ధైర్య సాహసాలతో పాల్గొన్నాడు.

కామ్రేడ్ రఘు 2007, 2008లో జరిగిన మిలటరీ శిక్షణలో పాల్గొని బహుమతులు పొందాడు. కమ్యూనికేషన్ నేర్చుకుని కంపెనీ చేపట్టిన ఆంబుషుల్లో స్కాట్ టీంలో వుండి సమాచారాన్ని అందజేసేవాడు.

కామ్రేడ్ రఘు కువ్వి, ఒడియా, తెలుగు భాషలు రాకపోయినా నేర్చుకునేందుకు ప్రయత్నం చేస్తూ, కువ్వి ప్రజలతో, చిన్న పిల్లలతో, వృద్ధులతో సహితం కలిసిపోయి వచ్చీరాని కువ్వి భాషలో మాట్లాడుతూ, వాళ్లకు పార్టీ రాజకీయాలు చెప్పేవాడు. కామ్రేడ్ రఘు ఎక్కడ వున్నా కొత్త, పాత అనే తేడా లేకుండా ప్రజలతో, తోటి సహచర కామ్రేడ్స్‌తో ప్రేమగా కలిసిమెలసి వుంటూ వారి అభిమానాన్ని చూరగొన్నాడు. ⇨

# పాక్‌–ఆఫ్ఘన్ సరిహద్దు స్వాత్ లోయలో పష్తూన్ జాతి విమోచనోద్యమం

పాకిస్తాన్ వాయువ్య సరిహద్దు రాష్ట్రం బాగా వెనుకబడిన చిన్న ప్రాంతం. అందులో భాగమైన ఆదివాసీ ప్రాంతం (ఫెడరల్ అడ్మినిస్టర్డ్ ట్రైబల్ ఏజెన్సీ–ఎఫ్.ఏ.టి.ఏ.–ఫాటా) దూరంగా విసిరివేయబడ్డ మారుమూల కొండ ప్రాంతం. ఇందులో స్వాత్ లోయ నేడు నెత్తురోడుతోంది. పాకిస్తాన్ సేనల ముట్టడిలో తల్లడిల్లుతోంది. స్వాత్ జిల్లాలో టెర్రరిస్టుల ఏరివేత పేరిట పాకిస్తాన్ ఇరవై వేల సైన్యాల, వందలాది యుద్ధ హెలికాప్టర్ల అండతో యుద్ధం సాగిస్తోంది. కేవలం పది రోజుల్లోనే పాకిస్తాన్ ప్రభుత్వ అధికారిక లెక్కల ప్రకారమే 17 లక్షల జనాభా గల ప్రాంతం నుంచి 11 లక్షల మంది నిర్వాసితులయ్యారు. వేలమందిని పిట్టల వలె కాల్చిచంపుతున్నారు. ఐదారు వందల మంది తాలిబాన్ మిలిటెంట్లను మట్టుబెట్టే పేరిట ఈ నరమేధం సాగుతోంది. అయినా సోకాల్డ్ నాగరిక ప్రపంచం ప్రేక్షక పాత్రను పోషిస్తోంది. తాలిబన్ల మీద పథకం ప్రకారం అదే పనిగా చేసిన విషప్రచారం, విద్వేషాలు వంటబట్టిన సభ్యసమాజం మౌనంగా వుంది. ఫలితంగా నరమేధం సాఫీగా సాగుతోంది.




స్వంత పౌరుల మీద ఆయా దేశాల ప్రభుత్వాలు ఫాసిస్టు యుద్ధాలు చేయడం ప్రపంచంలో కొత్తకాదు. సార్క్‌లో మూడు సభ్య దేశాలు నేడు సాగిస్తున్న యుద్ధాలు అలాంటివే. కాశ్మీర్ జాతీయ విమోచనోద్యమాన్ని భారత పాలకవర్గాలు నెత్తుటేరుల్లో ముంచుతున్నాయి. శ్రీలంక ప్రభుత్వం తమిళుల మీద సింహళ జాత్యహంకార యుద్ధాన్ని సాగించింది. పాకిస్తాన్ ప్రభుత్వం పష్తూన్, బెలూచీ జాతుల మీద సాగిస్తున్న యుద్ధం కూడా ఇలాంటిదే. ఇలాంటి ఘటనలు ప్రపంచ చరిత్రలో అనేకం వున్నాయి. అయితే మన దక్షిణాసియాలోని కాశ్మీరీ, తమిళ జాతుల సమకాలీన విమోచనోద్యమాలకు లభించిన కనీస ఆదరణ, ప్రాచుర్యాలు పష్తూన్ జాతీయ విమోచనోద్యమానికి లభించలేదు.

స్వాత్‌పై ఇప్పుడు జరిగే యుద్ధం హఠాత్తుగా ఆకాశం నుంచి ఊడిపడింది కాదు. దీని వెనుక సుదీర్ఘ యుద్ధ పరిణామ చరిత్ర వుంది. స్వాత్‌పై తాజా యుద్ధం పాత చరిత్రను తవ్వి వెలికి తీస్తున్నది. నేడు అక్కడ ప్రవహిస్తున్న ప్రజల నెత్తుటి ధారల నుంచి కొత్త తిరుగుబాటు ధోరణులు పుట్టుకొస్తున్నాయి.

స్వంత దేశ పౌరుల మీద పాకిస్తాన్ ప్రభుత్వం తన తొలిదశ యుద్ధాన్ని దక్షిణ వజిరిస్తాన్‌లో 2004లో ప్రారంభించింది. జార్జిబుష్ రెండవసారి అమెరికా అధ్యక్షునిగా గెలిచేందుకు, టెర్రరిజం భూతాన్ని ఓడించే పేరిట పాకిస్తాన్ సైన్యంతో ఈ యుద్ధం చేయించడం అవసరమైంది. ఇందులో వందలాది మందిని చంపగా, వేలమందిని నిర్బంధించారు. దక్షిణ వజిరిస్తాన్ వల్లకాడుగా మారింది. ఆనాడు 10వేల పాక్ సైన్యం పాల్గొంది. ఆ తర్వాత అది ఉత్తర వజిరిస్తాన్‌పై, తర్వాత ఖుర్రం ఏజెన్సీపై విరుచుకుపడింది. ఆ తర్వాత ఖైబర్, మహమండ్, బజౌర్ ఏజెన్సీల మీద వరుసగా యుద్ధం సాగించింది. పైన పేర్కొన్న ఆరు ఏజెన్సీలను ఫాటాగా పిలుస్తారు. 2005 నాటికి ఈ ప్రాంతంలో పాక్ సైన్యం సంఖ్య 50 వేలకు చేరుకుంది. 2006 సెప్టెంబర్‌లో వజిరిస్తాన్‌తో పాక్ ప్రభుత్వం శాంతి ఒప్పందం చేసుకునే నాటికి ఈ సంఖ్య 80 వేలకు చేరింది. ఒక చిన్న, ఆదివాసీ ఏజెన్సీ ప్రాంతంలోని స్వంత పౌరుల మీద

---

⇨

కామ్రేడ్ రఘు తోటి కామ్రేడ్స్ తప్పులను నిర్మొహమాటంగా విమర్శించేవాడు. సమిష్టి పనులు చేయడంలో, బరువులు మోయడంలో పోటీపడుతూ వుండేవాడు.

నాల్కో రెయిడ్‌లో మొదటి అసాల్ట్ గ్రూపులో వుండి, పై బంకర్‌ను క్లియర్ చేసే బాధ్యతలో భాగంగా కొద్ది మంది పోలీసులను చంపుతూ, మరికొందరిని సరెండర్ చేసుకుంటూ శత్రువుపై రాపిడి ఫైరింగ్‌లో అడ్వాన్స్ అవుతున్న క్రమంలో కామ్రేడ్ రఘు తలకు తూటా తగిలి నేలకొరిగాడు.

కామ్రేడ్ రఘులోని పట్టుదల, విశాల మనస్తత్వం, ధైర్య సాహసాలు, చూపుల్లో చురుకుదనం, చేతల్లో సూటిదనం లాంటి ఆదర్శాలను ఎత్తిపడుతూ, నవసమాజ నిర్మాణానికి త్యాగాల బాటలో ముందుకు నడుద్దాం. ★

యుద్ధానికి 80 వేల ఆధునిక సైనిక బలగాలను కేంద్రీకరించడం అక్కడి పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది.

పాక్ రాజ్యాంగం ప్రకారం వాయువ్య సరిహద్దు రాష్ట్రం (ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి) పాలనాపరంగా రెండు భాగాలుగా వుంటుంది. ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి. ప్రొవిన్షియల్ ప్రభుత్వ ప్రత్యక్ష పౌర వరిపాలనలోని ప్రాంతాలు ఒక భాగంగా వుంటాయి. ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి. ప్రభుత్వం నియమించిన పొలిటికల్ ఏజెంట్ల ద్వారా పరోక్ష పాలనా ప్రాంతాలు మరో భాగంగా వుంటాయి. ఈ రెండవ భాగాన్నే ఫాటాగా పిలుస్తారు. ఈ ఫాటాకు చెందిన ఏజెన్సీ ప్రాంతాలలో సంప్రదాయ గిరిజన పెద్దల మండలి (షురు) నిర్వహించే ఆదివాసుల పంచాయితీ వ్యవస్థకు పాకిస్తాన్ రాజ్యాంగం ప్రత్యేక మినహాయింపు నిచ్చింది. అందుకే ఫాటాకు స్వయంపాలిత ప్రాంతపు హెూదా వుంది. ఇందులో పైన పేర్కొన్న ఏడు ఏజెన్సీలు వున్నాయి. ప్రత్యక్ష పాలనా ప్రాంతంలో మాలాఖండ్ డివిజన్ వుంటుంది. ఈ డివిజన్‌లోని ఏడు జిల్లాల్లో స్వాత్ ఒకటి. ప్రస్తుతం వార్తల్లో కెక్కిన బునేర్, దీర్ జిల్లాలు కూడా మాలాఖండ్ డివిజన్‌లోనివే. ప్రత్యక్ష పాలనా ప్రాంతాలలోని చిత్రాల్, ఎగువ దీర్, దిగువ దీర్ జిల్లాలు ఆఫ్ఘనిస్తాన్‌తో సరిహద్దును కలిగి వుంటాయి. కానీ, స్వాత్, బునేర్ జిల్లాకు అలాంటి సరిహద్దు లేదు. కాబట్టి ఆఫ్ఘనిస్తాన్ నుంచి వచ్చి తలదాచుకుంటున్న తాలిబాన్, అల్‌ఖాయిదా నేతల్ని లక్ష్యంగా చేసుకొని ఈ యుద్ధం సాగటం లేదు. ఇక్కడి దాకా వారు వచ్చే అవకాశం లేదు. ఇందుకు భిన్నంగా పష్తూన్ జాతీయ విమోచనోద్యమానికి ఈ ప్రాంతం ఇరుసుగా మారడమే దీనికి ప్రధాన కారణం.

2006 సెప్టెంబర్ 5న వజిరిస్తాన్ తాలిబన్లతో స్థానిక గిరిజన పెద్దల సభ మధ్యవర్తిత్వంతో ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి. ప్రభుత్వం ఒక శాంతి ఒప్పందం చేసుకునే నాటికి తాలిబన్ల ప్రతిఘటనలో వందల మంది పాకిస్తాన్ సైనికులు మట్టిగరిచారు. దీంతో పాక్ సైన్యంలో అసంతృప్తి బాగా పెరిగింది. స్వంత పౌరులే కాకుండా స్వమతస్తులు కూడా అయిన ఆదివాసీ ప్రజల మీద యుద్ధం చేయడాన్ని దిగువస్థాయి సైనికులు వ్యతిరేకించారు. మరోవైపు యుద్ధాన్ని మరింత ఉధృతం చేయాల్సిందిగా ముషారఫ్ ప్రభుత్వం మీద అమెరికా ఒత్తిళ్లు కొనసాగాయి. ఈ ఒత్తిడి కన్నా తాలిబాన్ ప్రతిఘటన తీవ్రస్థాయిలో వుండటంతో వారితో పాక్ ప్రభుత్వం శాంతి ఒప్పందం చేసుకోవాల్సి వచ్చింది. అప్పటికే పాక్ తాలిబాన్ల బందీలుగా వున్న సుమారు 50మంది సైనికుల విడుదల, సుమారు 200 మంది పాక్ తాలిబాన్ల, ఆదివాసీ బందీల విడుదల, వజిరిస్తాన్‌లో, సైనిక క్యాంపుల ఎత్తివేత, నిషేధాజ్ఞల వుపసంహరణ, పాక్ తాలిబాన్లపై ఆయుధాలతో తిరగకుండా నిషేధం మొదలైనవి ఈ ఒప్పందంలో చోటు చేసుకున్నాయి. ఇది ఆచరణలో పాక్ తాలిబాన్లను బలోపేతం చేసింది. ప్రశాంతత ఏర్పడింది. ప్రజలు హర్షించారు.

కాని అమెరికా ఒత్తిళ్లు, పాక్‌కు అదనపు రుణ మంజూరు ఎరల ఫలితంగా ముషారాఫ్ ప్రభుత్వం అర్ధాంతరంగా ఒప్పందం నుంచి కుంటిసాకులతో వైదొలిగింది. తిరిగి అదనపు సేనలను మోహరించి మరో దశ యుద్ధాన్ని మరింత విస్తృతంగా తలపెట్టింది. ఫలితంగా ఆదివాసీ ఏజెన్సీలు కల్లోలిత ప్రాంతాలుగా మారాయి. పాక్ తాలిబాన్లతో పాటు వారిని ఆదరించి, ఆశ్రయమిస్తున్నట్లు (శాంతి ఒప్పందం తర్వాత స్వేచ్ఛకాలంలో) ప్రభుత్వం ధృవీకరించుకున్న వాంటెడ్ టెర్రరిస్టులను వేటాడే పేరిట మరోసారి నరమేధం ప్రారంభమైంది. ఫలితంగా మరోసారి ప్రజలపై యుద్ధం మొదలైంది.

శాంతి ఒప్పందానికి సరిగ్గా మూడు నెలల ముందు 2006 జూన్ 7న హిందూ పత్రికకు ఇస్లామాబాద్ నుంచి ప్రముఖ పాత్రికేయుడు నిరుపమ సుబ్రహ్మణ్యం పంపిన ఒక వార్త ఇలా వుంది. "వజిరిస్తాన్ ఆదివాసీ ప్రాంతాల్లో 80వేల పాక్ సైన్యం వుంది. ఇప్పటికే పోరులో 350 నుంచి 400 మంది వరకు సైనికులు మృతి చెందారు. 800 మంది గాయపడ్డారు. ఈ విషయాలను బట్టి ప్రతిఘటన తీవ్రతను అంచనా వేసుకోవచ్చు. ఫలితంగానే ప్రభుత్వం రాజీకి సిద్ధపడింది. అయితే విదేశీ ఒత్తిళ్లు ఈ ప్రశాంతతను భగ్నం చేశాయి. ప్రజల బతుకులను మళ్లీ ఛిద్రం చేశాయి. ఇటు ప్రజలతో పాటు, అటు సైనికులు కూడా అమెరికా నెత్తుటి దాహానికి మళ్లీ బలిపశువులయ్యారు.

ముషారఫ్ తదనంతరం ఎన్నికల ద్వారా గద్దెనెక్కిన పౌర ప్రభుత్వం కూడా పాక్ తాలిబాన్ సంస్థలతో ఆదివాసీ ఏజెన్సీలతో ఒప్పందాలకు సిద్ధపడింది. కొన్ని ప్రాంతాలలో స్థానిక స్థాయిలో ఒప్పందాలు జరిగాయి. అవి ప్రజలకు ఊరటనిచ్చాయి. కానీ వాటిని ఎక్కువ కాలం అమెరికా మిగలనివ్వకుండా చేసింది. ఇవన్నీ ఒక ఎత్తు! 2009 ఫిబ్రవరి 16న జరిగిన స్వాత్ ఒప్పందం మరో ఎత్తు.

స్వాత్ ఒప్పందానికి పది రోజుల ముందు పాకిస్తాన్ ప్రభుత్వం 2009 ఫిబ్రవరి 6న ఒక రిపోర్టు విడుదల చేసింది. గత ఐదేండ్ల కాలంలో వాయువ్య సరిహద్దు రాష్ట్రంలో మిలిటెంట్ల అణచివేతకై తమ ప్రభుత్వం సాగించిన పోరు తగిన ఫలితాలనివ్వడం లేదని అది అంగీకరించింది. పైగా తాము ఎక్కువ నష్టాలు పొందామన్నది. ఇంతవరకూ పోరులో తాము 1450 మంది సైనికులను కోల్పోయామన్నది. మూడున్నర వేల మందికి పైగా గాయపడ్డారని చెప్పింది. ఈ నేపథ్యంలో 2009 ఫిబ్రవరి 16న సూఫీ మహమ్మద్

(మత పెద్ద) మధ్యవర్తిత్వంతో ఒప్పందం కుదిరింది. ఈ శాంతి ఒప్పందం పట్ల లక్షల మంది ప్రజలు హర్షిస్తూ కేరింతలు కొట్టారు. స్వాత్‌లో భారీ ర్యాలీ జరిగింది. కాని ఈ ఒప్పందం పట్ల అమెరికా, నాటో దేశాలు పచ్చి విద్వేషాన్ని వెళ్లగక్కాయి. పాకిస్తాన్ పౌర శక్తులతో ఒప్పందాలు చేసుకునే హక్కు పాకిస్తాన్ పౌర ప్రభుత్వాలకు ఉంది. కానీ 'నీ ప్రజలతో ఒప్పందాలు చేసుకునే హక్కు నీ ప్రజల చేత ఎన్నికైన నీ పౌర ప్రభుత్వానికి లేదు' అంటూ ఒబామా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడం గమనార్హం. తమ ఒత్తిళ్లకు లొంగకపోతే ఒకవైపు రుణాలపై ఆంక్షలతో బెదిరిస్తూ, మరోవైపు టెర్రరిస్టులకు పాక్ ప్రభుత్వం అమ్ముడుబోయిందంటూ సామ్రాజ్యవాద మీడియా ద్వారా అప్రతిష్టపాలు చేయడం – ఇదీ అమెరికా తీరు.

పాలస్తీనాలో ఓస్లో శాంతి ఒప్పందం, శ్రీలంకలో ఎల్.టి.టి.ఇ.తో శాంతి ఒప్పందం, ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టులతో శాంతి చర్చల అనుభవాలున్నాయి. ప్రభుత్వాలు తాము చేసుకున్న ఒప్పందాలను తామే ఉల్లంఘించాయి. ఏనాడు ఆయా ప్రభుత్వాలు శాంతి ఒప్పందాలను చిత్తశుద్ధితో గౌరవించలేదు. చర్చల ద్వారా కొన్ని తక్షణ ఫలితాలతో పాటు తాత్కాలిక ప్రశాంతతను సాధిస్తే ప్రజలకు ఒకింత ఉపశమనం లభిస్తుందని పోరాట సంస్థలు చిత్తశుద్ధితో అందుకు కృషి చేశాయి. కానీ ఇంటా, బయటా దోపిడీ వర్గశక్తుల ఒత్తిళ్ళకు ప్రభుత్వాలు తలవంచి ఒప్పందాల ఉల్లంఘనకు బరితెగిస్తున్నాయి. పైగా తమ చెప్పు చేతల్లోని మీడియా ద్వారా పోరాట సంస్థలే ఉల్లంఘనకు పాల్పడుతున్నాయంటూ తీవ్ర నిందా ప్రచారం చేయిస్తాయి. అంతవరకూ అదే మిలిటెంట్ సంస్థలతో బాగానే చర్చల్లో పాల్గొంటాయి. కుంటిసాకులతో ఒప్పందాలు రద్దు చేశాక అదే సంస్థలను ఉగ్రవాద సంస్థలుగా నిందిస్తాయి. సరిగా ఇదే చరిత్ర స్వాత్ ఒప్పందంలోనూ పునరావృతమైంది.

ఈ నేపథ్యంలోనే స్వాత్ శాంతి ఒడంబడిక తర్వాత స్వాత్ మిలిటెంట్లు క్రూరులనీ, ఆటవికులనీ, అనాగరికులనీ ప్రచారం చేయటం జరిగింది. తద్వారా ప్రపంచ దేశాల అభిప్రాయాలను మరోసారి పాక్ తాలిబాన్లపై యుద్ధం వైపుగా మళ్లించి, వారితో ఒప్పందం చేసుకున్న పాకిస్తాన్ ప్రభుత్వంపై ప్రపంచ దేశాల ద్వారా వత్తిడి తెచ్చి మెడలు వంచే ప్రయత్నం అమెరికా చేసింది. ఈ ద్విముఖ లక్ష్యాలను అమెరికా ఆచరణలో చాలా వరకూ సాధించగలిగింది.

ఈ సందర్భంగా తొలుత చారిత్రక కోణంలో స్వాత్ తిరుగుబాటుదార్ల లక్ష్యాలను విశ్లేషించాల్సి వుంది. స్వాత్ మిలిటెంట్ల భావజాలంతో ప్రగతిశీల శక్తులు ఏకీభవించవు. వారు సాంఘికంగా తిరోగామి పాత్రను పోషించినప్పటికినీ, నేటి అంతర్జాతీయ పరిస్థితుల్లో వారి రాజకీయ కార్యాచరణ సామ్రాజ్యవాద వ్యతిరేకమైనది. స్వాత్ మిలిటెంట్లు పోషించే చారిత్రక, రాజకీయ, సాంఘిక పాత్రలను కూడా ఈ చారిత్రక కోణంలో నుంచి పరిశీలించాల్సి వుంది. వారు సామ్రాజ్యవాద వ్యతిరేక పాత్రను పోషిస్తున్నంత వరకూ చారిత్రకంగా వారి పాత్ర విప్లవకరమైనదే. ఒకవైపు సాంఘికంగా వారి మత ఛాందస, సనాతన భావజాలాన్ని దృఢంగా వ్యతిరేకించుతూనే, మరోవైపు విప్లవ రాజకీయ కార్యాచరణను స్వాగతించాల్సి వుంది.

పర్షియా (ఇరాన్)లో ఇస్లామిక్ విప్లవం తలెత్తినప్పుడు జారిస్టు రష్యా సేనలు (కొసక్కులు) క్రూరంగా అణచివేశాయి. ఈ సందర్భాన్ని ప్రస్తావిస్తూ 1908లో లెనిన్ 'రష్యా దేశపు క్రైస్తవ సేనలు అంతర్జాతీయ శిరచ్ఛేదకుల పాత్రను పోషించడం ఇది మొదటిసారి కాదు' అన్నాడు. 'మేల్కొంటున్న ఆసియా'ను గూర్చి 1913 మే 7న లెనిన్ రాసిన ఒక వ్యాసంలో 'జావాలో జాతీయ ఉద్యమం ఇస్లామిక్ బ్యానర్ కింద నడుస్తున్నది' అన్నాడు. ఇంకా మహా ఇస్లామిక్ వుద్యమాన్ని అణచివేసే పేరిట నాగరికత ముసుగులోని యూరప్ దేశాలు సమైక్యం కావడాన్ని సైతం లెనిన్ తీవ్రంగా వ్యతిరేకించాడు. కాని ప్రస్తుతం తాలిబాన్లను ఇండియా వంటి సోకాల్డ్ సెక్యులర్ ప్రజాస్వామిక దేశాలతో సహా సోకాల్డ్ నాగరిక ప్రపంచం పిచ్చికుక్కలుగా ముద్రవేసింది. వారిని నిర్దాక్షిణ్యంగా మట్టుబెట్టడమే పరమ పవిత్రమని మీడియా తెగ ప్రచారం చేస్తున్న కాలమిది. ప్రజలు కూడా నమ్ముతున్న సమయమిది. పాక్ తాలిబాన్లకు ఏ ప్రచారానికీ అవకాశం లేని పరిస్థితి వుంది. ఒకవేళ భిన్న స్వరం ఏదో ఒక మేరకు వినిపించినా ఈ విద్వేషం ఎదుట తెరమరుగున పడుతోంది. స్వాత్ శాంతి ఒప్పందాన్ని పాక్ తాలిబాన్లు వుల్లఘించారన్న పాక్ ప్రభుత్వ ప్రచారమే నేడు రాజ్యమేలుతున్నది. నిష్పాక్షిక దృష్టితో పరిశీలిస్తే నిజానికి ఒప్పంద ఉల్లంఘనకి పాక్ ప్రభుత్వమే పాల్పడిందని తేటతెల్లమౌతోంది.

శాంతి ఒప్పందంలో ఒక షరతు మాలాఖండ్ డివిజన్‌లోని ఏడు జిల్లాల్లో షరియత్ చట్టం అమలు కావడం. మాలాఖండ్‌లో ప్రతిపాదిత షరియత్ చట్టం కొత్తది కాదు. 1969కి ముందు అక్కడ షరియత్ చట్టం అమలులో వుండేది. ఈ షరియత్ చట్టం ద్వారా తమకు సత్వర న్యాయం, తక్కువ వ్యయంతో జరుగుతుందని ప్రజలు విశ్వసిస్తున్నారు. నేటి పాకిస్తాన్ చట్టాల ప్రకారం అప్పీళ్ల పేరిట పెషావర్ హైకోర్టు, ఇస్లామాబాద్ సుప్రీం కోర్టు వరకూ దశాబ్దాల పాటు కాళ్లు అరిగేలా తిరగాల్సి వస్తుందనే అసంతృప్తి ప్రజల్లో వుంది. అందుకే పాత షరియత్ చట్టం పునరుద్ధరణను ప్రజలు పదే పదే కోరుతున్న భౌతిక పరిస్థితి అక్కడ వుంది. దీని

కంటే ఇందులో దాగిన మరో ముఖ్యమైన రాజకీయ కోణాన్ని పరిశీలించాల్సి వుంది.

ఇటీవల ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి. రాష్ట్రంలో ముఖ్యంగా ఫాటా ప్రాంతంలో కూంబింగ్ పేరిట అరెస్టు చేసిన సుమారు 600 మంది స్థానిక మిలిటెంట్లను ప్రావిన్షియల్ ప్రభుత్వం ఇస్లామాబాద్ ఫెడరల్ ప్రభుత్వానికి అప్పగించింది. అందులో కొందరు ముఖ్యులను ఈ ఫెడరల్ ప్రభుత్వం అమెరికా ఎఫ్.బి.ఐ.కి అప్పగించింది. ఇది వీరిని నెలల తరబడి ఎటువంటి విచారణ లేకుండా చిత్రహింసల శిబిరాల్లో హింసిస్తున్నది. ఆఫ్ఘనిస్తాన్‌పై అమెరికా దురాక్రమణ తర్వాత, ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి., బెలూచిస్థాన్ రాష్ట్రాలలో 54 వేల ఎకరాల స్థలాలను అమెరికా సైనిక అవసరాల కోసం 99 ఏళ్లపాటు ముషారఫ్ ప్రభుత్వం ఇచ్చిన విషయం తెలిసిందే. తమ సాటి ఆఫ్ఘన్ దేశభక్తుల అణచివేతకు ఈ విధంగా వేలాది ఎకరాలను అమెరికాకు ధారాదత్తం చేయటాన్ని పాక్ దేశభక్తియుత శక్తులు తొలి నుంచి వ్యతిరేకిస్తున్నాయి. ఇప్పుడు పాకిస్తాన్ పౌరుల చిత్రహింస శిబిరాలుగా వాటిని వినియోగించడాన్ని భరించలేకపోతున్నారు. ముఖ్యంగా వాయువ్య సరిహద్దు రాష్ట్రంలోని 107 మంది మహిళా మిలిటెంట్లను కూడా హింసించటం తమ సాంప్రదాయ, సాంస్కృతిక విలువల ఉల్లంఘనగా పరిగణిస్తూ ప్రజలు తీవ్రంగా అసహ్యించుకుంటున్నారు. అమెరికా ఎఫ్.బి.ఐ.కి అప్పగించబడిన మిలిటెంట్లు 'మిస్సింగ్' కేసులుగా మిగిలిపోతున్నారు. దీంతో ఆచరణలో పూర్వ ఆదివాసీ చట్టాలే తమకు కావాలన్న డిమాండ్ ప్రజల్లో బలపడడానికి ఇది దారితీసింది. 'షరియత్ చట్టం' ప్రకారం స్థానికంగా ప్రజలందరి సమక్షంలోనే ఎటువంటి ఆలస్యం లేకుండా కేసులు పరిష్కారమౌతాయనేది ప్రజల విశ్వాసం.

2009 మార్చి 27న ఫ్రంట్‌లైన్ సంచికలో నిరుపమ సుబ్రహ్మణ్యం రాసిన వ్యాసంలో 'స్వాత్ శాంతి ఒప్పందం జరిగిన వార్త తెలిసిన వెంటనే అక్కడి ప్రజలు మిఠాయిలు పంచుకున్నారు. అంతవరకూ మూతపడిన పాఠశాలలు, మార్కెట్లు తెరుచుకున్నాయి' అని పేర్కొనడం గమనార్హం. ఇదే విలేకరి ఇస్లామాబాద్ నుంచి పంపిన ఒక వ్యాసం 2009 మార్చి 24న హిందూలో ప్రచురితమైంది. పేరు వెల్లడించడానికి ఇష్టపడని ఒక లాయర్ మింగోరా పట్టణం (స్వాత్ జిల్లా ముఖ్య పట్టణం) నుంచి తనకి చెప్పిన ఒక విషయాన్ని ప్రస్తావించారు. 'స్వాత్ జిల్లా ప్రజలు శాంతి ఒప్పందాన్ని ఆమోదిస్తున్నారు. షరియత్ చట్టం వల్ల తమకు సత్వర న్యాయం జరుగుతుందని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు. మింగోరా పట్టణంలో మేం 300 మంది లాయర్లం వున్నాం. షరియత్ చట్టంతో మేమందరం నిరుద్యోగులమయ్యాం. ఇక్కడ ప్రజలు మా పక్షాన లేరు. వారు మా తరఫున పోరాడరు. మా కోసం పోరాడగల శక్తి మా లాయర్లకి ఇక్కడ లేదు' అని పై న్యాయవాది చెప్పినట్లు పేర్కొనడం గమనార్హం.

షరియత్ చట్టం మీద 'నాగరిక' ప్రపంచం నేడు నిప్పులు కక్కుతున్నది. కాని స్వాత్ ప్రజలు దీన్ని స్వాగతిస్తున్నారు. స్వాత్‌తో పాటు మాలాఖండ్ డివిజన్‌లో మొత్తం ఏడు జిల్లాల ప్రజల పరిస్థితి కూడా ఇదే. సోకాల్డ్ నాగరిక అమెరికా దురాక్రమించిన ఆఫ్ఘనిస్తాన్‌లో కర్జాయ్ ప్రభుత్వం షరియత్ చట్టాన్నే అమలు చేస్తున్నది. అమెరికా తొత్తు దేశాలైన సౌదీ అరేబియా, కువైట్ తదితర ఇస్లామిక్ దేశాలు షరియత్ చట్టాలను అమలు చేస్తున్నాయి. తన వ్యూహాత్మక మిత్ర దేశమైన పాకిస్తాన్ రాజ్యాంగం సైతం షరియత్ చట్టాన్ని పూర్తిగా నిరాకరించలేదు. అంతెందుకు అతి పెద్ద ప్రజాస్వామిక, లౌకిక, సోషలిస్టు రాజ్యంగా చెప్పుకునే మన దేశంలో కూడా షాబానో కేసులో షరియత్ నీతికి అనుగుణంగా అలనాటి రాజీవ్ ప్రభుత్వం చట్టం చేసింది. ఇవన్నీ ఈ నాగరిక ప్రపంచానికి నేరాలుగా కనిపించవు. కాని శతాబ్దాలుగా సోకాల్డ్ నాగరిక రాజ్యాల దోపిడీ, అణచివేతలకు మగ్గి, పద్దెనిమిది నెలల పాటు మిలిటరీ కూంబింగ్‌లో నెత్తురోడిన బాధిత జాతి షరియత్ చట్టాన్ని కావాలంటే నేరమైపోయింది.

ప్రపంచీకరణ పేరిట విపరీత పెడధోరణులు, పెట్టుబడిదారీ విష సంస్కృతి వెర్రితలలు వేస్తున్న నేటి పరిస్థితులను గమనంలో వుంచుకోవాలి. సామ్రాజ్యవాద దురాక్రమణలు బాధిత జాతులనూ, మతాలనూ, తెగలనూ తీవ్రంగా గాయపరుస్తున్న కాలమిది. తమ భుజాలపై తుపాకులు ధరించి దురాక్రమణదార్లను ఎదిరించి అశేష ప్రాణ త్యాగాలతో పురోగమిస్తున్న జాతీయ పోరాటశక్తులను క్రూర నేరస్తులుగా నిందించటమే ఒక కుట్ర.

ఇప్పుడు స్వాత్ ఒప్పందాన్ని ఎవరు ముందుగా ఉల్లంఘించారన్న విషయంలోకి వద్దాం. ఒప్పందం తొలుత సూఫీ మహమ్మద్‌కూ, ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి. ప్రభుత్వానికీ మధ్య కుదిరింది. జర్దారీ ప్రభుత్వ ఆశీస్సులతో జరిగిన ఈ ఒప్పందాన్ని రెండు నెలల్లో ఆమోదించాల్సి వుంది. పై శాంతి ఒప్పందం ప్రకారం ఈ లోపుగానే ఖైదీల విడుదల జరగాలి. శాంతి భద్రతల పోలీసు, పౌర పాలనాధికార్లు తప్ప సైన్యం మాలాఖండ్ డివిజన్ నుంచి వెనక్కి వెళ్లాలి. పాక్ తాలిబాన్లు ఆధునిక ఆయుధాలతో సంచరించరాదు. పార్లమెంట్ ఆమోదించాల్సినది షరియత్ చట్టం గురించి మాత్రమే. కానీ దీనికి ముందు ఒప్పందంలోని నిర్ణీత గడువు ప్రకారం మిలిటెంట్లను ప్రభుత్వం విడుదల చేయలేదు. సైన్యం వైదొలగలేదు. మార్షల్ చట్టాలను రద్దు చేయలేదు. మిలిటెంట్ల కోసం వేట ఆగలేదు. ఇవన్నీ ప్రభుత్వం వైపు నుంచి ఉల్లంఘనలే. ప్రపంచానికి వెలుగులోకి రాని ఉల్లంఘనలివి. ఒప్పందం కుదిరాక యాభై రోజులకి స్వాత్

జైళ్లల్లోని 200 మంది డిటెన్యూలు, 261 మంది రిమాండ్ ఖైదీలు అధికారులకొక అల్టిమేటం ఇచ్చారు. (ఒప్పందం ప్రకారం ఖైదీల విడుదల జాప్యం పట్ల నిరసనగా సూఫీ మహమ్మద్‌తో సహా స్వాత్ మిలిటెంట్ సంస్థలు అప్పటికే సాగిస్తున్న పుద్యమానికి సంఘీభావ అల్టిమేటమిది.) 2009 ఏప్రిల్ 4న ఇచ్చిన ఆ అల్టిమేటంలో తమను విడుదల చేయకపోతే సామూహిక ఆత్మహత్యలు చేసుకుంటామని వారు హెచ్చరించారు. ఇదంతా ప్రభుత్వ ఉల్లంఘనకు నిదర్శనమే.

ఈ ఉల్లంఘనలు ఒక ఎత్తు, పాక్ తాలిబాన్ల నుంచి ప్రమాదం గురించి అమెరికా మీడియా చేసిన భారీ దుష్ప్రచారం మరో ఎత్తు. రాజధాని ఇస్లామాబాద్‌కు వంద కి.మీ. దగ్గర్లో వున్న బునైర్ జిల్లాలోకి వందలాది మంది సాయుధ మిలిటెంట్లు ప్రవేశించారనీ, త్వరలో కరాచీ, లాహోర్, ఇస్లామాబాద్‌లు మిలిటెంట్ల హస్తగతం కానున్నాయని, కాశ్మీర్‌లోకి అగ్రశ్రేణి తాలిబాన్ నేతలు ప్రవేశించారనీ, రేపో, మాపో అణ్వస్త్ర కేంద్రాలు కూడా మిలిటెంట్ల కైవసం కానున్నాయనీ, చైనా, ఇరాన్, చెచెన్యా, ఉజ్బెకిస్తాన్, తజికిస్తాన్ తదితర దేశాలలోకి కూడా తాలిబాన్లు చొరబడుతున్నారని చేసిన ఈ దుష్ప్రచారం మార్చి, ఏప్రిల్ నెలల్లో ప్రపంచాన్ని ఫోబియాకి గురిచేసింది. తద్వారా వాయువ్య సరిహద్దు రాష్ట్రంలోని పష్తూన్ జాతీయులపై మరో అనాగరిక మారణహోమానికి పూర్వరంగాన్ని అమెరికా సిద్ధం చేయగలిగింది.

ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి. నుంచి సిక్కులను, హిందువులను తాలిబాన్లు తరిమివేస్తున్నారన్న ప్రచారం కూడా నిజం కాదు. శతాబ్దాల కాలంగా వ్యాపార, వాణిజ్యాలను హిందువులకు వదిలేసి పష్తూన్ జాతి ఆదివాసులు మేకలు, గొర్రెల పెంపకం, వ్యవసాయ పనులకే పరిమితమయ్యారు. ఈనాటికీ అదే మధ్య యుగ సామాజిక పరిస్థితుల్లోనే పష్తూన్లు జీవిస్తున్నారు. నాటి నుంచి నేటి వరకూ కొన్ని హిందూ, సిక్కు కుటుంబాలు కలప, వజ్రాలు, అటవీ వుత్పత్తుల వ్యాపారాలు చేసి బడా సంపన్నులయ్యారు. ఇటీవల మిలిటెంట్లు రాజ్యాధికారం చేజిక్కించుకున్న చైతన్యంతో తమ ప్రాంత వ్యాపారాలను తామే చేసుకుంటామని పష్తూన్లు ముందుకొచ్చారు. అంతేకాకుండా వాళ్లు చేసే వ్యాపార రాబడి నుంచి పాకిస్తాన్ ప్రభుత్వానికి బదులుగా తమ సంస్థలకు పన్ను చెల్లించాలని మిలిటెంట్లు కోరారు. ముఖ్యంగా వజ్రాల (పచ్చలు) గనులను మిలిటెంట్లు స్వాధీనం చేసుకోవడం స్మగ్లింగ్ వ్యాపార వర్గాలకు రుచించలేదు. ఈ వజ్రాల ఆదాయంలో స్థానిక లేబర్‌కు 66 శాతం ఇచ్చి, కేవలం 33 శాతం రాబడిని ఆయుధ కొనుగోళ్లకు మిలిటెంట్లు వినియోగించసాగారు. దీంతో లేబర్ కూలి హఠాత్తుగా నాలుగైదు రెట్లు పెరిగింది. ఇది వారిని ఎంతో పరవశింపజేసింది. అంతేకాకుండా సొంత మతస్తులైన కొందరు బడా భూస్వాములను తరిమివేసి వారి భూములను స్థానిక పేదలకు మిలిటెంట్లు పంచి పెట్టారు. (ఇందులో ఒక బడా ఇస్లాం మత పెద్ద వున్నాడు. అందువల్ల మత దురభిమానంతో సిక్కులు, హిందువుల పట్ల వ్యవహరించలేదని అర్థం చేసుకోవాలి.) కేవలం రెండు నెలల్లో జరిగిన ఈ రాడికల్ సంస్కరణలతో వ్యాపార వర్గాలు భీతిల్లి నిందా ప్రచారాన్ని తీవ్రతరం చేశాయి. (మన దగ్గర 1/70 ఆక్ట్ అమలును కోరుకునే ప్రజాతంత్ర శక్తులకు, ఆదివాసీ సంస్థలకూ పై పరిణామాలు సరిగ్గానే బోధపడతాయి.)

చివరకు 2009 ఏప్రిల్ 14న పాక్ ప్రభుత్వం షరియత్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టింది. సైనిక నీడలో జరుగుతున్న ఈ తంతు అర్థరహితమని సూఫీ మహమ్మద్ నిరసన వ్యక్తం చేశాడు. సైనిక ఉపసంహరణకు రెండు వారాల గడువునిస్తూ సూఫీ మహమ్మద్ ఏప్రిల్ మధ్యలో పాక్ ప్రభుత్వానికి అల్టిమేటం ఇచ్చాడు. సైనిక ఉపసంహరణ జరక్కపోగా, భారీగా కొత్త సైనిక బలగాలను ఎన్.డబ్ల్యు.ఎఫ్.పి.లోకి పాక్ ప్రభుత్వం తరలించసాగింది. షరియత్ కోర్టుకు న్యాయమూర్తులను నియమించేటప్పుడు సూఫీ మహమ్మద్‌ను సంప్రదించాలన్న షరతును కూడా పాక్ ప్రభుత్వం ఉల్లంఘించింది. పచ్చి బ్యూరాక్రటిక్ నీతిజ్ఞులను ఏకపక్షంగా నియమించింది. అయినా తానిచ్చిన గడువు ముగిసేంత వరకూ సూఫీ మహమ్మద్ వేచి చూశాడు. ఆ తర్వాతే తాను నిస్సహాయ స్థితిలో మధ్యవర్తిత్వం నుంచి వైదొలిగాడు. స్వాత్ మిలిటెంట్లు అనివార్యంగా మరోసారి ప్రతిఘటనకు సిద్ధం కావాల్సి వచ్చింది. ఈ నేపథ్యంలో తమనూ, మధ్యవర్తినీ, లక్షలాది ప్రజలనూ వంచించిన ప్రభుత్వ వైఖరికి నిరసనగా ఒప్పందం నుంచి తాము వైదొలుగుతున్నట్లు 2009 మే 4న పాక్ తాలిబాన్లు బహిరంగ ప్రకటన చేశారు.

ఈ ఒప్పందం చేయడంలో పాక్ ప్రభుత్వ లక్ష్యాల గూర్చి మూడు రకాల అభిప్రాయాలున్నాయి. ఒకటి, తన మనుగడకోసం అమెరికా ఒత్తిళ్ళకు తలవంచకుండా తొలుత ప్రభుత్వం స్పందించి ఒప్పందం చేసుకొని, ఆ తర్వాత లొంగి పోయిందనేది ఒక వాదన. రెండు, పాకిస్తాన్ ఆర్థిక సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నందువల్ల అమెరికా, ప్రపంచబ్యాంక్, ఐ.ఎం.ఎఫ్., ఇ.యు.ల నుంచి భారీ ఆర్థిక చేయూతనిస్తే, ఇందుకు ఇండియా నొచ్చుకుని నిరసన వ్యక్తం చేస్తుంది. అందువల్ల ఇలాంటి పరిస్థితిని నాటకీయంగా సృష్టించి, ఆర్థిక చేయూత పట్ల ఇండియా ఆమోదం పొందాలనుకున్నారనేది మరో వాదన. మూడు, పష్తూన్ల పట్ల పాకిస్తాన్‌లోని పంజాబీ, సింధూ ప్రజల్లో సైతం ఆదరణ పెరుగుతోంది. దీనిని దెబ్బకొట్టి, వారిలో జాతి విద్వేషాన్ని పెంచేందుకు వ్యూహాత్మకంగానే ఇలాంటి

వంచనాత్మక విధానాన్ని అమెరికా, పాక్ ప్రభుత్వాలు పరస్పర కుమ్మక్కుతో చేపట్టాయనేది మరో వాదన. ఇందులో ఏది నిజమనేది భవిష్యత్తు నిరూపిస్తుంది. ఏది ఏమైనా తాము చేసుకున్న ఒప్పందాన్ని తామే తుంగలో తొక్కి తిరిగి పాక్ తాలిబాన్లపై అమెరికా నిర్దేశకత్వంలో పాక్ సైన్యం మరో కౄరమైన యుద్ధానికి సిద్ధమైంది.

ఇదే కాలంలో పాకిస్తాన్‌లో ముదిరిన రాజకీయ సంక్షోభాన్ని అమెరికా తనదైన శైలిలో పరిష్కారం చేసింది. ప్రధాన ప్రతిపక్ష నేత నవాజ్ షరీఫ్‌ను ప్రసన్నం చేసుకున్నది. న్యాయమూర్తుల మన్ననలు పొందింది. అధ్యక్షుడు జర్దారీని ఇరకాటంలో పెట్టింది. ప్రధాని గిలానీని దువ్వింది. జనరల్ కయానీని తన పూర్తి కంట్రోల్‌లోకి తెచ్చుకున్నది. ఒకరికి మరొకరితో చెక్ పెట్టింది. అవసరమైతే మరో సైనిక కుట్రకు అనుకూల పరిస్థితిని సిద్ధం చేసింది. ఈ కూర్పుతో కేవలం తన లక్షిత మిలిటెంట్ సంస్థల మీదికి మొత్తం పాకిస్తాన్ రాజ్య శక్తులను అమెరికా ఏకం చేయగలిగింది. ఏకకాలంలో అటు ఆఫ్ఘనిస్తాన్‌లోనూ, ఇటు పాకిస్తాన్‌లోనూ సామ్రాజ్యవాద వ్యతిరేక మిలిటెంట్ పోరాటాలను అణచివేసేందుకు ఒబామా ప్రభుత్వం ఒక కొత్త విధానాన్ని ఇటీవల కనిపెట్టింది. దీనికి అది ఆఫ్–పాక్ పాలసీ అని పేరు పెట్టింది. ఈ నూతన విధానానికి అనుగుణంగా అమెరికా పావులు కదపడం గమనార్హం. చివరకు 2009 మే 7న రాత్రి జాతిని ఉద్దేశించి చేసిన ప్రసంగంలో పాక్ అధ్యక్షుడు జర్దారీ పాక్ తాలిబాన్లపై 'యుద్ధ ప్రకటన' చేశాడు. అదే అర్ధరాత్రి నుంచి వందలాది యుద్ధ విమానాలు, హెలికాప్టర్లతో, వేలాది సైనిక బలగాలతో ప్రభుత్వం స్వాత్‌పై యుద్ధాన్ని ఆరంభించింది. నేడు ఎన్.డబ్ల్యు.ఎఫ్.పిలో లక్షన్నర సైన్యాలతో అది యుద్ధం సాగిస్తోంది. కేవలం పది రోజుల్లోనే మొత్తం మాలాఖండ్ డివిజన్‌లో 20 లక్షల మంది ఈ యుద్ధం వల్ల నిర్వాశితులయ్యారు. (ఇందులో స్వాత్ జిల్లా ప్రజలే 11 లక్షల వరకూ వుంటారు).

పాక్ ప్రభుత్వ యుద్ధ ప్రకటన వెలువడిన మరునాడే మాజీ పాకిస్తాన్ క్రికెటర్, ఇన్సాఫ్ పార్టీ నేత ఇమ్రాన్‌ఖాన్ 'అమెరికాకు అమ్ముడుబోయిన తొత్తు ప్రభుత్వం తన స్వంత దేశ పౌరులపైనే తలపెట్టిన అధర్మ యుద్ధమిది' అంటూ నిశితంగా విమర్శించాడు. ఈ అన్యాయమైన యుద్ధం సహజంగానే పాక్ సైన్యంలో జాతీయ చైతన్యాన్ని తట్టిలేపింది. పాకిస్తాన్ పార్లమెంట్‌లో సెనేటర్ పి.పి.పి. నేత అన్వర్‌బేగ్ మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఉగ్రవాదులపై తలపెట్టిన యుద్ధానికి సైనికుల నుంచి సహాయ నిరాకరణే ప్రధాన ఆటంకంగా వుందనే ఒక నగ్నసత్యాన్ని అంగీకరించటం ద్వారా ఈ విషయం స్పష్టమైంది.

ఇస్లామాబాద్‌కు వందమైళ్ల దక్షిణాన జీలం పట్టణం శివారు గ్రామమొకటి మిలిటరీ గ్రామంగా ప్రసిద్ధి చెందింది. ఇప్పటి యుద్ధంలో మరణించిన ఒక సైనికుడి భౌతిక కాయాన్ని సైన్యాధికార్లు సైనిక శకటంలో ఊరిలోకి తెచ్చారు. కాని, స్వంత మతస్తులతో యుద్ధంలో మరణించిన తన కన్న కొడుకు భౌతిక కాయాన్ని స్వీకరించబోనని కన్నతండ్రి ప్రకటించాడు. అంతేకాకుండా తన కొడుకు శవాన్ని తెచ్చిన సైన్యాధికారులను తన కాలిచెప్పుతో కొట్టాడు. ఆ తర్వాత ఇలా తెచ్చిన సైనికుల మృతదేహాలను ఊరు వెలుపల హఠాత్తుగా దింపి సైన్యాధికారులు పారిపోసాగారు.

మరోవైపు వేలాది మంది సైనికులు ఈ మిలిటరీ ఆపరేషన్‌కు రాకుండా మూకుమ్మడి సెలవులు పెడుతున్నట్లు వార్తలు వచ్చాయి. 2008లో స్వాత్ నుంచి ఆరు వందల మంది సైనికులు తమ అధికార్లకు చెప్పకుండా పారిపోయారు. వీరిలో సగం మందికి పైగా తిరిగి విధులకు హాజరు కాలేదు. వజీరిస్తాన్, బజౌర్, ఖుర్రం, మొహామండ్, ఖైబర్, ఒరాక్ జాయ్, దీర్, బునేర్ తదితర ప్రాంతాలలో ఇలాంటి సైనిక పలాయన సంఘటనలు తరచుగా జరుగుతున్నాయని వార్తలు వెలువడ్డాయి. ఇవన్నీ పాక్ ప్రభుత్వ సైనిక విజయాన్ని ప్రశ్నిస్తున్నాయి.

## 2009 అక్టోబర్ నుంచి పాక్ తాలిబాన్లపై పాక్ సైన్యపు మరో దాడి – ప్రతిఘటన

అమెరికా వత్తిడి వున్నప్పటికీ పాక్ తాలిబాన్లకు ఆయువుపట్టుగా వున్న దక్షిణ వజీరిస్తాన్‌పై దాడి చేసేందుకు పాకిస్తాన్ ప్రభుత్వం చాలా కాలం పాటు విముఖంగా వుండింది. తెహ్రీక్–ఎ–తాలిబాన్ పాకిస్తాన్ (టిటిపి) అనే సంస్థను కలిగిన పాక్ తాలిబాన్లకు మెహ్సూద్ ఆదివాసీ తెగ నివశించే దక్షిణ వజీరిస్తాన్ ప్రాంతం ఆయువుపట్టు లాంటిది. మెహ్సూద్ తెగ నుంచి చాలా మంది పాక్ తాలిబాన్‌లోకి రిక్రూట్ అయ్యారు. అయితే దక్షిణ వజీరిస్తాన్ ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దున లేదు. అంతేకాక పాక్ తాలిబాన్లు ఆఫ్ఘనిస్తాన్‌లో పోరాడేందుకు పెద్దయెత్తున గెరిల్లా బలగాలను కూడా ఎప్పుడూ పంపలేదు. అయినా అల్‌ఖాయిదాతో వారికి వున్న సంబంధాల రీత్యా వారిపై దాడి చేయాలని అమెరికా వత్తిడి చేస్తోంది.

2009 ఆగస్టులో అమెరికా చేసిన ఒక డ్రోన్ (మానవరహిత విమానం) దాడిలో టిటిపి నాయకుడు బయితుల్లా మెహ్సూద్ చనిపోయిన తర్వాత ఏర్పడిన అనుకూల పరిస్థితిని కూడా పాక్ సైన్యం వినియోగించుకోలేదని అమెరికా విరుచుకపడింది. ఇక గత్యంతరం లేని పరిస్థితిలో అక్టోబర్ 17న పాక్ సైన్యపు మరో దాడి ప్రారంభమైంది.

అక్టోబర్ ప్రారంభం నుంచే టిటిపి గెరిల్లా బలగాలు ఆత్మాహుతి బాంబు దాడులు, కమాండో శైలిలో ఫిదయీన్ ఎత్తుగడలతో కూడిన దాడులను మేళవించి అనేక చర్యలు వరుసగా నిర్వహించాయి. ఇందులో అక్టోబర్ 10న రావల్పిండిలోని పాకిస్తాన్ సైన్యం జనరల్ హెడ్‌క్వార్టర్స్‌పై జరిగిన దాడి అత్యంత తీవ్రమైంది. ఇదే రోజున లాహోర్‌లో ఫెడరల్ ఇన్వెస్టిగేషన్ అథారిటీని, రెండు పోలీసు ట్రైనింగ్ స్కూళ్లను టార్గెట్ చేస్తూ మూడు దాడులు జరిగాయి.

దీంతో తప్పనిస్థితిలో పాక్ సైన్యం దక్షిణ వజీరిస్తాన్‌లోకి అడుగు పెట్టింది. అక్కడ అది ఏ విధంగా ఆపరేషన్లు నిర్వహించిందో బయటకు తెలిసింది చాలా తక్కువ. ఎందుకంటే అప్పుడు ఆ ప్రాంతంలోకి జర్నలిస్టులను ఎవ్వరినీ అనుమతించలేదు. పాక్ సైనిక అధికార్లు, తాలిబాన్ కమాండర్లు ప్రకటించిన వివరాలు వేరు వేరుగా వున్నాయి.

నవంబర్ 5 నాటి డాన్ పత్రిక ప్రకారం పాక్ సైన్యం తన ఆపరేషన్‌లో మొదటి దశను పూర్తి చేసింది. ఇందులో షేర్‌వాంగి, కాట్‌కాయి, కనిగురమ్, సారారోఘాలను, ప్రధాన సప్లై మార్గాలను స్వాధీనం చేసుకున్నట్లు సైన్యం ప్రకటించింది. ఆపరేషన్ ప్రారంభమైన 20 రోజుల్లోనే సైన్యం దక్షిణ వజీరిస్తాన్‌లో మెహ్సూద్ హెడ్‌క్వార్టర్స్‌ను ధ్వంసం చేసింది. దీంతో అది మొదటి దశ ముగిసిందని ప్రకటించింది. ఈ ఆపరేషన్‌లో 40 మంది సైనికులు మరణించారని, 71 మంది గాయపడ్డారని పేర్కొంది. అదే సమయంలో, అవతలివైపు, 500 మంది తాలిబాన్ పోరాటకారులు మరణించారని, 700లకు పైగా గాయపడ్డారని తెలిపింది. తాలిబాన్ ఎత్తుగడలనే వారిపైకి తిప్పికొడుతూ ఈ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకున్నట్లు సైన్యం చెప్పుకుంది : ఆయువుపట్టుగా వున్న ప్రదేశాల (స్ట్రాంగ్ హోల్డ్స్) చుట్టూ వున్న కీలకమైన కొండలు, గుట్టలను ముందు స్వాధీనం చేసుకొని, ఆ తర్వాత ఆయువుపట్టుగా వున్న ప్రదేశాలపై సైన్యం దాడి చేసింది. గతంలో జరిగిన ఆపరేషన్లలో ఈ కొండలు, గుట్టల్ని తమ చేతిలో పెట్టుకొని తాలిబాన్లు చుట్టుముట్టడం ద్వారా వారి వుచ్చులో ఇరుక్కున్నానని సైన్యం అనుభవపూర్వకంగా పాఠాలు నేర్చుకుని ఈసారి ఆ ఎత్తుగడను తాలిబాన్లపైకే తిప్పికొట్టింది. ఫలితంగా గతంలో జరిగిన మూడు ఆపరేషన్లలా కాకుండా ఈసారి అధిక సంఖ్యలో బలగాలను మోహరించిన సైన్యం యుద్ధ విమానాలను వినియోగించింది. మానవరహిత విమానాల ద్వారా అతి స్పష్టమైన (హైరిజల్యూషన్) ఫోటోలను భూమిపై పోరాడే సైనిక బలగాలకు అందించింది. దీంతో ఈ ఆపరేషన్‌లో పాక్ సైన్యం విజయం సాధించగలిగింది.

అహ్మద్‌జాయి వజీర్లు అనే మరో పెద్ద ఆదివాసీ తెగ దక్షిణ వజీరిస్తాన్‌లో నివసిస్తోంది. ఇది తటస్థ పాత్ర వహించటం వల్ల కూడా సైన్యం విజయానికి తోడ్పడింది. ఈ వజీర్లు నివసించే ప్రాంతం ఆఫ్ఘనిస్తాన్–దక్షిణ వజీరిస్తాన్ సరిహద్దు ప్రాంతం కావడమూ, వీరు తటస్థ పాత్ర వహించటమూ, ఫలితంగా ఈ ఆపరేషన్ జరిగేటప్పుడు ఆఫ్ఘన్–పాక్ తాలిబాన్ బలగాల మధ్య సమన్వయానికి అడ్డుకట్టపడటం జరిగింది.

అహ్మద్‌జాయి వజీర్ల నాయకుడు ముల్లా నజీర్, ముఖ్యమైన తాలిబాన్ నాయకుడు హఫీజ్ గుల్ బహదూర్, బయితుల్లా మెహ్సూద్‌తో గతంలో చేతులు కలిపారు. కాని, బయితుల్లా మెహ్సూద్ మరణంతో ఈ ఐక్యసంఘటన దెబ్బతినిపోయింది. ముల్లా నజీర్, హఫీజ్ గుల్ బహదూర్‌లను పోరాటానికి దూరం చేయటంలో సైన్యం సఫలమైంది. వీరిని పోరాటం నుంచి దూరం చేసేందుకు సైన్యం వీరితో కొన్ని ఒప్పందాలు కూడా చేసుకుందని కొన్ని నివేదికల ద్వారా తెలుస్తోంది. కాని, సైన్యం విజయం సాధించానని ప్రకటించటాన్ని తాలిబాన్ సవాల్ చేసింది. ఎత్తుగడల రీత్యానే కొన్ని ప్రాంతాల నుంచి ఉపసంహరించుకున్నామని, అట్లాగే సైన్యం తమ వైపు నష్టాలను గోరంతలు కొండంతలుగా చేసి చెబుతోందని అది పేర్కొంది. కొన్ని ప్రాంతాల్లో తాలిబాన్లు ఎత్తుగడలపరంగా రిట్రీట్ అయితే అక్కడ పెద్దయెత్తున ఆయుధాలు–అమ్యునిషన్ దొరకదు కదా అని సైన్యం ప్రశ్నించింది. ఈ వాద ప్రతివాదనల్లో వాస్తవం ఎంత వున్నా, సైన్యం దాడి తర్వాత తాలిబాన్లు యుద్ధరంగంగా వున్న ఆ ప్రాంతం నుంచి బయటకు వచ్చి దేశవ్యాప్తంగా అనేక గెరిల్లా చర్యలకు పూనుకునే విధానాన్ని అనుసరించారనేది మాత్రం వాస్తవం. దేశవ్యాప్తంగా యుద్ధవ్యతిరేక వాతావరణాన్ని సృష్టించటానికి, సైన్యం ఉపసంహరించుకునేలా వత్తిడి చేసేందుకు ఈ ఎత్తుగడలు చేపట్టారు. అయితే నవంబర్ 26 ముంబై దాడులకు పాల్పడిన వారిని పట్టివ్వనందుకు ప్రతీకారంగానే భారత ఇంటెలిజెన్స్ ప్రోద్బలంతోనే ఈ దాడులు జరుగుతున్నాయని, తాలిబాన్లకు వారే నిధులు సమకూర్చుతున్నారని పాక్ సైన్యం, ప్రభుత్వం ఆరోపించటం ఇక్కడ విశేషం.

దీంతో ఆత్మాహుతి బాంబు దాడుల్లో సాధారణ ప్రజలను టార్గెట్ చేయటం పెరిగింది. ఇస్లామాబాద్‌లో ఇస్లామిక్ యూనివర్సిటీ, రావల్పిండిలో ఒక బ్యాంకు ఈ విధంగానే టార్గెట్ చేయబడ్డాయి. పెషావర్‌లోని ఒక మార్కెట్‌లో జరిగిన ఒక ఆత్మాహుతి దాడిలో 105 మంది ప్రజలు, ఎక్కువ మంది మహిళలు, పిల్లలు చనిపోవటం దేశం మొత్తాన్ని కుదిపివేసింది. అమెరికా విదేశాంగ మంత్రి హిల్లరీ క్లింటన్ పాకిస్తాన్‌లో పర్యటిస్తుండగా ఈ దాడి జరగటం విశేషం.

ఆఫ్ఘనిస్తాన్‌ను అమెరికా దురాక్రమించి 2010 అక్టోబర్ నాటికి తొమ్మిదేండ్లు నిండనున్నది. ఈ కాలంలో 37 దేశాల సైనిక బలగాలు ఆఫ్ఘన్ ప్రజల మీద సాగిస్తున్న యుద్ధంలో సుమారు 11 వందలకు

పైగా సైనికులు మరణించారు. కానీ 2004 నుంచి నాల్గున్నర ఏళ్ల స్వంత ప్రజలపై చేసిన యుద్ధంలో 1450 మందికి పైగా సైనికులను పాకిస్తాన్ కోల్పోయింది. దీని ద్వారా పాక్ పష్తూన్ జాతీయుల ప్రతిఘటన ఎంత తీవ్రంగా వుందో అంచనా వేసుకోవచ్చు.

ఆఫ్ఘనిస్తాన్ కంటే పాకిస్తాన్‌లో ఈ సాయుధ ప్రతిఘటన అధికంగా వుండటానికి చారిత్రక నేపథ్యం వుంది. బ్రిటిష్ ఇండియా కాలంలో బ్రిటిష్ సామ్రాజ్యవాదులు 1893లో కుట్రబుద్ధితో ఆఫ్ఘనిస్తాన్‌కూ, ఇండియాకూ మధ్య దురాండ్ సరిహద్దు రేఖను సృష్టించారు. ఈ రేఖ పష్తూన్ (ఫక్తూన్) జాతిని రెండుగా చీల్చింది. అప్పటి నుంచి నేటి వరకూ పష్తూన్ జాతి సమైక్య ఫక్తూనిస్తాన్ స్థాపనకై పోరాడుతూనే వుంది. బ్రిటిష్ వలసవాదుల నిష్క్రమణతో భారత్, పాకిస్తాన్‌లు చీలిపోగా, పై సరిహద్దు రేఖ కారణంగా పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్‌లలో పష్తూన్లు చెరిసగంగా చీలిపోయి బతకాల్సిన స్థితి ఏర్పడింది. సుమారు రెండున్నర వేల కి.మీ.ల సుదీర్ఘ దురాండ్ సరిహద్దుకు రెండువైపులా పష్తూన్లే వున్నారు. (వీరినే పఠానీలని కూడా అంటారు.) ఐరిష్ జాతి తర్వాత పష్తూన్ జాతీయ విమోచనోద్యమమే ప్రపంచంలో సుదీర్ఘ చరిత్రను కలిగి వుంది. ఆఫ్ఘనిస్తాన్‌లో కంటే రెట్టింపు సంఖ్యలో పాకిస్తాన్ పఠానీలు (పష్తూన్లు లేదా ఫక్తూన్లు) వున్నారు. ఏ కృత్రిమ సరిహద్దులూ ఈ జాతిని విడదీయలేకపోయాయి. ఇండియా, పాకిస్తాన్‌లలోని కాశ్మీరీల మధ్య జాతీయ సమైక్యత వలెనే పఠానీల మధ్య సంబంధం దృఢంగా వుంది. అందుకే ఆఫ్ఘనిస్తాన్ దురాక్రమణకు గురికావటంతో తమ సాటి పష్తూన్ల పట్ల పాకిస్తాన్ పష్తూన్లు కేవలం సానుభూతికే పరిమితం కాలేదు. స్వయంగా అదొక సమాంతర తిరుగుబాటు కేంద్రంగా మారడం ప్రపంచ సంఘీభావ వుద్యమాల చరిత్రలోనే ఒక అద్భుతం.

ఆఫ్ఘనిస్తాన్‌ను దురాక్రమించినా నిజ లక్ష్యాలను అమలు జరగనివ్వకుండా అగ్రరాజ్యాన్ని చావుదెబ్బతీస్తున్న ఒక కీలక రాజకీయ పరిణామం పాకిస్తాన్‌లోని పష్తూన్ బెల్టులో జరిగింది. ప్రపంచ చరిత్రలో ఏ దురాక్రమణ సైన్యాలకైనా సైనిక సరఫరా మార్గం సరిగ్గా వుండి తీరాలి. ఆఫ్ఘనిస్తాన్‌కు సముద్ర మార్గం లేదు. పాకిస్తాన్, ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుల మధ్య వున్న ఖైబర్ కనుమల మధ్య నుంచి వెళ్లే ప్రధాన రోడ్డు మార్గం ద్వారానే ఆఫ్ఘనిస్తాన్‌లోని అమెరికా నాటో సైనిక బలగాలకు సైనిక సరఫరాలు జరగాల్సి వుంది. కరాచీ ఓడరేవు కొచ్చిన ఆయుధ, ఆహార, ఆయిల్ (ఆఫ్ఘనిస్తాన్‌లోని 70 వేల మంది విదేశీ సేనలకు అవసరమయ్యేవి) సరుకులు ట్రక్కుల్లో తొలుత ఆఫ్ఘనిస్తాన్ సరిహద్దుకు ఆనుకొని వున్న పెషావర్ నగరానికి చేరుస్తారు. అక్కడ నుంచి పాక్ పష్తూన్ ప్రాంతాల్లోని ఖైబర్ కనుమ మార్గం ద్వారా కాబూల్‌కు చేరుస్తారు. ఆర్యులు, ఇండో గ్రీకులు, పార్థియన్లు, సింథియన్లు, పారశీకులు, అరబ్బులు, కనిష్కులు, తుర్కులు, మంగోలియన్లు, మొఘలులు అందరూ ఈ ఖైబర్ లేదా భోలానే కనుమ మార్గాల ద్వారానే భారత ఉపఖండంపై దండయాత్రలు జరిపిన విషయం తెలిసిందే. ఈ కనుమ మార్గాలు పష్తూన్ ప్రాంతాలతో నిండి వుంటాయి. ఆఫ్ఘన్ దురాక్రమణను పాక్‌లోని పష్తూన్లు కూడా ప్రతిఘటిస్తున్నందున ఈ నాటో సైనిక సరఫరా మార్గం మూసుకుపోతున్నది. పష్తూన్ల గెరిల్లా దాడుల తీవ్రతతో ఖైబర్ కనుమ దిగ్బంధనంలో చిక్కుకున్నది.

అటు ఖైబర్ కనుమ మార్గంలోనూ, ఇటు పెషావర్‌లో మజిలీ గోడౌన్లలోనూ నిత్యం గెరిల్లా దాడుల్లో వందలాది సైనిక శకటాలు దగ్ధమయ్యాయి. 2008 అక్టోబర్ నుంచి 2009 మార్చి మధ్య గడిచిన ఆరు నెలల్లో మొత్తం 760 సైనిక ట్రక్కులూ, కంటైనర్లు దగ్ధమయ్యాయి. ఒక్క 2008 డిసెంబర్ 7 నాడే 140 ఆయుధాలతో కూడిన ట్రక్కులు బూడిదయ్యాయి. ఈ దాడులు ఇప్పటికీ కొనసాగుతూనే వున్నాయి. 2010 సెప్టెంబర్, అక్టోబర్ మాసాల్లో కూడ అమెరికా సప్లై వాహనాలపై గెరిల్లాలు దాడులు చేసి పెద్దయెత్తున నష్టపరిచారు. మున్ముందు ఈ ఖైబర్ కనుమ అమెరికా బలగాల పాలిట మృత్యు కనుమగా మారటం తథ్యం. ఈ సైనిక మార్గానికి ప్రత్యామ్నాయంగా ఉత్తరాదిన మరో కొత్త మార్గం కావాలంటే రష్యా అనుమతి అవసరమయింది. రష్యా మీద ఆధారపడాలంటే, పోలండ్, చెక్ రిపబ్లిక్‌లలో అమెరికా ప్రతిపాదిత మిస్సైళ్ల రక్షణ వ్యవస్థను అది రద్దు చేయాలని కోరుతున్నది. అందుకే ఎన్ని లక్షల మందిని చంపించైనా ఖైబర్ కనుమ గుండానే సైనిక సరఫరాలు చేయజూస్తున్నది అమెరికా. అందుకే పష్తూన్ల మీద లక్షన్నర పాక్ సేనలతో అమెరికా తాజా యుద్ధాన్ని చేయిస్తోంది.

తాలిబాన్లపై దాడుల పేరిట పాకిస్తాన్ సైన్యం పష్తూన్ ప్రజలపై జరుపుతున్న దుర్మార్గాలు అన్నీ ఇన్నీ కావు. గెరిల్లాల మీద దాడులుగా చెపుతున్న వాటిలో చనిపోతున్నది చాలా వరకు సామాన్య ప్రజలే. మానవరహిత డ్రోన్ విమానాలతో అమెరికా నేరుగా ప్రజలపై బాంబు దాడులు చేసి, తాలిబాన్ స్థావరాలపై దాడులుగా ప్రచారం చేస్తున్నది. ఈ దాడుల్లో పిల్లలు, మహిళలు, అమాయక ప్రజలు విపరీతంగా చనిపోతుంటే, మీడియాను ఆ ప్రాంతాల్లోకి ప్రవేశించనీయకుండా చేసి, ఈ ఘోరాల్ని ప్రపంచానికి వెల్లడి కాకుండా కట్టడి చేస్తున్నది. ఆఫ్ఘనిస్తాన్‌లో, పాకిస్తాన్ లోని పష్తూన్ ప్రాంతాలపై అమెరికా జరుపుతున్న మారణకాండను రుజువులతో సహా 'వికీలీక్స్' వెబ్‌సైట్ ప్రపంచానికి వెల్లడించింది.

ఇరాక్‌లో ఒక వర్గాన్ని కొనేసి, ప్రజల మధ్య విభజనలు తీసుకొచ్చి ఇరాక్‌ను కొంతవరకు తన అదుపులోకి తెచ్చుకొన్న

అమెరికా అదే విధానాన్ని ఆఫ్ఘనిస్తాన్‌లోనూ అమలు చేయాలనుకుంటున్నది. 'తాలిబాన్లు మళ్ళీ అధికారంలోకి వచ్చి, అల్–కాయిదా స్వేచ్ఛగా వ్యవహరించగలిగితే అమెరికా జాతీయ భద్రతకు ఎనలేని ముప్పు ఏర్పడుతుంది. ప్రపంచదేశాలకు భద్రత కొరవడుతుంది' అని బరాక్ ఒబామా ఇటీవల హఠాత్తుగా, అత్యంత రహస్యంగా కాబూల్‌ను సందర్శించినప్పుడు తన సేనలను ఉద్దేశించి ప్రసంగిస్తూ అన్నాడు. ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ తరహా అనుభవాలతో తల బొప్పిగట్టిన అమెరికా తాలిబాన్లలో ఒక వర్గంతో రాజీపడి అయినా సరే ఆఫ్–పాక్ నుంచి సత్వరమే గౌరవంగా నిష్క్రమించాలనుకుంటున్నది. అయితే ఆఫ్ఘనిస్తాన్‌ను తన అదుపులోకి తెచ్చుకొని, అల్–కాయిదాను సంపూర్ణంగా నిర్మూలించేంతవరకు ఆఫ్ఘాన్‌లో తన సేనలు వుండాలనేది అమెరికా ఉద్దేశ్యం. ఇందుకు అడ్డంకిగా సరిహద్దున పాకిస్తాన్‌లో సాగుతున్న పష్తూన్ జాతి విమోచనోద్యమాన్ని పూర్తిగా అణచివేసే లక్ష్యంతో పాకిస్తాన్ సైన్యంతో యుద్ధం చేయిస్తున్నది. తాను విమానాలతో బాంబు దాడులు చేస్తున్నది.

ఈ దాడులకు వ్యతిరేకంగా పష్తూన్ పోరాటకారులు దేశవ్యాప్తంగా గెరిల్లా చర్యలు జరుపుతూనే వున్నారు. ఇప్పుడు పాకిస్తాన్ కూడ ఇరాక్ వలెనే నిత్యం ఆత్మాహుతి బాంబు దాడులతో దద్దరిల్లుతోంది. అయితే పష్తూన్ గెరిల్లాలు అమాయక ప్రజల మరణాలకు కూడా దారితీస్తున్న ఈ ఆత్మాహుతి బాంబు దాడులకే పరిమితం కాక, పాకిస్తాన్‌లో అమెరికా జోక్యాన్ని నిరసిస్తున్న లక్షలాది ప్రజానీకాన్ని సంఘటితం చేసి విస్తృత ప్రతిఘటనా వుద్యమాన్ని నిర్మించేటటువంటి ఎత్తుగడలను అనుసరిస్తూ , విశాల ప్రజానీకాన్ని పష్తూన్ జాతీయ విమోచనోద్యమంలోకి కదిలించాల్సిన అవసరం వుంది. పాక్ ప్రభుత్వం అమెరికా ఒత్తిడితో తన స్వంత ప్రజలపైనే సాగిస్తున్న యుద్ధాన్ని తక్షణం నిలిపివేయాల్సిందిగా డిమాండ్ చేయాలి. అది(పాక్ ప్రభుత్వం) అమెరికా డ్రోన్ దాడుల్ని నామమాత్రంగా వ్యతిరేకించటం కాకుండా, తన స్వంత సైనికుల మరణాలకు సైతం కారణమవుతున్న డ్రోన్ దాడులను తక్షణం ఆపాలని హెచ్చరించాల్సిందిగాను, అమెరికాకు పాకిస్తాన్ నుంచి అందించే అన్ని రకాల సప్లైలను ఆపివేయాలనీ డిమాండ్ చేయాలి. పష్తూన్ జాతి విమోచన కోసం ఉద్యమిస్తున్న సంస్థలన్నీ ఐక్యంగా పోరాడాలి. అంతేకాక, వారు మత ఛాందసవాదాన్ని విడనాడి, ఇస్లాం మతాన్నే నిర్మూలించాలనే ఉద్దేశ్యంతో మారణకాండలు జరుపుతున్న అమెరికా సామ్రాజ్యవాదానికి, దాని అడుగులకు మడుగులొత్తుతూ తన స్వంత ప్రజలపైనే యుద్ధాన్ని సాగిస్తున్న పాకిస్తాన్ దోపిడీ పాలకవర్గాలకు వ్యతిరేకంగా ప్రపంచ ప్రజలందరి మద్దతును కూడగట్టాలి. పాకిస్తాన్‌లో అమెరికా జోక్యాన్ని నిరసిస్తున్న లక్షలాది ప్రజానీకాన్ని సంఘటితం చేసి విశాల ప్రతిఘటనా వుద్యమాన్ని నిర్మించాల్సిన అవసరం వుంది. ఆఫ్ఘనిస్తాన్‌లో సోవియట్ సోషల్ సామ్రాజ్యవాదానికి ఎదురైన ఘోర పరాభవాన్ని అమెరికాకు కూడా రుచి చూపించాలి. తాలిబాన్ల అణచివేత పేరిట పాకిస్తాన్‌లోని ఆదివాసీ ప్రాంతాలపై అమెరికా జరుపుతున్న నరమేధాన్ని సభ్య సమాజం తీవ్రంగా ఖండించాలి. పాక్ ప్రభుత్వం అమెరికా ఒత్తిడితో తన స్వంత ప్రజలపైనే సాగిస్తున్న యుద్ధాన్ని తక్షణం నిలిపివేయాల్సిందిగా డిమాండ్ చేయాలి. అది(పాక్ ప్రభుత్వం) అమెరికా డ్రోన్ దాడుల్ని నామమాత్రంగా వ్యతిరేకించటం కాకుండా, తన స్వంత సైనికుల మరణాలకు సైతం కారణమవుతున్న ఈ దాడులను తక్షణం ఆపాలని హెచ్చరించాల్సిందిగాను, అమెరికాకు పాకిస్తాన్ నుంచి అందించే అన్ని రకాల సప్లైలను ఆపివేయాలనీ డిమాండ్ చేయాలి. పాక్, అమెరికా బలగాలు వైదొలగాలని ఒత్తిడి పెంచేందుకు పష్తూన్ జాతి ప్రజలకు సంఘీభావంగా అన్ని దేశాల్లో స్వాతంత్ర్య కాముకులైన ప్రజలంతా పోరాడాలి.

స్వాత్ కొండల్లో పఠానీలు చిందించిన నెత్తుటి కాల్వలూ, కాశ్మీరులోయలో కార్చుతున్న కన్నీటి ధారలూ, ముల్లైతీవు అడవులను ఆవరించిన అమరత్వాలూ ముమ్ముందు స్నేహం చేసి జతకడతాయి. ఐరిష్, కుర్దిష్, పాలస్తీనా, బెలూచీ జాతుల త్యాగాలతో ఇవి రేపు పెనవేసుకుపోతాయి. ప్రపంచ శ్రామిక వర్గ విప్లవ సంస్థలు ఇలాంటి అన్ని పీడిత జాతులతోనూ, తెగలతోనూ చెలిమి చేసి పిడికిళ్లెత్తుతాయి. మరణోన్ముఖ ప్రపంచ దురాక్రమణదారీ శక్తులకు మరణశాసనం రాస్తాయి. స్వాత్ ప్రజలారా! మీ స్వాతంత్ర్యోద్యమం వర్ధిల్లుగాక. ★

---

*(...21వ పేజీ తరువాయి)*

వుద్యమించాలి. ఆనాడే ఇటువంటి అసమ ఒప్పందాలు, ప్రమాదకరమైన విధానాలు అంతమవుతాయి.

సి.పి.ఐ.(మావోయిస్టు) దేశ అంతరంగిక భద్రతకు అత్యంత ప్రమాదం అని చెప్పే పాలకుల మాటల్లో నిజంలేదని విప్లవాల వైపు కదులుతున్న ప్రజలు, వారు నిర్మిస్తున్న ఉద్యమాలు నిరూపిస్తున్నాయి. భారతదేశ సార్వభౌమాధికారానికి, ప్రజల ప్రాణాలకు, ప్రయోజనాలకు ఈ పాలకులు, ఈ దోపిడీ వ్యవస్థ, సామ్రాజ్యవాదం అసలు ప్రమాదమని గుర్తిస్తున్నారు. తక్షణం అణు ఒప్పందాన్ని రద్దు చేసేలా ప్రజలను కదిలించి ఉద్యమిద్దాం. అంతిమంగా సామ్రాజ్యవాదాన్ని భారత దోపిడీ వర్గాలను ఓడిద్దాం. జీవించే హక్కుకు గ్యారంటీని ఇచ్చే ప్రజా రాజ్యాధికారాన్ని సాధిద్దాం. ★

పత్రికా ప్రకటన

ఆగస్టు 9, 2010

# కామ్రేడ్ మాలతి (శాంతిప్రియ), సురేంద్ర కోసరియాలకు శిక్ష విధింపు : అభివృద్ధి నిరోధక రమన్ ప్రభుత్వం, నిరంకుశ పోలీసు-పరిపాలనా యంత్రాంగం పన్నిన కుట్ర ఫలితం!

# మాలతి, సురేంద్రలకు కాదు, వందలాది ఆదివాసుల రక్తం పారించిన రమన్‌సింగ్, మహేంద్రకర్మలకు వెయ్యాలి శిక్ష!!

2010 జూలై 29వ తేదీన రాయ్‌పూర్‌లోని ఒక ఫాస్ట్‌ట్రాక్ కోర్టు మా పార్టీ కార్యకర్త ఐన కామ్రేడ్ మాలతి ఎలియాస్ శాంతిప్రియ, కేడియా డిస్టిలరీజ్‌లో పని చేసే కార్మికుడైన సురేంద్ర కోసరియాలను బాగా ప్రచారం పొందిన రాయపూర్ సీడీ కేసులో దోషులుగా నిర్ధారిస్తూ అనేక సెక్షన్ల కింద అత్యధికంగా పదేళ్ల శిక్ష విధించింది. ఛత్తీస్‌గఢ్ ఎమ్మెల్యేలకు సీడీలు అందజేయడంపై 2006 ఫిబ్రవరిలో రాయపూర్‌లోని ఒక పోలీసు స్టేషన్‌లో ఈ కేసు నమోదైంది. వాస్తవానికి మా దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ ప్రచార బ్యూరో ఆ సీడీని తయారు చేసింది. అందులో మేం బస్తర్‌లోని కొన్ని ప్రాంతాల్లో జరుగుతున్న సల్వాజుడుంకు సంబంధించిన బీభత్సకరమైన వాస్తవాల్ని వీడియో ఫిల్ముగా చిత్రీకరించాం. రమన్‌సింగ్, మహేంద్రకర్మల కుమ్మక్కుతో కొనసాగిన ఆనాటి ప్రభుత్వ ప్రాయోజిత ఫాసిస్టు దమనకాండలో గ్రామాలను కాల్చి ఎలా వల్లకాడుగా మారుస్తున్నారో, ప్రజలను ఎలా విచ్చలవిడిగా హత్య చేస్తున్నారో, మహిళలపై సామూహిక అత్యాచారాలు ఎలా కొనసాగుతున్నాయో మేం ఆ సీడీలో వివరించాం... చూపించాం. అయితే ఎమ్మెల్యేలకు ఆ సీడీల్ని అందజేసిన వాళ్ల ఆచూకీ దొరక్కపోవడంతో కొద్ది నెలల తర్వాత కేసు మూతపడింది. కానీ జనవరి 2008లో రాయపూర్‌లో మా పార్టీ కార్యకర్తలైన కామ్రేడ్స్ మాలతి, మీనలతో పాటు మరి కొందరిని పోలీసులు అరెస్టు చేసిన తర్వాత ప్రభుత్వ ఆదేశంపై అధికార్లు ఈ కేసును మళ్లీ తెరిచి ఇందులో వీళ్లను ఇరికించారు.

ఫాసిస్టు రమన్‌సింగ్ ప్రభుత్వం, డీజీపీ విశ్వరంజన్, పోలీసు-పరిపాలనా విభాగం అంతా కూడా దీన్ని ప్రతిష్టకు సంబంధించిన సవాలుగా తీసుకొని ఎట్లాగైనా మా కామ్రేడ్స్‌కు శిక్షలు పడాలని రకరకాల కుయుక్తులకూ, కుట్రలకూ పాల్పడ్డారు. దొంగ సాక్షులను పట్టుకొచ్చి వాళ్లకు ఏమేం మాట్లాడాలో నేర్పించి తప్పుడు సాక్ష్యాలు చెప్పించి పదేళ్ల శిక్ష విధించారు. ఇందుకోసం జడ్జిపై వత్తిడి కూడా తెచ్చారు. ఇంకా పలు రకాలుగా అప్రజాస్వామికంగా వ్యవహరించారు. కామ్రేడ్స్ మాలతి, మీనలతో పాటు జైళ్లల్లో బందీలుగా వున్న రాజకీయ ఖైదీలపై దుష్ప్రవర్తన, కొట్టడం వంటి అనేక సంఘటనలు జరిగాయి. జైలు అధికార్లు మొదటి నుండీ వాళ్లను అనేక రకాల మానసిక, శారీరక హింసలకు గురి చేస్తూ వాళ్ల మనోస్థైర్యాన్ని దెబ్బతీయాలని చూస్తున్నారు. వీళ్లకు శిక్ష విధించడాన్నీ, జైలులో జరుగుతున్న దౌర్జన్యాల్నీ మా స్పెషల్ జోనల్ కమిటీ ఖండిస్తోంది. దండకారణ్య విప్లవోద్యమంపై రమన్ ప్రభుత్వం సాగిస్తున్న అన్యాయమైన యుద్ధంలో భాగమే ఇదంతా అని మా స్పెషల్ జోనల్ కమిటీ భావిస్తోంది.

నేడు పెద్ద పెద్ద ఊచకోతలకూ, మానవత్వం సిగ్గుతో తలవంచుకునే ఘోరాతిఘోరమైన నేరాలకూ బాధ్యులైన వాళ్లు గద్దెలెక్కి సుఖభోగాలలో మునిగితేలుతున్నారు. 25 వేలకు పైగా మంది ప్రజల బలవన్మరణానికి దారితీసిన భోపాల్ గ్యాస్‌లీక్ ఉదంతానికి బాధ్యులైన వాళ్లకు 26 ఏళ్ల నేరపూరిత ఆలస్యం తర్వాత కేవలం రెండేళ్ల శిక్ష విధించడం, శిక్ష ప్రకటించిన కొద్ది నిమిషాల్లోనే వాళ్లకు బెయిల్ కూడా మంజూరు చేయడం, పైగా ఇందులో ముఖ్య ముద్దాయి ఐన వారన్ ఆండర్‌సన్‌కు దర్జాగా దేశం వదిలి పోయేలా అవకాశం ఇవ్వడం వంటివి ఈ దేశ న్యాయవ్యవస్థ బడా, విదేశీ పెట్టుబడిదార్లకు వత్తాసు పలుకుతుందనే దానికి ఉదాహరణ. 1984లో జరిగిన సిక్కుల ఊచకోతకు బాధ్యులైన కాంగ్రెస్ నాయకులకూ, 2002లో గుజరాత్‌లో ముస్లింలపై జరిగిన ఊచకోతలకు బాధ్యులైన నరేంద్రమోది తదితర సంఘ్ ముఠా హంతకులకూ ఇప్పటి దాకా శిక్ష పడకపోవడం మన దేశ న్యాయవ్యవస్థ ప్రజలకూ, మైనారిటీ మతస్తులకూ వ్యతిరేకమైందని చెప్పడానికి స్పష్టమైన ఉదాహరణ. వేలాది కోట్ల ప్రజాధనాన్ని పెద్ద పెద్ద కుంభకోణాల్లో స్వాహా చేస్తున్న వాళ్లకు శిక్ష విధించిన ఉదాహరణ మచ్చుకు ఒక్కటైనా కానరాదు మనకు. దేశ న్యాయవ్యవస్థ నిష్పక్షపాతమైందని రుజువు చేయగల వుదాహరణ ఒక్కటైనా లేదు. రుచికా కేసు సహా మహిళలపై జరిగిన నేరాలలో ముద్దాయిలైన పెద్ద పెద్ద వాళ్లకు శిక్ష పడిన దాఖలా

## అన్యాయపు తీర్పులను ఖండిద్దాం!

'న్యాయ' వ్యవస్థ తనను తాను స్వయం ప్రతిపత్తి, నిష్పాక్షిక వైఖరి కల్గినదిగా చెప్పుకుంటుంది. కానీ వాస్తవానికి దోపిడీ వ్యవస్థలో అది విడదీయరాని అంతర్భాగం. దోపిడీ వ్యవస్థ లోతుగా వేళ్లూనుకోవడానికీ, సుదీర్ఘంగా కొనసాగడానికి బలమైన ఆలంబనగా వుంటుంది. ఇది చరిత్రలో ఎన్నోసార్లు నిరూపితమైనదే!

ఒకవైపు గ్రీన్‌హంట్ పేరుతో దోపిడీ పాలకవర్గాలు మావోయిస్ట్ పార్టీపై, ప్రజలపై విరుచుకుపడుతుంటే, మరోవైపు న్యాయవ్యవస్థ అందుకు ఏ మాత్రం తగ్గకుండా మావోయిస్ట్ కార్యకర్తలకూ, సానుభూతిపరులకూ కఠినశిక్షలు విధిస్తోంది. అలా పీడిత ప్రజలకు నాయకత్వం లేకుండా చేయాలని ప్రయత్నిస్తోంది.

అందులో భాగంగా ఇటీవలి కాలంలో సి.పి.ఐ. (మావోయిస్ట్) పొలిట్‌బ్యూరో సభ్యుడు కామ్రేడ్ సుమిత్ దా (అమితాబ్ బాగ్చీ)పై అనేక బూటకపు కేసులు ఆరోపించి కోర్టు జీవితఖైదు విధించింది. దండకారణ్య పార్టీకి చెందిన సీనియర్ కార్యకర్త కామ్రేడ్ మాలతికీ, కార్మికుడిగా పనిచేస్తోన్న సురేంద్ర కోసరియాలకు వారికి ఎటువంటి సంబంధం లేని సీడీ కేసులో పదేళ్ల శిక్ష విధించింది. అలాగే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ పరిధిలో రీజినల్ కమిటీ స్థాయిలో పనిచేసిన కామ్రేడ్ సాగర్ (పాండు రంగారెడ్డి)కీ, మరో ముగ్గురికీ వాళ్లకు ఎటువంటి సంబంధం లేని అలిపిరి కేసులో ఏడేళ్ల శిక్షను విధించింది.

బూటకపు కేసులు మోపి పై కామ్రేడ్స్‌కు శిక్షలు విధించడాన్ని 'క్రాంతి' తీవ్రంగా ఖండిస్తోంది. ఇటువంటి అప్రజాస్వామ్య అన్యాయ తీర్పులకు వ్యతిరేకంగా ఉద్యమించవల్సిందిగా ప్రజలకూ, ప్రజాస్వామ్యవాదులకూ పిలుపునిస్తోంది.

ఒక్కటి కూడా కానరాదు. పీడితులకు న్యాయం ఎప్పుడూ జరగలేదు. ఆశ్చర్యకరంగా రాయ్‌పూర్ సీడీ పంపిణీ కేసులో పీడితులే లేరసలు. వాళ్లు చెప్పుకునే రాజ్యాంగం ప్రకారం కూడా ఇది నేరం కానే కాదు. వాస్తవానికి న్యాయాన్నీ, ప్రజాస్వామ్యాన్నీ నమ్మే వాళ్లెవరు ఈ సీడీని చూసినా మొట్టమొదట దీనిలో చూపించిన హింస, అత్యాచారం, హత్య, బీభత్సకాండలకు సంబంధించిన సంఘటనల వెనుక అసలు సూత్రధారులైన రమన్‌సింగ్, మహేంద్రకర్మలకు ఇప్పటి వరకూ శిక్ష ఎందుకు పడలేదని ప్రశ్నిస్తారు. కానీ ఈ దోపిడీ వ్యవస్థలో ఒక అంగంగా పని చేస్తున్న ప్రస్తుత న్యాయవ్యవస్థ దృష్టిలో మాత్రం సీడీలో చూపించిన అంశాలకంటే సీడీల్ని పంచడమే నేరమైపోయింది. ఒకవేళ సీడీల్ని లేదా కరపత్రాలు పంచడమే నేరమైతే ఈ నేరం దేశంలోని కోట్లాది మంది ప్రజలు ఎప్పుడో చేశారు. ఒక్కసారి కాదు, ఎన్నో సార్లు!

ప్రభుత్వం ఒక కుట్రలో భాగంగానే ఈ కేసును నడిపించి స్పష్టమైన సాక్ష్యాలు లేనప్పటికీ, కిరాయికి తెచ్చిన దొంగ సాక్షులతో, ఇంకా అనేక రకాల వత్తిళ్లతో మా పార్టీ కార్యకర్త మాలతితో పాటు నిరుపేద కార్మికుడైన సురేంద్ర కోసరియాకు శిక్ష పడేలా చేసింది. ఇలా శిక్షలు విధించడం ద్వారా విప్లవకారుల, ముఖ్యంగా జైళ్లల్లో వున్న రాజకీయ ఖైదీల మనోస్థైర్యాన్ని దెబ్బతీయగలనని ప్రభుత్వం భావిస్తున్నది. ఇలా తప్పుడు కేసుల్ని నడిపించి కఠిన శిక్షలు విధించడం ద్వారా ప్రజల, ప్రత్యేకించి పట్టణ ప్రాంతాల్లోని ప్రజలను భయపెట్టగలననీ, వాళ్లను విప్లవోద్యమం నుండి దూరం చెయ్యగలననీ కూడా అది పగటికల గంటున్నది. కానీ జైలు కటకటాలు, ఉరికొయ్యలు విప్లవకారుల ఉక్కు సంకల్పాన్ని, శ్రామిక ప్రజల విప్లవ స్ఫూర్తిని ఎప్పుడూ దెబ్బతీయలేదని, ఇక ముందు దెబ్బతీయబోవని కూడా చరిత్ర చెబుతున్నది. కామ్రేడ్ మాలతి, సురేంద్ర కోసరియాలకు అన్యాయంగా శిక్ష విధించడాన్ని ఖండించాలని మేం ప్రజాస్వామిక మేధావులందరికీ, కార్మిక-కర్షకులందరికీ విజ్ఞప్తి చేస్తున్నాం. ముందుగా పోలీసులు వల్లెవేయించిన తప్పుడు సాక్ష్యాలను కోర్టులలో చెప్పడం ద్వారా ప్రజలకు వ్యతిరేకంగా నేరానికి పాల్పడుతున్నారని, ఇందుకు ప్రజలు మిమ్మల్ని క్షమించరని పోలీసు ఏజెంట్లకూ, ప్రభుత్వ దొంగ సాక్షులకూ మేమీ సందర్భంగా హెచ్చరిక చేస్తున్నాం. ప్రజల ప్రజాస్వామిక న్యాయస్థానాలు వీళ్లను తప్పక విచారిస్తాయి.

Gudsa Usendi

**(గుడ్సా ఉసెండి)**

**అధికార ప్రతినిధి**

**దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీ,**

**భారత కమ్యూనిస్టు పార్టీ (మావోయిస్టు)**

# ప్రతిఘటనా – పోరాటాలూ – సభలు

## మల్కన్‌గిరి-కోరాపుట్ సరిహద్దు డివిజన్

### బిచ్చినాంచొళా ప్రజా ఆందోళన

మల్కన్‌గిరి–కోరాపుట్ సరిహద్దు డివిజన్‌కు చెందిన కుడుములగుమ్మ బ్లాక్‌లోని 7 పంచాయితీల్లోని గ్రామాలను వేరు చేస్తూ సీలేరు నది ప్రవహిస్తుంది. దానిపై చిత్రకొండ వద్ద విద్యుత్తు ఉత్పాదనకై భారీ డ్యాంను 1950లలో నిర్మించారు. దీనితో పదుల సంఖ్యలో గ్రామాలు, పంట భూములు ముంపుకు గురయి వేలాది మంది ప్రజలు నిర్వాసితులుగా మారారు. ఈ ప్రాంతం ఒడిషా రాష్ట్రంతో సంబంధం తెగిపోవడంతో కట్ ఆఫ్ ఏరియాగా పిలువబడుతున్నది. ప్రజలు ఎలాంటి అభివృద్ధి, సంక్షేమాలకు నోచుకోకుండ తీవ్రమైన వివక్షతకు, నిర్లక్ష్యంకు గురిచేయబడుతున్నారు. విద్య, వైద్యం, రవాణాలాంటి కనీస ప్రాథమిక సదుపాయాలు కల్పించబడటంలేదు. ప్రభుత్వ అధికారులు ఎవరు ఈ ప్రాంతంవైపు తొంగిచూడరు. సంతలకు, హాస్పిటల్‌కు రావాలన్న రిజర్వాయర్ నుండే రావాల్సి వుంటుంది. దానికోసం 50 సంవత్సరాల క్రితం ప్రభుత్వం కొన్ని లాంచ్‌లను మంజూరు చేసింది. క్రమంగా అవి చెడిపోయి పని చేయకుండ మారినా రిపేర్ చేయించడం లేదు.

సుదీర్ఘకాలంగా ఎన్నో సమస్యలతో సతమతమవుతున్న కట్ ఆఫ్ ఏరియా ప్రజలు 2009 జూలైలో బిచ్చిన్నాంచొళా ఆదివాసీ సంఘంగా సంఘటితపడ్డారు. జూలై 15న వందలాది గ్రామాల ప్రజలు వంటకు అవసరమయిన సామాన్లు వెంట తీసుకొని కాలినడకన ప్రయాణంచేసి చిత్రకొండ–బలిమెల ప్రధాన రహదారిపైకి చేరుకున్నారు. జూలై 15న 15 వేల మంది రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో చేసి మొదటిసారిగా తమ సమస్యలను బయటి ప్రపంచం దృష్టికి తీసుకువచ్చారు. ప్రభుత్వం దిగివచ్చి తమ సమస్యలు పరిష్కరించే వరకు ఆందోళనను కొసాగిస్తామని ప్రకటించారు.

జూలై 15 నుండి 24 వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్క చేయకుండ రాస్తారోకో, ఇ.ఇ.ఆఫీస్ ముట్టడి, తహసీలు ఆఫీస్ దిగ్బంధనం, బంద్ పిలుపు, ముఖ్యమంత్రి, కలెక్టర్ దిష్టిబొమ్మల దగ్ధం, ఊరేగింపుల ద్వారా 9 రోజులు రోడ్డుపై వంటలు చేసుకొని తింటూ ఆందోళనను కొనసాగించారు. కలెక్టర్ చర్చలకు ఆహ్వానించాడు. ఆందోళన జరుపుతున్న ప్రజల మధ్యనే చర్చలు జరుగాలనే ప్రజల డిమాండ్‌కు తలవంచక తప్పలేదు. జూలై 24 ప్రభుత్వం తరపున సబ్ కలెక్టర్ చర్చలకు హాజరయ్యాడు. మెజారిటి డిమాండ్లను ఆమోదిస్తూ తమ పరిధిలోకి రాని విషయాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకువెళుతామనీ తాము ఆమోదించిన సమస్యల పరిష్కారంకు రెండు నెలల వ్యవధి కావాలని కోరాడు. తాత్కాలికంగా ఆందోళనను విరమిస్తూనే మొత్తం సమస్యలు పరిష్కారం అయ్యేవరకు తదుపరి పోరాటంను కొనసాగించాలని నిర్ణయించారు.

ఆ తర్వాత 6 నెలలు గడిచినా ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చలేదు. కమిటీతో చర్చల పేరుతో కాలయాపన జరిపింది. ఎక్కడ వేసిన గొంగలి అక్కడే అన్నచందంగా మారిపోయింది. ప్రజల రవాణ కోసం రిజర్వాయర్‌లో నడుపుతున్న లాంచ్‌లు రిపేర్ పేరుతో పూర్తిగా నిలిచిపోయాయి. ప్రజలు మరిన్ని ఇబ్బందులు చవిచూసారు. తిరిగి 2010 ఫిబ్రవరిలో కట్ ఆఫ్ ఏరియాతోపాటు లాంచ్ సమస్యను ఎదుర్కొంటున్న నక్కమామిడి, టన్నెల్ క్యాంపు పంచాయితీలను కలుపుకొని కమిటీ ఏర్పడింది. మొత్తం సమస్యలను మరోసారి చర్చించారు. ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ మరోసారి ఆందోళన చేపట్టాలని నిర్ణయం తీసుకున్నారు. గ్రామ, పంచాయితీ స్థాయిలో ఐక్యసంఘటనను ఏర్పర్చింది. ఆదివాసీ ప్రాంతాలపై ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తలపెట్టిన భారీ సైనిక దాడిని నిలిపివేయాలని డిమాండ్‌ను కూడా జోడించారు. ఫిబ్రవరి 15న తొమ్మిది పంచాయితీలకు చెందిన అనేక గ్రామాల నుండి 13–15 వేల మంది ప్రజలు బ్యానర్లు, ప్లేకార్డులు, సాంప్రదాయక ఆయుధాలు, ఆదివాసీ ధింస వాయిద్యాలు, వంటపాత్రలు పట్టుకొని కాలినడకన ప్రయాణించి చిత్రకొండ – బలిమెల ప్రధాన రహదారి పైకి చేరుకున్నారు. ఆరోజు సభ జరిగింది. ప్రజలనుద్దేశించి పలువురు వక్తల ప్రసంగాలు, నినాదాలూ, సాంప్రదాయక ఆయుధాలతో నృత్యం, ధింస, కళారూపాల ప్రదర్శనతో సభ ఉత్తేజభరితంగా జరిగింది.

ఫిబ్రవరి 16న ర్యాలీ చేశారు. వీరి ఆందోళనకు మద్దతును ప్రకటిస్తూ స్థానిక కాంగ్రెస్ ఎం.పి. హాజరయ్యాడు. మీడియా ముందు మరోసారి వారి డిమాండ్లను తెలియజేస్తూ విశాల ప్రజల మద్దతును కోరుతూ ప్రకటన చేశారు. ఎం.పి. తన నిధుల నుండి నూతన లాంచ్ కొనుగోలుకు 20 లక్షలు ఇస్తున్నట్టు ప్రకటన చేశాడు.

ఫిబ్రవరి 17న సాంప్రదాయక ఆయుధాలతో మార్చింగ్ చేస్తూ చిత్రకొండకు చేరుకొని ప్రభుత్వ దిష్టిబొమ్మను దగ్ధం చేసారు.

ఫిబ్రవరి 18న కోరుకొండ, కుడుములగుమ్మ బ్లాక్‌ల బంద్ పిలుపునిచ్చి రాస్తారోకో ఆందోళన చేసి నవీన్ పట్నాయక్

దిష్టిబొమ్మను దగ్ధం చేసారు. జిల్లా కలెక్టరు, ఎస్.పి.లు కమిటి సభ్యులకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకున్నారు. కట్ ఆఫ్ ఏరియాలో ఎ.పి. పోలీసుల దాడులు నిలిపివేసే విధంగా చర్యలు చేపడుతామని హామీనిచ్చారు. ఈ సమస్యలు ఇపుడే తన దృష్టికి వచ్చాయనీ, గతంలో పనిచేసిన కలెక్టరు హామీనిచ్చి నెరవేర్చకపోవడం పొరపాటేననీ, జిల్లా హెడ్‌క్వార్టర్‌కు వస్తే కమిటితో చర్చిస్తానని కలెక్టరు ప్రతిపాదన చేశాడు.

ఫిబ్రవరి 19న తహసిల్ ఆఫీసును దిగ్బంధించి, తహసీల్‌దారుని నిర్బంధించారు. 9 పంచాయితీలకు చెందిన సర్పంచ్‌లు, సమితి సభ్యులు, వార్డు మెంబర్స్ తమ పదవులకు రాజీనామా ప్రకటించారు.

తమ సమస్యలు నెలరోజుల లోపు ప్రభుత్వం పరిష్కరించనిచో మార్చి 19 నుండి తమ ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని ప్రకటించి తాత్కాలికంగా ఆందోళనను విరమించారు.

ప్రభుత్వం ఇచ్చిన హామీల మాట అటుంచి ఆందోళన చేసిన ప్రజలు చట్టవిరుద్ధంగా ఆయుధాలు ధరించి ప్రదర్శనలు చేసారనీ, అనుమతి లేకుండా ధర్నా, రాస్తారోకోలు చేపట్టారని దిష్టిబొమ్మలు దగ్ధం చేసారని, పోరాట నాయకత్వం ప్రజలను రెచ్చగొట్టి ప్రభుత్వంపై రాజకీయ కుట్రకు పాల్పడిందని కమిటీ అధ్యక్షులు, కార్యదర్శి, మరో సభ్యుడిపై అయిదు అక్రమ కేసులు బనాయించారు.

ప్రజలను పోరాటం నుండి పక్కదారి పట్టించి ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయడానికి కలెక్టర్ కమిటీ సభ్యులను విభజించి పాలించే పద్ధతులు అవలంభిస్తూ, బెదిరించడం చేస్తూ, మరోవైపు తమ మాటవినే సభ్యుల ప్రతిపాదనలను అమలుచేయాలనే కుట్రలు చేస్తున్నాడు. కంటితుడుపు చర్యగా డిమాండ్లలోనే కొన్ని సమస్యలు పరిష్కరిస్తూ ప్రత్యేక శ్రద్ధ పెడుతున్నట్టు నమ్మించపూనుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

## ఎస్.ఒ.జి. జవానులపై ఆంబుష్

ఆదివాసీ ప్రాంతాలలోని సహజ సంపదను కొల్లగొట్టడానికి సామ్రాజ్యవాదుల, బహుళజాతి కంపెనీలకు ఆహ్వానం పలుకుతున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆపరేషన్ గ్రీన్‌హంట్ పేరుతో భారీ సాయుధ దాడిని మావోయిస్టు పార్టీపై, పోరాడే ప్రజలపై ఆరంభించింది. అందులో భాగంగానే పెద్ద ఎత్తున కేంద్ర అర్ధసైనిక బలగాలను, ప్రత్యేక హంతక కోబ్రా బలగాలను, స్థానిక స్పెషల్ బలగాలను ఉద్యమ ప్రాంతాలంతటా మోహరిస్తున్నారు. దీనిని వ్యతిరేకిస్తూ మల్కన్‌గిరి, చిత్రకొండ, నారాయణపట్నాలో వేలాది మంది ప్రజలు కదిలి నిరసనను తెలియజేస్తూ ఆందోళన చేసారు. 2010 మార్చి నెలలో మూడు బెటాలియన్‌ల బి.ఎస్.ఎఫ్.ను కోరాపుట్‌లో దింపి మల్కన్‌గిరిలోని ఉద్యమ ప్రాంతాలకు తరలించారు. దానిని అడ్డుకోవడానికి భాగంగా సాయుధ బలగాలను ప్రతిఘటించి నిర్మూలించాలనే ఎస్.జడ్.సి. చేసిన నిర్ణయంలో భాగంగా కోరాపుట్–మల్కన్‌గిరి జిల్లాల సరిహద్దు గ్రామమైన మంత్రిమంబు వద్ద 2010 ఏప్రిల్ 4న ప్రజల క్రియాశీలక భాగస్వామ్యంతో పి.ఎల్.జి.ఎ. చేసిన ఆంబుష్‌లో 11 మంది ఎస్.ఒ.జి. జవానులు చావగా మరో 8 మంది గాయపడ్డారు. ఈ ప్రాంతంలో దాడి ఆరంభించామని ప్రకటించిన రెండవ రోజునే సాయుధ బలగాలపై దెబ్బపడడంతో శత్రువు ఖంగుతిన్నాడు. ప్రజల్లో విశ్వాసం మరింతగా పెరిగింది. ఈ సంఘటన తర్వాత పలు గ్రామాల ప్రజలు సమావేశాలు జరుపుకొని పోలీసులు దాడికి వస్తే ప్రతిఘటించి సంఘటితంగా ఎదుర్కోవాలనీ, సాయుధం కావాల్సిన అవసరం వుందని చర్చించి నిర్ణయాలు తీసుకున్నారు.

## గ్రామ పెత్తందారుకు దేహశుద్ధి

కోరాపుట్ జిల్లా బైపరిగూడ బ్లాక్‌లోని మాజీగూడ గ్రామంలోని పెత్తందారు, వడ్డీ వ్యాపారి అయిన సుభాష్ ఆదివాసీ పేద ప్రజలకు అప్పులిచ్చి మోసం చేసి భూములు ఆక్రమించడం, ఎదిరిస్తే పోలీసు కేసులు పెట్టించడం, సి.పి.ఐ. పార్టీ జెండా కప్పుకొని ప్రజలను బెదిరించడం చేసేవాడు. ఈ ప్రాంతానికి 2009లో మావోయిస్ట్ పార్టీ వెళ్లిన తర్వాత పేదల భూములు కొన్నింటిని వాపస్ ఇప్పించింది. దానితో సంఘ కార్యకర్తలను అరెస్టు చేయించి అక్రమ కేసులు పెట్టించి జైలుకు పంపారు. ఈ విషయాన్ని ప్రజల్లో పెట్టి విచారించడంతో అరెస్టులకు తన బాధ్యత వుందని సుభాష్ అంగీకరించాడు. ప్రజల అభిప్రాయంతో మాచిఖండ్ ఎల్.ఒ.ఎస్. దేహశుద్ధి చేసి, ప్రజలకు కోర్టు ఖర్చులు చెల్లించడం కోసం 10 వేల రూ.లు దండుగ వసూలు చేసింది. ఈ సంఘటన ద్వారా చుట్టుపక్కల గ్రామాల ప్రజల్లో మంచి ప్రభావం పడింది.

# కోరాపుట్ డివిజన్

## మాలి పర్వతాల రక్షణకై పోరు

మాలి పర్వతం అంటే మాలీలు మెజారిటీగా నివసించే పర్వత ప్రాంతం. మాలీలతో పాటు పొర్జ, కుయి పైడీలు నివసిస్తున్నారు. ఈ పర్వతాలను, నీటి సదుపాయాలన్నీ ఆధారం చేసుకొని చోళ్లు , ధాన్యం, కూరగాయలు తదితర పంటలు పండించి జీవిస్తున్నారు. కూరగాయలను కోరాపుట్, దామన్‌జోడి తదితర ప్రాంతాలకు ఎగుమతి చేస్తారు.

మాలీ పర్వతాల్లో నిక్షిప్తమై వున్న బాక్సైట్ నిల్వలను దోపిడి చేయాలని దళారీలు ఈ పర్వతాలను ప్రభుత్వం నుండి లీజుకు తీసుకున్నారు. ఇండోల్ కంపెనీ దళారీ బూర్జువాలు తవ్వకాలు ప్రారంభించారు. ఈ తవ్వకాలు ఇలాగే కొనసాగితే ఈ పర్వతాలు అదృశ్యం అవుతాయి. అంటే మాలీలు అదృశ్యం కావడమే.

కోరాపుట్ జిల్లాలో పంబవట్‌మాలీ, దేవుమాలీ, బాబలిమాలీ, కోరాడియామాలీ, మాలీపర్వతాల్లో విస్తారమైన బాక్సైట్ నిల్వలున్నాయి. 30 సంవత్సరాల క్రితం "పంచవట్ మాలీ" పర్వతాల సమీపంలోని దామన్‌జోడిలో నెలకొల్పిన నాల్కో ఫ్యాక్టరీ బాక్సైట్ నిల్వలను దోపిడి చేయడం ప్రారంభించి విశాలమైన ప్రాంతం నుండి ఆదివాసీలను నిర్వాసితులను చేసి తరిమివేసింది. నేడు మాలీ, దేవుమాలీ పర్వతాల నుండి ఖనిజ సంపదను కొల్లగొట్టడం కోసం ఆదివాసీలను నిర్వాసితులను చేయాలని చూస్తున్నారు. దీనికి వ్యతిరేకంగా ప్రజలు దేవుమాలీ-మాలీ పర్వత సురక్ష సమితి కింద సంఘటితమై పోరాడుతున్నారు. దీనికి ఛసి ములియా సంఘం కూడా మద్దతు ఇస్తున్నది.

మాలీ పర్వత ప్రాంతం గురించి నిర్దిష్టంగా చెప్పుకోవాలంటే ప్రస్తుతం లీజు ఇచ్చిన ప్రాంతం నాలుగు పంచాయితీల పరిధిలోనిది. కుడి, సొరసపాదర్, పక్కుజొల్ల, దొల్లయ్‌గూడ పంచాయితీల్లోని 25 గ్రామాలు తవ్వకాల వల్ల ప్రత్యక్షంగా ప్రభావితం అవుతాయి. మాలీ పర్వత నిర్వాసిత సమస్యను వ్యతిరేకిస్తూ 25 గ్రామాల ప్రజలు సంఘటితమై పోరాటం ప్రారంభించారు. అనంత్‌కిరసానీ, పిత్తంపాడి వంటి నాయకులు ఫ్యాక్టరీతో ఒప్పందాలు కుదుర్చుకొని లంచాలు తీసుకొని పోరాటాన్ని నీరుగార్చి కంపెనీకి పర్వతాలను అప్పజెప్పాలని చూస్తున్నారు. వీళ్లు 25 గ్రామాలల్లో ప్రచారం చేసి గ్రామాల్లోని పెత్తందార్లకు లంచాలు ఆశచూపి కొన్ని గ్రామాలను కంపెనీ వైపు నిలబెట్టారు. కంకడాంబ అనే 200 వరకు ఇండ్లు వుండే ఆదివాసి కుయి గ్రామం కంపెనీవైపు నిలబడింది. నిర్వాసిత సమస్యకు వ్యతిరేకంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్న వారిపై దాడి చేశారు. ఆ సందర్భంగా దశరత్ కిల్లో అనే వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. అయినప్పటికీ కంపెనీ నిర్వహిస్తున్న పనులను మే 2010 మొదటి వారంలో ప్రజలంతా కలిసి అడ్డుకున్నారు. కొండలల్లో పనుల్లో వున్న వాహనాలను మొత్తం కొండల కిందికి దింపివేశారు.

2005 నుండి ప్రారంభమైన నిర్వాసిత వ్యతిరేక ఆందోళన బలంగానే కొనసాగుతున్నది. 2005-07లో ప్రభుత్వం నిర్వహించిన పోలీసు సభలను ప్రజలు తీవ్రంగా వ్యతిరేకించారు. ఈ పోరాటానికి మేధావులు ప్రఫుల్లా సామంతరాయ్, గణనాథ్‌పాత్రోలు మద్దతునిస్తున్నారు. దీన్ని మరింత మిలిటెంట్ ఉద్యమంగా కొనసాగించడానికి నాయకత్వం సిద్ధంగా వుంది. ప్రజలు మావోయిస్టు పార్టీ నాయకత్వాన్ని కోరుతున్నారు.

## మనోబల్ సభలు

కోరాపుట్ జిల్లా నారాయణపట్నాలో 2009 నవంబర్ 20న జరిపిన కాల్పుల అనంతరం, సింగన్నను చంపేశాం, సంఘం పని అయిపోయిందంటూ పోలీసులు, శాంతిసేన కలిసి గ్రామాలపై దాడులు చేయడం, కాల్పులు జరపడం, సరెండర్ కావాలని లేకుంటే చంపివేస్తామని బెదిరించడం, లింగాను అరెస్టు చేయడం కోసం ఆపరేషన్ లింగా పేరుతో అభియాన్‌ను ప్రారంభించడంతో ఏరియా వ్యాప్తంగా ప్రజల్లో భయానక వాతావరణం నెలకొంది. ప్రజలను ఈ భయాల నుండి బయటపడవేసి, వారిలో మనోస్థైర్యాన్ని పెంచడం కోసం మనోబల్ సభలను జరుపుతున్నారు.

2010 జనవరి 15కు ముందు వారం రోజులు నారాయణపట్నాలోని అన్ని గ్రామాలలో ప్రచారం చేశారు. జనవరి 15న తోలోగుమ్మండిలో దాదాపు 2 వేల 500 మంది మహిళలు, పిల్లలు, పురుషులతో సభ జరిగింది. ఈ సభలో సంఘం నాయకులు సంఘం చేసిన పోరాటాలు, ప్రభుత్వం చేస్తున్న నిర్బంధ అణచివేత, నవంబర్ 20న కామ్రేడ్స్ సింగన్న, ఆండ్రుల హత్య, నేడు పోరాడాల్సిన ఆవశ్యకతను వివరంగా మాట్లాడి ప్రజల మధ్య చర్చించారు. సంఘాన్ని దృఢంగా ముందుకు నడిపించాలనీ, భూస్వాముల, షావుకార్ల దోపిడీని నిర్మూలించాలనీ, ప్రభుత్వం ప్రకటిస్తున్న సగం భూమి పద్ధతిని వ్యతిరేకించాలనీ, భూములు వదలవద్దనీ 'మానాయూ-మా రాజ్యమీ (మా వూరు మా అధికారం)', 'కామ్రేడ్స్ సింగన్న, ఆండ్రుల ఆశయాలను కొనసాగిద్దాం', 'వాళ్ల వారసత్వాన్ని కొనసాగిద్దాం' అంటూ నాయకులు చేసిన వుపన్యాసాలు ప్రజల్లో ఎంతో ధైర్యాన్నీ, ఉత్సాహాన్నీ కల్గించాయి. ఈ సభ ప్రజలకు ఎంతో మనోస్థైర్యాన్ని కల్గించి ముందుకు నడిపించింది.

**మంకిడిలో:** జనవరి 15న జరిగిన సభ విశాల ప్రజానీకంలోకి వెళ్లలేదు. ఒక్క నారాయణపట్నా బ్లాక్‌లోనే జరిగింది కనుక సిమిలిగూడ, బందుగామ్ బ్లాక్‌లను కలుపుకొని ఫిబ్రవరి 8న మరో సభ జరపాలనుకున్నారు. దీనికోసం ఫిబ్రవరి 2 నుండి 7 వరకు మొత్తం మూడు క్యాంపెయిన్ టీములు ప్రచారం చేశాయి. మిలీషియా కామ్రేడ్స్ 6వ తేదీనే 400 మంది సమావేశమై సభ రక్షణ ఏర్పాట్లను చర్చించారు. 10 గంటలకు మీటింగు ప్రారంభమైంది. దీనికి ఎ.ఆర్.సి.ఎస్. అధ్యక్షుడు కామ్రేడ్ రవి అధ్యక్షత వహించగా కా. పద్మ (ఎ.వి.ఎం.ఎస్.), కా. కుమారి(ఎ.వి.ఎం.ఎస్.), కామ్రేడ్ సోమరాజులతో పాటు ప్రతి బ్లాక్ నుండి ప్రాతినిధ్యం వహిస్తూ మొత్తం ఏడుగురు వక్తలు ప్రసంగించారు. ఈ సభకు దాదాపు 7 వేల 500 మంది ప్రజలు హాజరయ్యారు. ఈ సభలో వక్తలు తర తరాలుగా ఆదివాసేతర భూస్వాముల, షావుకార్ల దోపిడీని భరించిన మనం, ఇప్పుడు భూమికోసం పోరాడుతుంటే సర్కారు షావుకార్ల, భూస్వాముల కొమ్ముకాస్తూ ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని ప్రయోగిస్తోంది. దీనికి వ్యతిరేకంగా మనం మరింత సంఘటితం కావాలనీ, 'మా నాయూ-మా రాజ్యమీ', 'దూయిని గ్రటకే జొమ్మి

(దున్నేవారికే భూమి)' ప్రభుత్వ 'సగం భూమి' పద్ధతిని వ్యతిరేకించాలనీ ఉపన్యసించారు. 5 గంటలపాటు జరిగిన ఈ సభ ప్రజలలో మరింత మనోస్థైర్యాన్ని పెంచింది. సాంస్కృతిక బృందం ఆట పాటలతో నూతన విప్లవోత్తేజాన్ని కల్గించింది. ఈ సభ ప్రజల్ని మరింత సంఘటితం చేసింది.

## ప్రభుత్వ సరెండర్ పత్రాలను కాల్చివేసిన ప్రజలు

నారాయణపట్నా బ్లాక్‌లో నవంబర్ 20న జరిగిన కాల్పుల అనంతరం ప్రభుత్వం ప్రజలపై తీవ్ర నిర్బంధాన్ని కొనసాగించి భీతావహ వాతావరణాన్ని కల్పించి, అరెస్టు చేసి భయపెట్టి బలవంతంగా సరెండర్ చేసుకుంది. సరెండర్ అయితే ఏమీ చేయమని చెప్పడంతో కొందరు సరెండర్ అయ్యారు. సంతలకు వెళ్లిన వారిని పట్టుకొని రక రకాలుగా అదుపులోకి తీసుకొని వారందరినీ సరెండర్ అయినట్టుగా ప్రకటించుకుంది ప్రభుత్వం.

ఈ గ్రామాలకు దళం వెళ్లి సరెండర్ పాలసీ వెనుక వున్న ప్రభుత్వ కుట్రను అర్థం చేయించింది. తర్వాత గ్రామ పెద్దలు తాము భయపడి పోలీసులు వూరికి రాకుండా వుండడం కోసం ముసలివారిని సరెండర్ కోసం పంపామనీ, ఇది తప్పనీ ప్రజల ముందు క్షమాపణలు కోరారు. సరెండర్ పత్రాలను కాల్చి ప్రభుత్వ సరెండర్ పాలసీని తిప్పికొడుదాం అన్నారు. అందరూ ఆ మాటకు ఆమోదం తెల్పి, మంటను రాజేసి సమిష్టిగా సరెండర్ పత్రాలను మంటలో వేసి కాల్చి ఎ.ఆర్.సి.ఎస్. వర్థిల్లాలి, పి.ఎల్.జి.ఎ. వర్థిల్లాలి అంటూ నినాదాలు చేశారు.

## ప్రభుత్వ సరెండర్ పథకాన్ని ఎండగడుతూ సభ

ప్రభుత్వం చేపట్టిన సరెండర్ల కార్యక్రమాన్ని ఎండగడుతూ నారాయణపట్నా బ్లాక్ బొరిగి, నాగులబెద్ద పంచాయితీల పరిధిలో సభ జరిగింది. ఈ సభకు వేయి మందికి పైగా ప్రజలు హాజరయ్యారు. ఈ సభలో పార్టీ నుండి కా. పూర్ణ, కా. గాసీ మాట్లాడుతూ ప్రభుత్వ విధానాలను, కామ్రేడ్ సింగన్న, ఆంధ్రులను చంపి ఇక్కడ పోరాటాన్ని నిర్మూలించాలని చేస్తున్న కుట్రలను బహిర్గతం చేశారు. ప్రజలందరూ ఈ సభలో ప్రాణాలు పోయినా సరెండర్లు కావద్దని ప్రతినబూనారు. ఫలితంగా ప్రజలు ప్రభుత్వ కుట్రలను మరింత లోతుగా అర్థం చేసుకుంటూ విప్లవోద్యమంలో దృఢంగా నిలబడుతున్నారు.

## మల్కన్‌గిరి డివిజన్

### పి.ఎల్.జి.ఎ. వారోత్సవాల సందర్భంగా

మల్కన్‌గిరి జిల్లా కలిమెల ఏరియాలోని రాయగూడ గ్రామం వద్ద 9వ పి.ఎల్.జి.ఎ. వారోత్సవాల సందర్భంగా 2009 డిసెంబర్ 6న సభ జరిగింది. ఈ సభ సందర్భంగా ప్రజలు వేయి మంది హాజరయ్యారు.

కంపెనీ బలగాలు, డివిజన్ బలగాలు దీనిలో పాల్గొన్నాయి. ఈ సందర్భంగా డివిజన్ బలగాలకు చెందిన ఒక మహిళా ఏసీఎం పి.ఎల్.జి.ఎ. జెండాను, మరొక మహిళా ఏసీఎం పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రజలనుద్దేశించి డివిజన్ సెక్రెటరీ, నల్గురు ఏసీఎంలు (ఇందులో ముగ్గురు మహిళా కామ్రేడ్స్) ఒడియాలో మాట్లాడారు. ఈ సందర్భంగా సెక్రటరీ మాట్లాడుతూ నేడు ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిన ఆర్థిక మహా సంక్షోభం ప్రభావం భారత దేశంపై పడిందని, అలాగే సామ్రాజ్యవాదులు అటవీ సంపదను కొల్లగొట్టడానికే గోదావరి దమన్‌ను తెచ్చారనీ దీనిని ప్రతిఘటించడానికి ఊరు ఊరునా ప్రజలు మిలీషియాలో చేరాలని పిలుపునిచ్చాడు.

గ్రామ, ఆర్.పి.సి. పి.ఎ.డి.కి చెందిన 80 మంది కామ్రేడ్స్ సాంస్కృతిక ప్రదర్శనలు ఇచ్చారు. నిర్బంధంపైన కొత్త పాటలు, నాటకం వేసారు. ఈ సభకు ముందు నుండే కరపత్రాల, పోస్టర్ల ద్వారా విస్తృత ప్రచారం చేసారు.

డిసెంబర్ 7న పొట్టేరు ఏరియా రంగుమెట్టిగూడ వద్ద ఒక సభ జరిగింది. దీనికి 300 మంది ప్రజలు హాజరయ్యారు. పార్టీ జెండాను పి.ఎ.డి ఏసీఎం, పి.ఎల్.జి.ఎ. జెండాను దళసభ్యురాలు ఎగురవేసారు. ఈ సందర్భంగా డీవీసీఎం, ఏసీఎం కామ్రేడ్స్ ప్రజలనుద్దేశించి మాట్లాడారు. ప్రభుత్వం తీసుకువస్తున్న గోదావరి దమన్‌ను ప్రజలందరూ ముక్త కంఠంతో ఖండించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పి.ఎ.డి. కామ్రేడ్స్ పాటలు పాడారు. అధిక ధరల సమస్యపై నాటకం వేసారు.

## బలిమెల పవర్ స్టేషన్‌పై దాడి

బలిమెల డ్యాం నిర్మాణమై 30 సంవత్సరాలు అయినప్పటికీ, అక్కడి నిర్వాసితులకు ఇప్పటికీ నష్టపరిహారం ఇవ్వకపోవడంతో ఇక్కడి ప్రజలు తినడానికి తిండిలేక వలసలు పోతున్నారు. వాళ్ల బతుకులు రోజు రోజుకూ దుర్భరంగా మారుతున్నాయి. ఇక్కడ ఉత్పత్తి అవుతున్న కరెంట్ ఝూర్ఖండ్, ఒడిషా, ఆంధ్రప్రదేశ్, బీహార్ లాంటి రాష్ట్రాలకు వెళ్తుండగా ఇక్కడి ప్రజల బతుకులు చీకటిలో మునిగిపోతున్నాయి.

దీనికి నిరసనగానూ, ఆదివాసీ గ్రామాలకు సాగునీరు అందించాలనే, గ్రీన్‌హంట్‌ను బందు పెట్టాలనే డిమాండ్లతో 2009 డిసెంబర్ 13న పిఎల్‌జిఎ బలగాలు ఒక బి.ఎస్.ఎన్.ఎల్. టవర్, వాటర్ టన్నెల్ గేటు కేబుల్ హౌజ్‌ను కాల్చివేయడంతో ఆటోమేటిగ్గా నీళ్లు బందు అయి నెలరోజుల పాటు కరెంటు ఉత్పత్తి ఆగిపోయి

కోట్లాది రూపాయల నష్టం వాటిల్లింది. ఈ ఘటన ప్రజల్లో మంచి ప్రభావాన్ని వేసింది. విప్లవ కార్యక్రమాల్లో ప్రజలు కదలడం మొదలంది. అలాగే గ్రామీణ ప్రాంతాల్లోకి విద్యుత్ ఇచ్చే ప్రక్రియ కూడా ప్రారంభమైంది.

## ప్రజా వ్యతిరేకి ఓయం కన్నాల్ ఖతం

డివిజన్‌లోని వోటు ఏరియా మన్నెకొండ గ్రామంలో త్రిమూర్తులు, లక్ష్మి అనే జంట విప్లవ సానుభూతిపరులు, గతంలో సంఘంలో కూడా పనిచేసి వుండినారు. వీరిపై ఇక్కడి ప్రజా వ్యతిరేకుల కన్నుపడింది. దానితో వీరిద్దరినీ హతమార్చే ఉద్దేశంతో 2009 నవంబర్ నెలలో వీరి ఇంటిపై ఓయం కన్నాల్ నాయకత్వంలో పదిమంది ముఠా దాడి చేసింది. అయితే త్రిమూర్తులు ఈ దాడి నుండి తప్పించుకోగలిగాడు. తమ చేతికి చిక్కిన లక్ష్మిని ఆమె ముగ్గురు పిల్లలు చూస్తుండగానే బట్టలు విప్పదీసి, చిత్రహింసలకు గురిచేసి, మెడకోసి పాశవికంగా హత్య చేశారు. పైగా మావోయిస్టులు చేసినట్టుగా పత్రికా ప్రకటన ఇచ్చారు.

జరిగిన సంఘటనపై స్థానిక పార్టీ సమాచారం సేకరించిన తర్వాత 2010 ఫిబ్రవరి 2న ఓయం కన్నాల్ ఇంటిపై పిఎల్‌జిఎ దాడి చేసింది. కన్నాల్ ప్రతిదాడి చేయడానికి విఫల ప్రయత్నం చేసి చివరకు పిఎల్‌జిఎ చేతికి చిక్కాడు. కన్నాల్‌నూ, ఆ దారుణ ఘటనతో సంబంధం వున్న మరో ఇద్దరిని విచారించగా, విప్లవోద్యమానికి జడిసి 2006లో గ్రామం వదిలి పారిపోయిన స్థానిక భూస్వాములైన నత్తిరాజు, రైమాన్‌లు ఈ హత్యచేయమన్నారనీ, డబ్బులు కూడా ఇచ్చారనీ కన్నాల్ వెల్లడించాడు.

ప్రజాభిప్రాయం మేరకు పిఎల్‌జిఎ కన్నాల్‌ను చంపి, మరో ఇద్దరికి దేహశుద్ధి చేసి వదిలేసింది.

## భాషా దివస్ దినోత్సవం సందర్భంగా

మల్కన్‌గిరి జిల్లా కలిమెల ఏరియాలో టేకుగూడ ఆర్.పి.సి. పాకెట్‌లో 800 మంది ప్రజలతో 2010 ఫిబ్రవరి 21న భాషా దివస్ పండుగ జర్గింది. ఈ సందర్భంగా మధ్యాహ్నం నుండి సాయంత్రం వరకు సభ జర్గింది.

ఈ సభ సందర్భంగా పార్టీ జెండాను ఆర్.పి.సి. సభ్యుడు ఆవిష్కరించాడు. ఒక మహిళా ఏసీఎం అధ్యక్షత వహించిన ఈ సభను ఉద్దేశించి ఆర్.పి.సి. సభ్యుడు, ఉపాధ్యక్షుడు ఉపన్యసించారు.

ఈ సందర్భంగా ఆర్.పి.సి. సభ్యులు ఆదివాసీ ప్రజల సంస్కృతి, సాంప్రదాయాలు, పండుగల్లో మార్పులు వచ్చాయనీ కోయ డోలు డాకా, సామూహిక నృత్యాలు, కోయ ప్రజలు ఉపయోగించిన సాంస్కృతిక కళారంగ పరికరాలు డోలు, ఊసాజ్, కింకిరి, గుజ్జుడు నేడు కనబడడం లేదని ఆవేదన వ్యక్తం చేసారు. వస్త్రధారణలలోనూ మార్కెట్ సంస్కృతి చోటు చేసుకుంటున్నదన్నారు.

భాషకు లిపి అవసరమనీ, కుయి భాషకు లిపిని తయారు చేసిన బాసధార డివిజన్ కమిటీ మెంబర్ కామ్రేడ్ దాసురాం మాలికా చేసిన కృషిని కొనియాడుతూ, ఆయనకు జోహార్లు చెపుతూ అతను తయారు చేసిన కుయి లిపిని ప్రభుత్వం గుర్తించాలని డిమాండ్ చేయాలన్నారు. అలాగే కోయ భాషకు లిపి తయారు చేయాలనీ, కోయ పుస్తకాలు ముద్రించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలన్నారు. మన భాషను మనం రక్షించుకోవాలని ప్రతిఏటా ఈ ఫిబ్రవరి 21 తేదిన భాషా దివస్ పండుగ ప్రజల నడుమ పెద్ద ఎత్తున జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

ఈ సందర్భంగా పి.ఎ.డి. కామ్రేడ్స్ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఒడియా, కోయ భాషల్లో పాటలు పాడారు, భాష ప్రాముఖ్యతను గుర్తించాలనీ, మన భాషా, సంస్కృతి కోసం మనం పోరాటం చేయాలనే సందేశంతో ఒక నాటకం వేసారు. చివరన కోయ ప్రజలు గ్రామాల నుండి పెద్ద పెద్ద డోళ్లు తీసుకువచ్చి, కళాత్మకంగా, లయబద్ధంగా సామూహిక నృత్యాలు చేసారు

పప్పులూర్ ఏరియా నుండి 200 మంది కొండరెడ్లు ఈ సభకు హాజరై వారి సామూహిక సాంస్కృతిక కోలాట నృత్యాన్ని ప్రదర్శించారు.

## పంచాయితీ భవనాల పేల్చివేత

కలిమెల బ్లాక్‌లో వున్న తెల్లరాయి, బొడిగట్ట; పొట్టేరు ఏరియాలోని కాంగూరు కొండ పంచాయితీ భవనాలు పోలీసుల క్యాంపులు పెట్టడానికి అనువుగా వున్నాయి. పొట్టేరు పంచాయితీ భవనాన్ని 2009 నవంబర్ నెలలో పోలీసులు పరిశీలించి కూడా వెళ్లారు. ఇక్కడ త్వరలో పోలీసు క్యాంపు వేయబోతున్నారని పెద్ద ఎత్తున ప్రజల్లో ప్రచారం కూడా జరుగుతోంది. కాబట్టి 2010 మేలో టిసిఒసిలో భాగంగా పిఎల్‌జిఎ, ప్రజలు కల్సి వాటిని పేల్చివేశారు.

## కానిస్టేబుల్ రాంచందర్ ఖతం

పాడియా ఏరియాలోని పాడియా బ్లాక్ కేంద్రంలో వున్న పోలీస్ అవుట్ పోస్ట్‌ను గత సంవత్సరం పిఎల్‌జిఎ బలగాలు పేల్చివేశాయి. అప్పటి నుండి అక్కడ పనిచేసే పోలీసులు కలిమెలలో వుంటున్నారు. రాంచందర్ అనే కానిస్టేబుల్ మాత్రం పాడియాలోనే వుంటూ కలిమెలకు వెళ్లి వస్తున్నాడు. ఇతను గ్రామాల్లో తిరుగుతూ దళాల, సంఘాల సమాచారాన్ని సేకరిస్తున్నాడు. ప్రజలను తిట్టడం, కొట్టడం, డబ్బులు దండుకోవడం చేస్తున్నాడు. పాడియా గ్రామం డీకేకు దగ్గరగా వుండడం వల్ల కూడా ఈ గ్రామంలో ఇటువంటి వాడు

వుండడం ప్రమాదకరంగా భావించి 2010 మే 16న ఇతన్ని పిఎల్‌జిఎ సభ్యులు కాల్చిచంపారు.

## ఈస్ట్ డివిజన్

### గ్రేహౌండ్స్ బలగాలపై దాడి

గ్రీన్‌హంట్‌లో భాగంగా పోలీసులు మన్యంలో పెద్ద ఎత్తున కూంబింగ్స్ నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా కిల్లంకోట పంచాయితీ రాచరాయి గ్రామంలో గెరిల్లాలు వున్న సమాచారం తెల్సుకొని దాడి చేయడానికి వస్తున్న గ్రేహౌండ్స్ పోలీసులపై 2010, ఫిబ్రవరి 13న గెరిల్లా బలగాలు దాడి చేశాయి. ఈ దాడిలో ముగ్గురు పోలీసులు గాయపడ్డారు. ఈ దాడి పోలీసుల మనోస్థైర్యాన్ని బాగా దెబ్బతీసి, ప్రజల మనోస్థైర్యాన్ని పెంచింది.

### గిట్టుబాటు ధరలను డిమాండ్ చేస్తూ వ్యాపారుల ఇండ్లపై దాడి

ఆదివాసీ రైతాంగం పండించిన అపరాలకు గిట్టుబాటు ధర ఇవ్వకుండా షావుకార్లు మోసం చేస్తున్నారు. విప్లవ ప్రజా సంఘాలు నిలదీసినపుడు అందరి ముందు గిట్టుబాటు ధరలు ఇస్తామని చెప్తున్నారు కానీ అమలు చేయడం లేదు. పైగా సంఘ సభ్యులూ, మిలీషియా మీద దాడులు చేయిస్తున్నారు. ఇలా దాడులు చేయించిన కొందరిపై పిఎల్‌జిఎ దాడి చేసింది.

మల్కన్‌గిరి జిల్లా కుదుముల, గుమ్మ బ్లాక్ బొడపొడ పంచాయితీ బిడార్ పక్క, జాన్‌బాయ్‌లలో 2010 ఫిబ్రవరిలో మాజీ సర్పంచ్ సీతారాం, ఉపసర్పంచ్ కుర్పరావు, వ్యాపారస్తుడు ఆనంద్ ఇళ్లపై పిఎల్‌జిఎ దాడి చేసింది. ఈ దాడిలో 400 మంది మిలీషియా పాల్గొన్నారు. మిలీషియా తీసుకురాగల్గినంత సామాను తీసుకురాగా మిగిలిన సామాన్లను దగ్ధం చేశారు.

### జడ్‌పిటిసి సోమలింగం ఖతం

అధికారంలో వున్న కాంగ్రెస్ ప్రభుత్వం తమ పబ్బం గడుపుకోవడానికి బహుళజాతి సంస్థలతో కుమ్మక్కై మన్యంలో వున్న బాక్సైట్ సంపదను కొల్లగొట్టడానికి పూనుకుంది. బాక్సైట్ ఒప్పందాలు రద్దు చేసుకోవాలని ప్రజలు పోరాడుతుంటే ఆపరేషన్ గ్రీన్‌హంట్ ద్వారా అణచివేయజూస్తున్నది. ప్రజలపై పార్టీపై మరింత నిర్బంధం తీవ్రతరం చేస్తున్నది. ప్రజా ఉద్యమాలను ఉక్కుపాదంతో అణచివేసి బాక్సైట్‌ను ఎలాగైనా తరలించుకు పోవాలనే ప్రభుత్వం కుట్ర పన్నుతున్నది గానీ బాక్సైట్ ఒప్పందం రద్దు చేసుకోవడంలేదు. బాక్సైట్ కోసం మరిన్ని ప్రయత్నాలు తీవ్రతరం చేస్తూనే వుంది.

అందుకే విశాఖ జిల్లా, చింతపల్లి మండలం, జడ్‌పిటిసి ఉగ్రంగి సోమలింగాన్ని 2010, మే 10న పిఎల్‌జిఎ ఖతం చేసింది. ఉగ్రంగి సోమలింగం గిరిజన శాఖ మంత్రి పసుపులేటి బాలరాజుకు కుడిభుజం. కాంగ్రెస్ పార్టీలో జడ్‌పిటిసి సభ్యుడిగా వుంటూ కీలక పాత్ర పోషిస్తున్నాడు. ఏజెన్సీ ప్రాంతంలో పాలకవర్గాలు తీసుకుంటున్న అన్ని నిర్ణయాల్లో భాగం అవుతున్నాడు. బాక్సైట్ విషయంలో కూడా రోడ్లు వేయించడంలో సర్వేలు చేయించడంలో ప్రతిపక్ష నేతలను, ప్రజలను, ముఖ్యంగా యువకులను బాక్సైట్‌కు అనుకూలంగా మల్చుకోవడంలో ముఖ్యమైన పాత్ర వహిస్తున్నాడు. ప్రజల బతుకులను బూడిద పాలు చేయడానికి పూనుకున్న సోమలింగంపై ప్రజల అభిప్రాయం మేరకు పిఎల్‌జిఎ చర్య తీసుకుంది.

### ఎస్సార్ కంపెనీ పేల్చివేత

మల్కన్‌గిరి జిల్లా కోరుకొండ బ్లాక్ చిత్రకొండ పరిధిలో గల ఎస్సార్ కంపెనీని 2010, మార్చి 24న పేల్చివేసింది. ఇందులో మిలీషియా 400 మంది వరకూ పాల్గొన్నారు. కంపెనీలోని సామాగ్రినీ వాహనాలను తగులబెట్టారు. కంపెనీ మిషన్లు పేల్చివేయడంతో కోట్ల నష్టం జరిగింది.

ఎస్సార్ కంపెనీ దండకారణ్యం ప్రాంతంలో చాలాకాలం నుంచి ఆదివాసీలను గ్రామాల నుండి తరిమి వేసి ఇనుప ఖనిజాన్ని దోపిడీ చేస్తోంది. తమ బతుకులు కోల్పోతున్న ఆదివాసీలు పోరాటాలు చేస్తున్నారు. గతంలో ఒక గూడ్సు రైలు ద్వారా మాత్రమే తీసుకెళ్లిన ఖనిజాన్ని ప్రస్తుతం దండకారణ్యం నుంచి ఒడిషా మీదుగా విశాఖ వరకూ భూమిలో వేసిన పైపుల ద్వారా తీసుకెళ్తున్నారు. పైపులు వేయవద్దంటూ గతంలో చిత్రకొండ ఏరియాలో పోరాటం జరిగింది. పైపులు కూడా ధ్వంసం చేశారు. ఇదే పైప్‌లైన్ ఆఫీస్‌లు రెండు మూడు సార్లు ధ్వంసం చేశారు. అయినప్పటికీ కంపెనీ వాళ్లు పెడచెవిన పెడ్తున్నారు. దానితో మరోసారి బుద్ధిచెప్పాలనే ఉద్దేశంతో పిఎల్‌జిఎ, ప్రజలూ ఈ చర్యను చేపట్టవల్సి వచ్చింది.

### సోమలింగం ఖతం

విశాఖలో వున్న బాక్సైట్‌ను కొల్లగొట్టుకు పోవడాన్కి సామ్రాజ్యవాద బహుళజాతి సంస్థలు అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నాయి. ఇందులో భాగంగా ఏజెన్సీలోని పాలకవర్గాల నాయకులను కూడా డబ్బులు పెట్టి కొనేశాయి. సర్వేలు, రోడ్లు వేస్తున్నా నాయకులెవరూ నోరుమెదపలేదు. ఆన్‌రాక్ ఏజెంట్లు రాఘవులు రమణలు సోమలింగం, విజయ్ కుమార్, నవీన్, నాగరాజులను చౌడుపల్లి మార్కెట్ వద్ద సమావేశపర్చి బాక్సైట్ బాధ్యతలను అప్పగించారు. నెలకు 8–9 వేల జీతమూ, ఉద్యోగాలూ ఇచ్చే ఒప్పందం చేసుకున్నారు.

*(మిగతాది 35వ పేజీలో...)*

(...60వ పేజీ తరువాయి)

నెలకొనాలంటే 2,3 నెలల కాలం కాల్పుల విరమణ వుండాలి. 72 గంటల కాల్పుల విరమణ హాస్యాస్పదం అంటూ... ప్రజల జీవన పరిస్థితుల మెరుగుదలకు కృషి జరగాలి. జైళ్లలో ఉన్న మా కామ్రేడ్స్‌ను విడుదల చేస్తే వారు చర్చలు చేస్తారని గతంలో మేం చేసిన ప్రతిపాదనల ప్రస్తావన చిదంబరం లేఖలో లేదు. చిత్తశుద్ధి వుంటే మా ప్రతిపాదనల గురించి ప్రస్తావించాలి. కేవలం శాంతి కోసం ఒత్తిడి చేసే ప్రజలను సంతృప్తి పరచడానికి చిదంబరం చర్చల ప్రస్తావన వుంది" అంటూ లేఖ రాసిన ఒక నెల రోజుల తర్వాత కామ్రేడ్ ఆజాద్‌ను పట్టుకుని దారుణంగా హత్య చేసి ఆదిలాబాద్ జిల్లా వాంకిడి అడవుల్లో ఎన్‌కౌంటర్ జరిగిందని కథ అల్లారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే ఆజాద్‌తో చర్చించవచ్చు. అంతకంటే మంచి అవకాశం ఏం వుంటుంది? ఈ చర్యతో అన్ని సెక్షన్ల ప్రజలు కూడా చర్చల ప్రతిపాదన బూటకత్వాన్ని గుర్తించారు.

ఆజాద్ హత్యను ఖండించిన ప్రజలు చిదంబరాన్ని, కేంద్ర ప్రభుత్వాన్ని దోషులుగా నిలబెట్టారు. "మావోయిస్టులపై దాడిలో నా రక్తం ఆఖరి బొట్టు వరకు చిందించడానికి సిద్ధం" అని ప్రకటించిన చిదంబరంకు మావోయిస్టులతో చర్చలు జరపాలని, శాంతి కోసం దాడులు ఆపాలని వుంటుందని ఎవరైనా ఆశించగలరా? కామ్రేడ్ ఆజాద్‌ను ముమ్మాటికి ప్రభుత్వమే కుట్రపూరితంగా హత్య చేసింది. పోస్ట్‌మార్టం రిపోర్ట్‌ను పరిశీలించిన ఫోరెన్సిక్ నిపుణులు శాస్త్రీయ విశ్లేషణతో అది క్లోజ్ రేంజ్ (7 సెం.మీ)లో కాల్చి చంపినట్లు నిర్ధారిస్తున్నారు. దేశంలోని ప్రముఖ పౌరహక్కుల సంఘాలు సమన్వయంతో చేసిన నిజనిర్ధారణలో అది బూటకపు ఎన్‌కౌంటర్ అని తేలింది. కామ్రేడ్ ఆజాద్ హత్యపై న్యాయవిచారణకు అందరూ డిమాండ్ చేసారు. అయినా ప్రభుత్వం స్పందించలేదు. పోలీసు బాస్‌లు, పోలీసు గవర్నర్ మాత్రం అది నిజమైన ఎన్‌కౌంటరేనని బుకాయించారు. న్యాయవిచారణ అవసరమని (ఏ.పి.) ప్రజలు సర్వత్రా బలంగా డిమాండ్ చేస్తున్నారు.

ఇంకా వేడి తగలలేదని, మావోయిస్టులపై మరింత ఒత్తిడి పెంచితే చర్చలకు వస్తారని జి.కె.పిళ్లై, ప్రకాశ్‌సింగ్, చిదంబరం తదితరులు ఆలోచిస్తున్నారు. అందుకే నిర్బంధాన్ని పెంచుతున్నారు. నిర్బంధం ప్రతిఘటనకు దారితీస్తుందనీ, అనువైన పరిస్థితులు లేకుండా చర్చలు అసాధ్యం అని మావోయిస్టులు అనడంలో సబబు వుందని అందరూ ఆమోదిస్తున్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి వుంటే సి.పి.ఐ. (మావోయిస్టు) నాయకత్వం ముందుకు తెచ్చిన ఈ కింది ప్రతిపాదనలకు స్పందించాలి.

1. ఆపరేషన్ గ్రీన్‌హంట్‌ను ఆపాలి. బలగాలను వెనక్కి పిలవాలి. ప్రభుత్వం హింస/దాడి లేకపోతే ప్రతిహింస/ప్రతిదాడి వుండదు.

2. మావోయిస్టు పార్టీ ఒక రాజకీయ పార్టీ, అంతర్జాతీయ కమ్యూనిస్టు ఉద్యమాలతో ముడిపడినది. రాజ్యాంగం ప్రకారం అన్ని హక్కులు వర్తిస్తాయి. పార్టీ మీద నిషేధాన్ని ఎత్తివేయాలి. ప్రజాస్వామికంగా దానికి పని చేసుకునే హక్కు ఉంటుందని గుర్తించాలి. ఆ పరిస్థితుల్లోనే చర్చలకు రాగలుగుతుంది.

3. ఎ.పి.లో జరిగిన చర్చల్లో జనశక్తి పార్టీ తరఫున ప్రతినిధిగా పాల్గొన్న కామ్రేడ్ రియాజ్‌ను బూటకపు ఎన్‌కౌంటర్‌లో కాల్చి చంపారు. మిగిలిన వారిపై టార్గెట్ చేసి దాడులు చేసారు. ఇప్పుడు ఆ ప్రయత్నాలలో వున్న ఆజాద్‌ను దారుణంగా హత్య చేసారు. కనుక ఈ ప్రభుత్వాన్ని నమ్మి ఏ విశ్వాసంతో చర్చలకు వెళ్లాలి? అజ్ఞాతంలో వున్న కామ్రేడ్స్‌ను పంపడం సాధ్యం కాదు. సి.పి.ఐ.(మావోయిస్టు) ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ గణపతి ఇటీవల పత్రికలకు విడుదల చేసిన ఇంటర్వ్యూలో మరోసారి ఈ విషయాన్నే చెబుతూ జైళ్లలో ఉన్న నాయకత్వ కామ్రేడ్స్‌ను విడుదల చేస్తే వారే చర్చలు చేస్తారని, పార్టీకి ప్రత్యక్షంగా ప్రాతినిధ్యం వహిస్తారని చెప్పారు.

నేపాల్ సి.పి.ఎన్.(మావోయిస్టు) అనుభవం, దేశంలో వివిధ జాతులతో జరుగుతున్న చర్చలు, ఎల్.టి.టి.ఇ.తో శ్రీలంక ప్రభుత్వం జరిపిన చర్చలు, వాటి అనుభవాలను సి.పి.ఐ. (మావోయిస్టు) లోతుగా అధ్యయనం చేస్తుంది. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో జరిగిన చర్చల నుండి తీసిన గుణపాఠాల వెలుగులో 2007లో జరిగిన ఐక్యతా (9వ) కాంగ్రెస్ ''చర్చల పట్ల ఒక విధానాన్ని'' రూపొందించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి గణపతి, అధికార ప్రతినిధి ఆజాద్, పొలిట్ బ్యూరో సభ్యుడు కిషన్‌జీ వివిధ సందర్భాల్లో పై అవగాహననే వ్యక్తపరిచారు. మొత్తం పార్టీ అనుసరిస్తున్న విధానమే ఇది. దీనిలో భిన్నాభిప్రాయాలు ఎక్కడా లేవు.

అమెరికా ఇరాక్‌పై దాడి చేయడానికి ముందు మారణాయుధాలు వున్నాయని ఇరాక్ పట్ల సద్దాం హుస్సేన్ ఎడల చేసిన దుష్ప్రచార దాడి, ఆఫ్ఘనిస్తాన్‌పై దాడికి ముందు టెర్రరిజం గురించి, లాడెన్ గురించి, అల్‌ఖైదా గురించి చేసిన విస్తృత దుష్ప్రచారం, ప్రపంచంలో ఎక్కడ చూసినా జాతులు, ప్రజలు విముక్తి కోసం పోరాడినా ప్రజల దృష్టిని మళ్లించడానికి అనేక రూపాల్లో విప్లవ పార్టీల మీద చేస్తున్న దుష్ప్రచారం ఒకే ప్రయోజనం, ఒకే స్వభావం కలిగినది. "వామపక్ష తీవ్రవాదం దేశ ఆంతరంగిక భద్రతకు అత్యంత ప్రమాదంగా పరిణమించింది. ఇది క్యాన్సర్‌లాగా వ్యాపిస్తుంది" అని మన దేశ పాలకులు చేస్తున్న ప్రచార దాడి అంతా ఇంతా కాదు. 'అభివృద్ధికి' నక్సలిజమే అడ్డంకి అని అబద్ధాలను పథకం ప్రకారం ప్రచారం చేస్తున్నారు.

దేశ ప్రజలకు చెందిన భూమి, నీరు, అడవి లాంటి సహజ వనరులను దురాక్రమించి ప్రజల బతుకుల్లో చీకటిని నింపుతూ, ఎస్.ఇ.జడ్.ల పేరుతో లక్షల ప్రజల్ని నిర్వాసితులను చేస్తున్న పాలకవర్గాల ప్రజావ్యతిరేక చర్యలను దేశవ్యాపితంగా ప్రజలు ప్రతిఘటిస్తున్నారు. లాల్‌గఢ్, నారాయణపట్నా వంటి మిలిటెంట్ పోరాటాలు దీనికి ఉదాహరణలు. ఈ ప్రతిఘటనకు సి.పి.ఐ.(మావోయిస్టు) బలమైన అండగా వుంది. ఈ పోరాటాలను విప్లవోద్యమంలో భాగంగా అభివృద్ధి చేస్తున్నది. నిర్బంధాన్ని లెక్కచేయకుండా ఉద్యమాన్ని విస్తరింపజేస్తున్నది.

దేశంలో ప్రజల బతుకులు కష్టంగా మారాయి. ఆకలి చావులు, అనారోగ్య మరణాలు, రైతాంగం ఆత్మహత్యలు, కరువు, దారిద్ర్యం అత్యధిక శాతం పెరిగాయి. కనీస మౌలిక సదుపాయాలైన తాగునీరు, సాగునీరు, విద్యుత్, విద్య, వైద్యం, గృహ వసతి, రోడ్లు, పారిశుధ్యం లాంటి సమస్యలు పరిష్కారం కాలేదు. నిరుద్యోగం పెరిగింది. సంపన్నుల ఆస్తులు పెరిగి దరిద్ర రేఖకు దిగువన జీవించేవారి సంఖ్య గత లెక్కల్ని దాటి పరుగులు పెడుతున్నది. హత్యలు, అత్యాచారాలు, అరాచకాలు ప్రబలిపోతున్నాయి. ప్రాథమిక హక్కులు మృగ్యమైపోతున్నాయి. వేల కోట్ల కుంభకోణాలు రోజు రోజుకు బయటకొస్తూ అవినీతిని బయటపెడుతున్నాయి. ఈ అవినీతి రేపిన అలజడి పార్లమెంటును, న్యాయవ్యవస్థను, కేంద్ర ప్రభుత్వాన్ని కుదిపివేస్తున్నది. కొన్ని రాష్ట్రాల్లో ప్రభుత్వాలే మారిపోతున్నాయి. ఒక లాబీ కుంభకోణాల్ని మరో లాబీ బయటపెడుతున్నదని కేంద్ర మంత్రులే బహిరంగంగా ఆరోపించుకుంటున్న నేపథ్యంలో ప్రజల దృష్టిని మళ్లించడానికి, విప్లవోద్యమంపై, ప్రజలపై ఫాసిస్టు దాడికి సాధికారతను సాధించడానికి సోనియా, మన్‌మోహన్‌సింగ్, చిదంబరంల దుష్ట కూటమి అమెరికా ఆశిస్సులతో చర్చల పేరుతో దుష్ప్రచార అస్త్రాన్ని సంధించారు. కుహనా మేధావుల వితండ వాదనలతో ప్రభుత్వ అనుకూలమైన మీడియా మాయాజాలంతో ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ప్రజలు, విప్లవోద్యమం, ప్రజాస్వామిక శక్తులు అప్రమత్తంగా లేకపోతే కేంద్ర ప్రభుత్వం తలపెట్టిన బహుముఖ దాడిలో సర్వం కోల్పోయే ప్రమాదం వుంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న అణచివేత, దోపిడీ విధానాల వలన చర్చలకు అనుకూల వాతావరణం లేదు. సి.పి.ఐ. (మావోయిస్టు) ప్రతిపాదించిన మూడు అంశాలు కేంద్రం అంగీకరిస్తే అప్పుడు చర్చల గురించిన కేంద్రం చర్చ చిత్తశుద్ధితో కూడినది కాగలదు. ఇక అప్పుడు చర్చలకు ఒక అవకాశం వుంటుంది.

చర్చలకు మావోయిస్టులు వ్యతిరేకం అని చిదంబరం చేసే ప్రచారంలో వాస్తవం లేదు. అసలు చర్చలకు అనుకూలమైన వాతావరణమే లేకుండా కేంద్రం ప్రజల పీకల మీద కత్తిపెట్టి, శాంతి చర్చలని ప్రచారం చేస్తూ, ఉద్యమం బయట కొద్దిమంది ప్రజల్ని నమ్మించడానికి, మాయ చేయడానికి ప్రయత్నిస్తున్నది. అవాస్తవ పరిస్థితిని అందరూ గుర్తించి చిదంబరం, కేంద్ర ప్రభుత్వం అనుసరించే విధానాలను బహిర్గతం చేసి ఓడించాలి. ★

---

*(...18వ పేజీ తరువాయి)*

ఉద్యమంపైనైనా తీవ్ర అణచివేతకు సిద్ధపడుతున్నాయి. గతంలో అవి రూపొందించుకున్న విధానాలనూ, చట్టాలనూ పక్కన పడేస్తున్నాయి.

కాల్పులపై తీవ్ర నిరసన వ్యక్తమయిన తర్వాతయినా నామమాత్రపు పశ్చాత్తాపాన్ని కూడా ప్రకటించకుండా హోం మంత్రి, ప్రభుత్వ కార్యదర్శి తదితరులు అనివార్య పరిస్థితిలో ఆత్మరక్షణ కోసమే కాల్పులు జరపవల్సి వచ్చిందని తమ మారణకాండను సమర్థించుకోవడాన్ని చూస్తే కూడా ఈ విధానాలకు వాళ్లెంత కట్టుబడి వున్నారో అర్థమవుతుంది. తమ విధానాలకు ఆటంకం వస్తే భవిష్యత్‌లోనూ ఇటువంటి మారణకాండలకు సిద్ధమని హెచ్చరించడం కూడా ఇది.

కేవలం పాలకపక్షమే కాదు ప్రతిపక్షాలు కూడా ఈ రాజకీయ విధానాలకు పూర్తిగా అనుకూలమైనవి. అందువల్లనే సోంపేట ఆందోళనకారులు అర్థించినప్పటికీ ఈ విద్యుత్ ప్లాంటుకు వ్యతిరేకంగా తెలుగుదేశం, ప్రజా రాజ్యం పార్టీలు చిన్న నిరసనను కూడా తెలియజేయలేదు. అప్పుడు నోరెత్తని ప్రతిపక్షాలు తమ రాజకీయ ప్రయోజనాలను నెరవేర్చుకోవడానికి కాల్పుల అనంతరం మాత్రం మొసలి కన్నీళ్లు కార్చాయి.

ఒకనాడు ఉత్తరాంధ్ర విశాఖ స్టీల్ ప్లాంటు కోసం పోరాడిన ప్రాంతం. అదే ప్రాంతంలో నేడు పవర్‌ప్లాంటుకు వ్యతిరేకంగా పోరాడుతున్నారు. దీన్ని బట్టి నిజమైన అభివృద్ధి నమూనా పట్ల ప్రజలకు ఎంత స్పష్టమైన దృక్పథం వుందో తెలుస్తోంది.

అభివృద్ధికి ఆమడ దూరంలో వుంచిన ఒక వెనుకబడిన ప్రాంతం, నేడు పాలకవర్గాలు ముందుకు తెస్తున్న అభివృద్ధిని వ్యతిరేకిస్తూ, అభివృద్ధికి అసలైన నిర్వచనాన్ని చెప్పడం చాలా ఆసక్తిదాయక విషయం.

పాలకవర్గాల అభివృద్ధి నమూనాను అడ్డుకునే ప్రజాపోరాటాలకు 'సోంపేట' ఒక నమూనా కావాలి. ఈ పోరాటాలు మొత్తంగా దేశంలో జరుగుతున్న భూస్వామ్య, దళారీ నిరంకుశ పెట్టుబడిదారీ, సామ్రాజ్యవాద వ్యతిరేక పోరాటాల్లో భాగం కావాలి. అప్పుడే పాలకవర్గాలు తీసుకువస్తోన్న అభివృద్ధి వినాశనాన్ని అడ్డుకొని నిజమైన అభివృద్ధిని సాధించుకోగలం. ★

# శాంతి, చర్చలు వర్గ పోరాటంలో భాగమే!
# చర్చల పట్ల చిత్తశుద్ధిలేని ప్రభుత్వ ప్రతిపాదనను బహిర్గతం చేద్దాం!!

కేంద్ర ప్రభుత్వం ఒక పక్కన ప్రజలపై యుద్ధం ప్రకటించి అణచివేత, హింసలకు పాల్పడుతున్నది. మరోపక్క చర్చల ప్రతిపాదనతో మేధావులను, మధ్యతరగతి ప్రజలను పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తోంది. అణచివేత, దుష్ప్రచారం రెండూ దోపిడీ విధానంలో అంతర్భాగమే. తక్కువ తీవ్రతగల యుద్ధ (ఎల్.ఐ.సి.) వ్యూహంలో భాగమే ఇది. "శాంతి కోసం చర్చలకు ఆహ్వానిస్తుంటే మావోయిస్టులు హింసనే కోరుకుంటున్నారు. చర్చలకు మావోయిస్టులు వ్యతిరేకం" అంటూ వాస్తవాలను మరుగుపరచి దుష్ప్రచార దాడిని తీవ్రం చేసింది. సైనిక దాడిని తీవ్రతరం చేస్తేనే మావోయిస్టులు చర్చలకు దిగివస్తారంటూ తన దాడిని సమర్థించుకుంటోంది.

మావోయిస్టులు చర్చలకు, శాంతికి వ్యతిరేకం అని నిరూపించేందుకు అది శతవిధాలా ప్రయత్నిస్తోంది. ప్రజలపై మానసిక యుద్ధాన్ని కూడా ఒక యుద్ధ విధానంగా అమలుచేస్తూ అణచివేతకు సాధికారతను సాధించి నిర్మూలనా దాడులను మరింత తీవ్రతరం చేసే విధానమే ఇది. నిజానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు చర్చల పట్ల చిత్తశుద్ధి లేదు. గత దశాబ్ద కాలంగా జరిగిన పరిణామాలను పరిశీలిస్తే ఇది స్పష్టం అవుతుంది.

ఆంధ్రప్రదేశ్‌లో 2002లో టి.డి.పి. ప్రభుత్వం ప్రజలపై, పార్టీ మీద దాడులు చేస్తూనే చర్చల ప్రతిపాదన చేసింది. దానిలో బూటకత్వం వుందని ప్రజలు, మేధావులు గుర్తించారు. విప్లవోద్యమం ఆ ప్రతిపాదనను తిరస్కరించి ప్రజల ప్రతిఘటన ద్వారానే నిర్బంధాన్ని ఓడించింది. 2004లో తిరిగి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక సుదీర్ఘ సంప్రదింపుల అనంతరం ఇరుపక్షాల నుండి కాల్పుల విరమణకు అంగీకారం కుదిరాకనే చర్చలు జరిగాయి. ప్రజాస్వామ్యం, భూమి, స్వావలంబన ఆనాడు చర్చల్లో ప్రధానాంశాలు. వీటిని పరిష్కరించే స్వభావం లేని దోపిడీ కాంగ్రెస్ ప్రభుత్వం చర్చలను ఏకపక్షంగా నిలిపివేసి బూటకపు ఎన్‌కౌంటర్లు, అణచివేతల్ని తీవ్రతరం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో విప్లవోద్యమాన్ని వై.ఎస్.ఆర్. కాంగీ ప్రభుత్వం బాగా నష్టపరిచింది. ఇప్పుడు కేంద్ర ప్రభుత్వం నిర్బంధాన్ని, దాడుల్ని కొనసాగిస్తూనే రాజ్యహింసను మరుగుపరుస్తూ చర్చల ప్రతిపాదనతో మరోసారి ముందుకు వచ్చింది. ఈ వాస్తవ పరిస్థితులను విశ్లేషించినపుడు ఈ ప్రతిపాదనలో ప్రభుత్వ 'చిత్తశుద్ధి', కుటిల ఎత్తుగడ బయటపడుతాయి.

ప్రజలపై చేస్తోన్న యుద్ధాన్ని గ్రీన్‌హంట్ లాంటి వివిధ రకాల క్యాంపెయిన్లను నిలిపివేసి, అన్ని రకాల బలగాలను ఉద్యమ ప్రాంతాల నుండి ఉపసంహరించి, పార్టీ, ప్రజాసంఘాలపై నిషేధాన్ని ఎత్తివేసి, జైళ్లలో వున్న కామ్రేడ్స్‌ను విడుదల చేసి, రెండు వైపుల కాల్పుల విరమణ ఏకకాలంలో అమలు జరిగినప్పుడు మాత్రమే చర్చలకు అనువైన వాతావరణం ఏర్పడుతుంది. ఆ రకమైన ప్రయత్నాలు ఏమీ లేకుండా దానికి భిన్నంగా ఆపరేషన్ గ్రీన్‌హంట్‌లో భాగంగా ప్రభుత్వం లక్షలకు పైగా కేంద్ర పారా మిలటరీ బలగాలను (సి.ఆర్.పి.ఎఫ్.), నాలుగు లక్షల రాష్ట్ర బలగాలను, ప్రత్యేక బలగాలను మోహరించి ప్రతిరోజూ ప్రజలపై లెక్కలేనన్ని అత్యాచారాలు చేస్తున్నది. ఈ దాడులను వ్యతిరేకించే ప్రజలను, ప్రజాస్వామికవాదులను యు.ఎ.పి.ఎ. లాంటి ప్రత్యేక చట్టాల కింద అరెస్టు చేసి ఎటువంటి విచారణ లేకుండా సంవత్సరాల తరబడి జైళ్లలో నిర్బంధిస్తున్నది. మన దేశంలో ప్రజలపై జరుగుతున్న ఈ యుద్ధాన్ని అందరూ వ్యతిరేకిస్తున్నారు. సమర్థించే వారు ఎవరూ లేరు. ఈ పరిస్థితి చర్చలకు అనువైనది కాదని స్పష్టమవుతూనే వుంది.

కేంద్ర హోంమంత్రి చిదంబరం మే 11న ప్రముఖ సామాజిక కార్యకర్త స్వామి అగ్నివేశ్‌కు లేఖ రాస్తూ చర్చలకు మావోయిస్టులను ఒప్పించాలని కోరాడు. మే 31న సి.పి.ఐ. (మావోయిస్టు) నాటి అధికార ప్రతినిధి కామ్రేడ్ ఆజాద్ స్పందించి షరతులను, అజెండాను ప్రతిపాదించాడు. అందులో పార్టీ వైఖరిని మరోసారి ప్రకటించాడు. "కాల్పుల విరమణ అనేది ఉభయపక్షాల నుండి వుండాలి. గ్రీన్‌హంట్ పేరుతో ఈ ప్రాంతంలో మోహరించిన భద్రతా బలగాలు ప్రజలపై దౌర్జన్యాలకు దిగుతున్నాయి. హత్యలు, అత్యాచారాలు, అపహరణలు, ఆదివాసీలపై చిత్రహింసలు, ఆస్తుల ధ్వంసాలు రోజూ జరుగుతున్నాయి. ప్రభుత్వం చిత్తశుద్ధితో శాంతికి కృషి చేస్తుందని ఎలా నమ్మాలి? ఆచరణలో శాంతి

*(మిగతాది 58వ పేజీలో...)*